

ఈనాడు



హైదరాబాద్ 31-8-2017 గురువారం సిటీ సంపుటి 44 . సంచిక 21


THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 5-00 పేజీలు 16+24 www.eenadu.net

Hyderabad, Visakhapatnam, Vijayawada, Tirupati, Anantapur, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

సాగర మథనం

- హైదరాబాద్ అవసరాలకు సరిపడా అందని నీరు
- నాగార్జునసాగర్‌లో మరింత దిగువ నుంచి తీసుకొనేలా ఏర్పాట్లు
- 475 అడుగుల వరకు అప్రోచ్ కాలువ తవ్వకం
- అవసరమైతే 450 అడుగుల వరకూ..
- సర్వే షురూ.. సీఎం అనుమతే తరువాయి



హైదరాబాద్ మహానగరంలో తాగునీటి కనెక్షన్లు	9.2 లక్షలు
రోజువారీ అవసరాలకు కావాల్సిన నీరు	480 – 500 ఎంజీడీ
నీటి లభ్యత లేక ప్రస్తుతం తీసుకొంటున్నది	390 ఎంజీడీ

ఈనాడు – హైదరాబాద్

వానాకాలమైనా హైదరాబాద్ మహానగరంలో కొన్ని ప్రాంతాల్లో నీటి ఎద్దడి తప్పడం లేదు. జలాశయాల్లో తగినంత నీటి నిల్వలు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఏడాది పాటు ఎలాంటి ఇబ్బంది లేకుండా నీటిని సరఫరా చేయడానికి జలమండలికి చాలా కష్టంగా మారుతుంది. ఈ నేపథ్యంలో తగిన నీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. గోదావరి బేసిన్‌లోని జలాశయాల్లోకి వచ్చిన నీటిని ఎక్కువ భాగం హైదరాబాద్ తాగునీటికి కేటాయించడంతోపాటు, నాగార్జునసాగర్‌లో మరింత దిగువ నుంచి కూడా నీటిని తీసుకొనేలా పనులు చేపట్టాలని నిర్ణయించింది. కనీసం 475 అడుగుల మట్టం వరకు నీటిని తీసుకొనేలా అప్రోచ్ కాలువ పనులు (మిగతా 2లో)

చిత్తు కాలేదు..
బ్యాంకులను ముంచెత్తాయి

- 99 శాతం నోట్లు తిరిగి చేరాయి
- చెల్లని సొమ్ము కేవలం రూ.16,050 కోట్లే
- రద్దయిన నోట్ల జమపై వివరాలు వెల్లడించిన రిజర్వు బ్యాంకు
- చివరకు మేలే జరిగింది: జైట్లీ
- నల్లధనాన్ని అదుపు చేశామన్న ఆర్థిక శాఖ
- విమర్శలు ఎక్కుపెట్టిన విపక్షాలు

11లో

తుది జాబితాపై రైతులందరి సంతకాలు

- పారదర్శకంగా భూ రికార్డుల ప్రక్షాళన
- ౧౧౯౩ బృందాలు ఏర్పాటు...ఒక్కోదానికి ౯ గ్రామాలు
- ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాలు



ఈనాడు, హైదరాబాద్ : ఏ రైతుకూ హాని చేయకుండా పూర్తి పారదర్శకంగా భూముల రికార్డులు ప్రక్షాళన చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. లెక్కలన్నీ సవరించిన ప్రతి గ్రామంలో తుది జాబితాపై రైతులందరి సంతకాలు తీసుకోవాలని, ఆ తర్వాత జాబితాను ప్రజలకు వెల్లడించాలన్నారు. భూ రికార్డుల ప్రక్షాళనపై బుధవారం ప్రగతి భవన్‌లో సీఎం సమీక్ష జరిపారు. ఉప ముఖ్యమంత్రి (మిగతా 2లో)

విలాసవంత వాహనాలపై 25% సెస్సు


- ఉపశమనం ఇవ్వాలంటే అది పేదలకే: జైట్లీ 6లో

క్రీమీలేయర్ పరిధిలోకి పీఎస్‌యూల్లోని పోస్టులు

- కేంద్రమంత్రివర్గం నిర్ణయం 6లో

ఆధార్‌పై గడువు డిసెంబరు 31

3లో



హిమాచల్ కాంగ్రెస్‌లో సంక్షోభం

- రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సుఖ్విందర్‌సింగ్‌ను తొలగించాల్సిందేనంటున్న సీఎం వీరభద్రసింగ్
- లేకపోతే.. ఎన్నికల్లో పోటీ చేయబోనని స్పష్టీకరణ
- శాంతపరిచేందుకు పార్టీ యత్నం

దిల్లీ

హిమాచల్‌ప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న వేళ అధికార కాంగ్రెస్ పార్టీలో సంక్షోభం ముంచుకొస్తోంది. పార్టీ రాష్ట్రశాఖ అధ్యక్షుడు సుఖ్విందర్‌సింగ్ సుఖుతో పొసగని ముఖ్యమంత్రి వీరభద్రసింగ్ అసమ్మతి గళం ఎత్తుకున్నారు. రాష్ట్ర పార్టీ వ్యవహారాల్లో తనకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని కోరుతున్నారు. సుఖును తొలగించకపోతే ఈ ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనని వీరభద్రసింగ్ ఇంతకుముందే ప్రకటించడంతో తమ నాయకుడు పోటీ చేయబోకపోతే తాము కూడా బరిలోకి దిగబోమని ఎమ్మెల్యేలు స్పష్టంచేశారు. హిమాచల్ విషయంలో కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం రెండుగా చీలిపోయింది. కొంతమంది అగ్రనాయకులు సుఖ్విందర్‌నే ఆ పదవిలో కొనసాగించాలని కోరుకుంటున్నారు. విదేశీ పర్యటనలో ఉన్న ఉపాధ్యక్షుడు రాహుల్ గాంధీ తిరిగొస్తేనే నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది. తాజాగా.. కోర్టు కేసుకు సంబంధించి దిల్లీలో ఉన్న వీరభద్రసింగ్ సోనియాగాంధీని కలిసేందుకు యత్నించినా అపాయింట్‌మెంట్ దొరకలేదని తెలుస్తోంది. సోనియాగాంధీ రాజకీయ కార్యదర్శి అహ్మద్‌పటేల్ బుధవారం హిమాచల్ సీఎంను శాంతపరిచేందుకు యత్నించారు. ఎన్నికల ముందు పరిస్థితులు మరింతగా దిగజారకుండా చూడాలని పార్టీ యత్నిస్తోంది.

పత్రాలు వీరభద్రసింగ్‌కు అప్పగించాలని సీబీఐకి కోర్టు ఆదేశం: రూ.10 కోట్ల ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో కొన్ని పత్రాలు హిమాచల్ సీఎం వీరభద్రసింగ్‌కు అప్పగించాలంటూ బుధవారం ప్రత్యేక కోర్టు సీబీఐని ఆదేశించింది. దర్యాప్తు అధికారి ఇతర కేసుల్లో వీటిని కూడా ఉన్నందున కోర్టు ఆదేశాల ప్రకారం పత్రాల్ని నిందితులకు అందజేయలేకపోతున్నామంటూ సీబీఐ కోర్టుకు తెలుపగా, వాటిని అప్పగించాలంటూ ప్రత్యేక జడ్జి వీరేందర్‌కుమార్ గోయల్ ఆదేశాలు జారీ చేశారు. ఛార్జిషీట్‌తోపాటు నమోదు చేసిన పలు పత్రాలు తమకు అందలేదని వీరభద్రసింగ్, ఆయన తరఫు ప్రతినిధి కోర్టుకు తెలిపారు. వ్యక్తిగత హాజరునుంచి మినహాయింపు ఇవ్వాలని వీరభద్రసింగ్ దంపతుల పిటిషన్‌పైనా స్పందించాలని కోర్టు సీబీఐకి తెలిపింది. తదుపరి దర్యాప్తును అక్టోబరు 31కి వాయిదా వేసింది. ఈ కేసులో ఇతర నిందితులు కోర్టుకు హాజరయ్యారు.

కర్ణాటక మంత్రి సన్నిహితుల నివాసాల్లో ఐటీ సోదాలు

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక ఇంధన శాఖ మంత్రి డీకే శివకుమార్ సన్నిహితుల స్థిర, చరాస్తులపై ఆదాయపు పన్ను శాఖ సోదాలు చేసింది. బెంగళూరు నగరంలోనే కాకుండా చెన్నై, దిల్లీలతోపాటు మొత్తం పన్నెండు చోట్ల బుధవారం ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సోదాలు కొనసాగించింది. బెంగళూరు సుబ్రహ్మణ్యనగరలోని శివకుమార్ అప్పటి కాంగ్రెస్ నేత విజయ ముళగుండ్ నివాసంలో పది మంది అధికారులు తనిఖీలు చేశారు. జయనగరలోని శివకుమార్ వ్యక్తిగత కార్యదర్శి బి.ఎస్.శ్రీధర్ నివాసంపైనా దాడులు జరిగాయి. సోదాల్లో భారీ ఎత్తున స్థిరాస్తి పత్రాలు, స్వర్ణాభరణాలు, ఖరీదైన వస్తువుల్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఎస్.ఎం.కృష్ణ ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో కర్ణాటక చేనేత అభివృద్ధి సంస్థ అధ్యక్షుడిగా పని చేసిన విజయ ముళగుండ్ ప్రస్తుతం ప్రదేశ్ కాంగ్రెస్ సమితి కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. బి.ఎస్.శ్రీధర్ కూడా ఎస్.ఎం.కృష్ణ ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఆయనకు వ్యక్తిగత కార్యదర్శిగా పని చేశారు. ఈనెల తొలి వారంలో ఆదాయపు పన్ను శాఖ అధికారులు శివకుమార్ నివాసంపై మూడు రోజుల పాటు దాడి నిర్వహించి పెద్ద ఎత్తున పత్రాలు, ఇతర ఖరీదైన వస్తువుల్ని స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా లభించిన ఆధారాలతో తాజా సోదాలు నిర్వహించినట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి.

రావలసింది రూ.ఆరున్నర వేలు... ఖాతాలో వచ్చి పడింది రూ.ఆరున్నర కోట్లు

- దక్షిణాఫ్రికా విద్యార్థినికి విచిత్ర అనుభవం

జోహెన్నెస్‌బర్గ్: వాల్టర్ సిస్లు వర్సిటీలో ఆహార అలవెన్స్‌ను బదలాయించే క్రమంలో పొరపాటుగా ఓ విద్యార్థిని బ్యాంకు ఖాతాలోకి సుమారు రూ.ఆరున్నర కోట్లు వచ్చిపడ్డాయి. వాస్తవానికి ఆ అమ్మాయి కేవలం రూ.ఆరున్నరవేల పైచిలుకు అలవెన్స్‌కే అర్హురాలు. పెద్దమొత్తంలో డబ్బు రావడంతో ఆ విద్యార్థిని జూన్ నుంచి రూ.39 లక్షలకుపైగా ఖర్చుపెట్టేసింది. సోమవారం అధికారులు జరిగిన పొరబాటు గుర్తించారు. సదరు విద్యార్థిని ఖాతాలో మిగిలిన మొత్తాన్నంతా తీసేసుకున్నారు. ఖర్చు చేసిన డబ్బును ఆ విద్యార్థిని నుంచి వసూలు చేస్తామన్నారు.

ఆపరేషన్ థియేటర్‌లో వైద్యుల 'వీధి'పోరాటం!

- అమ్మ పక్కనే శిశువు అసహాయ మరణం!
- జోథ్‌పూర్ ఆసుపత్రిలో అవాంఛనీయ పరిణామం

జోథ్‌పూర్(రాజస్థాన్): ప్రసవం తల్లికి పునర్జన్మ.... బిడ్డకు కొత్తజన్మ. తల్లీబిడ్డలకు నూతన జన్మ నివ్వాల్సిన జోథ్‌పూర్ వైద్యులు తమ గురుతర బాధ్యతను విస్మరించారు. ఆపరేషన్ థియేటర్‌లో వీధిపోరాటాల స్థాయిలో గొడవపడ్డారు. సీనియర్ వైద్యులై ఉండీ బాధ్యతారహితంగా వ్యవహరించిన ఆ వైద్యులిద్దరి వైఖరే నవజాతశిశువు మృతికి కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇక్కడి ఎస్.ఎన్.వైద్యకళాశాల ఆసుపత్రిలో మంగళవారం చోటు చేసుకున్న ఈ అవాంఛనీయ సంఘటన పూర్వాపరాలిలా ఉన్నాయి...

ఓ వైపు తల్లి సిజేరియన్ శస్త్రచికిత్స అనంతరం ఆపరేషన్ థియేటర్‌లో బల్లమీద సూదిమందు మత్తులో స్పృహలేకుండా పడిఉంది. మరోవైపు ఆ పక్కనే నవజాతశిశువు పల్స్‌రేటు క్షీణిస్తోంది. ఆ లేత గుండె బలహీనంగా కొట్టుకుంటోంది. ఆ బుల్లి ప్రాణాన్ని నిలబెట్టి...తల్లి ఒడికి చేర్చాల్సిన వైద్యులు ఆ బాధ్యతను దారుణంగా విస్మరించారు. ఆపరేషన్ థియేటర్‌లో 'వీధి'పోరాటాలు చేశారు. చివరకు ఆ చిన్నిపాప పల్స్ రేటు పడిపోయి... ప్రాణాలు కోల్పోయింది. నవమాసాలూ పోసి తనకు ప్రాణంపోసిన అమ్మ ఆపరేషన్ టేబులు పక్కనే ఆ బిడ్డ విగతజీవి అయింది. కారణం... వైద్యుల అవాంఛనీయ ప్రవర్తనేనన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. థియేటర్‌లో మిగిలిన అందరు సిబ్బంది సమక్షంలోనే ప్రసూతి వైద్య నిపుణులు డాక్టర్. అశోక్ నానీవాల్, అనస్థీసియా విభాగం ప్రొఫెసరు డాక్టర్ మథురా లాల్ తక్ 'నువెంతంటే నువ్వెంత' అనుకున్నారు. చివరకు ఒక దశలో డాక్టర్.అశోక్ నానీవాల్ అసభ్యకరమైన పదజాలాన్ని కూడా వాడారు. తర్వాత ఇద్దరిలో ఒకరు అచేతన స్థితిలో ఉన్న బాలింతను, కొనప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న పురిటికందును నిర్లక్ష్యంగా అక్కడే గాలికి వదిలేసి వెళ్లిపోయారు. ఈ వ్యవహారం మొత్తాన్నీ ఎవరో వీడియో తీశారు. ఆ వీడియో ఇప్పుడు వైరల్ అవుతోంది. వీడియో నేపథ్యంలో వైద్యులిద్దరినీ రాజస్థాన్ వైద్య విద్యా విభాగం ఉద్యోగాల నుంచి తొలగించింది.

పట్నంలోనే పట్టభద్రులమవుతాం..!

- హైదరాబాద్‌లో డిగ్రీ చదవడంపైనే మక్కువ
- ఆన్‌లైన్ ప్రవేశాలతో ఓయూ కళాశాలల్లోనే ఎక్కువగా చేరుతున్న విద్యార్థులు
- మిగతా అన్ని వర్సిటీల్లో తగ్గుతున్న సీట్ల భర్తీ

ఈనాడు - హైదరాబాద్

ఇంజినీరింగ్ విద్యకే కాదు.. డిగ్రీ కోర్సులను చదివేందుకూ విద్యార్థులు రాజధాని వైపే మొగ్గుచూపుతున్నారు. రాష్ట్రంలోని మారుమూల జిల్లాల వారు సైతం హైదరాబాద్‌లోని కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో తెలంగాణలోని ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలో తప్ప మిగిలిన ఐదు వర్సిటీల్లో భర్తీ అవుతున్న సీట్ల సంఖ్య తక్కువగా ఉంటోంది.

గత ఏడాది నుంచి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్-తెలంగాణ(దోస్త్) పేరిట ఆన్‌లైన్‌లో ప్రవేశాలు పొందే విధానాన్ని విద్యా శాఖ ప్రారంభించింది. ఆ తర్వాత మిగతా వర్సిటీల్లో డిగ్రీ ప్రవేశాల సంఖ్య తగ్గుతుండగా.. ఓయూలో మాత్రం పెరుగుతుండటం గమనార్హం. ముఖ్యంగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని కళాశాలల్లో చేరేందుకు ఇతర జిల్లాలవారు ఆసక్తి చూపుతున్నారని అధికారులు అంచనాకు వస్తున్నారు.

సొంతంగా 42 కళాశాలల్లో..

ఆన్‌లైన్ ద్వారా మూడో విడత వరకు 1,87,368 మంది చేరారు. హైదరాబాద్‌లో 42 కళాశాలలు సొంతంగా ప్రవేశాలు జరుపుకున్నాయి. వాటిల్లో 19,031 మంది ప్రవేశాలు పొందారు. మరో 3 వేల మంది రెసిడెన్షియల్‌లో చేరారు. వాటిని కలుపుకుంటే ఇప్పటివరకు 2,09,399 మంది డిగ్రీ కళాశాలల్లో చేరారు. నాలుగో విడతలో 9 వేల మంది వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకున్నారు. వారిలో కనీసం ఐదారు వేల మంది చేరే అవకాశం ఉంది.

ఇక ఓయూ పరిధిలో పరిశీలిస్తే.. ఆన్‌లైన్ ద్వారా 69,894 మంది చేరారు. దోస్త్‌లో చేరని 42 కళాశాలల్లోని 19,031 మందిని కలుపుకుంటే 88,925 మంది ఓయూ పరిధిలో చేరారు. నాలుగో విడతలో కనీసం మరో 3 వేల మంది ఓయూ కళాశాలల్లో చేరే అవకాశం ఉంది.

దోస్త్ కారణమా?

2015-16 విద్యా సంవత్సరం వరకు ప్రవేశం కావాలంటే ఆయా కళాశాలలకు వెళ్లాల్సిందే. హైదరాబాద్‌లోని పలు పేరున్న కళాశాలలకు దరఖాస్తు చేసుకోవాలంటే ఒక్కో దానికి రూ.500 ఖర్చయ్యేది. గత ఏడాది నుంచి ఆన్‌లైన్ ప్రవేశాలు ప్రారంభం కావడంతో రూ.100తో ఒకే దరఖాస్తుతో రాష్ట్రంలో ఎక్కడైనా ప్రవేశం పొందే వీలు లభించింది. విద్యార్థి సాధించిన మార్కులు, కేటగిరీని బట్టి కళాశాలలో సీటు కేటాయిస్తారు. దీంతో పలువురు నిజాం, కోఠి మహిళా, సిటీ కళాశాలతోపాటు మరికొన్ని ప్రముఖ ప్రైవేట్ కళాశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతున్నారు. హైదరాబాద్‌లో చదువుకుంటే ఉద్యోగావకాశాలు మెండుగా ఉంటాయని, పోటీ పరీక్షలకు సన్నద్ధం కావచ్చని విద్యార్థులు భావిస్తున్నారు. పేద విద్యార్థులు పార్ట్ టైమ్ ఉద్యోగాలు చేసుకోవచ్చని కూడా నగరంలో చేరుతున్నారు.

20 శాతం మంది ఇతర జిల్లాలవారు పెరిగారు



సిటీ కళాశాలలకు గతంలోనూ మహబూబ్‌నగర్, మరికొన్ని జిల్లాల వారు వచ్చి ప్రవేశాలు పొందేవారు. దోస్త్ తర్వాత 20 శాతం మంది ఇతర జిల్లాల వారు పెరిగారు. ఆదిలాబాద్ నుంచి సైతం వస్తున్నారు. ఇంటర్‌లో 95 శాతం మార్కులు సాధించిన వారు కూడా చేరుతున్నారు.

–మంజులత, ప్రిన్సిపాల్, సిటీ కళాశాల, హైదరాబాద్

విశ్వవిద్యాలయాలవారీగా భర్తీ అయిన సీట్ల పరిస్థితి..

విశ్వవిద్యాలయం	2015	2016	2017
కేయూ	70,168	54,034	49,430
ఓయూ	78,276	86,330	69,894
మహాత్మాగాంధీ	24,440	18,049	16,451
పాలమూరు	19,885	17,855	13,713
శాతవాహన	25,182	23,930	22,661
తెలంగాణ	16,431	15,158	13,728
మొత్తం	2,34,453	2,15,356	1,87,368

(★ ఓయూలో ఆఫ్‌లైన్‌లో మరికొన్ని సీట్లూ భర్తీ అయ్యాయి)



సింధుకు కేసీఆర్ 'చేనేత' కానుక

ఈనాడు, హైదరాబాద్: బ్యాడ్మింటన్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో రజతం సాధించిన పి.వి.సింధు, ఆమె కోచ్ పుల్లెల గోపీచంద్‌లను తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అభినందించారు. బుధవారం ప్రగతి భవన్‌లో సింధు, గోపీచంద్‌లను సీఎం చేనేత శాలువాలతో సత్కరించారు. మంత్రి కేటీఆర్ ప్రత్యేకంగా తెప్పించిన పోచంపల్లి చీరలను కేసీఆర్ సింధుకు అందజేశారు. సింధు, గోపీచంద్‌లకు వెండి జ్ఞాపికలను బహుమతిగా ఇచ్చారు.

నిబంధనలకు వ్యతిరేకంగా పార్కింగ్ ఫీజు వసూలు

- ఎంపీ సుబ్బిరామిరెడ్డి, పార్కింగ్ కాంట్రాక్టర్‌పై కేసు నమోదు

సుల్తాన్‌బజార్, న్యూస్‌టుడే: జీహెచ్‌ఎంసీ చట్టానికి వ్యతిరేకంగా, నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారని వచ్చిన ఫిర్యాదుపై ప్రముఖ పారిశ్రామికవేత్త, ఎంపీ టి.సుబ్బిరామిరెడ్డితో పాటు కాచిగూడ చౌరస్తాలోని బిగ్‌బజార్, ఐనాక్స్ నిర్వాహకులు, పార్కింగ్ కాంట్రాక్టర్లపై సుల్తాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదయ్యాయి. కాచిగూడ చౌరస్తాలోని బిగ్‌బజార్ మాల్ వద్ద నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారని తార్నాకకు చెందిన విజయ్‌గోపాల్ అనే వ్యక్తి ఈ నెల 27న సుల్తాన్‌బజార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో బిగ్‌బజార్ కాంప్లెక్స్ యజమాని సుబ్బిరామిరెడ్డితో పాటు బిగ్‌బజార్, ఐనాక్స్ నిర్వాహకులు, పార్కింగ్ కాంట్రాక్టర్‌పై జీహెచ్‌ఎంసీ చట్టం మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణప్రసాద్ చెప్పారు.

'సాగర' మథనం

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టనుంది. అవసరమైతే 450 అడుగుల వరకు కూడా వెళ్లే ఆలోచనతో ఉన్నట్లు తెలిసింది. మరోవైపు ఎల్లంపల్లి, సింగూరు, నాగార్జునసాగర్ నుంచి మొత్తం 29 టీఎంసీల నీటిని హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కేటాయించాలని జలమండలి నీటిపారుదల శాఖను కోరింది. ఇందులో కూడా ఎల్లంపల్లి నుంచి ఎక్కువ నీటిని కేటాయించాలని కోరినట్లు నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి.

హైదరాబాద్ మహానగర జనాభా అవసరాలకు తగ్గట్లుగా నీటిని సరఫరా చేయాలంటే సుమారు 350 మిలియన్ గ్యాలన్ల (ఎంజీడీ) నీరు అవసరం. నీటి రవాణా, సరఫరా, ఆవిరితో కలుపుకొని 40 శాతం వరకు వృథా అవుతుంది. అంటే రోజూ 480 నుంచి 500 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేయాలి. ప్రస్తుతం నీటి లభ్యత లేనందున సుమారు 390 ఎంజీడీ నీటిని మాత్రమే తీసుకొంటున్నారు. ఇందులో వృథాను మినహాయిస్తే 230 ఎంజీడీ వరకే వినియోగించుకొంటున్నట్లు లెక్కలున్నాయి. నీటికి ఎద్దడి లేకుండా చూడాలంటే మళ్లింపు, నిల్వ సామర్థ్యం రెండింటినీ పెంచుకోవాలి. నీటి నిల్వ కోసం నిర్మిస్తున్న జలాశయాల్లో కొన్నింటిని ఇటీవల ప్రారంభించగా, ఎక్కువ భాగం నిర్మాణంలో ఉన్నాయి. ప్రస్తుతం నిల్వ కంటే రానున్న రోజుల్లో తగినంతగా నీటిని సరఫరా చేయడం జలమండలికి ప్రధాన సవాలు కానుంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై మూడు నెలలు పూర్తయినా కృష్ణా బేసిన్‌లోని జలాశయాల్లోకి ప్రవాహం లేదు. గోదావరికి ఇటీవలే ప్రారంభమైంది. హైదరాబాద్ అవసరాలకు కృష్ణా బేసిన్‌లో నాగార్జునసాగర్ నుంచి, గోదావరి బేసిన్‌లో ఎల్లంపల్లి, సింగూరు నుంచి నీటిని తీసుకొనే ఏర్పాటు ఉంది. ఎల్లంపల్లి నుంచి 10 టీఎంసీల నీటి కేటాయింపు ఉంది. ఇక్కడి నుంచి 360 క్యూసెక్కులు తీసుకొనే సామర్థ్యం ఉండగా ప్రస్తుతం 220 క్యూసెక్కులే తీసుకొంటున్నారు. తొమ్మిది పంపులకు ఆరు పని చేస్తున్నాయి. ఎల్లంపల్లిలో పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 20.18 టీఎంసీ కాగా ప్రస్తుతం 15 టీఎంసీలు ఉంది. అందువల్ల ఈ ప్రాజెక్టు నుంచి తీసుకోవడానికి ఎలాంటి ఇబ్బంది లేదు. 29.91 టీఎంసీల సామర్థ్యమున్న సింగూరులో ప్రస్తుతం 22 టీఎంసీలు ఉంది. గోదావరి నుంచి తాగునీటి మళ్లింపునకు ఎలాంటి ఇబ్బంది లేకున్నా నిల్వ సామర్థ్యం పెరిగిన తర్వాతే పూర్తి స్థాయిలో తీసుకొనే అవకాశం ఉంది.

కృష్ణా బేసిన్ నుంచి..

కృష్ణా బేసిన్‌లోని నాగార్జునసాగర్ నుంచి ప్రతి నెలా ఒకటిన్నర టీఎంసీ నీరు హైదరాబాద్‌కు మళ్లించాలి. ప్రస్తుతం రోజూ 270 మిలియన్ గ్యాలన్ల నీటిని తీసుకొంటున్నారు. నల్గొండ జిల్లాలో తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకొని ఇందులో 90 మిలియన్ గ్యాలన్ల నీటిని ఉదయసముద్రం రిజర్వాయర్‌కు మళ్లించాలని నిర్ణయించారు. అర టీఎంసీ ఈ జలాశయానికి చేరితే మొత్తం నీటిని తిరిగి హైదరాబాద్‌కు సరఫరా చేస్తామని సంబంధిత వర్గాలు తెలిపాయి. అయితే సమస్య అంతా నాగార్జునసాగర్‌లో నీటిమట్టం పడిపోవడమే. సాగర్ కనీస నీటిమట్టం 510 అడుగులు కాగా 505 అడుగుల వరకు తాగునీటి పంపులు నడపవచ్చు. అప్రోచ్ ఛానల్‌ను డ్రెడ్జింగ్ చేసి ఇంకా తక్కువ నీటిమట్టం నుంచి తీసుకోవడానికి ఏర్పాట్లు చేశారు. 490 అడుగుల వరకు మళ్లించేలా డ్రెడ్జింగ్ చేసినా పంపులు పని చేయడానికి ఐదు మీటర్ల మట్టం ఉండాలి. కాబట్టి 495 అడుగుల వరకు నీటిని తీసుకొంటామని సంబంధిత వర్గాలు తెలిపాయి. బుధవారానికి సాగర్ నీటిమట్టం 500 అడుగులు. 495 అడుగుల వరకు మరో 8 టీఎంసీలు అందుబాటులో ఉంటుంది. డిసెంబరు వరకు ఈ నీటిని వినియోగించుకోవచ్చు. అయితే శ్రీశైలంలోకి ప్రవాహం ఇలాగే ఉంటే వచ్చే ఏడాది జులై వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోక తప్పదు. ఇందుకోసం 475 అడుగుల వరకు నాగార్జునసాగర్ నుంచి నీటిని తీసుకొనేలా సుమారు రెండున్నర కిలోమీటర్ల దూరం డ్రెడ్జింగ్ చేసి కాలువను సిద్ధం చేయడానికి కసరత్తు ప్రారంభించారు. 475 అడుగుల వరకు తీసుకొంటే మరో 35 టీఎంసీలు అందుబాటులో ఉంటాయి. సాగర్‌లోకి ప్రవాహం రాకపోయినా హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ఇబ్బంది ఉండదని నీటిపారుదల శాఖ వర్గాలు తెలిపాయి. డ్రెడ్జింగ్‌కు సంబంధించి సర్వే జరుగుతోంది. అంచనాలు రూపొందించిన తర్వాత ముఖ్యమంత్రితో చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

ఏప్రిల్ నుంచి జులై వరకు నీటి సరఫరా, రవాణా వివరాలు

నెల	సరఫరా (ఎంజీడీ)	నష్టం	నష్ట శాతం
ఏప్రిల్	375	155.17	38.09
మే	388	165.69	41
జూన్	388	161.31	37.86
జులై	388	164.41	38.49

హైదరాబాద్ తాగునీటికి వివిధ జలాశయాల నుంచి నీటి సరఫరా వివరాలు (ఎంజీడీల్లో)

ప్రాజెక్టు	డిజైన్ సామర్థ్యం	ప్రస్తుతం తీసుకొంటున్న నీరు
ఉస్మాన్‌సాగర్	25	0
హిమాయత్‌సాగర్	15	0
మంజీరా మొదటి, రెండోదశ	45	30
సింగూరు	75	9
ఎల్లంపల్లి	172	114

గ్రహం అనుగ్రహం

31–8–2017 గురువారం

శ్రీ హేవళంబి నామ సం॥రం॥ దక్షిణాయనం వర్ష రుతువు; భాద్రపద మాసం; శుక్ల పక్షం
దశమి: పూర్తి
మూల నక్షత్రం: తె. 4-53 తదుపరి పూర్వాషాఢ
అమృతఘడియలు: రా. 9-46 నుంచి 11-32 వరకు
వర్జ్యం: ఉ. 11-07 నుంచి 12-54 వరకు
తిరిగి తె. 3-05 నుంచి 4-53 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-57 నుంచి 10-47 వరకు
తిరిగి మ. 2-55 నుంచి 3-44 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ. 5-48; సూర్యాస్తమయం: సా. 6-13
పుబ్బకార్తె ప్రారంభం

వాతావరణం

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
ఆదిలాబాద్	21.1	32.6
హైదరాబాద్	22.3	---
మహబూబ్‌నగర్	23.0	30.4
కరీంనగర్	23.0	31.0
నిజామాబాద్	24.0	32.0
గుంటూరు	24.0	34.5
ఖమ్మం	24.0	35.0
విశాఖపట్నం	24.2	33.2
విజయవాడ	24.6	35.0
రామగుండం	25.2	---
తిరుపతి	26.0	36.5
సూర్యాపేట	27.0	34.8

తుది జాబితాపై రైతులందరి సంతకాలు

(మొదటి పేజీ తరువాయి)

మహమూద్ అలీ, మంత్రి కేటీఆర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. "ఒకప్పుడు భూమి ప్రభుత్వానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. ఇప్పుడు ప్రభుత్వమే ఎకరానికి ఏడాదికి రూ.8 వేల చొప్పున పెట్టుబడి కోసం ఇస్తుంది. ఈ పథకంతో భూమికి సంబంధించిన దృక్పథమే మారుతోంది. ప్రపంచవ్యాప్తంగా రైతులను అన్ని దేశాలూ గౌరవిస్తున్నాయి. వచ్చే సంవత్సరం నుంచి కాళేశ్వరం ప్రాజెక్టు నీటితో చెరువులు నింపుతాం. వీటితో పాత ఏడు జిల్లాల్లో పంటలు బాగా పండుతాయి. పహాణీ, సేత్వారీ లాంటి పాతకాలపు పదాలు తొలగించి మన తెలుగు భాషకు సరళమైన పదాలతో రికార్డులు తయారుకావాలి. పహాణీలో ఎక్కువ కాలమ్స్ వద్దు. ఈ కార్యక్రమం నిర్వహణకు 1193 బృందాలు ఏర్పాటు చేయాలి. ఒక్కో బృందానికి 9 గ్రామాలు అప్పగించాలి. 3 నెలల్లో రికార్డుల ప్రక్షాళన చేయాలి. ప్రస్తుతం రికార్డుల్లో ఉన్న చిక్కులన్నీ తొలగిపోవాలి. రైతులు ప్రశాంతంగా వ్యవసాయం చేసుకునేలా ఇవి ఉండాలి. కోట్లాది బ్యాంకు ఖాతాలను నిర్వహిస్తోన్న కోర్ బ్యాంకింగ్ విధానం భూ రికార్డులకు వర్తింపజేయాలి. దీనికోసం వెయ్యి మంది ఐటీ అధికారులను ప్రత్యేకంగా రెవెన్యూ శాఖలో పనిచేయడానికి నియమించాలి. పట్టాదారులకు ఎలాంటి సమాచారమైనా ఆన్‌లైన్‌లోనే దొరకాలి. భూమి రిజిస్ట్రేషన్ అయిన వెంటనే మ్యూటేషన్ జరగాలి. భూముల క్రయ, విక్రయాలకు రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ఒకేసారి వెళ్లేలా ఉండాలి. రైతుల పాసు పుస్తకాలు కొరియర్‌లో వారికి పంపాలి. కలెక్టర్ కోర్టు మినహా మిగతా రెవెన్యూ కోర్టులన్నీ రద్దు చేయాలి. బ్యాంకులు రైతుల పాసు పుస్తకాలను తీసుకోకుండా కంప్యూటర్ సమాచారం ఆధారంగా పంటరుణాలు ఇవ్వాలి. ఈ కార్యక్రమంపై తహసీల్దార్లతో రాష్ట్రస్థాయి సమావేశం ఏర్పాటుచేయాలి" అని సూచించారు.

పవన్ కల్యాణ్ ఇంటి ముందు మహిళ హంగామా

అదుపులోకి తీసుకున్న పోలీసులు

జూబ్లీహిల్స్, న్యూస్‌టుడే: సినీనటుడు, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌ను కలవాలంటూ బుధవారం ఓమహిళ జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని ఆయన ఇంటి ముందు హంగామా సృష్టించింది. జ్యోతి అనే సదరు మహిళను లోపలికి వెళ్లనివ్వకుండా పవన్ ఇంటి వద్ద ఉన్న సిబ్బంది అడ్డుకుని జూబ్లీహిల్స్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు వచ్చి ఆమెను అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో పవన్‌కల్యాణ్ ఇంట్లోలేరు. అయితే, ఆమె గతంలోనూ చాలాసార్లు పవన్ కల్యాణ్‌ను కలవాలంటూ ఆయన ఇంటి ముందు హంగామా సృష్టించిందని.. మానసిక పరిస్థితి సరిగాలేకే ఇలాచేస్తోందని పోలీసులు తెలిపారు.

బతుకమ్మ చీరలు సిద్ధం

- 500 డిజైన్లు.. కనువిందైన రంగులు

ఈనాడు, హైదరాబాద్: ఐదు వందల రకాల డిజైన్లు... ఒక్కో డిజైన్‌కు ఐదేసి రంగులు.. రాష్ట్ర ప్రభుత్వం బతుకమ్మ పండుగ సందర్భంగా పంపిణీ చేయనున్న బతుకమ్మ చీరల సొగసులివీ. రాష్ట్రంలో తొలిసారిగా 1.04 కోట్ల మంది పేద మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిన తెలంగాణ ప్రభుత్వం దీనిని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంది. తెల్లకార్డున్న వారందరికీ చీరలు పంపిణీ చేయాలని ఏప్రిల్‌లో సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. చీరలు నాణ్యత, నవ్యతతో ఉండాలన్నారు. తెలంగాణ వాతావరణం ఉట్టిపడేలా వాటిని తయారు చేయాలన్నారు. దీనికి అనుగుణంగా రాష్ట్ర చేనేత శాఖ, సహకార సంస్థ అధికారులు ప్రముఖ డిజైనర్లు, చేనేత, జౌళి నిపుణులతో సమావేశం నిర్వహించి డిజైన్లు రూపొందించాలని కోరారు. నెల రోజులు శ్రమించి 500 డిజైన్లను తయారు చేశారు. ఒక్కో డిజైన్‌కు ఐదేసి రంగులను రూపొందించారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల ఆమోదం పొందాక వీటిని ఉత్పత్తి సంస్థలకు అందజేశారు. సిరిసిల్లతో పాటు ఇతర ప్రాంతాల్లో 50 శాతం మాత్రమే చీరలు ఉత్పత్తి అవుతుండగా, మిగిలిన 50 శాతం చీరల తయారీకి టెండర్లను పిలిచి సూరత్ సంస్థను ఎంపిక చేశారు. దానికి రాష్ట్ర ప్రభుత్వ డిజైన్లను పంపగా వాటితోనే చీరలను తయారు చేశారు. నాణ్యమైన నూలు, పాలిస్టర్‌తో రూపొందించిన చీరల ఉత్పత్తి ఇప్పటికి 90 శాతం పూర్తయింది. సూరత్‌లో రూపొందించిన చీరలు బుధవారం రాష్ట్రానికి చేరాయి. నిజామాబాద్ తదితర జిల్లాల్లో వాటిని గోదాముల్లో నిల్వ చేశారు. సిరిసిల్ల చీరలను సైతం గోదాములకు తరలిస్తున్నారు. మహారాష్ట్రలో వర్షాల కారణంగా కొంత జాప్యం ఏర్పడినా సెప్టెంబరు రెండోవారం వరకు అన్ని చీరలు రాష్ట్రానికి చేరతాయని ఆశిస్తున్నారు.

పకడ్బందీగా పంపిణీ: సెప్టెంబర్ 18, 19, 20 తేదీల్లో చీరలను గ్రామాలు, వార్డుల వారీగా పంపిణీ చేయనున్నారు. ప్రతి చీరకు ప్యాకింగ్ ఉంటుంది. ప్యాక్‌పై తెలంగాణ ప్రభుత్వ ముద్ర, ముఖ్యమంత్రి కేసీఆర్, చేనేత, జౌళి శాఖల మంత్రి కేటీఆర్, తెలంగాణ తల్లి ఫొటోలతోపాటు తెలంగాణ ఆడపడుచులకు బతుకమ్మ కానుక, ప్రభుత్వ శుభాకాంక్షలు అని ముద్రించారు. మహిళలకు పంపిణీ చేసే చీరల ధర రూ.400 నుంచి రూ.500 వరకు ఉంటుందని అధికారులు చెబుతున్నారు.



గోదాములకు చేరిన బతుకమ్మ చీరలు

ఇదీ సంగతి!



కామ్రేడ్ ప్రెసిడెంట్, ఇదంద మీ మూడో బేబీ!

కలసిరాని సమయం..



చిన్నపాటి పొరపాటు సరిగా లేకుంటే.. యుద్ధరంగంలో మహా అశ్వాలైనా చతికిలపడిన చందంగా చిన్న గడియారంలో తలెత్తిన లోపం వల్ల ఒక ఉపగ్రహమే కొరగాకుండా పోయింది. స్వదేశీ దిక్సూచి వ్యవస్థను సాకారం చేయాలనుకున్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు కాలమానినితో చిక్కులు తప్పలేదు. ప్రధాన గడియారంతో పాటు ప్రత్యామ్నాయాలూ విఫలం కావడంతో మరో ఉపగ్రహ ప్రయోగం తప్పనిసరైంది. దీంతో.. నెల్లూరులోని షార్ నుంచి గురువారం రాత్రి 7 గంటలకు పీఎస్ఎల్వీ ద్వారా ఐఆర్ఎన్ఎస్ఎస్-1 హెచ్ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపనున్నారు.

గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) తరహాలో ఇస్రో కూడా ఇండియన్ రీజనల్ నేవిగేషన్ శాటిలైట్ సిస్టమ్ (ఐఆర్ఎన్ఎస్ఎస్) పేరుతో స్వదేశీ దిక్సూచి వ్యవస్థకు శ్రీకారం చుట్టింది. అటు రక్షణ అవసరాలతోపాటు ఇటు పౌర అవసరాలకూ ఉపయోగపడేలా అత్యంత కచ్చితమైన దిక్సూచి డేటాను అందించడం దీని ఉద్దేశం. రూ.1420 కోట్ల విలువైన ఈ ప్రాజెక్టు కింద 9 దిక్సూచి ఉపగ్రహాలను ఇస్రో రూపొందించాల్సి ఉంటుంది. ఇందులో ఏడు.. కక్ష్యలో ఉంటాయి. వీటిలో ఏదైనా ఉపగ్రహాలు విఫలమైతే.. వాటి స్థానాన్ని భర్తీ చేయడం కోసం మిగతా రెండింటిని ప్రత్యామ్నాయంగా భూమిపై సిద్ధంగా ఉంచారు. ఈ ఉపగ్రహ వ్యవస్థకు 'నావిక్' అని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ గత ఏడాది నామకరణం చేశారు. ఏడు ఉపగ్రహాలను ఇప్పటికే ఇస్రో ప్రయోగించింది.

- నావిక్ వ్యవస్థ ద్వారా ప్రధానంగా రెండు రకాల సేవలు అందుతాయి. ఒకటి.. ప్రామాణిక స్థితి సేవలు (ఎస్పీఎస్). ఇవి సాధారణ ప్రజలకు ఉద్దేశించినవి. రెండోది నియంత్రిత సేవలు. రక్షణ బలగాలు వంటి అధీకృత వినియోగదారులకు మాత్రమే ఇవి అందుతాయి. ఈ సేవల్లో కచ్చితత్వం ఎక్కువగా ఉంటుంది.
- దేశవ్యాప్తంగానూ, దేశ సరిహద్దుల నుంచి 1500 కిలోమీటర్ల దూరం వరకూ విస్తరించిన ప్రాంతంలోనూ మన దిక్సూచి వ్యవస్థ సేవలు అందిస్తుంది. అంటే మన పొరుగు దేశాల వారూ దీన్ని ఉపయోగించుకోవచ్చు.
- జీపీఎస్ తరహాలో నావిక్ కూడా బహుళ సేవలను అందిస్తుంది. వాహనాల గతిని ఎప్పటికప్పుడు పరిశీలించడానికి, నౌకలు, విమానాల రాకపోకల నిర్వహణకు, విపత్తు సమయంలో సేవలకు, మ్యాపింగ్ అవసరాలకు; నేల, సముద్రం, నింగిలో దిక్సూచి సేవలకు ఉపయోగపడుతుంది.



- నావిక్ సేవలను వినియోగించుకునేందుకు అవసరమైన హార్డ్‌వేర్‌ను వివిధ కంపెనీలు రూపొందిస్తున్నాయి. వచ్చే ఏడాది నుంచి వీటి సేవలు జనసామాన్యానికి అందుబాటులోకి రావొచ్చని అంచనావేస్తున్నారు.

విశ్వసనీయత కోసమే..

అమెరికాకు చెందిన జీపీఎస్, రష్యాకు చెందిన గ్లోనాస్, ఐరోపాకు చెందిన గెలీలియో, చైనాకు చెందిన బీడో వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం మనం.. గమన పరిశీలనకు, నిర్దిష్ట ప్రదేశ గుర్తింపునకు జీపీఎస్ సేవలను పొందుతున్నాం. అయితే అది అమెరికా రక్షణశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. మనం జీపీఎస్ డేటాను పొందుతుండగా.. ఏ క్షణంలోనైనా అడ్డుకునేందుకు ఆ దేశానికి అవకాశం ఉంది. తద్వారా మనకు ఇబ్బందులు కలిగించొచ్చు. కార్గిల్ యుద్ధంలో జీపీఎస్ వ్యవస్థను భారత రక్షణ బలగాలు వినియోగించలేకపోయాయి. ఉద్దేశపూర్వకంగా ఆ ప్రాంతంలో అమెరికా ఈ సేవలు అందకుండా నిరోధించడమే ఇందుకు కారణమన్న వాదన ఉంది.

- స్వదేశీ దిక్సూచి వ్యవస్థ ఉంటే మనకు ఈ ఇబ్బంది తప్పుతుంది. దేశ రక్షణ అవసరాల్లో విశ్వసనీయత సాధ్యమవుతుంది.

పరమాణు గడియారాలే కీలకం..

'నావిక్' వంటి దిక్సూచి వ్యవస్థలకు అత్యంత కచ్చితమైన సమయ నిర్ధారణే కీలకం. భూమి మీద ఒక వ్యక్తి ఉన్న ప్రదేశాన్ని కచ్చితంగా నిర్ధారించడానికి.. దిక్సూచి ఉపగ్రహం నుంచి అతడి చేతిలోని రిసీవర్‌కు రేడియో సంకేతాలు చేరుకోవడానికి పట్టే సమయాన్ని అత్యంత నిర్దిష్టంగా లెక్కించాల్సి ఉంటుంది.

- ఎందుకంటే.. ఈ సంకేతాలు కాంతి వేగంతో (సెకనుకు 3లక్షల కిలోమీటర్లు) పయనిస్తాయి. అందువల్ల వాటి ప్రయాణ సమయ నిర్ధారణలో ఒక మిల్లీ సెకను మేర తేడా వచ్చినా.. భూమిపై వినియోగదారుడికి అందే దిక్సూచి సమాచారంలో 300 కిలోమీటర్ల మేర వైరుధ్యం తలెత్తుతుంది.
- ఈ స్థాయి కచ్చితత్వంతో సమయ నిర్ధారణ కోసమే దిక్సూచి ఉపగ్రహాల్లో పరమాణు గడియారాలను అమర్చారు.
- నావిక్‌లోని 9 ఉపగ్రహాల్లోనూ మూడేసి చొప్పున రుబీడియం అటామిక్ ఫ్రీక్వెన్సీ స్టాండర్డ్ (ఆర్ఏఎఫ్ఎస్) పరమాణు గడియారాలు ఉన్నాయి. ఇందులో ఒకటి మాత్రమే సమయ నిర్ధారణ చేస్తుంది. ఇది విఫలమైతే ప్రత్యామ్నాయంగా మిగతా రెండింటిని ఏర్పాటు చేశారు.

మూడు విఫలం..



ఈ పరమాణు గడియారాల తయారీ భారత్‌లో లేదు. స్విట్జర్లాండ్‌కు చెందిన 'స్పెక్ట్రా టైమ్' సంస్థ నుంచి 40 లక్షల యూరోలతో 27 గడియారాలను భారత్ దిగుమతి చేసుకుంది. ఐరోపాకు చెందిన గెలీలియో, చైనాకు చెందిన బీడో దిక్సూచి వ్యవస్థలకూ ఈ సంస్థే పరమాణు గడియారాలను సరఫరా చేసింది.

- అయితే నావిక్ శ్రేణిలో మొదటిదైన ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఎ ఉపగ్రహంలోని మొత్తం మూడు రుబీడియం పరమాణు గడియారాలు మొరాయించాయి. దీంతో ఈ ఉపగ్రహం.. దిక్సూచి సేవలను నిర్దిష్టంగా అందించలేని స్థితికి చేరింది. ఈ నేపథ్యంలో ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ పేరుతో 8వ ఉపగ్రహాన్ని గురువారం ప్రయోగిస్తోంది.
- ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఏలో గడియారాలు మినహా మిగతా వ్యవస్థలన్నీ సజావుగానే ఉన్నాయి. ఇప్పటికీ తక్కువ శక్తి కలిగిన సందేశాలను, మత్స్యకారులకు ఉపయోగపడే వాతావరణ డేటాను పంపుతోంది. అందువల్ల దీన్ని ఇతర అవసరాల కోసం ఉపయోగించాలని ఇస్రో నిర్ణయించింది.

నాలుగు చాలు..

నిజానికి ఒక్క ఉపగ్రహంలో పరమాణు గడియారాలు విఫలమైనంత మాత్రాన 'నావిక్' వ్యవస్థ సామర్థ్యంపై ఎలాంటి ప్రభావం ఉండదు. కనీసం నాలుగు ఉపగ్రహాలతో సేవలు అందించవచ్చు. ఒక్కటి విఫలమైనప్పటికీ మిగతా ఆరు ఉపగ్రహాలు సేవల్లో పనిచేస్తున్నాయి. మరింత కచ్చితత్వం కోసమే భూమి మీద సిద్ధంగా ఉంచిన ఒక ఉపగ్రహాన్ని ఇస్రో తాజాగా నింగిలోకి పంపుతోంది.

విఫలం ఇందుకే..

డిజైన్‌లో లోపం వల్ల కానీ అంతరిక్షంలోని ప్రతికూల పరిస్థితుల వల్ల కానీ ఈ గడియారాలు విఫలం కావొచ్చు. 'నావిక్' విషయానికొస్తే.. ఉష్ణోగ్రత, కాంతిని వెలువరించే రుబీడియం బల్బ్, ఎలక్ట్రానిక్ పవర్ సరఫరా వంటి అంశాల్లో సమస్యల కారణంగా ఈ గడియారాలు విఫలమై ఉండొచ్చని ఇస్రో అంచనావేస్తోంది. ఐరోపా 'గెలీలియో', రష్యా 'గ్లోనాస్'కూ ఈ తరహా వైఫల్యాల బెడద తప్పలేదు.

దిద్దుబాటు..

మొదట విడత కింద అందిన గడియారాల్లోనే ఇబ్బందులు తలెత్తినట్లు ఇస్రో పేర్కొంది. తర్వాత అందుకున్న సాధనాల డిజైన్‌ను మెరుగుపరచినట్లు వెల్లడించింది. తాజాగా ప్రయోగిస్తున్న ఉపగ్రహంలోని పరమాణు గడియారాలనూ మరింత ఆధునికీకరించినట్లు తెలిపింది.

స్వదేశీ సమయం..

దిక్సూచి సేవలను సాధ్యమైనంత స్వదేశీకరించేందుకు ఇస్రో తీవ్రంగా కసరత్తు చేస్తోంది. ఈ నేపథ్యంలో 'నావిక్'కు దిల్లీలోని నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ (ఎన్‌పీఎల్) అందించిన 'అధికారిక సమయాన్ని' వినియోగించాలని నిర్ణయించింది. ఇప్పటి వరకూ సమయ సమన్వయం కోసం.. అమెరికా నౌకాదళ అబ్జర్వేటరీ (యూఎస్ఎన్వో) అందించే డేటాపై ఇస్రో ఆధారపడింది. స్వదేశీ సమయంలోకి మళ్లడం వల్ల సమయంలో తేడాలను 20 నానో సెకన్ల కన్నా తక్కువ స్థాయికి పరిమితం చేయడానికి వీలవుతుంది. ఒక నానో సెకను అంటే.. సెకనులో వంద కోట్ల వంతు.

ఏమిటీ పరమాణు గడియారాలు?

మానవ చరిత్ర పరిణామక్రమంలో సమయ నిర్ధారణ అనేది ఎక్కువ శాతం.. భూ భ్రమణం ఆధారంగా సాగింది. అయితే ఈ భ్రమణ కాలంలో వైరుధ్యాలు చోటుచేసుకుంటున్నాయి. సౌర దినం నిడివి క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో అనేక రకాల సాధనాలు వచ్చినా.. వాటిలో కచ్చితత్వం అంతంత మాత్రమే.



- అయితే మానవ అవసరాలు, సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతున్నకొద్దీ సమయంలో మిల్లీసెకను స్థాయి లెక్కల్లోనూ కచ్చితత్వం అవసరమైంది.
- ఈ నేపథ్యంలో 1955లో లూయీ ఎస్సెన్, జాక్ పారీ అనే శాస్త్రవేత్తలు ప్రపంచంలోనే తొలిసారిగా సీసియం పరమాణు గడియారాన్ని రూపొందించారు. సమయాన్ని మనం కొలిచే, ఉపయోగించే తీరు తెన్నులను ఇది సమూలంగా మార్చేసింది.

పనిచేసేది ఇలా..


ఇస్రో ఉపయోగిస్తున్న పరమాణు గడియారానికి రుబీడియం మూలకమే కీలకం. ఈ మూలకంలోని శీతలీకరించిన పరమాణువులో ఉండే ఎలక్ట్రాన్లు ఒక నిర్దిష్ట కాలావధిలో క్రమం తప్పకుండా విద్యుదయస్కాంత రేడియోధార్మికతను వెలువరిస్తాయి. ఈ తరంగాల పౌనఃపున్యాన్ని కొలవడం ద్వారా సమయాన్ని ఈ గడియారాలు లెక్కిస్తాయి. ఈ లెక్క చాలా స్థిరంగా ఉంటుంది. ఎట్టిపరిస్థితుల్లోనూ మారదు.

- లోలక ఆవర్తనం ఆధారంగా పాతకాలపు గడియారా (పెండులం క్లాక్స్)లు సమయాన్ని నిర్ధరించినట్లు.. విద్యుదయస్కాంత తరంగాల పౌనఃపున్యం ఆధారంగా పరమాణు గడియరాలు సమయాన్ని లెక్కిస్తాయన్న మాట. సీసియం గడియారాల్లో రుబీడియంకు బదులు సీసియంను ఉపయోగిస్తారు.

చౌక..

ప్రస్తుతం రుబీడియం, హైడ్రోజన్ మేసర్, సీసియం గడియారాలను ఉపయోగిస్తున్నారు. మిగతా రెండింటితో పోలిస్తే రుబీడియం గడియారానికి ఒకింత తక్కువ సామర్థ్యం కలిగి ఉన్నప్పటికీ.. అది కూడా కచ్చితమైనదేనని చెప్పుకోవచ్చు. పైగా అది చౌకైనది కావడంతో విరివిగా వినియోగిస్తున్నారు. దానిలో ఒక సెకను మేర తేడా రావడానికి కొన్ని వేల సంవత్సరాలు పడుతుంది.

- అయితే కచ్చితత్వానికి డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో అనేక సంస్థలు క్రమంగా సీసియం గడియారాలవైపు మొగ్గుతున్నాయి. చాలా దేశాలు తమ ప్రామాణిక సమయాన్ని నిర్ధరించడానికి సీసియం గడియారాలనే ఉపయోగిస్తున్నాయి. భారత ప్రామాణిక సమయాని (ఐఎస్‌టీ)కీ ఈ తరహా గడియారాలే ఆధారం. దిల్లీ కేంద్రంగా పనిచేసే నేషనల్ ఫిజికల్ లేబొరేటరీ (ఎన్‌పీఎల్) వీటిని నిర్వహిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా విస్తరించి ఉన్న దాదాపు 400 సీసియం పరమాణు గడియారాల ఆధారంగా అంతర్జాతీయ సమయాన్ని (కోఆర్డినేటెడ్ యూనివర్సల్ టైమ్-యూటీసీ) నిర్ధరిస్తున్నారు.
- ఇస్రో కూడా భవిష్యత్‌లో ప్రయోగించబోయే దిక్సూచి ఉపగ్రహాల్లో ఈ తరహా గడియారాలనే అమర్చాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.



బోలెడు ప్రయోజనాలు..

అత్యంత కచ్చితత్వంతో కూడిన సమయ నిర్ధారణ.. చాలా రంగాలకు ప్రాణావసరమవుతోంది. ఉదాహరణకు విద్యుత్ కోతల సమస్యలను అధిగమించడానికి విద్యుత్ పంపిణీకి ఉద్దేశించిన స్మార్ట్ గ్రిడ్‌లకు అత్యంత కచ్చితమైన సమయ సమన్వయం అవసరం. అలాగే సైబర్ నేరాలను పరిష్కరించడానికి.. సదరు ఆన్‌లైన్ నేరం జరిగిన సమయాన్ని చాలా నిర్దిష్టంగా గుర్తించాల్సి ఉంటుంది. ఎందుకంటే.. ప్రతి సెకనుకూ లక్షలాది లావాదేవీలు జరుగుతుండటమే కారణం. స్టాక్ మార్కెట్లు, సూపర్ కంప్యూటర్లు, అనేక ఆధునిక పరికరాలకూ అత్యంత మెరుగైన సమయ నిర్ధారణ అవసరం.

-ఈనాడు ప్రత్యేక విభాగం

ఆధార్‌పై గడువు డిసెంబరు 31

దిల్లీ: సంక్షేమ పథకాల లబ్ధిదారులు తమ ఆధార్ వివరాలను సమర్పించడానికి గడువును డిసెంబరు 31వ తేదీ వరకు పొడిగిస్తామని కేంద్రం ప్రకటించింది. వివిధ సామాజిక పథకాల కింద ప్రయోజనం పొందాలంటే సెప్టెంబరు 30లోగా ఆధార్ వివరాలు సమర్పించాలని విధించిన గడువును మూడు నెలల పాటు పెంచడానికి కేంద్రం సుముఖంగా ఉందని అటార్నీ జనరల్ కె.కె.వేణుగోపాల్ బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపారు. సంక్షేమ పథకాలకు ఆధార్‌ను తప్పనిసరి చేయడాన్ని సవాల్ చేస్తూ కొంతమంది దాఖలు చేసిన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారించింది. ఈ సందర్భంగా కేంద్రం వైఖరిని అటార్నీ జనరల్ వివరించారు. ముందుగా పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది శ్యామ్ దివాన్ వాదనలు వినిపించారు. వ్యక్తిగత గోప్యత... ప్రాథమిక హక్కేనని తొమ్మండుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం ఇటీవల ప్రకటించినందువల్ల ఆధార్ సంబంధిత పిటిషన్లను తగిన ధర్మాసనం విచారించాల్సి ఉంటుందని ఆయన చెప్పారు. ఆధార్ వివరాల సమర్పణకు గడువు సెప్టెంబరు 30 వరకే ఉందని ఆయన ప్రస్తావించినప్పుడు ఏజీ స్పందిస్తూ- గడువు పెంపుదల గురించి వెల్లడించారు. అలాగైతే ఈ పిటిషన్లను అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదనీ, అవి నవంబరు మొదటి వారంలో విచారణకు వచ్చేలా చూస్తామనీ ధర్మాసనం ప్రకటించింది. అంశాల ప్రాముఖ్యత దృష్ట్యా అయిదుగురు న్యాయమూర్తుల ధర్మాసనం దృష్టికి వీటిని నివేదించాలని ఏజీ కోరారు. నవంబరులో వాదనలు వినిపించడానికి తమకెలాంటి అభ్యంతరం లేదని దివాన్ చెప్పారు.

రాష్ట్రాలవారీగా ఆధార్ చట్టాలు!

ఈనాడు, దిల్లీ: భాజపా, ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల పాలిత రాష్ట్రాలు విడిగా ఆధార్ చట్టాలను రూపొందించుకుని తమతమ శాసనసభల్లో ఆమోదం పొందేలా చూసుకోవాలని నరేంద్రమోదీ సర్కారు ప్రోత్సహించనుంది. కేంద్ర ఆధార్ చట్టం నేపథ్యంలో గోప్యత హక్కుపై ఈ నెల 24న సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో కేంద్రం ఒకింత ఆందోళనతో ఉంది. ఎన్డీఏ/ భాజపా పాలిత ఆరు రాష్ట్రాలు ఇప్పటికే తమ పరిధిలో సొంతంగా ఆధార్ చట్టాలను ఆమోదించుకున్నాయి. మిగిలిన 15 రాష్ట్రాలూ ఈ పని పూర్తి చేయాలని మోదీ సర్కారు సూచించింది. ఈ సూచన ప్రకారం సొంత చట్టాలను ఆమోదింపజేసుకోవడం, లేదా కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేయడం ద్వారా పని పూర్తిచేయాల్సి ఉంటుంది. 'ఆధార్ చట్టం సుప్రీంకోర్టు పరిశీలనను తట్టుకుని నిలుస్తుందని మాకు పూర్తి నమ్మకం ఉంది. అయినా ఎలాంటి ఇబ్బంది రాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం' అని భాజపా కేంద్ర మంత్రి ఒకరు తెలిపారు. ఎన్డీఏ పాలనలో ఉన్న రాష్ట్రాలతో పాటు ఇతర పార్టీలు అధికారంలో ఉన్న కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్, ఒడిశా రాష్ట్రాలకూ కేంద్రం ఈ సూచన చేసింది. పశ్చిమ బెంగాల్, దిల్లీ, కేరళ, పంజాబ్ రాష్ట్రాలు మాత్రం కేంద్రం సూచనకు సానుకూలంగా స్పందించలేదు.

ఏటా రూ.3 లక్షల కోట్ల నగదు బదిలీ

కేంద్ర ఆధార్ చట్టం... భారత సంచిత నిధి నుంచి నిధులు సమకూరే కేంద్ర పథకాలకు మాత్రమే వర్తిస్తుంది. గత మూడేళ్లలో కేంద్ర సర్కారు 250 కేంద్ర పథకాలకు ఆధార్ ఆధారంగా నగదు బదిలీ చేయిస్తోంది. ఈ మొత్తం ఏటా రూ.3 లక్షల కోట్లు ఉంటోంది. రాష్ట్రాల్లో అమలవుతున్న సుమారు 3 వేల పథకాల కింద మరో రూ.3 లక్షల కోట్లు ఖర్చవుతూ ఉండవచ్చునేది కేంద్రం అంచనా. నకిలీ లబ్ధిదారుల్ని ఏరివేయడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలు దీనిలో భారీగా ఆదా చేయగలుగుతాయని కేంద్ర సర్కారు భావిస్తోంది.

పాన్‌తో ఆధార్ అనుసంధానం గడువు పొడిగింపుపై నేడు నిర్ణయం

దిల్లీ: శాశ్వత ఖాతా సంఖ్య (పాన్)తో ఆధార్ అనుసంధానం గడువును పొడిగించే విషయంపై కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ గురువారం నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుత గడువు నేటి (ఆగస్టు 31)తో ముగుస్తోంది. దీన్ని ఈ ఏడాది చివరి వరకూ పొడిగించే అవకాశముంది. ప్రస్తుతం "ఆధార్ అనుసంధానం" అంశం సుప్రీం కోర్టు పరిధిలో ఉన్న సంగతి తెలిసిందే. దీనిపై నవంబరులో విచారణ చేపడతామని సుప్రీం ఇప్పటికే ప్రకటించింది. మరోవైపు వివిధ ప్రభుత్వ పథకాలకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి గడువును డిసెంబరు ఆఖరు ప్రభుత్వం పొడిగించింది.

రాబర్ట్ వాద్రా భూ లావాదేవీలపై సీబీఐ దర్యాప్తు మొదలు

దిల్లీ: రాజస్థాన్‌లోని బికనీర్‌లో సోనియాగాంధీ అల్లుడు రాబర్ట్ వాద్రాతో సంబంధం ఉన్న సంస్థతో సహా....కొన్ని కంపెనీల భూ లావాదేవీల్లో అవకతవకల ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు బుధవారం నుంచీ మొదలైంది. ఈ మేరకు రాజస్థాన్ ప్రభుత్వం సూచించిన 18 భూ లావాదేవీల కేసులపై సీబీఐ దర్యాప్తు చేస్తుంది. బికనీర్‌లో సంబంధిత భూమి కుంభకోణం ఆరోపణలపై సీబీఐ 18 ఎఫ్ఐఆర్‌లను తిరిగి నమోదు చేసినట్లు సమాచారం. రాజస్థాన్ అభ్యర్థన మేరకే కేంద్రం ఈ కేసులను సీబీఐకి పంపింది.

14 రైళ్లకు నెలరోజుల పాటు అదనంగా ఏసీ బోగీలు

ఈనాడు, హైదరాబాద్: నిరీక్షణ జాబితా ప్రయాణికుల సౌకర్యం కోసం 14 రైళ్లకు అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే పేర్కొంది. సెప్టెంబరు 1 నుంచి నెలపాటు ఆయా రైళ్లకు ఒక్కో ఏసీ బోగీ ప్రయాణికులకు అదనంగా అందుబాటులోకి రానుంది. రెండింటికి ఏసీ ఛైర్‌కార్, పన్నెండు రైళ్లకు త్రీ టైర్ ఏసీ బోగీలను జత చేయనున్నట్లు ద.మ.రై.సీపీఆర్వో ఎం.ఉమాశంకర్ కుమార్ తెలిపారు. పల్నాడు ఎక్స్‌ప్రెస్, నర్సాపూర్, శబరి ఎక్స్‌ప్రెస్, ఏసీ సంపర్క్‌క్రాంతి, మచిలీపట్నం-సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, కాకినాడ-ఎల్‌టీటీ ముంబయి, నాందేడ్-ముంబయి సీఎస్‌టీల మధ్యతిరిగే రైళ్లకు తాత్కాలికంగా ఒక్కో అదనపు బోగీని ఏర్పాటు చేసినట్లు ద.మ. రైల్వే తెలిపింది.



హైదరాబాద్‌లోని తెలుగు విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో.. 2016 కీర్తి పురస్కారాల గ్రహీతలతో వర్సిటీ ఉపకులపతి ఆచార్య సత్యనారాయణ, శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ తదితరులు

వంతెనల కింద జలకళ

- 174 చోట్ల చెక్‌డ్యాంలు
- ఈ ప్రాంతాల్లో భారీగా నీటి నిల్వలు

ఈనాడు, హైదరాబాద్: రహదారి మార్గంలోని వంతెనల వద్ద ప్రయోగాత్మకంగా చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణాలు ఫలితాన్నిస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం రహదారుల నిర్మాణానికి పెద్దపీట వేసింది. ఆయా మార్గాల్లో కాలం చెల్లిన వంతెన స్థానంలో నూతన నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. 532 ప్రాంతాల్లో వంతెన నిర్మాణానికి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ వంతెనల వద్ద నీరు నిల్వ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ సూచించటంతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అందుకు వ్యూహరచన చేశారు. మహారాష్ట్ర తరహాలో వంతెనల కింద చెక్‌డ్యాంలు నిర్మించటం ద్వారా భూగర్భ నీటి మట్టానికి కొంత ఊతమివ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం అధికారుల బృందాన్ని మహారాష్ట్ర పంపి అధ్యయనం చేయించింది. ఆక్కడి పరిస్థితులను పరిశీలించిన బృందం ఇక్కడి స్థితిగతులను నిర్ధారించేందుకు వంతెనలను నిర్మించే ప్రాంతాలను పరిశీలించారు. 174 వంతెనల వద్ద వంతెన చెక్‌డ్యాంలు నిర్మించటానికి అవకాశాలున్నట్లు గుర్తించారు. అన్ని చెక్‌డ్యాంలను పూర్తి చేయటం ద్వారా 18,690 కోట్ల లీటర్ల నీటిని నిల్వ చేయవచ్చని అంచనాలు రూపొందించారు. ఖమ్మం, కరీంనగర్, మహబూబ్‌నగర్, మెదక్, నిజామాబాద్, రంగారెడ్డి, నల్గొండ, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లో 174 వంతెనల నిర్మాణానికి రూ. 520.60 కోట్ల వ్యయం చేయనున్నారు. అందులో రూ.62.47 కోట్ల నుంచి రూ.78.09 కోట్ల వ్యయంతో చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు 39 వంతెనలు, చెక్‌డ్యాంల నిర్మాణాన్ని పూర్తి చేశారు. మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి.

ముంపునూ నియంత్రిస్తాయి.. మంత్రి తుమ్మల: వంతెనల కింద చెక్‌డ్యాంలు ఉండటం కారణంగా భారీ వర్షాలు, వరదలు వచ్చిన సందర్భాల్లో ముంపును కొంత మేరకైనా నియంత్రించేందుకు ఉపయోగపడుతుందని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ తరహా వంతెనలను హరిత నిర్మాణాలుగా మారతాయన్నారు.



వరంగల్ జిల్లాలోని ఆకేరు వాగు వంతెన కింద చెక్‌డ్యాం..

'ప్రాథమికం' నుంచే లలితకళలు పాఠ్యాంశమవ్వాలి

- మండలి ఛైర్మన్ స్వామిగౌడ్
- తెలుగు వర్సిటీలో ఘనంగా కీర్తి పురస్కారాల ప్రదానోత్సవం

నారాయణగూడ, న్యూస్‌టుడే: ప్రాథమిక స్థాయి నుంచే లలిత కళలను పాఠ్యాంశంగా ప్రవేశపెట్టాలని, అప్పుడే వాటిని రక్షించినవారమవుతామని తెలంగాణ శాసనమండలి ఛైర్మన్ స్వామిగౌడ్ అభిప్రాయపడ్డారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, విస్తరణ సేవా విభాగం ఆధ్వర్యంలో 2016 కీర్తి పురస్కారాల ప్రదానోత్సవం వర్సిటీలో బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన స్వామిగౌడ్ మాట్లాడుతూ.. రెండు రాష్ట్రాలుగా మనం విడిపోయినా తెలుగు ప్రజల కళలు, సంస్కృతి ఒక్కటేనని, ఆయా అంశాలను కాపాడుకొని భవిష్యత్ తరాలకు అందించాలని కోరారు. వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ.. గురుకులాల్లో లలితకళల ఉపాధ్యాయ పోస్టులను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనలను త్వరలోనే తాము ప్రభుత్వానికి పంపించబోతున్నామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే పలు చోట్ల తమ వర్సిటీ పీఠాలు ఉన్నాయని.. త్వరలోనే తెలంగాణలోని కరీంనగర్, నల్గొండ జిల్లాల్లోనూ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు. అమెరికాలోని తెలుగువారి పిల్లలకు మనదైన మాతృభాషను నేర్పించడానికి కృషి చేస్తూనే.. వారి అమ్మమ్మలు, తాతయ్యలకు ఇంటర్నెట్‌లో పిల్లలతో ఛాటింగ్, ఆన్‌లైన్‌లో మాట్లాడేందుకు కావాల్సిన కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కూడా అందిస్తున్నామన్నారు.

పురస్కారాలు స్వీకరించింది వీరే..: మేరెడ్డి యాదగిరి రెడ్డి (సృజనాత్మక సాహిత్యం), డి.సూర్యకుమార్ (పరిశోధన), తోలేటి జగన్మోహనరావు (హాస్యరచన), వల్లూరి చిన్నయ్య (జీవిత చరిత్ర), బండారు సుజాతాశేఖర్ (ఉత్తమ రచయిత్రి), తిరునగరి దేవకీదేవి (ఉత్తమ రచయిత్రి), సిద్ధార్థ (వచన కవిత), కర్నాటి లింగయ్య (వివిధ ప్రక్రియలు), ఎం.వెంకటేశ్వరరావు (పత్రికా రచన), సత్తెనపల్లి నరసింహాచారి (అవధానం), రహమతుల్లా (కథ), ఎస్.డి.వి.అజీజ్ (నవల), బొడ్డుల వెంకటేశం (ఛందో సాహిత్య విమర్శ), ఎస్.అనంతలక్ష్మి (ఆధ్యాత్మిక సాహిత్యం), పగడాల నాగేందర్ (సాహిత్య విమర్శ), ఎన్.ఆర్.వెంకటేశం (పద్యరచన), పుప్పాల కృష్ణమూర్తి (బాలసాహిత్యం), పాతూరి రఘురామయ్య (పద్య రచన), వేల్పుల నారాయణ (తెలుగు గేయ కవిత), జి.గిరిజా మనోహర్ (కాల్పనిక సాహిత్యం)లకు 2016 తెలుగు వర్సిటీ కీర్తి పురస్కారాలను ప్రదానం చేశారు. గురువారం మరికొందరికి అందజేస్తారు.



ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహానికి పరీక్షలు నిర్వహిస్తున్న శాస్త్రవేత్తలు

నేడు నింగిలోకి పీఎస్ఎల్వీ-సీ39

ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహ ప్రయోగానికి ఏర్పాట్లు పూర్తి

శ్రీహరికోట, న్యూస్‌టుడే: పోలార్ ఉపగ్రహ వాహకనౌక- సీ39 (పీఎస్ఎల్వీ)ని ప్రయోగించేందుకు శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్‌లో శాస్త్రవేత్తలు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ రాకెట్ నావిగేషన్ వ్యవస్థకు సంబంధించిన ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్ ఉపగ్రహాన్ని కక్ష్యలో ప్రవేశపెట్టనుంది. గురువారం సాయంత్రం 7 గంటలకు రాకెట్‌ను ప్రయోగించనున్నారు. దీనికిముందుగా నిర్వహించే కౌంట్‌డౌన్ ప్రక్రియ బుధవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభమైంది. ఇది నిరంతరాయంగా 29 గంటలపాటు కొనసాగిన అనంతరం రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. శాస్త్రవేత్తలు షార్‌లోని మిషన్ కంట్రోల్ కేంద్రం నుంచి కౌంట్‌డౌన్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు. నావిగేషన్ వ్యవస్థ కోసం భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ఏడు ఉపగ్రహాలను కక్ష్యలోకి పంపింది. ఇందులో 2013లో పంపిన ఐఆర్ఎన్ఎస్ఎస్-1ఏ ఉపగ్రహంలోని మూడు పరమాణు గడియారాలు మొరాయించి సేవలందడం లేదు. దాని స్థానంలో ఐఆర్ఎన్ఎస్ఎస్-1హెచ్‌ను పంపుతున్నారు.

ప్రాజెక్టుల పూర్తికి సహకరిస్తాం

- వీలైనంత త్వరగా అటవీ అనుమతులు
- పర్యావరణశాఖ ప్రాంతీయ కమిషనర్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టులు సకాలంలో పూర్తయ్యేందుకు శాఖాపరంగా సహకరిస్తామని, అటవీ అనుమతుల్ని సాధ్యమైనంత త్వరగా ఇస్తామని కేంద్ర పర్యావరణ శాఖ చెన్నై ప్రాంతీయ కమిషనర్ రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. వివిధ శాఖల ప్రాజెక్టులకు అటవీభూముల కేటాయింపు, శాఖల మధ్య సమన్వయంపై హైదరాబాద్‌లో బుధవారం సమావేశం జరిగింది. రహదారులు-భవనాలు, విద్యుత్తు, సాగునీటి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, గిరిజన అభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనులపై సమావేశంలో చర్చించారు. చిన్న చిన్న కారణాలతో అనుమతులను సంవత్సరాల తరబడి ఆలస్యం చేస్తే ప్రాజెక్టులపై ప్రభావం పడుతుందని, క్షేత్రస్థాయి అటవీ అధికారులు తమ పరిధిలోని అంశాలపై వెంటనే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తే జాప్యాన్ని నివారించవచ్చని అన్నారు. ఇతర శాఖలు కూడా ప్రత్యామ్నాయ భూముల కేటాయింపు, నిధుల విడుదలలో ఆలస్యం లేకుండా చూడాలని రాంగోపాల్‌రెడ్డి కోరారు.

తుది దశలో నిలిచిన 179 అనుమతులు: వివిధ శాఖలకు చెందిన రహదారులు, ప్రాజెక్టులకు సంబంధించి 179 పనులకు మొదటి విడత అనుమతి వచ్చినా, తదుపరి చేపట్టాల్సిన చర్యల ఆలస్యంతో తుది దశ అనుమతులు నిలిచాయి. ఈ విషయంపై ఆయా శాఖలతో సమావేశంలో చర్చించారు. శాఖలవారీ సమీక్ష తర్వాత మూడునెలల్లో అన్ని పనులు పూర్తిచేసి నివేదికలు పంపుతామని ఆయా శాఖలు తెలిపాయి. అటవీశాఖ ప్రధాన సంరక్షణ అధికారి పి.కె.ఝా మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన మూడేళ్లలోనే 37 ప్రాజెక్టులకు అటవీ, పర్యావరణ తుది అనుమతులు వచ్చాయని తెలిపారు. తమ శాఖ పనితీరును ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రశంసించారని గుర్తుచేశారు.

ఈనాడు

ఇండియాను గెలిపిద్దాం!


హాకీలో అనర్ఘరత్నం మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడాదినోత్సవంగా నిర్వహిస్తున్న భారత ప్రభుత్వం, ఈ ఏడాది ఆ సందర్భంగా వినూత్న చొరవ కనబరచింది. ఉపరాష్ట్రపతి వెంకయ్య చేతులమీదుగా, జాతీయ స్థాయిలో క్రీడా ప్రతిభాన్వేషణ పోర్టల్‌ను ప్రత్యేకంగా ప్రారంభింపజేసింది. ఎనిమిదేళ్ల వయసు దాటిన పిల్లలెవరైనా అందులో తమ పేరు నమోదు చేసుకోగల వీలుంది. వారి క్రీడాసక్తి గురించి తెలిసిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సైతం వివరాలు, వీడియోలు పొందుపరచే వెసులుబాటు కల్పించారు. ఆ జాబితాలోంచి ప్రతిభావంతుల్ని ఎంపికచేసి భారత క్రీడా ప్రాధికార సంస్థ (శాయ్) కేంద్రాల్లో శిక్షణకు పంపిస్తామంటున్నారు. వెంకయ్య ప్రస్తావించినట్లు, భారత్ తరఫున ఇన్నేళ్లూ కొందరు వ్యక్తులే తప్ప వ్యవస్థ ఎన్నడూ స్వీయపాటవం చాటలేకపోయిందన్నది నిష్ఠురసత్యం. సానియా, సింధు, సైనా, పీటీ ఉష, మిల్ఖాసింగ్, అభినవ్ బింద్రా ప్రభృతులు అపార పట్టుదల, క్రమశిక్షణ, తల్లిదండ్రుల తోడ్పాటుతోనే జాతి గర్వించే స్థాయిలో రాణించారు. చిన్న వయసులోనే సహజ ప్రతిభా సంపన్నుల్ని వెలికితీసి, అన్ని రాష్ట్రాల్లో మౌలిక క్రీడా సదుపాయాలు కల్పించి, దేశవ్యాప్తంగా మరిన్ని అకాడమీలను శిక్షణ కేంద్రాల్ని నెలకొల్పాలంటున్న కొత్త అజెండా వినసొంపుగా ఉంది. ముడి కోహినూర్ వజ్రాలను గుర్తించడంలో పోర్టల్ యోచన ఏ మేరకు ఉపయుక్తమవుతుందో చూడాలి. పతక విజేతలుగా రాణకెక్కి కన్నవారికి మాతృదేశానికి గొప్ప పేరుప్రతిష్ఠలు తేవాలన్న పట్టుదల బాల్యదశలోనే పెంపొందేలా, విద్యాలయ ప్రాంగణాలనుంచే భావి ఒలింపియన్లు పుట్టుకొచ్చేలా విధి విధానాల సాకల్య ప్రక్షాళన తక్షణావసరం. క్షేత్రస్థాయిలో అందుకు తగ్గ స్థితిగతుల పరికల్పనే విజేతల సృజనలో అత్యంత కీలక ఘట్టం!

బాలల మానసిక ఉల్లాసానికి, వారి సమగ్రాభివృద్ధికి వ్యాయామ విద్య విశేషంగా దోహదపడుతుంది. మైదానంలో శారీరక శ్రమ విద్యార్థుల్లో ఏకాగ్రత, కుశాగ్రబుద్ధి, ఉమ్మడితత్వాన్ని పెంపొందిస్తుంది. అనేక అధ్యయనాలు ధ్రువీకరించిన యథార్థాలివి. ఆ సదవగాహనను ప్రస్ఫుటీకరిస్తూ- కంప్యూటర్ ప్లే స్టేషన్‌లో కాకుండా నిజమైన క్రీడా మైదానాల్లో యువత స్వేదం చిందించాలని 'మనసులో మాట' పేరిట ప్రధాని మోదీ ఇటీవలే పిలుపిచ్చారు. వాస్తవంలో, ఆట స్థలాలున్న పాఠశాలలు దేశంలో ఎన్ని ఉన్నాయి? ప్రతి పాఠశాలలో ఆటస్థలం, క్రీడాసామగ్రి తప్పనిసరిగా ఉండితీరాలన్న విద్యాహక్కు చట్టం స్ఫూర్తి కార్యాచరణలో కొల్లబోతోంది. ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు యావత్ దక్షిణాదిన మూడోవంతు పాఠశాలలకు ఆటస్థలాలు లేవని అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. నిక్కచ్చిగా మదింపు వేస్తే, ఆ సంఖ్య మరింత విస్తరించడం తథ్యం. బిహార్, ఒడిశా, ఝార్ఖండ్, జమ్మూ కశ్మీర్ లాంటిచోట్ల ఆటస్థలాలున్న బడులు 39 శాతం లోపు. ఈ చేదు నిజాల వెలుగులో కేంద్ర క్రీడల మంత్రి విజయ్ గోయల్ గతంలో నిర్దేశించినట్లు, ప్రతి విద్యాసంస్థలోనూ ఆట స్థలం ఉండాలన్న నిబంధన అమలు కత్తి మీద సాము. క్రీడా మైదానాలుంటేనే విద్యాలయాలకు అనుమతులు కొనసాగిస్తామంటే, చాలాచోట్ల మూతపడాల్సిందే. ఆ దృష్ట్యా, దేశవ్యాప్తంగా ప్రాంతాలవారీగా పాఠశాలలకు అందుబాటులో ఆటస్థలాల్ని ఎలా ఏర్పరచాలన్న అంశాన్ని కేంద్రం భుజాలకెత్తుకోవాల్సిందే. రాష్ట్రాలు, క్రీడా సంఘాలు, స్వచ్ఛంద సంస్థల క్రియాశీలక భూమికతో ఏకోన్ముఖ కృషి ఊపందుకోవాలి. బడి దశలోనే సహజ ప్రతిభను గుర్తించి, అందులోంచి మెరికల్ని వెలికితీసి, ప్రత్యేక శిక్షణతో రాటుతేల్చేలా అంచెలవారీ వ్యూహమూ పదును తేలాలి!

అయిదారు దశాబ్దాల క్రితం వట్టి కాళ్లతోనే ఫుట్‌బాల్ ఆడి పెను సంచలనాలు నమోదు చేసిన అద్భుత ఖ్యాతి భారత క్రీడాకారులది. నేడు 'ఫిఫా' ర్యాంకింగుల్లో ఇండియా 98వ స్థానానికి పరిమితమైంది! ఒకప్పుడు హాకీ జగజ్జేతగా ఒలింపిక్ స్వర్ణాలు కొల్లగొట్టిన భారత జట్టు పునర్ ప్రాభవ సాధనలో కిందుమీదులవుతోంది. చైనా, అమెరికా, ఆస్ట్రేలియా, జమైకా తదితరాలతో పోలిస్తే ఇప్పటికీ అథ్లెటిక్స్‌లో ఇండియా పసికూనగా అభాసుపాలవుతోంది. లోగడ పాఠశాలలు, కళాశాలల్లో వాలీబాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖోలాంటివి ఆడించే క్రీడా మైదానాలు కొన్నేళ్లుగా ఉనికే కోల్పోయాయి. ప్రతిభ లేక కాదు, సానపట్టే సాధన సంపత్తి కొరవడి విశ్వ క్రీడాంగణంలో ఇండియా తల వేలాడేస్తోంది. వివిధ క్రీడల్లో అత్యున్నత ప్రమాణాల్ని లక్షించి ఎప్పటికప్పుడు ప్రణాళికల్ని పరిపుష్టీకరించుకోవడమే క్రీడా దిగ్గజాలుగా వెలుగొందుతున్న దేశాల విజయరహస్యం. భారీయెత్తున శిక్షణాలయాలు, విస్తృత మౌలిక వసతుల పరికల్పనలో శ్రద్ధ నిబద్ధత చైనా, థాయ్‌లాండ్, మలేసియా, జపాన్, యూకే ప్రభృత దేశాలకు పతకాల పంట పండిస్తున్నాయి. క్రీడను పరిశ్రమగా గుర్తించిన సంపన్న రాజ్యాలు క్రమానుగత శిక్షణ వ్యవస్థకు పెద్దపీట వేస్తున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో సుమారు మూడువేల విశిష్ట క్రీడా కేంద్రాలు నిర్వహిస్తున్న చైనా, ఎనిమిదిన్నర లక్షలకుపైగా వ్యాయామశాలల్నీ నెలకొల్పింది. దేశీయంగా భారత క్రీడా ప్రాధికార సంస్థ ఏర్పరచిన పది ప్రాంతీయ సంఘాలు, దాదాపు 290 శాయ్ శిక్షణ కేంద్రాలతోనే ఒలింపిక్ దీప్తులు ప్రభవించవు. ప్రపంచంలో మరెక్కడా కానరాని విభిన్న వాతావరణ స్థితిగతులు, విశ్వంలోనే ఎక్కడా లేనంత అత్యధిక యువత కలిగిన భారత్ అమేయ క్రీడాశక్తిగా ఎదగడానికి బడిలోనే పునాది పడాలి. ఆటల్లో రాణిస్తే తమ బిడ్డల బంగారు భవిష్యత్తుకు ఢోకా ఉండబోదన్న దృఢ విశ్వాసం తల్లిదండ్రుల్లో పాదుకొన్న నాడే, క్రీడాభారతం జేగీయమానమవుతుంది!

ఉన్నత విద్యకు కొత్త ఊపిరి!




ఆచార్య కోదాటి వియ్యన్నరావు

ఉన్నత విద్యారంగ అభివృద్ధికి ఉభయ తెలుగు రాష్ట్రాలూ సాగిస్తున్న కృషి దేశవ్యాప్తంగా ఆసక్తి రేకెత్తిస్తోంది. విభజనకు ముందు కేంద్ర విశ్వవిద్యాలయాలు అయిదు, అప్పటి రాష్ట్రప్రభుత్వ ఆధ్వర్యంలో 34, 'డీమ్డ్' వర్సిటీలు ఏడు ఉండేవి. దేశంలోని మొత్తం వర్సిటీల్లో ఇది 6.56 శాతమే! ఇందులో 2,377 కళాశాలలు దాదాపు 5.3 లక్షల మంది విద్యార్థులకు వివిధ కోర్సుల్ని అందించేవి. జాతీయ సగటు అయిన 21.0 శాతంతో పోల్చి చూస్తే, స్థూల ప్రవేశాల నిష్పత్తి కేవలం 16.9 శాతంగా ఉండేది. దీన్ని దృష్టిలో పెట్టుకొన్న అప్పటి కేంద్రప్రభుత్వం- విభజన చట్టంలో ఉన్నత విద్యాసంస్థల స్థాపన పరంగా రెండు రాష్ట్రాలకూ కొన్ని హామీలు ప్రకటించింది. జాతీయ ప్రాముఖ్యం కలిగిన అనేక సంస్థలు (కేంద్రీయ విశ్వవిద్యాలయం, ఇతర ఉన్నత విద్యాసంస్థలు) హైదరాబాద్ కేంద్రంగా తెలంగాణకు దఖలు పడుతున్నందువల్ల, 2022లోగా ఆంధ్రప్రదేశ్‌కు 11 ఉన్నతస్థాయి విద్యాసంస్థల్ని కేంద్రం ప్రతిపాదించింది. ఒక్కొక్కటి చొప్పున ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎం, ఐఐఎస్ఈఆర్, కేంద్ర విశ్వవిద్యాలయం, పెట్రోలియం వర్సిటీ, వ్యవసాయ విశ్వవిద్యాలయం, ట్రిపుల్ ఐటీ, గిరిజన యూనివర్సిటీ, ఎయిమ్స్ తరహా బోధనాస్పత్రి, జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థల్ని కేటాయించారు. తెలంగాణలో ఒక గిరిజన విశ్వవిద్యాలయం, పండ్లతోటల పెంపకానికి సంబంధించిన వర్సిటీ ఏర్పాటవుతాయి. రెండు రాష్ట్రప్రభుత్వాల ఒత్తిడి, చొరవ వల్లనే కేంద్రం ఈ ఉన్నత విద్యాసంస్థల ఏర్పాటుకు చొరవ చూపింది. రాష్ట్రాలు సైతం అవసరమైన భూమి, ఇతర మౌలిక సౌకర్యాల కల్పనకు తగిన చర్యలు తీసుకున్నాయి. ఫలితంగా అన్ని సంస్థలూ సాకారమవుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అయిదు సంస్థలు తమ కార్యకలాపాలు ప్రారంభించి, ప్రవేశాలనూ జరుపుతున్నాయి. స్థూలంగా చూస్తే 2019-20 నాటికి, అంటే కేంద్రం హామీ ఇచ్చిన దానికన్నా రెండేళ్ల ముందే- రెండు రాష్ట్రాల్లో అన్ని సంస్థలూ తమ కార్యకలాపాల్ని పూర్తిస్థాయిలో చేపట్టే అవకాశం ఉంది.

నైపుణ్యాభివృద్ధి వైపు చూపు

ఉన్నతవిద్యను బలోపేతం చేసేందుకు సిద్ధమైన ఉభయ రాష్ట్రాలూ ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన కోసం ప్రత్యేక చట్టాలు రూపొందించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వమైతే ప్రైవేట్ విశ్వవిద్యాలయాల స్థాపన బిల్లును 2016 మార్చిలోనే ఆమోదించింది. నేటికి దాదాపు 15 సంస్థల ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం తెలిపింది. అందులో ఎస్ఆర్ఎం, వీఐటీ వంటి సంస్థలు 2017-18 నుంచి ప్రవేశాలు ప్రారంభించాయి. తెలంగాణ ప్రభుత్వమూ ఇటువంటి సంస్థల ఏర్పాటుకు ముమ్మరంగా ప్రయత్నిస్తోంది. సంబంధిత ముసాయిదాను రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. దీనికి అనుగుణంగా తెలంగాణలోనూ త్వరలోనే ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన మొదలు కావచ్చు. దేశం మొత్తంమీద గల 29 రాష్ట్రాల్లోని 22 రాష్ట్రాల్లో ఇప్పటికే ఇవి ఏర్పాటై ఉన్నాయి. నూతన రాష్ట్రాలు రెండూ ఇప్పుడు ఈ కోవలోకి కొత్తగా చేరుతున్నాయి. భూ సమీకరణ ఆంధ్రప్రదేశ్‌కు కలిసి వచ్చిన అంశం. అందుకే అది సమీకరించిన భూమిని ప్రణాళికాబద్ధంగా విభజించి, ప్రత్యేకంగా విద్యా నగరం, విజ్ఞాన నగరం ఏర్పాటు కోసం ఆశావహ సంస్థలకు కేటాయించగలుగుతోంది. భూ సేకరణ లేదా సమీకరణ విషయంలో తెలంగాణకు మరికొంత సమయం పట్టవచ్చు. తెలంగాణలో ప్రైవేటు విశ్వవిద్యాలయాల స్థాపన 2019-20 నాటికి ఒక రూపు సంతరించుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలు కేంద్రం దన్నుతో పాటు నూతన విధానాలను ప్రవేశపెట్టి వేగంగా ముందుకు సాగుతున్నాయి. ముఖ్యంగా ఉన్నత విద్యను అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అనేక కమిటీలను వివిధ దేశాలకు పంపుతోంది. ఉన్నత విద్యామంత్రి సహా కార్యదర్శులు, విశ్వవిద్యాలయ కులపతులు- ఐరోపాలోని ఫిన్లాండ్, స్వీడన్, యూకే వంటి దేశాలను; ఆస్ట్రేలియా, జపాన్, సింగపూర్, మలేసియా, చైనా తదితర దేశాలను సందర్శిస్తూ అక్కడి పద్ధతులు, నాణ్యత ప్రమాణాలను అధ్యయనం చేస్తున్నారు. ఏపీలోని విశ్వవిద్యాలయాల్లో విదేశీ సంస్థల సహకారంతో నూతన కోర్సులు అందించే ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం చైనా సంస్థ సహకారంతో చైనావారి భాషను, జపనీస్‌నూ విద్యార్థులకు నేర్పేందుకు చర్యలు తీసుకుంటోంది. శ్రీకృష్ణదేవరాయ, శ్రీపద్మావతి విశ్వవిద్యాలయాలు పశ్చిమ స్కాట్లాండ్ వర్సిటీలతో కలిసి యానిమేషన్, ఫిల్మ్ మేకింగ్ కోర్సుల ప్రారంభానికి ఉపక్రమించాయి. జేఎన్‌టీయూ కాకినాడ- హెచ్‌డబ్ల్యూ యూనివర్సిటీ సహకారంతో ఒక 'ఇంధన అకాడెమీ' స్థాపనకు ప్రయత్నిస్తోంది. ఆంధ్ర, శ్రీవేంకటేశ్వర యూనివర్సిటీలు విదేశీ విద్యార్థులకు ప్రవేశాలు కల్పించడంలో, అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవడంలో, నూతన కోర్సులు ప్రారంభించడంలో ఎంతో ముందున్నాయి. తెలంగాణ ప్రభుత్వమూ పలు విదేశీ విశ్వవిద్యాలయాలు, సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకోనుంది. ముఖ్యంగా ఉస్మానియా, ఆచార్య జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయాలు ఈ విషయంలో ముందున్నాయి. వైద్యవిద్యను ప్రోత్సహించడానికి తెలంగాణ ప్రభుత్వం ఎంతో చొరవ తీసుకుంటోంది. కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలోని మానవ వనరుల మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సరళీకృత విదేశీ ఉన్నత విద్యావిధానం ప్రకారం- దేశంలో అత్యున్నత నాణ్యత ప్రమాణాలు కలిగిన విద్యాసంస్థల్ని విదేశీ ఒప్పందాలకు అనుమతించనున్నారు. విద్యాసంస్థలు, పరిశ్రమలు లబ్ధి పొందే విధంగా పాఠ్యప్రణాళిక రూపొందిస్తారు. విదేశీ విద్యను బడుగు, బలహీనవర్గాల చెంతకు తీసుకురావాలన్నదే ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. రెండు రాష్ట్రాలూ అర్హులైన విద్యార్థులు విదేశీ విద్యాలయాల్లో ప్రవేశాలు పొందడానికి వీలుగా పది లక్షల రూపాయల వంతున తోడ్పాటును అందిస్తున్నాయి. ప్రత్యేక కార్పొరేషన్ల ద్వారా విద్యార్థులకు సాయం అందజేస్తున్నాయి.

తెలుగునాట మేలు బాట

దేశంలోని ఉన్నత విద్యాసంస్థల అభివృద్ధికి కేంద్రం 'రూసా' పథకాన్ని అమలుచేస్తోంది. ఇది 2015-16 ఆర్థిక సంవత్సరం నుంచి చురుగ్గా సాగుతోంది. పలు రాష్ట్రాలు రెండు నుంచి మూడు శాతం మేరకే 'రూసా' నిధుల్ని వినియోగించుకున్నాయి. ఆంధ్రప్రదేశ్ 24 శాతం నిధులు ఉపయోగించుకుంది. ఈ విషయంలో దేశంలోనే తెలంగాణ ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ పథకం దన్నుతో డిగ్రీస్థాయిలో ప్రవేశాలను 'ఆన్‌లైన్ పద్ధతి'లో నిర్వహిస్తున్నారు. ప్రవేశాల పెంపు, అవగాహన ఒప్పందాలు, కోర్సుల నిర్వహణ వంటి సంస్కరణలతో పాటు ఉభయ రాష్ట్రాలూ నైపుణ్యాభివృద్ధిపైనా దృష్టి కేంద్రీకరిస్తున్నాయి. కళాశాలలు, విశ్వవిద్యాలయాల నుంచి పట్టాలు చేత పట్టుకొని బయటకు వస్తున్న విద్యార్థులకు తగిన నైపుణ్యాలు ఉండటం లేదనే అంశాన్ని అవి గుర్తించాయి. నైపుణ్యాభివృద్ధి సంస్థలను ప్రత్యేకంగా స్థాపించాయి. 'ఇంక్యుబేషన్' కేంద్రాల ఏర్పాటు వంటి సరికొత్త ఆలోచనలకు తెలంగాణ, ఏపీ తెరతీశాయి. వీటి ద్వారా పరిశోధనలపై పట్టు సాధించాలని భావిస్తున్నాయి. గతేడాది నీతి ఆయోగ్ ఉభయ రాష్ట్రాలకూ రెండేసి కేంద్రాల్ని మంజూరు చేసింది. వివిధ స్వదేశీ, విదేశీ కార్పొరేట్ సంస్థల సహకారంతో ఈ కేంద్రాల్ని బలోపేతం చేసేందుకు రాష్ట్రాలు చర్యలు చేపడుతున్నాయి.

బడుగు వర్గాలకు అండ

ఇప్పటివరకు చేపట్టిన కార్యక్రమాల స్ఫూర్తితో, ఇరు రాష్ట్రాలూ నూతన పథక రచన సాగించాలి. మొదట- ప్రభుత్వ అధీనంలో గల విశ్వవిద్యాలయాలకు మార్గదర్శనం చేయాలి. ప్రతి విశ్వవిద్యాలయం ఒకటి లేదా రెండు అంశాల్ని మాత్రమే ఎంపిక చేసుకొని, వాటికి అంతర్జాతీయ గుర్తింపు లభించే విధంగా కృషి సాగించాలి. ప్రతి వర్సిటీకి ఒకే ప్రాధాన్య అంశం (ట్రస్ట్ ఏరియా) ఉండేలా విశ్వవిద్యాలయాల ప్రాథమ్యాలను తిరిగి నిర్వచించాలి. బోధన, పరిశోధన కళాశాలలను వర్గీకరించాలి. బోధనలో అత్యున్నత ప్రమాణాలు సాధించే విధంగా కొన్నింటిని, పరిశోధనలపై దృష్టి కేంద్రీకరించేలా మరికొన్నింటిని రూపుదిద్దడం మంచిది. అన్ని కళాశాలల్లోనూ ఒకే రీతి ప్రమాణాలను సాధించడం సాధ్యం కాదు. అందువల్ల ఎంపిక విధానం అనుసరించడమే మేలు. ఎంపిక చేసిన కొన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో కనీసం 40 శాతం విదేశీ 'ఫ్యాకల్టీ' ఉండేలా అంతర్జాతీయ నియామకాలు జరగాలి. ఆ తరవాత అన్ని వర్సిటీల్లోని కనీసం సగం కళాశాలల్లో నియామకాలు జాతీయస్థాయిలో ఉండేలా నిబంధనలు రూపొందించాలి. ప్రతి విశ్వవిద్యాలయంలోనూ విధిగా ఒక 'ఇంక్యుబేషన్' కేంద్రం ఉండి తీరాలి. ఇందుకోసం విపుల మార్గదర్శక సూత్రాల్ని రూపొందించాలి. ప్రస్తుతానికి ఆ కేంద్రాల ఏర్పాటులో ఉత్సాహం కనిపిస్తోంది. అవి ఏ విధంగా పని చేయాలి, వాటి ప్రాథమ్యాలు ఏమిటి, లక్ష్యసాధన ప్రణాళిక ఏ విధంగా ఉండాలన్న అంశాలపై ఇప్పటికీ స్పష్టత లేదు. ఈ విషయంలో విదేశీ సంస్థల తోడ్పాటు కోసం ప్రత్యేక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోవాలి. నిధుల సమీకరణ అందులో భాగం కావాలి. ఉద్యోగాన్వేషణకు సంబంధించి- యువత నైపుణ్యాల పెంపుదల విషయమై కేంద్రం, రాష్ట్రాలు ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాయి.

ఉభయ రాష్ట్రాలూ చేపడుతున్న చర్యల ఫలితంగా- కొత్త సంస్థలు ఏర్పాటై, ఉన్నత విద్య ఎక్కువమందికి చేరువ అవుతుంది. ఈ విషయంలో సమన్యాయం జరగాల్సి ఉంది. కొత్తగా వచ్చే సంస్థలన్నీ ప్రైవేటు లేదా ప్రైవేటు-పబ్లిక్ భాగస్వామ్యంతో ఏర్పడుతున్నవే. వాటి వల్ల ఉద్యోగ కల్పన, ప్రవేశాల సంఖ్య, పద్ధతులు, వసతుల అందుబాటు, నాణ్యత ప్రమాణాల నియంత్రణ వంటివి- ఎంతవరకు సమన్యాయాన్ని ప్రోదిచేసేలా ఉంటాయనేది వేచి చూడాల్సిన అంశం. ఇందులో ఇరు రాష్ట్రాలూ విశిష్ట దృక్పథంతో ముందుకు సాగాలి. అప్పుడే బడుగు, బలహీన వర్గాలకూ ఉన్నత విద్య అందుబాటులోకి వస్తుంది!

(రచయిత- పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం)

సాంకేతికత సైదోడుగా...

ఒకవైపు భారతీయ ఐటీ నిపుణుల ప్రవేశంపై పాశ్చాత్య దేశాల్లో ఆంక్షలు పెరుగుతుంటే, మరోవైపు- మారుతున్న సాంకేతికత వల్ల ఐటీ రంగంలో వేల ఉద్యోగాలు ఊడిపోతున్నాయి. ఇలా ఏక కాలంలో జంట ముప్పు వచ్చిపడటంతో; 15,000 కోట్ల డాలర్ల భారతీయ ఐటీ రంగం భారీ కుదుపులకు లోనవుతోంది. ఈ పరిస్థితిలో దిగువ శ్రేణి ఉద్యోగులు దిగాలు పడుతున్నా- ముందు చూపు గల కొన్ని భారతీయ కంపెనీలతో పాటు నిపుణులు నూతన సాంకేతికతతో దూసుకెళుతున్నారు. ఏ అండా లేకపోయినా చొరవగా స్వీయ ప్రతిభతో రాణిస్తున్నారు. ఉదాహరణకు 2017లో అంతర్జాతీయ ఐటీ 'పొరుగు సేవల' విపణి 350 కోట్ల డాలర్లకు చేరగా, అందులో 44 శాతాన్ని భారతీయ టెక్నాలజీ సంస్థలే చేజిక్కించుకున్నాయి. బెంగళూరుకు చెందిన కన్సల్టెన్సీ, పరిశోధన సంస్థ జినోవ్ తాజా నివేదిక ప్రకారం- ఐటీ పొరుగు సేవల విపణిలో పశ్చిమ ఐరోపా దేశాల వాటా 27 శాతం. ఉత్తర అమెరికా దేశాల వాటా కేవలం 23 శాతం. టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్, టెక్ మహీంద్రా, ఎల్ అండ్ టీ టెక్నాలజీస్ వంటి విఖ్యాత భారతీయ ఐటీ కంపెనీలతో పాటు అనేక చిన్న కంపెనీలూ ఈ రంగంలో పెద్ద వాటా సాధించాయి. అంతర్జాతీయ ఐఓటీ విపణి విలువ 2017లో 14,000 కోట్ల డాలర్లు. 2022 కల్లా అది 32,200 కోట్ల డాలర్లకు చేరనుంది. ప్రస్తుతం భారత్‌లో ఐఓటీ పరిశ్రమ పరిమాణం 130 కోట్ల డాలర్లు. అది 2020నాటికి 900 కోట్ల డాలర్లకు చేరుకుంటుందని డిలాయిట్ అంచనా. అప్పటికి భారత్‌లో 190 కోట్ల పరికరాలు, సాధనాలు ఐఓటీ అనుసంధానత సంతరించుకొంటాయని ఆ సంస్థ లెక్కగట్టింది. ఫ్యాక్టరీ యంత్రాలు, మోటారు వాహనాలు, గృహోపకరణాలు, విద్యుత్కేంద్రాలు, ఆస్పత్రుల్లో రకరకాల సాధనాలకు సెన్సర్లను అమర్చి అంతర్జాలం ద్వారా అనుసంధానించడాన్నే 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్' (ఐఓటీ) అంటారు. వీటితో పాటు పంటపొలాల్లో ట్రాక్టర్లకు, కోత యంత్రాలకు అమర్చే సెన్సర్లు అపార సమాచార రాశిని (బిగ్ డేటా) సేకరించి ప్రసారం చేస్తాయి. చిల్లర వర్తకం, మేనేజ్‌మెంట్ రంగాల్లోనూ బిగ్ డేటా ఉత్పన్నమవుతోంది. ఈ విస్తృత సమాచారాన్ని క్రోడీకరించి విశ్లేషించడానికి కొత్త తరహా సాఫ్ట్‌వేర్‌ను భారత కంపెనీలు రూపొందిస్తున్నాయి.

మారుతున్న తీరుతెన్నులు

ఉదాహరణకు- పొలం పనులకు ట్రాక్టర్లను ఉపయోగిస్తున్న తీరును గమనించి, కొత్త సాఫ్ట్‌వేర్ రూపొందించడానికి మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీ 5,000 ట్రాక్టర్లకు సెన్సర్లను అమర్చి ప్రయోగాలు సాగిస్తోంది. బెంగళూరు-ముంబయి రహదారిపై ఫోక్స్ వ్యాగన్ డ్రైవర్ రహిత టిగ్వాన్ కారును ప్రయోగాత్మకంగా నడుపుతున్నారు. దాని ఇంజన్, బ్రేకులు, ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ పని తీరును 200 సెన్సర్లు అనుక్షణం పరిశీలించి అంతర్జాలం ద్వారా క్లౌడ్ కంప్యూటింగ్ వేదికకు ప్రసారం చేస్తున్నాయి. ఈ జర్మన్ కారుకు కావాల్సిన సాఫ్ట్‌వేర్‌ను భారతీయ సంస్థలే తయారుచేశాయి. బెంగళూరులో బాష్, బెజిర్క్, సన్ మొబిలిటీ వంటి కంపెనీలు ఐఓటీలో జోరుగా పరిశోధనలు చేస్తున్నాయి. ఐఓటీ రంగం 2021 కల్లా 25,000 కొత్త ఉద్యోగాల్ని సృష్టించనుంది. వేలమంది పాత తరం ఐటీ ఉద్యోగులకు ఉద్వాసన జరగనుంది. రానున్న పెను మార్పులకు సిద్ధం కావాలంటే- ప్రభుత్వం, కంపెనీలు తమ దృక్పథాన్ని మార్చుకుని విద్య, ఉపాధి, సామాజిక రంగాల్లో వినూత్న విధానాల్ని చేపట్టాలి. ప్రస్తుతం సంస్థలకన్నా వ్యక్తులే ఈ విషయంలో చొరవ ప్రదర్శిస్తున్నారు. నేడు అంతర్జాల వినియోగం పెరుగుతున్న కొద్దీ సైబర్ నేరాలు విజృంభిస్తున్నాయి. వాటిని నిరోధించడానికి ప్రభుత్వం, సంస్థలు ముందస్తు సన్నాహాలు చేసుకోలేదు. కొందరు భారతీయులు వ్యక్తిగత చొరవ, సామర్థ్యాలతో ఎన్నో అంతర్జాతీయ కంపెనీలకు సైబర్ భద్రత కల్పిస్తూ లక్షలాది డాలర్లు ఆర్జిస్తున్నారు. పెరటి చెట్టు వైద్యానికి పనికిరాదన్నట్లు మన వ్యాపార సంస్థలు ఈ భారతీయ ఎథికల్ హ్యాకర్ల విలువను గుర్తించలేకపోతున్నాయి. నిజానికి భారత్‌లో ఉన్నంతమంది ఎథికల్ హ్యాకర్లు ప్రపంచంలో మరెక్కడా లేరు. వీరు వ్యాపార, ప్రభుత్వ సంస్థల అనుమతితో వాటి కంప్యూటర్ నెట్‌వర్కులోకి చొరబడి, లోపాలు కనిపెట్టి, సైబర్ చోరీ నిరోధానికి తీసుకోవాల్సిన చర్యల్ని సూచిస్తారు. వీరి సేవల విలువ భారతీయ సంస్థలకు తెలియకపోయినా బహుళజాతి సంస్థలకు బాగా తెలుసు.



ఐఓటీలో భారత్ ముందడుగు

2016 ప్రథమార్ధంలో ఫేస్‌బుక్ భారతీయ హ్యాకర్ల సేవలకు భారీ ప్రతిఫలం ముట్టజెప్పింది. యాహూ, ఊబర్, రాక్‌స్టార్ గేమ్స్‌వంటి కంపెనీల సిస్టమ్స్‌లో 700 లోపాలను కనిపెట్టిన ఘనత- గీక్‌బోయ్ అనే భారతీయ హ్యాకరుదే. ఫేస్‌బుక్ వంటి అంతర్జాతీయ సంస్థలకు సేవలు అందించి మూడున్నర లక్షల డాలర్లను ఆర్జించిన 23 ఏళ్ల సైబర్ సెక్యూరిటీ ఇంజనీరు ఆనంద్ ప్రకాశ్ భారతీయ కంపెనీలకు ఎథికల్ హ్యాకింగ్ విలువ తెలియదంటున్నారు. తాము నెట్‌వర్క్ లోపాల్ని స్వచ్ఛందంగా పసిగట్టి హెచ్చరించినా సంస్థలు మేలుకోవడం లేదని; పైగా 'మా వెబ్‌సైట్లలోకి ఎందుకు చొరబడ్డారు, మీపై న్యాయపరమైన చర్య తీసుకుంటాం' అని బెదిరిస్తుంటాయని ఆయన వెల్లడించారు. 23 దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఒక ఆన్‌లైన్ ఆహార-రెస్టారెంట్ మార్గదర్శక సంస్థకు చెందిన 1.7 కోట్ల యూజర్ రికార్డులను కొంతకాలం క్రితం సైబర్ దుండగులు చోరీచేశారు. ఇలాంటి ప్రమాదం ఉందని ఆనంద్ ప్రకాశ్ రెండేళ్లముందే హెచ్చరించినా ఆ కంపెనీ లెక్కచేయలేదు. తీరా చేతులు కాలాక తమ నెట్‌వర్క్ లోపాల్ని పసిగట్టి నివారణ చర్యలు సూచించే ఎథికల్ హ్యాకర్లకు తగిన ప్రతిఫలం ఇస్తామని ప్రకటించింది. ఇటీవలి కాలంలో అనేక బ్యాంకు పాస్‌వర్డ్‌లు చోరీ అయిన సంగతి తెలిసిందే. అలాగే వాన్న క్రై, పెత్యా వైరస్‌ల గురించీ విన్నాం. చైనా, పాక్‌లు మనపై పదేపదే సైబర్ దాడులకు పాల్పడుతుంటే, తాజాగా ఆధార్ వివరాలు అమెరికా గూఢచారి సంస్థ సీఐఏ గుప్పిట్లో ఉన్నాయని వికీలీక్స్ హెచ్చరించింది. సొంత చొరవ, ప్రతిభలతో రాణిస్తున్న భారతీయ ఎథికల్ హ్యాకర్ల సేవలను ఇకనైనా పూర్తిస్థాయిలో వినియోగించుకోవడం అవసరం. డిజిటల్ ఇండియా పథకం ఈ అవసరాన్ని మరింత వేగంగా ముందుకు తెస్తోంది. 2020కల్లా ఐఓటీని 1500 కోట్ల డాలర్ల పరిశ్రమగా అభివృద్ధి చేయాలని పెద్ద కలలు కంటున్న కేంద్ర ఎలక్ట్రానిక్, సమాచార పరిజ్ఞాన శాఖ అందుకు సుశిక్షిత మానవ వనరులను తయారుచేసుకోవాలి. పరిశోధన, అభివృద్ధి రంగాల్ని ప్రోత్సహించాలి.

చొరవ కొనసాగాలి

యువ ఐటీ నిపుణులు ప్రభుత్వ రథం కదిలే వరకు ఆగకుండా తమంతట తామే సైబర్ సీమలో జైత్రయాత్ర సాగిస్తున్నారు. అంతర్జాల విస్తరణ చలవతో నేడు ఎక్కడి నుంచి ఎక్కడికైనా డిజిటల్ సేవలు అందించడం సులువు కావడం వీరికి లాభిస్తోంది. అందుకే వీరికి 'ఆన్‌లైన్ ఫ్రీలాన్స్ నిపుణులు' అనే పేరు స్థిరపడింది. ఇలా అంతర్జాలం ద్వారా స్వతంత్రంగా సేవలు అందించడంలో భారతదేశమే ముందున్నదని ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నెట్ ఇన్‌స్టిట్యూట్ తాజా నివేదిక వెల్లడించింది. ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ ఫ్రీ లాన్సర్లలో అత్యధికులు (24 శాతం మంది) భారత్‌లోనే ఉన్నారని ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధమైన ఈ సంస్థ ప్రకటించింది. అంతర్జాల బోధన, అనువాద పనుల్లో అత్యధికంగా అమెరికన్లే నిమగ్నమయ్యారు. మున్ముందు కృత్రిమ మేధ, ఐఓటీ, ఆటోమేషన్ లేనిదే ఏ పనీ జరగదు. ఈ రంగాల్లో స్వతంత్రంగా, చొరవగా, సమర్థంగా దూసుకెళ్లే నిపుణులకు గిరాకీ పెరగనుంది. దీన్ని తీర్చడానికి ఇప్పటినుంచే తగిన శిక్షణ చట్రాన్ని ఏర్పరచుకోవాలి!

- ప్రసాద్

ప్రేమ భావన

రెండక్షరాల చిన్న పదం 'ప్రేమ'. రెండు హృదయాల మధ్య మొలకలా అంకురించి, వికసించి, వటవృక్షమై వ్యాప్తి చెంది, అంతా తానై ఉండే సమ్మోహకం అది. భౌతిక రూపం లేనిది, మనసులకు గోచరించేది ప్రేమ!

మనుషులకు ప్రేమ- ఆత్మవిశ్వాసమిస్తుంది. అంతులేని ధైర్యాన్నిస్తుంది. తగినంత బలం కలిగిస్తుంది. భయాన్ని, పిరికితనాన్ని, జంకును, ఆత్మన్యూనతను అది దూరం చేస్తుంది. ప్రేమే నిత్య నూతనోత్సాహం ప్రసాదిస్తుంది. జీవితంపై అనేక ఆశల్ని పెంచుతుంది. దాని ఘనత అటువంటిది.

మానవ జీవితంలో ప్రేమదే అగ్రస్థానం. ఆప్యాయంగా మాట్లాడటం, మనసులు పంచుకోవడం- గొప్ప శక్తినిస్తాయి. తన కోసం ఆలోచించే ఒక వ్యక్తి ఉన్నారన్న భావన- ప్రేమ వల్ల ఏర్పడుతుంది. సమాజంపై అది వివిధ కోణాల్లో ప్రసరిస్తుంది. తల్లీపిల్లలు, అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లు- ఇలా ప్రేమకు పలు పార్శ్వాలు! సృష్టిలో అమ్మప్రేమకు సాటి మరేదీ లేదు. అహర్నిశలూ బిడ్డల క్షేమానికి ఆరాటపడే ఆమె ప్రేమను కొలిచే సాధనాలు లోకంలోనే లేవు.

యౌవనంలో ఇరు హృదయాల్లో పుట్టే ప్రేమకు విశిష్ట స్థానం ఉంది. అది తాత్కాలిక వ్యామోహం లేదా ఆకర్షణగా మిగిలి, జీవితాల్ని ఛిద్రం చేయకూడదు.

కులమతాలకు అతీతమైన సమాజ నిర్మాణానికి ప్రేమ దోహదపడుతుంది. అది నిర్మలమైనది, నిజాయతీతో కూడినది అయినప్పుడు- పవిత్రమైన వివాహ బంధం ఏర్పడుతుంది. ఆ దాంపత్య బంధమే ఆరోగ్యకర సమాజానికి మూలం. బిడ్డలు విలువలతో పెరగడానికి ప్రేమే ముఖ్య కారణమవుతుంది. భవిష్యత్ సమాజం ఆదర్శవంతంగా రూపుదిద్దుకొనేందుకు పునాది- ప్రేమ.

ప్రేమించి, ప్రేమను పొంది, జీవితాన్ని ఫలప్రదం చేసుకొన్న వారెందరో పురాణాల్లో కనిపిస్తారు. రుక్మిణీ కృష్ణులు, దమయంతీ నల చక్రవర్తులు, శకుంతలా దుష్యంతులు, సుభద్రార్జునులు, శశిరేఖా అభిమన్యులు... ఇలా ఎందరో! తమ ప్రేమకు ఎన్ని అవరోధాలు కలిగినా, వారు ఎంతమాత్రం చలించలేదు. ఆటంకాల్ని ధైర్యంగా ఎదుర్కొన్నారు. కోరుకున్నవారిని వివాహమాడారు. అనంతరం ఎదురైన కష్టనష్టాల్నీ సహనంతో భరించి తమ బంధాన్ని దృఢతరం చేసుకున్నారు. ప్రగాఢ ప్రేమకు పర్యవసానం చక్కటి వివాహ బంధమేనని చాటారు. అటువంటి వారి నడవడిని నేటి యువత ఆదర్శంగా తీసుకుంటే- ప్రేమలో కక్షలు, దాడుల ప్రసక్తే ఉండదు.



అంతర్వాణి

పెళ్లితో ప్రేమ పర్వం ముగిసిపోకూడదు. ముగిస్తే, అది తాత్కాలిక ప్రేమే అవుతుంది. నిజమైన ప్రేమలో హక్కులు, అధికారాలు, హెచ్చుతగ్గులకు తావు లేదు. కుటుంబంలో, సమాజంలో స్త్రీ పురుష సమానత్వ స్థాపనకు ప్రేమే దోహదపడుతుంది. ప్రేమించగల సహజసిద్ధమైన గుణం మనిషిలో ఉంటే, అదే అతడిలో విశాల దృక్పథాన్ని పెంచుతుంది. సాటివారి సమస్యల పట్ల సానుభూతి కలిగి ఉండటమూ అతడి స్వభావం కావాలి.

ఈ విశ్వం ఒక పెద్ద వృక్షం. దీనికి 'ప్రేమ' అనే పూలు పూయాలి. పరిమళాల్ని అంతటా వ్యాపింపజేయాలి.

ప్రేమ భగవత్ స్వరూపం. ప్రేమించే ప్రతి హృదయంలోనూ భగవంతుడు స్థిర నివాసం ఉంటాడు. పచ్చని చెట్లు, రంగుల పూలు, గలగలల సెలయేరు- ఇలా వింత సోయగాల ప్రకృతిని చూస్తే ఎంత ఆనందం కలుగుతుందో, మనుషుల్ని మనుషులుగా చూసినప్పుడూ అంతే ఆహ్లాదం వెల్లివిరుస్తుంది.

మానవ జీవితం ఉత్కృష్టమైనది. అనుభూతులు, భావోద్వేగాలు, భాష, వ్యక్తీకరణ... మనిషికే సాధ్యం. జీవితం యాంత్రికం కారాదు. కాలం బరువుగా గడవకూడదు. ఏ రోజుకు ఆరోజే సరికొత్తగా ఉండాలి. అనుభూతుల్ని పంచుకుంటూ, ఆనందాల్ని పెంచుకుంటూ, విశ్వమానవ ప్రేమను పెంపొందించుకుంటూ- ముందుకు సాగాలి మనిషి!

- వెంగల్వ బొడ్డపాటి రామలక్ష్మి

ఫెడరేషన్ వేషం.. భారీ మోసం

- రూ.కోట్లు ఆశచూపి రూ.లక్షల్లో టోపీ
- కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలా ప్రచారం
- పదవులు, పరిశ్రమల పేరుతో దగా
- డైరెక్టర్‌కు రూ. కోట్ల ఆదాయమని ఆశ
- 'ఈనాడు-ఈటీవీ' పరిశోధనలో గుట్టు రట్టు

ఈనాడు – ఖమ్మం

అచ్చంగా ఓ కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ మాదిరిగా వేషం కట్టారు.. ఫెడరేషనంటూ పేరు పెట్టారు.. అమాయకులను ముగ్గులో దింపి కోట్లలో మోసం చేశారు. ఇందుకోసం మంత్రులు, ఎమ్మెల్యేల పేర్లు కూడా వాడుకున్నారు. వందలమందిని కోట్లాది రూపాయల మేరకు చేసిన వంచనపై 'ఈనాడు - ఈటీవీ' దృష్టిసారించగా కళ్లుచెదిరే వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. దిల్లీ కేంద్రంగా 2010లో కొంతమంది మోసగాళ్లు ఓ భారీ కుట్రకు తెరలేపారు. నిడ్‌కాఫ్ (నేషనల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంటు కో-ఆపరేటివ్ ఫెడరేషన్) పేరుతో ఓ సంస్థను ప్రచారంలోకి తెచ్చారు. ఫిక్కీ, ఇఫ్కో, నెడ్‌క్యాప్ తరహాలో ఇది దేశంలో ఏర్పాటవుతున్న 23వ ఫెడరేషన్‌గా ప్రచారం చేశారు. అనీస్ జమాల్ అనే వ్యక్తి ఛైర్మన్‌గా, జఫారుద్దీన్ వైస్ ఛైర్మన్‌గా, మరో 10 మంది డైరక్టర్లుగా ఉన్నట్లు పేర్కొన్నారు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పలు జిల్లాల్లో దీనిపై విస్తృత ప్రచారం నిర్వహించారు. ఖమ్మంలోని ఓ వ్యక్తికి వల వేసి అతడి ద్వారా ఈ జిల్లాలో పాగా వేశారు.

కేంద్రం నుంచి నిధులు

ఏదో ఒక రాష్ట్ర ప్రభుత్వం షేర్ క్యాపిటల్ తీసుకుంటే ఏటా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ. 2,000 కోట్లు వస్తాయని చెప్పారు. ఈ నిధులన్నీ ఫెడరేషన్‌కే చెందుతాయని, ఈ మొత్తంతో ఫెడరేషన్‌లోని సభ్యులు పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చని నమ్మబలికారు. కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో డీసీసీబీని పోలినట్టు డైరక్టర్ పదవులుంటాయని, వీటిని దక్కించుకుంటే పెద్ద మొత్తంలో ఆదాయం వస్తుందని హామీ ఇచ్చారు. రూ.లక్ష నుంచి రూ. 2.50 లక్షల వరకు చెల్లిస్తే ప్రభుత్వం నుంచి పరిశ్రమ ఏర్పాటుకు రూ. 30 లక్షల వరకు నిధులు వస్తాయని నమ్మించారు. సొమ్ము వసూలు చేశాక ఇదిగో అదిగో అంటూ అయిదారేళ్లు గడిచిపోయాయి. డబ్బులు తీసుకున్న వారంతా పత్తా లేకుండాపోయారు. ఒక్క ఖమ్మం జిల్లాలోనే ఇలా ఫెడరేషన్ పేరు చెప్పి సుమారు రూ. 5.50 కోట్లు వరకు వసూలు చేసినట్లు సమాచారం. హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ, సంగారెడ్డి జిల్లాల్లో కూడా ఎంతోమంది బాధితులు ఉన్నట్లు తెలుస్తోంది.



రఘునాథపాలెం మండలంలోని శివాయిగూడెం వద్ద పవర్‌లూమ్ పరిశ్రమ కోసం వేసిన శిలాఫలకం



శ్రీకాంత్ అనే వ్యక్తికి ఫెడరేషన్ నుంచి అందిన లెటర్

మోసపూరిత ప్రకటనలు ఇలా..

- ఫెడరేషన్ టర్నోవర్ రూ. 50 కోట్లు. దానిలో షేర్ క్యాపిటల్ రూ. 24.5 కోట్లు. షేర్ క్యాపిటల్‌లో భాగస్వాములు అయితే రూ.కోట్లలో లాభాలుంటాయి.
- స్టేట్ ఎగ్జిక్యూటివ్ బాడీకి సంవత్సరానికి కమీషన్ రూపంలో రూ.2 కోట్లు నుంచి రూ.4 కోట్లు వస్తాయి.
- సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.కోటి నుంచి రూ.2 కోట్ల వరకు ఆదాయం ఉంటుంది.
- డైరెక్టర్ పదవికి రూ. 5లక్షలు, స్టేట్ ఎగ్జిక్యూటివ్ పోస్టుకు రూ. 15లక్షలు, సెంట్రల్ ఎగ్జిక్యూటివ్‌పోస్టుకు రూ.25లక్షలు చెల్లించాలి.
- మినిస్టర్ ఆఫ్ అగ్రికల్చరల్ డిపార్ట్‌మెంటు, కోపరేటివ్ నుంచి అనుమతులున్నాయి.

ఖమ్మంలో పరిశ్రమంటూ హడావిడి..

2015 ఏప్రిల్‌లో ఓ మంత్రి, మరికొందరు ప్రజాప్రతినిధులను పిలిచి హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో సమావేశం పెట్టి ఫెడరేషన్ గురించి గొప్పగా ప్రచారం చేయడం విశేషం. ఆ తర్వాత అదే ఏడాది జూన్‌లో ఖమ్మం సమీపంలోని రఘునాథపాలెం మండలంలో పవర్‌లూమ్ పరిశ్రమ పేరుతో హడావిడి చేశారు. ఒక్కో యూనిట్‌కు ఒక్కొక్కరినుంచి రూ.లక్ష నుంచి రూ. 2.50 లక్షలు వసూలు చేశారు. పరిశ్రమ ఏర్పాటుకు శిలాఫలకం ప్రారంభ కార్యక్రమానికి ఓ మంత్రిని ముఖ్య అతిథిగా పిలిచారు. శిలాఫలకం మీద మరో మంత్రి పేరు, ఎంపీ, ఎమ్మెల్యేల పేర్లు పెట్టినా ఎమ్మెల్యే ఒక్కరే ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. భారీ ఏర్పాట్లు ఉండడం, ప్రారంభ కార్యక్రమంలో ప్రజాప్రతినిధుల పేర్లు ఉండడంతో ఖమ్మం జిల్లాకు చెందిన కొందరు ఆకర్షితులయ్యారు.



ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న బాధితులు

మోసం బయటపడింది ఇలా?

- 2010 నుంచి ప్రారంభమైన ఫెడరేషన్ లీలలు ఖమ్మం నగరానికి 2011లో విస్తరించాయి.
- ఖమ్మం నగరానికి చెందిన ఓ వ్యాపారి మందుల దుకాణం నిర్వాహకునికి సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ పదవి ఇస్తామని రూ.25లక్షలు చెల్లించాలని ఫెడరేషన్ నిర్వాహకులు మాయమాటలు చెప్పారు. సదరువ్యాపారి ఇతరులకూ విషయం చెప్పడంతో వారు కొంత నగదు చెల్లించారు.

కాలయాపనతో గుట్టు రట్టు..

- పోస్టులు లభించినట్లు కాగితాలు అందుకున్న వారికి లాభాలు రాకపోవడం, సమావేశాలు లేకపోవడంపై ఆరా తీశారు.
- దీనిపై ప్రశ్నిస్తే ఫెడరేషన్‌కు ఏడాదికి రూ. 2 వేల కోట్లు రావాలంటే ఏదైన ఒక రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతి ఉండాలని ఆ ప్రయత్నంలో ఉన్నామని చెప్పారు.
- ఉత్తరప్రదేశ్ నుంచి అనుమతి వస్తుందని కొంతకాలం, ఉత్తరాఖండ్ నుంచి వస్తుందని మరికొంతకాలం కాలయాపన చేశారు.
- ఇటీవల కాలంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఓ సీఎం సంతకం చేద్దామనుకున్నాడని, ఫైలు మొత్తం అయ్యాక ఎవరో కావాలని ఎస్ఎంఎస్ ఇవ్వడంతో పని ఆగిపోయిందని చెప్పారు. దాంతో ఖమ్మంవాసులు ఇదేదో మోసం ఉందని తేరుకున్నారు. పలువురిని విచారించగా సదరు ఫెడరేషన్ మోసాల పుట్టని గమనించారు. ఛైర్మన్‌గా చెబుతున్న వ్యక్తి ఫేస్‌బుక్ అకౌంట్‌ను చూశారు. అశ్లీల బొమ్మలు చూసి అవాక్కయ్యారు. బాధితులంతా బుధవారం ఖమ్మం పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించి తమకు న్యాయం చెయ్యాలంటూ వేడుకున్నారు.

పెద్దకారు కొనేదాకా ఇల్లు కదలని పెద్దమనిషి

రూ.25 లక్షలు చెల్లించిన ఓ వ్యాపారికి ఫెడరేషన్ సెంట్రల్ ఎగ్జిక్యూటివ్‌గా నియమించినట్లు ఓ కాగితం పంపించారు. సదరు వ్యక్తి ఉబ్బితబ్బిబ్బయి మరింత నగదు ముట్టజెప్పారు. అంతేకాదు ఆయనకు ఉన్న కారు చిన్నదని ఇప్పుడు ఈ పదవి కారణంగా ఇద్దరు గన్‌మెన్‌లు వస్తారని, మంచి ఖరీదైన కారు కొనాలంటూ సలహా ఇచ్చారు. దాంతో పాత కారులో వెళ్లడం నామోషీగా భావించిన ఆయన కొత్తకారు కొనే వరకు రెండు నెలలు ఇంట్లోంచి బయటకు అడుగే పెట్టలేదంటే అతిశయోక్తికాదు.

మెడికల్ సీట్ల భర్తీలో జీవో 550 అమలు నిలిపివేత

ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు

ఈనాడు, హైదరాబాద్: రిజర్వు కేటగిరీకి చెందిన అభ్యర్థికి ప్రతిభ ఆధారంగా కేటాయించిన సీటు ఖాళీ అయితే తిరిగి ఆ కేటగిరీ అభ్యర్థితోనే భర్తీ చేయాలంటూ 2001లో జారీ అయిన జీవో 550లోని నిబంధన అమలును నిలిపివేస్తూ ఉమ్మడి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ జీవోకు సంబంధించి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఏపీ వైద్య ఆరోగ్యశాఖ ముఖ్యకార్యదర్శి, ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ రిజిస్ట్రార్, నీట్ కన్వీనర్‌లను ఆదేశించింది. ఎంబీబీఎస్ సీట్ల భర్తీ వ్యవహారంలో జీవో 550 ఆధారంగా సీట్లను భర్తీ చేయాలన్న నిర్ణయం చట్టవిరుద్ధమని, ప్రతిభ ఆధారంగా సీటు పొందిన రిజర్వుడు కేటగిరీ అభ్యర్థి దాన్ని వదిలివేసినట్లయితే ఆ సీటును తిరిగి ప్రతిభ ఆధారంగానే భర్తీ చేసేలా ఆదేశించాలని కోరుతూ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన ఎ. వెంకట హర్షవర్ధన్‌తోపాటు మరో ఇద్దరు విద్యార్థులు పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ వి.రామసుబ్రమణియన్, జస్టిస్ టి.రజనిలతో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరపు న్యాయవాది రమేశ్‌బాబు వాదనలు వినిపిస్తూ పిటిషనర్లు నీట్‌లో అర్హత సాధించారని, అయితే ఓపెన్ కేటగిరీ సీట్లలో తక్కువ మార్కులు వచ్చినవారు జీవో 550 పేరా 5(2) నిబంధన ద్వారా రిజర్వు కేటగిరీ అభ్యర్థులు సీట్లు పొందారన్నారు. రిజర్వు కేటగిరీ సీట్లు ఖాళీ అయితే అదే కేటగిరీ వారితో భర్తీ చేస్తున్నారని, అయితే ప్రతిభ ఆధారంగా రిజర్వు కేటగిరీ అభ్యర్థులు పొందిన సీట్లు ఖాళీ అయితే ప్రతిభ ఆధారంగా కాకుండా కేవలం రిజర్వు కేటగిరీతోనే భర్తీ చేయడం సరికాదన్నారు. ఇదే విషయాన్ని భారత ప్రభుత్వం వర్సెస్ రమేశ్ రామ్ కేసులో సీట్ల భర్తీలో అన్ని కేటగిరీల్లో కలిపి రిజర్వేషన్లు 50 శాతానికి మించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని, దీనికి విరుద్ధంగా జీవో 550 ఉందని తెలిపారు. వాదనలు విన్న ధర్మాసనం జీవో 550 అమలును నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ విచారణను సెప్టెంబరు 18కి వాయిదా వేసింది.

ప్రవేశాలు ఎలా కల్పిస్తారో నివేదిక ఇవ్వండి..

ఫాతిమా విద్యార్థుల కేసులో ఏపీని కోరిన సుప్రీంకోర్టు

ఈనాడు, దిల్లీ: ఫాతిమా వైద్య కళాశాల 2015-16 బ్యాచ్ విద్యార్థులకు ప్రవేశాలు ఎలా కల్పిస్తారో నివేదిక ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు కోరింది. రెండు వారాల్లో నివేదిక అందజేయాలని ఆదేశిస్తూ మెడికల్ కౌన్సిల్ఆఫ్ ఇండియా (ఎంసీఐ), కేంద్రప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. కడపజిల్లాలోని ఫాతిమా వైద్య కళాశాల 2015- 16 బ్యాచ్‌కు చెందిన 100మంది విద్యార్థులకు న్యాయం చేయాలంటూ సుప్రీంకోర్టులో ఏపీప్రభుత్వం పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై బుధవారం జస్టిస్ రంజన్‌గొగొయ్, జస్టిస్ నవీన్‌సిన్హాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. నిర్ణయాన్ని సెప్టెంబరు 21న వెలువరిస్తామని పేర్కొంటూ ధర్మాసనం విచారణను వాయిదా వేసింది.

భారత సైన్యంలో భారీ సంస్కరణలు

- పెద్ద ఎత్తున పునర్ వ్యవస్థీకరణ
- సిబ్బంది నియామక ప్రమాణాలు పెంపు
- స్వాతంత్ర్యం వచ్చాక తొలి సంస్కరణలు
- 2019 డిసెంబరుకల్లా పూర్తి..
- రక్షణమంత్రి అరుణ్‌జైట్లీ వెల్లడి

ఈనాడు, దిల్లీ: భారత సైన్యం పోరాట సామర్థ్యాన్ని ఇనుమడింపజేసేందుకు ప్రభుత్వం భారీ సంస్కరణలను తలపెట్టింది. ఇందులో 57 వేలమంది అధికారులు, ఇతరత్రా సిబ్బందికి విభిన్న బాధ్యతలు అప్పగించడం, వివిధ అవసరాల కోసం ఉపయోగించుకోవడం, వనరుల్ని మెరుగ్గా వాడుకోవడం వంటివీ ఉన్నాయి. బుధవారం రక్షణమంత్రి అరుణ్‌జైట్లీ మాట్లాడుతూ.. స్వాతంత్ర్యం వచ్చాక భారత సైన్యంలో జరుగుతున్న ప్రణాళికబద్ధమైన భారీ సంస్కరణ ఇదేనని పేర్కొన్నారు. డోక్లామ్ ఉదంతం నేపథ్యంలో ఈ చర్యలకు దిగారా అన్న ప్రశ్నకు స్పందిస్తూ.. నిర్దిష్టంగా ఏ ఘటనకూ సంబంధం లేదనీ, డోక్లామ్‌కన్నా ముందునుంచే సాగుతోందన్నారు. విశ్రాంత లెఫ్టినెంట్ జనరల్ డీబీషెకాట్కర్ నేతృత్వంలోని నిపుణుల కమిటీ ఇచ్చిన సిఫార్సులను రక్షణశాఖ మంగళవారమే ఆమోదించినట్లు తెలిపారు. భారత సైన్యం పోరాట సామర్థ్యాన్ని పెంచడంతోపాటు, సాయుధ బలగాలపై ఖర్చులను తగ్గించుకోవడానికి నిర్మాణాత్మక మార్పుల కోసం ఆ కమిటీ మొత్తం 99 సిఫార్సులు చేసిందనీ, తొలిదశ కింద అందులో 65 సిఫార్సులను రక్షణశాఖ ఆమోదించిందని చెప్పారు. సంస్కరణల ఆచరణ ప్రారంభమైందనీ, ఈ ప్రక్రియ 2019 డిసెంబర్ 31కల్లా పూర్తవుతుందన్నారు. సైన్యంలో పునర్‌వ్యవస్థీకరణ చేపట్టాలన్న నిర్ణయాన్ని బుధవారం కేంద్ర మంత్రివర్గానికి వివరించడం జరిగిందన్నారు.

సైన్యం సామర్థ్యం మెరుగు పరిచేందుకు విభిన్న విభాగాల్లో పౌర సిబ్బందిని పునర్ వ్యవస్థీకరించడం జరుగుతుందని రక్షణశాఖ ఓ ప్రకటనలో తెలిపింది. స్వాతంత్ర్యం వచ్చాక తొలిసారిగా చేపట్టిన కసరత్తనీ, భారత సైన్యంతో సంప్రదించి రక్షణ శాఖ ప్రణాళికబద్ధమైన రీతిలో పునర్‌వ్యవస్థీకరణ చేపట్టాలని నిర్ణయించిందనీ, ఈ నిర్ణయాల్ని రక్షణమంత్రి ఆమోదించారని పేర్కొంది. తొలిదశలో భాగంగా.. సుమారు 57 వేలమంది అధికారులు, జూనియర్‌కమిషన్డ్ అధికారులు, ఇతర ర్యాంకులు, పౌర సిబ్బంది పోస్టులకు విభిన్న బాధ్యతలు అప్పగించడం, మార్చడం, పునర్‌వ్యవస్థీకరించడం జరుగుతుందని తెలిపింది. మిలిటరీ పాడికేంద్రాలు, సైనిక తపాలా కార్యాలయాల్ని మూసేయడం జరుగుతుందనీ, మరమ్మతు కేంద్రాలు, కార్యశాలల్నీ పునర్ వ్యవస్థీకరించనున్నట్లు తెలిపింది. ఆయుధ కేంద్రాలు, వాహన, ఆయుధ డిపోలు వంటి వాటన్నింటిలోనూ మార్పులు జరుగుతాయని తెలిపింది. సరఫరా, రవాణా సౌకర్యాల్ని మరింత మెరుగ్గా ఉపయోగించుకునేందుకు సంస్కరణలు చేపట్టనున్నారు. క్లరికల్ సిబ్బంది, డ్రైవర్ల నియామకాల ప్రమాణాల్ని పెంచనున్నారు. ఎన్‌సీసీ కేడెట్ల సామర్థ్యాన్ని మెరుగుపరిచే చర్యలు చేపడతారు. సైనిక విద్యా కోర్‌తోపాటు 31 వేల మంది పౌరసిబ్బందిని కొత్త పద్ధతిలో మార్చడం జరుగుతుందని సైనిక వర్గాలు పేర్కొన్నారు.

ఎస్ఎఫ్‌సీ డీజీఎంను ఏకపక్షంగా తప్పించారు

తెలంగాణ ప్రభుత్వ వైఖరిని కేంద్ర హోంశాఖ దృష్టికి తీసుకెళ్లిన ఏపీ

ఈనాడు అమరావతి: ఆంధ్రప్రదేశ్ పునర్‌వ్యవస్థీకరణ చట్టంలోని 9వ షెడ్యూల్‌లో ఉన్న సంస్థకు సంబంధించిన అధికారిని తెలంగాణ ప్రభుత్వం ఏకపక్షంగా రిలీవ్ చేయడంపై ఆంధ్రప్రదేశ్ అభ్యంతరం వ్యక్తం చేసింది. ఏపీ రాష్ట్ర ఆర్థిక సంస్థ (ఏపీఎస్ఎఫ్‌సీ)లో డిప్యూటీ జనరల్ మేనేజర్‌గా తెలంగాణ డివిజన్‌కి పని చేస్తున్న జి.వెంకటేశ్వరరావును ఏప్రిల్ 24న తెలంగాణ ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఆయనతోపాటు ఏపీ మూలాలు ఉన్న ఇద్దరు అధికారుల్నీ రిలీవ్ చేశారు. వెంకటేశ్వరరావు గదికి తాళం వేసి ఫోన్, కంప్యూటర్ తొలగించడంతోపాటు ఇతర సదుపాయాల్నీ నిలిపివేశారు. ఈ విషయాన్ని ఏపీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి దినేష్‌కుమార్ కేంద్ర హోం మంత్రిత్వ శాఖ దృష్టికి తీసుకెళ్లారు. ఏకపక్షంగా రిలీవ్ చేసిన విషయాన్ని తెలంగాణ డివిజన్‌కు చెందిన సంయుక్త ఎండీకి తెలియజేశామనీ ఎలాంటి స్పందన రాలేదని పేర్కొన్నారు. ఉద్యోగి మూలాలు, పుట్టిన ప్రదేశాన్నిబట్టి వివక్ష చూపడం సరికాదని తెలిపారు. ఆ ముగ్గురు ఉద్యోగుల్నీ తిరిగి విధుల్లోకి తీసుకొని రిలీవ్ చేసిన రోజు నుంచీ జీతాలు చెల్లించేలా తెలంగాణ ప్రభుత్వానికి సూచించాలని ఆయన కోరారు.

అద్దె ఖాతాలతో సైబర్ నేరాలు!

- నేరగాళ్ల ఎత్తులకు అమాయకులు చిత్తు
- నారాయణపేట వాసి నుంచి రూ.25 లక్షలు కాజేసిన కేరళ వాసి
- అద్దె ఖాతాలతో సొమ్ము స్వాహా

ఈనాడు – హైదరాబాద్

సైబర్ నేరగాళ్లు తెలివి మీరుతున్నారు. కొంతకాలం వాడుకోవడానికి బ్యాంకు ఖాతా ఇస్తే నెలనెలా అద్దె చెల్లిస్తామని నమ్మబలుకుతున్నారు. వీరి మాటలకు బోల్తాపడుతున్న అమాయకులు చేయని నేరాల్లో ఇరుక్కుంటున్నారు. వీటినే మ్యూల్ ఖాతాలు అంటున్నారు. ఇందుకు తాజా ఉదంతమే నిదర్శనం. లాటరీ పేరుతో మోసానికి పాల్పడిన కేరళ వాసి హమ్జా ఒతక్కుమ్ పురత్‌ను తెలంగాణ సీఐడీ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. రూ. కోటి లాటరీ తగిలిందని, దాన్ని పొందాలంటే డబ్బు చెల్లించాలని చెబుతూ మహబూబ్‌నగర్ జిల్లా నారాయణపేటకు చెందిన వ్యక్తికి చెప్పి అతని నుంచి రూ. 25 లక్షలు కొల్లగొట్టాడు. ఖర్చులు చెల్లిస్తే లాటరీ నీదే అవుతుందని నమ్మబలికాడు. ఆ మాటలకు బోల్తాపడిన బాధితుడు అడిగిందే తడవుగా నిందితుడు ఇచ్చిన బ్యాంకు ఖాతాలో డబ్బు జమచేయడం మొదలుపెట్టాడు. రోజులు గడుస్తున్నా లాటరీ డబ్బు చేతికి అందకపోవడంతో పోలీసులను ఆశ్రయించాడు. దర్యాప్తు చేస్తే ఆశ్చర్యగొలిపే విషయాలు బయటపడ్డాయి. బాధితుడు డబ్బు జమచేసిన బ్యాంకు ఖాతాలను పరిశీలించారు. ఖాతాదారులను విచారిస్తే తమను ఓ వ్యక్తి సంప్రదించాడని, బ్యాంకు ఖాతా అద్దెకిస్తే నెలకు రూ.5వేల చొప్పున చెల్లిస్తానని చెప్పాడని.. దాంతో తమ ఖాతా వివరాలు, ఆన్‌లైన్ యూజర్‌ఐడీ వంటివి ఇచ్చామని తెలిపారు. మొత్తంమీద ఈ కేసులో అసలు నేరస్థుడు హమ్జాను పట్టుకోగలిగారు. మానవతా దృక్పథంతో పోలీసులు ఖాతాలను అద్దెకిచ్చిన వారిని వదిలేశారు.



నిందితుడు హమ్జా

ఎందుకిలా..?

మాయమాటలతో బ్యాంకు ఖాతాలు, క్రెడిట్‌కార్డుల వివరాలు తెలుసుకొని డబ్బు కొల్లగొట్టడం, లాటరీ కలిసిందని చెప్పి తెలివిగా డబ్బు గుంజడం వంటి నేరాలు పెరిగిపోతున్న సంగతి తెలిసిందే. ఇలా కొల్లగొట్టిన డబ్బును మొదట్లో నేరగాళ్లు సరాసరి తమ ఖాతాల్లోనే వేసుకునేవారు. దాంతో పోలీసులకు వెంటనే దొరికిపోయేవారు. దీన్నుంచి తప్పించుకోవడానికి ఇప్పుడు అమాయకుల ఖాతాలను అద్దెకు తీసుకుంటున్నారు. తాము మోసం చేసిన వారి నుంచి డబ్బు వీరి ఖాతాల్లో పడేట్లు చేసుకుంటున్నారు. డెబిట్ కార్డులు ఉంటే డబ్బు డ్రా చేసుకుంటున్నారు. లేనిపక్షంలో ఆన్‌లైన్ షాపింగ్ ద్వారా ఖరీదైన వస్తువులు కొనుగోలు చేసి వాటిని మళ్లీ అమ్ముకుంటున్నారు. సైబర్ నేరగాళ్ల తెలివితేటలకు అమాయకులు బలవుతున్నారు. నారాయణపేట కేసులో సీఐడీ అధికారులు అరెస్టు చేసిన హమ్జా ఏకంగా 32 అద్దె ఖాతాలను వాడుకున్నట్లు వెల్లడైంది. ఇలాంటి ఖాతాల వివరాలు సేకరించి సైబర్ నేరగాళ్లకు అప్పగించే ముఠాలు కూడా తయారయ్యాయి.

ఖాతా వివరాలు చెప్పొద్దు

రామ్మోహన్, సీఐడీ ఎస్పీ

డబ్బు ఇస్తామని ఆశపెట్టినప్పటికీ ఎవరూ తమ ఖాతా వివరాలు, డెబిట్ కార్డు వంటివి ఎవరికీ ఇవ్వకూడదు. వీటివల్ల జరుగుతున్న నష్టం తెలియక అమాయకులు బలవుతున్నారు. డబ్బుకు ఆశపడి ఖాతాల వివరాలిస్తే అనవసరంగా కేసుల్లో ఇరుక్కున్నట్లే.

రివ్వున ఎగిరొద్దాం..!

- శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హెలీటూరిజం సిద్ధం
- తిరుపతిలో తాత్కాలిక హెలిప్యాడ్ ఏర్పాటు

ఈనాడు, తిరుపతి: తిరుమల రాష్ట్ర పర్యటకశాఖ మ్యాక్ ఏవియేషన్‌తో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం తిరుపతిలో శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవాల సమయానికి హెలీటూరిజం అందుబాటులోకి రానుంది. 6 సీట్ల హెలీకాప్టర్ ద్వారా యాత్రికులకు తిరుపతి సమీప ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తోంది. తిరుపతి బస్టాండ్ ఎదురుగా ఉన్న శ్రీనివాసం వసతి సముదాయం వెనుక ఉన్న ప్రైవేటు స్థలాన్ని అధికారులు హెలిప్యాడ్ కోసం పరిశీలించారు. మూడెకరాల ఈ స్థలాన్ని చదును చేసి, తాత్కాలిక హెలిప్యాడ్, బుకింగ్ కౌంటర్‌తో పాటు చుట్టూ కంచె నిర్మించనున్నారు. పోలీసు, రెవెన్యూ శాఖల అనుమతులు పొందిన పర్యటక శాఖ.. హెలీటూరిజం ప్రాజెక్టు అనుమతి ఫైలును పౌర విమానయాన శాఖకు పంపింది. వారు కూడా సానుకూలంగా ఉండటంతో బ్రహ్మోత్సవాల నాటికి సాకారం కావొచ్చని తెలుస్తోంది.

అందుబాటులో టిక్కెట్ ధరలు: ఒక్కో వ్యక్తికి రూ.2500 మేర టిక్కెట్ ధర ఉండవచ్చని అధికారులు చెబుతున్నారు. ఒక్కో ట్రిప్పులో 12 నుంచి 20 నిమిషాల పాటు ఆకాశంలో చక్కర్లు కొడుతుంది. తిరుపతి నగరం మీదుగా చంద్రగిరి కోట వరకు వెళ్లి వచ్చేలా రూట్‌మ్యాప్ సిద్ధం చేశారు. ఈసారి విజయవంతమైతే.. శాశ్వత హెలీటూరిజం ప్రాజెక్టుపై దృష్టి సారించనున్నారు. తిరుపతి శిల్పారామం వెనుక ఉన్న హెలిప్యాడ్ నుంచి చంద్రగిరి, కాణిపాకం, శ్రీకాళహస్తి చుట్టివచ్చేలా ఇప్పటికే ప్రతిపాదనలు ఉన్నాయి. పర్యాటక శాఖ ఈడీ జయప్రకాశ్ 'ఈనాడు'తో మాట్లాడుతూ 'హెలీ టూరిజం తాత్కాలిక ప్రాజెక్టును శ్రీనివాసం వెనుక ప్రదేశంలో ఈసారి ప్రారంభిస్తున్నాం. దాదాపు అన్ని అనుమతులు వచ్చాయి. త్వరలోనే పనులు మొదలుపెడతాం. ఇది విజయవంతమైతే శాశ్వత ప్రాజెక్టు పట్టాలెక్కుతుంద'ని వివరించారు.

మౌలిక వసతులకు నిధుల్లేవు!

- రెండు పడక గదుల ఇళ్ల అపార్ట్‌మెంట్లలో వసతుల కల్పన పెనుభారమే
- ఆ ఖర్చును స్థానిక సంస్థలే భరించాలన్న గృహ నిర్మాణ శాఖ
- తమవల్ల కాదంటున్న జీహెచ్ఎంసీ
- రాష్ట్రంలోని ఇతర స్థానిక సంస్థల పరిస్థితీ ఇదే..

ఈనాడు, సిటీ బ్యూరో ప్రధాన ప్రతినిధి

రెండు పడక గదుల ఇళ్ల అపార్ట్‌మెంట్ల ప్రాంగణాల్లో మౌలిక సదుపాయాల కల్పనకయ్యే ఖర్చును స్థానిక సంస్థలే భరించాలన్న ప్రభుత్వ ఆదేశాలు ఆయా సంస్థలకు గుదిబండలా మారాయి. హైదరాబాద్ మహానగరపాలక సంస్థ(జీహెచ్ఎంసీ) ఇందుకోసం దాదాపు రూ. 700-900 కోట్ల వరకు వ్యయం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అసలే ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉందని, ఇప్పుడు ఈ నిధులు ఎలా సమకూర్చుకోవాలని అధికారులు ఆందోళన చెందుతున్నారు.

హైదరాబాద్ నగరంలో లక్ష రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో ఇళ్ల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. ఇందులో 59,520 ఇళ్లకు టెండర్ల ప్రక్రియను పూర్తి చేయగా.. 27734 ఇళ్ల నిర్మాణ పనులు మొదలయ్యాయి. బుధవారం మరో 31704 ఇళ్లకు టెండర్లను పిలిచారు. లక్ష ఇళ్ల నిర్మాణానికి రూ. 8,225 కోట్ల వ్యయమవుతుందని అంచనా వేశారు. ఇందులో కొంత కేంద్రం, మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం భరిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం హడ్కో నుంచి రుణం కూడా తీసుకుంది. పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అధికారులను పరుగులు పెట్టించడంతో ఇళ్ల నిర్మాణం వేగంగా మొదలైనా మౌలిక వసతుల కల్పనే సమస్యగా మారింది. రోడ్లు, భూగర్భ డ్రైనేజీ, కేబుల్ ద్వారా విద్యుత్తు, తాగునీటి కల్పన తదితర వసతులకు హైదరాబాద్ పరిధిలో చేపట్టే ఇళ్లకు ఒక్కోదానికి రూ. 90 వేల వరకు అవుతుందని అంచనా వేశారు. ఈ మొత్తాన్ని రూ. 70 వేలకు తగ్గించాలని భావిస్తున్నారు. మౌలిక వసతుల ఏర్పాటుకయ్యే ఖర్చును స్థానిక సంస్థలే భరించాలంటూ ఇటీవల రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ ఓ ఆదేశం జారీ చేసింది. ఈ ప్రభావం జీహెచ్ఎంసీపై భారీగా పడింది. రాజధానిలో నిర్మించే లక్ష ఇళ్లకు గాను రూ. 700-900 కోట్లు భరించాల్సి వస్తుంది. ప్రస్తుతం బల్దియా ఆర్థిక పరిస్థితి ఏమాత్రం ఆశాజనకంగా లేదు. ఆస్తి పన్ను వసూలైతేనే జీతాలిచ్చే పరిస్థితిలో ఉంది. ఈ ఏడాది ఇప్పటివరకు దాదాపు రూ. 650 కోట్ల మేరకు ఆస్తి పన్ను వసూలవడంతో కొంత మొత్తం జీతాలకు, మరికొంత అభివృద్ధి పనులు, ఇతర నిర్వహణ పనులకు ఉపయోగించి ఊపిరి పీల్చుకుంది. ఈ నేపథ్యంలో రెండు పడక గదుల ఇళ్లకు మౌలిక వసతుల కల్పనకు రూ. 700 కోట్ల నిధులను బల్దియా వినియోగించలేని పరిస్థితిలో ఉందని ఓ ఉన్నతాధికారి తెలిపారు. ప్రభుత్వం ఈ ఖర్చును భరిస్తేనే మౌలిక వసతులను కల్పించగలమన్నారు. లేకపోతే జేఎన్ఎన్‌యూఆర్ఎం ఇళ్ల సముదాయాల్లో మౌలిక వసతుల కల్పనను వదిలేసినట్లే ఇక్కడా వదిలేయాల్సిన పరిస్థితి వస్తుందని ఓ ఇంజనీర్ పేర్కొన్నారు. జీహెచ్ఎంసీనే ఈ నిధులను భరించలేనప్పుడు రాష్ట్రంలోని మిగిలిన నగర, పురపాలక సంస్థలు ఎలా భరిస్తాయని అధికారులు ప్రశ్నిస్తున్నారు.



డిసెంబరు 6 వరకూ పాదయాత్ర వాయిదా

మూడు నెలలు గడువిస్తున్నామన్న ముద్రగడ

కిర్లంపూడి, న్యూస్‌టుడే: డిసెంబరు 6వ తేదీ నాటికి కాపుల రిజర్వేషన్ల అమలుపై అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపాలంటూ ప్రభుత్వానికి ముద్రగడ పద్మనాభం అల్టిమేటం జారీ చేశారు. ఈ సమయానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నిచర్యలు పూర్తి చేయకపోతే ఆరోజు నుంచే ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతామని ప్రకటించారు. తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడిలో బుధవారం 13 జిల్లాలకు చెందిన కాపు ఐకాస నాయకులతో ముద్రగడ సుదీర్ఘంగా చర్చించారు. సమావేశం అనంతరం ఐకాస రాష్ట్రనాయకులతో కలిసి విలేకర్లతో మాట్లాడారు.

శ్రీకాకుళం జిల్లాలో స్వల్ప భూ ప్రకంపనలు

సోంపేట, న్యూస్‌టుడే: శ్రీకాకుళం జిల్లాలోని సోంపేట, బారువ, మామిడిపల్లి, కొర్లాం, మందస ప్రాంతాలలో బుధవారం సాయంత్రం స్వల్పంగా భూమి కంపించింది. సాయంత్రం 4 గంటల సమయంలో కొన్ని సెకన్ల పాటు భూప్రకంపనలు రావడంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులుతీశారు. ఒకవైపు ఆకాశం మేఘావృతమై ఉండడం, ఉరుములు, మెరుపులతో ఇబ్బందికర వాతావరణం ఉన్న సమయంలో భూమి కంపించడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. హరిపురం, అంబుగాం, మకరజోల, వీజీపురం, కుంటికోట ప్రాంతాల్లోనూ దాదాపు సాయంత్రం 3.55 గంటలకు భూమి కంపించడంతో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందారు.



సింగూరు ప్రాజెక్టులో చేప పిల్లలను వదులుతున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, అందోలు ఎమ్మెల్యే బాబూమోహన్ తదితరులు

సమైక్య పాలనలో కుల వృత్తుల విస్మరణ

రెండో విడత చేపపిల్లల పంపిణీ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా మంత్రి తలసాని

సంగారెడ్డి అర్బన్, న్యూస్‌టుడే: సమైక్య పాలనలో అప్పటి పాలకులు కులవృత్తులను పూర్తిగా విస్మరించారని రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ చేతి వృత్తులకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని స్పష్టం చేశారు. చేతి వృత్తిదారులకు ఆర్థిక స్వాతంత్ర్యం తీసుకురావలన్న సంకల్పంతో చేప పిల్లల పెంపకం, గొర్రెల పంపిణీ లాంటి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెండో విడత చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం సింగూర్ ప్రాజెక్టులో అక్కడి ఎమ్మెల్యే పి.బాబూమోహన్‌తో కలిసి మంత్రి శ్రీనివాస్‌యాదవ్ బుధవారం ప్రారంభించారు. అంతకుముందు సంగారెడ్డి పట్టణంలో మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్‌కు మానస పుత్రికలు గొర్రెల పంపిణీ, చేప పిల్లల పంపిణీ అని అన్నారు. గతేడాది తొలి విడతలో 22 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయగా ఈసారి రెండో విడతలో 70 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాలని లక్ష్యంగా నిర్ణయించినట్లు తెలిపారు. వర్షాలు సమృద్ధిగా కురవడం చేప పిల్లలకు మంచి పరిణామమన్నారు. ఇందుకు అనుగుణంగా చేపలకు మార్కెటింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు తెలిపారు.

మహారాష్ట్రతో మాట్లాడదాం..!

'కాళేశ్వరం'పై పిటిషన్ నేపథ్యంలో నీటిపారుదల శాఖ యోచన

ఈనాడు, హైదరాబాద్: కాళేశ్వరం ఎత్తిపోతల పథకంపై జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో మహారాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి పిటిషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆ రాష్ట్రంతో చర్చించడానికి నీటిపారుదల శాఖ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అటవీ, పర్యావరణ అనుమతులు లేకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు పనులు చేపట్టారని జాతీయ హరిత ట్రైబ్యునల్‌లో దాఖలైన పిటిషన్‌పై విచారణ జరుగుతున్న విషయం తెలిసిందే. తాజాగా మహారాష్ట్ర కూడా అభ్యంతరం వ్యక్తం చేసింది. దీనిపై తెలంగాణకి లేఖ రాసినట్లు పేర్కొంది. కానీ, మేడిగడ్డ వద్ద బ్యారేజి నిర్మాణానికి రెండు రాష్ట్రాల మధ్య ఒప్పందం జరగడం, మహారాష్ట్ర కోరినట్లుగా చేయడానికి సిద్ధపడినప్పటికీ పిటిషన్ వేయడం సరికాదని భావిస్తున్న నీటిపారుదల శాఖ.. ఆ రాష్ట్ర అధికారులతో మరోసారి చర్చించి అనుమానాలుంటే నివృత్తి చేయాలని భావిస్తోంది.

ఎస్సారెస్పీలోకి 40వేల క్యూసెక్కుల ప్రవాహం

శ్రీరాంసాగర్(ఎస్సారెస్పీ)లోకి వరద ప్రవాహం పెరిగింది. గురువారం 40 వేల క్యూసెక్కులకు పెరగడంతో నీటి నిల్వ 33 టీఎంసీలకు చేరింది. ఈ ప్రాజెక్టు నిండడానికి మరో 57 టీఎంసీలు అవసరం. ఎగువన కురిసిన వర్షాలతో ప్రవాహం పెరుగుతుందని అంచనా వేస్తున్నారు. సింగూరు, కడెం, నిజాంసాగర్‌లోకి నామమాత్రంగానే ఉండగా, ఎల్లంపల్లికి 12724 క్యూసెక్కులు ఉంది. ఈ ప్రాజెక్టు నిండడానికి మరో నాలుగున్నర టీఎంసీలు మాత్రమే అవసరం. కృష్ణా బేసిన్‌లో ఆలమట్టిలోకి 27885 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, 17వేల క్యూసెక్కుల నీటిని నారాయణపూర్‌కు వదిలారు. నారాయణపూర్‌లో కొంత నీటిని నిల్వచేసి 7613 క్యూసెక్కులను కాలువలకు వదిలారు. మహారాష్ట్రలోని భీమాపై ఉన్న ఉజ్జయినికి 70వేల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, 45వేల క్యూసెక్కులను దిగువకు వదిలారు. దీంతో జూరాలకు ఒకటి రెండు రోజుల్లో ప్రవాహం పెరిగే అవకాశం ఉంది. జూరాలకు 9766 క్యూసెక్కుల ప్రవాహం ఉండగా, తుంగభద్రలోకి 23438, శ్రీశైలంలోకి 4687, నాగార్జునసాగర్‌లోకి 907, పులిచింతలకు 3341 క్యూసెక్కుల ప్రవాహం ఉంది.


ఇఫ్లూకి 300 ఎకరాలివ్వండి: వీసీ

ఆంగ్లము, విదేశీ భాషల విశ్వవిద్యాలయా(ఇఫ్లూ)నికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు వర్సిటీ వీసీ ఆచార్య ఇ.సురేష్‌కుమార్ తెలిపారు. ఇటీవల కేంద్ర మంత్రి దత్తాత్రేయను కలిసి విజ్ఞప్తులతో కూడిన లేఖను అందజేసినట్లు చెప్పారు. వర్సిటీ విస్తరణకు కనీసం 300 ఎకరాలు అవసరమన్నారు. హైదరాబాద్‌లో ఎక్కడైనా భూమిని కేటాయిస్తే.. శాశ్వత ప్రాతిపదికన వర్సిటీని విస్తరించడానికి అవకాశం ఉంటుందని వివరించారు. 12 విదేశీ భాషలను ఆన్‌లైన్‌లో ఉచితంగా నేర్పే ప్రాజెక్టును వచ్చే 2 నెలల్లో ప్రారంభించనున్నట్లు తెలిపారు. జపాన్‌లో చాలా కొలువులు ఉన్నాయని.. అక్కడి అవసరాలను దృష్టిలో పెట్టుకొని మన దేశంలోని యువతకు తక్కువ కాలవ్యవధి కోర్సును త్వరలోనే అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎంవోయూ కుదుర్చుకున్నామన్నారు.

విలాసవంత వాహనాలపై 25% సెస్సు

ఈనాడు – దిల్లీ

వస్తు-సేవల పన్ను (జీఎస్‌టీ) అమల్లోకి వచ్చిన తర్వాత ధర తగ్గిన విలాసవంత వాహనాలపై సెస్సును 10% మేర పెంచడానికి కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. 'జీఎస్‌టీ అమల్లోకి వచ్చిన తర్వాత విలాసవంతమైన వాహనాల ధరలు రూ.3 లక్షల వరకు తగ్గాయి. చిన్న వాహనాల ధరలు మాత్రం అలాగే ఉన్నాయి. వాహనాలపై సెస్సును 15 నుంచి 25%కి పెంచడానికి కేంద్ర మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. ఆమేరకు సెస్ పెంచాలా? వద్దా? పెంచాలంటే ఎప్పటి నుంచి? అనే అంశాలపై నిర్ణయం తీసుకోవడానికి అవకాశం లభించింది. సెప్టెంబరు 9న హైదరాబాద్‌లో జరిగే జీఎస్‌టీ కౌన్సిల్ తదుపరి సమావేశంలో నిర్ణయం తీసుకున్న తర్వాత కేంద్ర మంత్రివర్గం ద్వారా దీనికి సంబంధించిన ఆర్డినెన్సును రాష్ట్రపతికి పంపుతాం' అని కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ ప్రకటించారు. సిగరెట్లు చౌక అయ్యేలా చేయడం జీఎస్టీ ఉద్దేశం కాదనీ, ఒకవేళ అలా చేస్తే ఆ విధానం అర్థంపర్థం లేనిదే అవుతుందనీ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.



ఎన్నికల్లో సహకారంపై ఆరు దేశాలతో ఒప్పందం

ఎన్నికల నిర్వహణలో సహకారానికి ఈక్వెడార్, అల్జీరియా, భూటాన్, అఫ్గానిస్థాన్, గినియా, మయన్మార్‌లతో ఒప్పందాలు కుదుర్చుకోవాలని ఎన్నికల సంఘం చేసిన ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది.

- పారిశ్రామిక పరిశోధనలు, సాంకేతిక నవకల్పనల్ని ప్రోత్సహించడానికి ఇజ్రాయెల్‌తో కలిసి 4 కోట్ల డాలర్ల (సుమారు రూ.260 కోట్లు) నిధిని ఏర్పాటు చేయాలన్న ఒప్పందాన్నీ మంత్రిమండలి ఆమోదించింది.
- దీపావళి సందర్భంగా కెనడాతో కలిసి సంయుక్తంగా స్మారక తపాలా బిళ్లల జారీకి కేబినెట్ సమ్మతించింది.
- జెబూ జాతి పశుగణానికి సంబంధించి పునరుత్పాదక సాంకేతికతలపై భారత్-బ్రెజిల్ మధ్య కుదిరిన ఒప్పందాన్ని కేబినెట్ ఆమోదించింది.

క్రీమీలేయర్ పరిధిలోకి పీఎస్‌యూల్లోని పోస్టులు

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం ఓబీసీ క్రీమీలేయర్ పరిధిని పెంచింది. ప్రభుత్వరంగ సంస్థలు(పీఎస్‌యూ), ఆర్థిక సంస్థలు, బ్యాంకులు, బీమా కార్పొరేషన్లలోని కొన్ని పోస్టులను ఇందులో చేర్చడం ద్వారా పరిధిని విస్తరించింది. సామాజికంగా ముందంజలో ఉన్న వ్యక్తులు/వర్గాలను ఓబీసీ పరిధి నుంచి మినహాయించాలన్న ప్రతిపాదననూ కేంద్ర మంత్రివర్గం ఆమోదించింది. ప్రభుత్వ ఖాళీల్లో 27 శాతం ఓబీసీ కోటా కేటాయిస్తూ, క్రీమీలేయర్ విధివిధానాలను వివరిస్తూ 1993లో సిబ్బంది, శిక్షణ విభాగం(డీఓపీటీ) ఆదేశాలు ఇవ్వగా, దీనిపై 23 ఏళ్ల తర్వాత నిర్ణయం జరిగింది. గ్రూప్-ఎ, గ్రూప్-బి పోస్టులకు పేర్కొన్న విధివిధానాలు.. ప్రభుత్వ రంగ సంస్థలు, బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో సమాన స్థాయి పోస్టుల్లో ఉన్న అధికారులకూ వర్తిస్తుందని అప్పటి ఆదేశాలు సూచించాయి. కేంద్ర ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ మంత్రివర్గ నిర్ణయాలను విలేకరులకు వివరిస్తూ.. పోస్టుల సమానత్వాన్ని నిర్ధరించే విధివిధానాలను ఆమోదించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థల్లోని అన్ని రకాల కార్యనిర్వాహకస్థాయి పోస్టులను ప్రభుత్వంలోని గ్రూప్-ఎ పోస్టులకు సమానంగా పరిగణిస్తూ, క్రీమీలేయర్‌లో ఉన్నట్లు భావిస్తారు. ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, ప్రభుత్వరంగ బీమా కార్పొరేషన్లలోని జూనియర్ మేనేజ్‌మెంట్ గ్రేడ్ స్కేల్-1, ఆపై నుండే పోస్టులను ప్రభుత్వంలో గ్రూప్-ఎ పోస్టులతో సమానంగా, క్రీమీలేయర్‌లో ఉన్నట్లు పరిగణిస్తారు. ఆయా ప్రభుత్వరంగ బ్యాంకులు, ఆర్థిక సంస్థలు, బీమా కార్పొరేషన్లలోని క్లర్కులు, ప్యూన్ల విషయంలో కాలానుగుణంగా సవరించే ఆదాయ పరిమితి వర్తిస్తుంది. సదరు స్థూల మార్గదర్శకాల్ని ప్రతి బ్యాంకు, పీఎస్‌యూ, బీమా సంస్థలు తమ బోర్డు ముందుంచి, పోస్టుల్ని గుర్తిస్తాయని ఓ అధికారిక ప్రకటనలో ప్రభుత్వం వివరించింది. 24 ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యకు ఇది పరిష్కారం చూపుతుందనీ, పీఎస్‌యూలు ఇతర సంస్థల్లో దిగువ స్థాయిలో పనిచేసే ఉద్యోగుల చిన్నారులు.. ప్రభుత్వంలో దిగువ స్థాయి ఉద్యోగులకు సమానంగా ఓబీసీ రిజర్వేషన్ ప్రయోజనాల్ని పొందేలా చేస్తుందని పేర్కొంది. ఓబీసీ రిజర్వేషన్ల కోసం క్రీమీలేయర్‌గా పరిగణించేందుకు గరిష్ఠ ఆదాయ పరిమితిని రూ.6 లక్షల నుంచి రూ.8 లక్షలకు గతవారమే ప్రభుత్వం పెంచింది. ఏడాదికి రూ.8 లక్షలకన్నా ఎక్కువగా ఆర్జించేవారిని క్రీమీలేయర్‌గా పరిగణిస్తారు. ఓబీసీ రిజర్వేషన్ ప్రయోజనాల నుంచి వారిని మినహాయిస్తారు.

రైల్వే నియంత్రణ సంస్థకు మార్గం సుగమం

దిల్లీ: రైల్వే ధరవరల్ని నియంత్రించడానికి ఎప్పటి నుంచో ప్రతిపాదిస్తున్న నియంత్రణ సంస్థ (ఆర్‌డీఏ) ఏర్పాటుకు మార్గం సుగమం అయింది. దీని విధి విధానాలను 'సిబ్బంది-శిక్షణ శాఖ' (డీఓపీటీ) కొలిక్కి తీసుకువచ్చింది. రైల్వేకు ఒక నియంత్రణ సంస్థ ఏర్పాటు చేయడానికి కేంద్ర మంత్రివర్గం ఏప్రిల్‌లోనే ఆమోదం తెలిపింది. ఇప్పుడు ఛైర్మన్, ఇతర సభ్యుల నియామకానికి ప్రకటన జారీ చేసేందుకు వీలు కలిగింది. ఛైర్మన్‌కు నెలకు రూ.4.5 లక్షలు, ఒక్కో సభ్యుడికి రూ.4 లక్షలు వంతున వేతనంగా చెల్లిస్తారు. వీరి పదవీకాలం అయిదేళ్లు. రైల్వేశాఖ నుంచి ఉద్యోగ ప్రకటన వెలువడిన తర్వాత కేంద్ర కేబినెట్ కార్యదర్శి నేతృత్వంలోని సంఘం- అర్హులను ఎంపిక చేస్తుంది. ఇదంతా ఈ ఏడాది చివరి నాటికి కొలిక్కి వస్తుందని అధికార వర్గాలు తెలిపాయి. టికెట్ ధరల్ని నిర్ణయించడం, రుసుములేతర విభాగంలో ఆదాయాన్ని పెంచుకునేందుకు చర్యల్ని సూచించడం, పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణాన్ని కల్పించడం వంటివి ఆర్‌డీఏ చేస్తుంది. రాజకీయాలతో సంబంధం లేకుండా ధరల్ని నిర్ణయించడానికి ఆర్‌డీఏ ఓ పెద్ద సంస్కరణగా నిలిచిపోతుందని సీనియర్ అధికారులు అంటున్నారు. ప్రయాణికుల చేరవేత ద్వారా ఏటా రూ.34,000 కోట్ల మేర నష్టం వస్తోందని రైల్వే లెక్కలు చెబుతున్నాయి. దీనిపై ఆర్‌డీఏ దృష్టి సారించనుంది.

మరిన్ని విజయాలు సాధించాలి

- పీవీ సింధును అభినందించిన చంద్రబాబు

ఈనాడు, అమరావతి: ప్రపంచ మహిళల బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించిన పీవీ సింధును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభినందించారు. మరిన్ని పతకాలు సాధించి భారతదేశ, ఆంధ్రప్రదేశ్ పేరు ప్రఖ్యాతులు నిలపాలని ఆకాంక్షించారు. బుధవారం వెలగపూడిలోని సచివాలయంలో తన శిక్షకుడు గోపీచంద్‌తో కలిసి ఆమె ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. బ్యాడ్మింటన్ క్రీడలో మరిన్ని విజయాలు, రికార్డులు సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాల సహకరిస్తుందని సీఎం చంద్రబాబు అన్నారు.



రజత పతకాన్ని సీఎం చంద్రబాబుకు చూపుతున్న పీవీ సింధు. చిత్రంలో పుల్లెల గోపీచంద్

ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ప్రమాదంలో 13 మంది ఉద్యోగుల తొలగింపు

దిల్లీ: ఉత్కళ్ ఎక్స్‌ప్రెస్ ఆగస్టు 19న ఘోర ప్రమాదానికి గురై 20 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనకు సంబంధించి 13 మంది రైల్వే ఉద్యోగులను బుధవారం ఉద్యోగాల నుంచి తొలగించారు. వీరిలో 11 మంది గ్యాంగ్‌మేన్లు కాగా, ఒకరు ఐరన్‌స్మిత్, ఒకరు జూనియర్ ఇంజినీర్.

నిమిషంలో 51 బస్కీలు

వాషింగ్టన్: పది బస్కీలు తీసి ఇక చాలు అంటూ ముగించేస్తాం కానీ అమెరికాకు చెందిన వ్యాయామ ఔత్సాహికుడు ఆడం సాండెల్ ఒక్క నిమిషంలో 51బస్కీలు తీసి గిన్నిస్ రికార్డును నెలకొల్పాడు. నిమిషంలో అత్యధిక బస్కీలు తీయడం ద్వారా ప్రపంచ రికార్డు సాధించడంతోపాటు గతంలో ఉన్న 50బస్కీల రికార్డును అధిగమించాడు.

పెట్రోల్, డీజిల్‌పై పన్నుల తగ్గింపు లేదు

- చమురుశాఖ మంత్రి ప్రధాన్ వెల్లడి

దిల్లీ: పెట్రోల్, డీజిల్‌లపై పన్నులను తగ్గించబోవట్లేదని కేంద్ర చమురుశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా చమురు ధరలకు అనుగుణంగా.. జులై ఆరంభం నుంచి ఇప్పటివరకూ లీటరు పెట్రోల్ ధర రూ.6కుపైగా పెరిగిన సంగతి తెలిసిందే. 2014 ఆగస్టు తర్వాత నమోదైన గరిష్ఠ ధర (దిల్లీలో లీటరుకు రూ.69.12) ఇదే. ఇటు లీటరు డీజిల్ ధర రూ.57.01కు చేరుకుంది. ఈ నేపథ్యంలో ధరల ప్రభావాన్ని తగ్గించేందుకు కేంద్రం పన్నుల్లో కోత పెడుతుందని వస్తున్న వదంతులను ప్రధాన్ కొట్టిపారేశారు. పన్ను విధానాన్ని సమీక్షించాల్సిన పరిస్థితి ప్రస్తుతం రాలేదని.. అలాంటి స్థితి తలెత్తినప్పుడు ఆలోచిస్తామని వ్యాఖ్యానించారు. 2014 జనవరి, 2016 జనవరి మధ్య చమురు ధరలు పడిపోయిన సమయంలో.. పెట్రోల్, డీజిల్‌లపై కేంద్రం తొమ్మిది సార్లు ఎక్సైజ్ సుంకాన్ని పెంచింది. ఫలితంగా ఈ వ్యవధిలో లీటరు పెట్రోల్‌పై రూ.11.77, డీజిల్‌పై రూ.13.47 మేర సుంకాలు పెరిగాయి. మరోవైపు జీఎస్‌టీ పరిధిలోకి పెట్రోల్, డీజిల్‌లను తీసుకువచ్చేందుకు తమ శాఖ సుముఖంగా ఉన్నట్లు ప్రధాన్ తెలిపారు. కేంద్ర ఆర్థికశాఖకు, రాష్ట్రాలకు ఇందుకోసం అభ్యర్థనలు చేస్తూనే ఉన్నామని పేర్కొన్నారు. ఇటు పెట్రోల్‌తో సమాన స్థాయికి డీజిల్ ధరను పెంచడం వల్ల రవాణా రంగంపై ప్రతికూల ప్రభావం పడుతుందని వ్యాఖ్యానించారు.

బీసీలకు చంద్రన్న పెళ్లి కానుక

- వివాహానికి రూ.25 వేల చొప్పున సాయం
- ఏపీ సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: బలహీనవర్గ కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం చంద్రన్న పెళ్లి కానుక ప్రకటించింది. ఇక నుంచి ప్రభుత్వం తరఫున ఒక్కో కుటుంబానికి రూ.25 వేలు పెళ్లి ఖర్చులు ఇవ్వనున్నట్లు సీఎం చంద్రబాబు బుధవారం వెల్లడించారు. తన కార్యాలయంలో బీసీ ఫెడరేషన్లు, కాపు, బ్రాహ్మణ కార్పొరేషన్ల సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీసీలను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని, వీరి సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు వివరించారు. ఆదరణ పథకంలో బలహీనవర్గాలకు అత్యంత అధునాతన పరికరాలను ఇవ్వనున్నట్లు సీఎం ప్రకటించారు. కాపు విద్యార్థులందరికీ బీసీల మాదిరిగానే ఉపకార వేతనాలు ఇవ్వాలని నిర్ణయించామన్నారు.

ఎనిమిది జిల్లాల్లో ఎదురుచూపు

- గత వారంలో రాష్ట్రవ్యాప్తంగా 71 శాతం అధిక వర్షపాతం
- వర్షాభావం తీవ్రంగా ఉన్న జిల్లాల్లో పడని వానలు
- 86 శాతానికి చేరిన పంటల సాగు
- రాష్ట్ర వ్యవసాయశాఖ తాజా నివేదిక

ఈనాడు, హైదరాబాద్ : దేశవ్యాప్తంగా జోరుగా వానలు పడుతున్నాయి....తెలంగాణలోనూ అక్కడక్కడ కుంభవృష్టి కురుస్తోంది...అయినప్పటికీ రాష్ట్రంలోని 8 జిల్లాల్లో వర్షాభావం తీవ్రంగా ఉంది. గత వారం రోజులుగా తెలంగాణలో సాధారణ సగటుకన్నా 71 శాతం అధిక వర్షపాతం నమోదైంది. కానీ ఇప్పటికీ కుమురంభీం, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్,పెద్దపల్లి జిల్లాల్లో 21 నుంచి 35 శాతం దాకా వర్షపాతం లోటు ఉంది. లోటు 20 శాతంకన్నా అధికంగా ఉంటేనే తీవ్ర వర్షాభావం కింద పరిగణిస్తారు. వాస్తవానికి ఒకటి నుంచి 20 శాతం లోటు మరో 11 జిల్లాల్లో ఉన్నా వాటిని సాధారణ వర్షపాతమున్న జిల్లాల్లోనే చూపుతున్నారు. నికరంగా 100 శాతం సాధారణ వర్షం కురిసిన జిల్లాలు 12 మాత్రమే. గత జూన్ ఒకటి నుంచి ఇప్పటివరకు రాష్ట్ర సాధారణ సగటు వర్షపాతం 568.3 మిల్లీమీటర్ల(మి.మీ.)కు గాను బుధవారానికి 521.3 మి.మీ.లు కురిసింది.

వరి నాట్లు 71 శాతం...

గత వారం రోజులుగా జోరుగా వానలు పడుతున్నందున వరి నాట్లు పుంజుకున్నాయి. ఈ సీజన్‌లో ఈ పంట మొత్తం సాధారణ సాగు విస్తీర్ణం 9.34 లక్షల హెక్టార్లలో 71 శాతం వరకు నాట్లు పడ్డాయి. గతేడాది ఇదే సమయానికన్నా కొంతమేర పెరిగాయి. మొత్తమ్మీద అన్ని పంటల సాగు సాధారణ విస్తీర్ణంలో 86 శాతానికి చేరింది. గత నెల, ఈ నెలారంభంలో వర్షాలు లేక వరి నాట్లు ఆలస్యంగా పడుతున్నాయి. పప్పుధాన్యాల పంటల సాగు 87 శాతం, ఆహార ధాన్యాలు 79, నూనెగింజల పంటల సాగు 63 శాతానికి చేరింది. అన్నింటికన్నా రికార్డుస్థాయిలో పత్తి సాగు 111 శాతానికి పెరిగింది. పప్పుధాన్యాలు, నూనెగింజల్లో తగ్గిన విస్తీర్ణంలో పత్తి వేశారని అంచనా. రాష్ట్రంలో పత్తి తప్ప మరే పంట కూడా ఈ సీజన్‌లో సాధారణ విస్తీర్ణం వందశాతాన్ని దాటకపోవడం గమనార్హం. వర్షాలు కొనసాగితే వరి వందశాతానికి వస్తుంది. జిల్లాల వారీగా చూస్తే వరంగల్ అర్బన్, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి జిల్లాల్లో మాత్రమే వంద శాతం విస్తీర్ణంలో పంటలు సాగయ్యాయి. అతి తక్కువగా జగిత్యాల జిల్లాలో 69 శాతం విస్తీర్ణంలోనే విత్తనాలు, నాట్లు వేశారు. వచ్చే నెల 3 వరకు తెలంగాణలో ఒక మాదిరిగా, అక్కడక్కడ భారీ వర్షాలు పడే వర్షాలు పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవనాలు సాధారణంగా ఉన్నాయి.

రాష్ట్రంలో పంటల సాగు (లక్షల హెక్టార్లు)

పంట	ఇప్పటికి వేయాల్సింది	సాగైంది
వరి	5.67	6.67
పత్తి	16.76	18.61
మొక్కజొన్న	5.28	4.51
కంది	2.78	2.48
పెసర	1.10	0.89
సోయా	2.32	1.65
పసుపు	0.47	0.45
జొన్న	0.59	0.42

రైతుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటం: రావుల

ఈనాడు, హైదరాబాద్: తెరాస ప్రభుత్వం రైతుల జీవితాలతో చెలగాటమాడే ప్రక్రియకు తెరతీసిందని తెలుగుదేశం పొలిట్‌బ్యూరో సభ్యుడు రావుల చంద్రశేఖరరెడ్డి ఆరోపించారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసే రైతు సమన్వయ సమితిలో తెరాస కార్యకర్తలే ఉంటారన్నారు. రాజ్యాంగం ద్వారా రైతులకు వచ్చిన ఆస్తి హక్కును తెరాస కార్యకర్తలు నిర్ణయించబోతున్నారని, మళ్లీ పటేల్, పట్వారీ వ్యవస్థ వస్తుందనే భయం రైతుల్లో ఉందని ఆయన తెలిపారు. తెరాస కార్యకర్తలను ఈ సమితిలో నియమించడానికి జిల్లాకో ఇంఛార్జి మంత్రిని నియమించారని, ఇది రాజ్యాంగ ప్రక్రియను ఉల్లంఘించడమేనని రావుల అన్నారు. రైతు సమన్వయ సమితి రావడం వల్ల గ్రామాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ సభ్యుల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతుందన్నారు. వివాదాల్లో ఉన్న భూముల జోలికి వెళ్లవద్దని జీఓ నెం.39లో తెలిపారని, వివాదం అనే అంశాన్ని సమితి నిర్ణయిస్తే ఎలా అని ప్రశ్నించారు. దీనిని అందరూ వ్యతిరేకించాలని ఆయన సూచించారు.

విద్యుత్తు తాత్కాలిక ఉద్యోగుల వేతనాలు ఖరారు

తెలంగాణ విద్యుత్తు సంస్థల్లోకి విలీన విధానంలో తీసుకున్న పొరుగు సేవల ఉద్యోగులకిచ్చే వేతనాలను ఖరారు చేస్తూ ట్రాన్స్‌కో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉద్యోగాలను ఆర్టిసన్ 1, 2, 3, 4 అని 4 రకాలుగా పిలుస్తారు. ఆర్టిసన్-1 ఉద్యోగికి రూ.23 వేలు మొత్తం కాగా నికరంగా రూ.20,118 చేతికి వస్తుంది. ఇలాగే ఆర్టిసన్-2కు రూ.19 వేలకు రూ.16,634, ఆర్టిసన్-3కి రూ.16 వేలకు రూ.13,984, ఆర్టిసన్-4కు రూ.14 వేలకు రూ.12,217 వేతనమివ్వాలని ట్రాన్స్‌కో ఆదేశించింది. దీంతోపాటు ఇక నుంచి పొరుగు సేవల విధానంలో ఉద్యోగులను తీసుకోవద్దని తెలిపింది.

'ప్రైవేట్' రుసుముల వెబ్‌సైట్ వచ్చింది

ఈనాడు, హైదరాబాద్: ప్రైవేట్ పాఠశాలల ఆదాయ, వ్యయాలు పరిశీలించాలి....ఆ తర్వాతే రుసుముల నియంత్రణపై తుది నివేదిక ఇస్తాం....అందుకు వెబ్ పోర్టల్ రూపకల్పన చేస్తున్నాం...అని చెబుతూ వస్తున్న ఆచార్య తిరుపతిరావు కమిటీ ఎట్టకేలకు దాన్ని అందుబాటులోకి తెచ్చింది. ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు 2015-16, 2016-17 విద్యాసంవత్సరంలో ఆదాయ, వ్యయాలు, ఈ విద్యా సంవత్సరం వసూలు చేస్తున్న రుసుముల వివరాలను సెప్టెంబరు 15వ తేదీలోపు వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. ఈ మేరకు యాజమాన్యాలకు తెలియజేసి వివరాలను సమర్పించేలా చూడాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ జి.కిషన్ ఆయా డీఈఓలకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఐబీ, కేంబ్రిడ్జి తదితర బోర్డులకు అనుబంధంగా ఉన్న పాఠశాలలు కూడా వివరాలను సమర్పించాలి. కొత్తగా రూపొందించిన www.cdse.telangana.gov.in వెబ్‌పోర్టల్‌లో వివరాలను అప్‌లోడ్ చేయాలి.

పార్లమెంటరీ నేతగా నన్ను తొలగించడం పార్టీ నిబంధనావళికి విరుద్ధం: శరద్‌యాదవ్

దిల్లీ: రాజ్యసభలో పార్టీ పార్లమెంటరీ నేతగా జేడీయూ తనను తొలగించే నిర్ణయం తీసుకోవడాన్ని ఆ పార్టీ అసమ్మతి నాయకుడు శరద్‌యాదవ్ ప్రశ్నించారు. తనను తొలగించడం పార్టీ నిబంధనావళికి విరుద్ధమని ఆయన మండిపడ్డారు. పార్టీ పార్లమెంటరీ నేతగా యాదవ్ తొలగింపునకు సంబంధించిన లేఖ లోక్‌సభ సభ్యుడు కౌశలేంద్ర కుమార్ ఆగస్టు 11న ఆయనకు పంపారు. ఆ లేఖను ఖండిస్తూ బుధవారం శరదయాదవ్ ప్రకటన విడుదల చేశారు. ఆ ప్రకటన ప్రతిని రాజ్యసభ ఛైర్మన్ ఎం.వెంకయ్యనాయుడికి, జేడీయూ అధినేత నితీశ్‌కుమార్‌కు పంపారు. తొలగింపు పట్ల నీతీశ్‌పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డ యాదవ్, పార్టీ మెజారిటీ సభ్యులు తనతో ఉన్నారని, పార్టీ గుర్తు తమకే ఇవ్వాలని కోరుతూ ఇప్పటికే ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించినట్లు ఆ లేఖలో పేర్కొన్నారు.

28 ఏళ్లకే హృద్రోగ ముప్పు

- తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న గుండె జబ్బులు
- శస్త్ర చికిత్సలైన వారిలో 87% మంది పురుషులే
- ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ లోకేశ్వరరావు వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: తెలుగు రాష్ట్రాల్లో హృద్రోగ ముప్పు పెరుగుతోందని ప్రముఖ కార్డియాక్ సర్జన్ డాక్టర్ లోకేశ్వరరావు సజ్జ పేర్కొన్నారు. గుండె జబ్బులు ఎదుర్కొంటున్నవారి సరాసరి వయసు 58 సంవత్సరాలు కాగా, కనీస వయసు 28 ఏళ్లు ఉండటం ఆందోళనకర పరిణామమన్నారు. రెండు దశాబ్దాల్లో తన బృందంతో కలిసి దాదాపు 11,697 బైపాస్ సర్జరీలు చేసిన ఆయన, ఆ వివరాలతో అధ్యయన నివేదికను రూపొందించారు. దీనిని ఇటీవల అమెరికాలో నిర్వహించిన అంతర్జాతీయ కరోనరీ కాంగ్రెస్ (ఐసీసీ)లో సమర్పించారు. ప్రముఖ సైన్స్ జర్నల్ 'సర్క్యులేషన్'లోనూ ఈ వివరాలు ప్రచురితం కానున్నాయి. బుధవారం బంజారాహిల్స్‌లోని స్టార్ ఆసుపత్రిలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు.

- ★ మారుతున్న ఆహారపు అలవాట్లు, ఒత్తిళ్లు, మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం, శారీరక వ్యాయామం లేకపోవడం తదితర కారణాలు హృద్రోగాలకు ప్రధాన కారణమవుతున్నాయి. గ్రామాలూ ఇందుకు అతీతం కాదు.
- ★ ఇప్పటివరకు ఆయన మొత్తం 11,697 బైపాస్ సర్జరీలు చేయగా, ఇందులో పురుషులు 87%. ఈస్ట్రోజన్ హార్మోన్ వల్ల మహిళల్లో ఈ ముప్పు తక్కువగా ఉంటోంది. అయితే, మెనోపాజ్ తర్వాత ఈస్ట్రోజన్ స్థాయి తగ్గి, పురుషులతో సమానంగా మగువలు గుండె జబ్బుల బారిన పడుతున్నారు.



- ★ బైపాస్ చికిత్సలు చేయించుకున్న వారిలో 40% మంది మధుమేహం, 10% మంది మూత్రపిండాల వైఫల్య రోగులు, మరో 20% ఊబకాయం, 20% అధిక రక్తపోటు, 10% మంది వంశపారంపర్యంగా గుండె జబ్బులు వస్తున్నవారు ఉన్నారు.

అమెరికా తర్వాత మనమే...

గతేడాది ప్రపంచ వ్యాప్తంగా 16 లక్షల బైపాస్ సర్జరీలు జరగ్గా.. అందులో అత్యధికంగా అమెరికాలో 1.80 లక్షల చికిత్సలు నిర్వహించగా, 1.40 లక్షల శస్త్రచికిత్సలతో భారత్ రెండో స్థానాన్ని ఆక్రమించినట్లు లోకేశ్వరరావు తెలిపారు. వీటిలో హైదరాబాద్‌లో జరిగినవి కూడా ఉన్నాయన్నారు. వైఫల్యాల రేటు కేవలం 0.78 శాతంగానే ఉందన్నారు. "పాశ్చాత్య దేశాలవారితో పోల్చితే మనవారిలో ధమనులు సన్నగా ఉంటాయి. గుండె పరీక్షలు చేయించుకోవడమూ మన దగ్గర తక్కువే. వ్యాధి ముదిరిన తర్వాతే చాలామంది వైద్యం కోసం వస్తుంటారు. అయినా 99% శస్త్రచికిత్సలు విజయవంతం కావడం విశేషం" అని ఆయన పేర్కొన్నారు. విదేశాల్లో బైపాస్ సర్జరీల విషయంలో మన వైద్యుల మార్గదర్శకాలను అనుసరిస్తుండటం గర్వకారణమన్నారు. ఆన్-పంప్, ఆఫ్-పంప్ విధానాలు రెండూ మంచి ఫలితాలను ఇస్తున్నాయన్నారు.

స్వైన్‌ఫ్లూతో ఒకరి మృతి

గాంధీ ఆసుపత్రి(హైదరాబాద్), న్యూస్‌టుడే: గాంధీ ఆసుపత్రిలో స్వైన్‌ఫ్లూతో ఒకరు మృతి చెందారు. హైదరాబాద్ చిలకలగూడకు చెందిన వ్యక్తి(65) ఈ నెల 28న స్వైన్‌ఫ్లూతో గాంధీ ఆసుపత్రిలో చేరారు. డిజాస్టర్ వార్డులో చికిత్స పొందుతున్న ఆయన మంగళవారం రాత్రి మృతి చెందారు. ఈ మృతితో ఈ ఏడాది ఇప్పటివరకు ఆసుపత్రిలో స్వైన్‌ఫ్లూకు చికిత్స పొందుతూ మరణించిన వారి సంఖ్య 33కు చేరింది. ఆసుపత్రిలో ప్రస్తుతం ఏడుగురు చికిత్స పొందుతుండగా, మరో ఐదుగురు వ్యాధి అనుమానితులుగా వైద్యసేవలు తీసుకుంటున్నారు.

బంగ్లాదేశ్‌లోకి 18,000 మంది రోహింగ్యాల ప్రవేశం

కోక్స్ బజార్: మయన్మార్‌లో తాజాగా ఘర్షణలు చెలరేగడంతో దాదాపు 18,000 మంది రోహింగ్యా ముస్లింలు బంగ్లాదేశ్‌లోకి ప్రవేశించినట్లు అంతర్జాతీయ వలసల సంస్థ (ఐవోఎం) తెలిపింది. మరోవైపు వేల మంది వలసదారులు రెండు దేశాల సరిహద్దుల మధ్య ఉండిపోయినట్లు పేర్కొంది. కోక్స్‌బజార్‌లోని ఐవోఎం అధికార ప్రతినిధి సంజుక్త సహానీ ఈ విషయంపై మాట్లాడారు. రోహింగ్యా ఉగ్రవాదుల దాడులకు ప్రతిగా మయన్మార్ సైన్యం కూడా దాడులు చేపడుతోందని పేర్కొన్నారు. ఘర్షణలు, ఇళ్లకు నిప్పుపెట్టడం, పౌరులపై కాల్పులు తదితర ఘటనలకు రోహింగ్యాలే కారణమని మయన్మార్ ప్రభుత్వం ఆరోపిస్తుంది.

వసుంధర

అలసటకు గంధంపూత!



రాత్రిపూట పుట్టినరోజు వేడుకలకు, వివాహాలకు వెళ్లినప్పుడు కొన్ని సార్లు ఆలస్యమవుతుంది. ఆ ప్రభావం మర్నాటి దినచర్యపై పడుతుంది. ముఖం కూడా నిర్జీవంగా మారుతుంది. అలసటా తప్పదు. అటువంటప్పుడు కొన్ని చిట్కాలు పాటించి చూడండి.


- చందనం, రోజ్‌వాటర్ కలిపి ముఖానికి రాసుకొని ఇరవై నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయండి. దానివల్ల చర్మం తాజాగా కనబడుతుంది.
- గోరువెచ్చని నీటితో స్నానం చెయ్యడం వల్ల శరీరం ఉత్తేజంగా మారుతుంది.
- విందులో బిర్యానీ వంటి మసాలా పదార్థాలు ఎక్కువగా తినడం వల్ల డీహైడ్రేషన్ సమస్య ఎదురవుతుంది. అందుకే నిద్రలేవగానే కాస్త ఎక్కువగా మంచినీరు తాగండి. గ్రీన్‌టీ, కొబ్బరినీళ్లు తాగినా అవి మీకు కొత్త ఉత్సాహాన్నిస్తాయి.
- కంటికింద కాస్త ఉబ్బినట్టుగా అనిపిస్తే ఐసు ముక్కతో రుద్ది చూడండి. సత్వర ఫలితం ఉంటుంది. లేదంటే గ్రీన్‌టీ బ్యాగును ఫ్రీజర్‌లో ఉంచి దాన్ని కళ్లపై ఇరవై నిమిషాలు ఉంచితే కళ్లు మామూలు స్థితికి వస్తాయి.
- అల్పాహారంలో కాస్త తేలికపాటి పదార్థాలకు ప్రాధాన్యం ఇవ్వాలి. వీలైతే ఒకపూటకి కేవలం పండ్లు మాత్రమే తినగలిగితే మరీ మంచిది.
- బద్ధకాన్ని వదిలించుకోవాలంటే మీకు బాగా నచ్చిన రంగు డ్రెస్ వేసుకొని చూడండి. తెలీకుండానే మీ బద్ధకం వదిలిపోతుంది.

సిగ సింగారం

వల జడ... వయ్యారం!



ఒత్తుగా ఉన్న జుట్టుతో ఏదైనా కొత్తగా అల్లుకుంటే ఆ అందమే వేరు. అందుకే ఈసారి జుట్టును వదిలేస్తూనే వలలాంటి జడను ప్రయత్నిద్దాం.



1. తల ముందువైపు నుంచి కొంత జుట్టు తీసుకుని రబ్బరుబ్యాండు పెట్టుకుని చిన్న పోనీటెయిల్‌గా వేసుకోవాలి. ఇప్పుడు ఎడమవైపు చెవిపక్క నుంచి సన్నగా మూడు పాయలు తీసుకొని రెండు వరుసలు అల్లుకోవాలి.



2. పోనీటెయిల్‌ని రెండుభాగాలుగా చేసుకుని రెండోభాగం జుట్టులోంచి ఒక సన్నటి పాయను ఈ జడకు కలిపి అల్లాలి. ఇదేవిధంగా ఆ భాగం పూర్తయ్యేవరకూ పాయల్ని అల్లుకుంటూ వెళ్లి బ్యాండు పెట్టుకోవాలి.




3. ఆ జడను పైకెత్తి క్లిప్ పెట్టాలి. లేదంటే రెండోవైపు జుట్టు తీసుకోవడం కష్టమవుతుంది.



4. ఇప్పుడు తల కుడివైపు నుంచి మూడు సన్నని పాయలు తీసుకుని రెండు వరుసలు అల్లుకోవాలి. ఇందాకటిలానే పోనీటెయిల్‌లో మిగిలిన రెండో భాగం నుంచీ ఒక్కో సన్నని పాయ తీసుకుంటూ ఆ జడకు కలుపుతూ వచ్చి చివరగా రబ్బరుబ్యాండు పెట్టుకోవాలి. తరవాత క్లిప్‌పెట్టిన జడను కిందకు వదిలేస్తే చాలు.

ఈ అలంకరణకి సంబంధించిన వీడియోను www.eenadu.net లోని వసుంధర విభాగంలో చూడొచ్చు.



కేతా శోభారాణి
కేశాలంకరణ నిపుణురాలు

email: vasundhara@eenadu.net



ప్రభుత్వ పాఠశాలలంటే మనకి చిన్న చూపు. దానికి తగ్గట్టుగా పిల్లలు లేక... ఉపాధ్యాయులు సరిపడక మూసేస్తున్న ప్రభుత్వ పాఠశాలలూ ఎక్కువే. కానీ రెండువేల మంది చదివే ఆ ప్రభుత్వ బడిలో మాత్రం ఒక్క సీటు దొరికితే బాగుండును అనుకుంటారంతా! ఒకప్పుడు 200 మంది మాత్రమే ఉండే ఆ స్కూల్ సామర్థ్యం ఇంతగా పెరగడానికి కారణం స్వాతి నన్నపనేని చేసిన కృషి. ఆ ఒక్క బడే కాదు... కొత్తూరు, గుంటూరులోని నాట్కో స్కూళ్లు కూడా ఆమె చేతుల్లో తీర్చిదిద్దుకున్నవే...

‘మనం కాకపోతే ఎవరు చేస్తారు?’

‘తాతముత్తాలు సంపాదించింది నీకొస్తుందని ధీమాగా ఉండకు.. నీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుకోవడానికి ఇప్పుడు నువ్వెంత శ్రమ పడుతున్నావో చివరి వరకూ నీకు తోడుగా ఉండేది ఆ వ్యక్తిత్వమే...’ అనేవారు నాన్న. ఆంధ్ర విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్‌గా పనిచేసిన వీఎస్ కృష్ణ మా తాతగారు. నాన్న రిషీవ్యాలీలో చదువుకున్నారు. నేనూ అక్కడే చదువుకున్నా. నాన్న అందించిన విలువలకి నా చదువు మరింత నిండుదనం తెచ్చింది. ఇంటర్ వరకూ రిషీవ్యాలీలోనే చదువుకున్నా. తర్వాత వైజాగ్ వచ్చి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆంగ్ల సాహిత్యం చదువుకున్నా. యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ నుంచి అమెరికాలో స్థిరపడ్డ ఆఫ్రికా బానిస స్త్రీలు రాసిన ఆంగ్ల సాహిత్యంపై ఎంఫిల్ చేశాను. దాంతో సాహిత్యం కొందరి సొత్తేనేమో అన్న అపోహ నాలో తొలగిపోయింది. బానిస స్త్రీల్లోనూ ప్రశ్నించే శక్తి ఉండటం నాకు ఆశ్చర్యం కలిగించింది. దాంతో ఇంకా తెలుసుకోవాలన్న ఆసక్తితో ఇదే అంశంపై ఆక్స్‌ఫర్డ్‌లోనూ చదువుకున్నా. అక్కడ నుంచి వచ్చి ప్రఖ్యాత ఓరియంట్ లాంగ్‌మెన్(ప్రస్తుతం బ్లాక్‌స్వాన్) ప్రచురణ సంస్థలో పిల్లల పుస్తకాల విభాగానికి ఎడిటర్‌గా మూడేళ్లు పనిచేశాను. ఈ సంస్థలో ఉన్నప్పుడు పిల్లలూ, సాహిత్యం వంటివాటిపై నాకు లోతైన అవగాహన ఏర్పడింది. డెస్క్ దగ్గర కూర్చోవడం కాకుండా మేమందించే కథలూ, సాహిత్యం పిల్లలని ఏ మేరకు ప్రభావితం చేస్తున్నాయి... వంటి విషయాలపై దృష్టిపెట్టాను. అప్పటికే నాకు పెళ్లయ్యింది. అదే సమయంలో మా మామగారు వెంకయ్య చౌదరిగారు నిర్వహించే నాట్కో ఔషధ సంస్థ క్యాన్సర్ మందుల తయారీలో దూసుకుపోతోంది. వేలాది మంది ఉద్యోగులు మా సంస్థలో పనిచేస్తున్నారు. ‘నువ్వు మన సంస్థ ఉద్యోగుల బాగోగుల కోసం ఏదైనా చేయొచ్చుగా’ అని అడిగారాయన. అలా 2007లో నాట్కోట్రస్ట్‌కి ప్రాజెక్టు మేనేజర్‌గా అడుగుపెట్టాను. సంస్థ తరపున సామాజిక బాధ్యతా కార్యక్రమాలని నేను చేయడం మొదలుపెట్టా. మా సంస్థ ప్రచురించే ‘స్పందన’ అనే పత్రికకు ఎడిటర్‌గా బాధ్యతలు తీసుకున్నాను. మా ఫ్యాక్టరీ మహబూబ్‌నగర్‌లోని కొత్తూరు అనే ఊళ్లో ఉండేది. మా సంస్థ నిర్వహిస్తున్న స్కూల్‌తోపాటూ చుట్టుపక్కల ఉన్న బడులూ, గ్రామాలని గమనించడం మొదలుపెట్టాను. ముందు మా బడిపై దృష్టిపెట్టాను. బట్టీ కొట్టడం కాకుండా... టీచర్ లేకుండా వాళ్లంతట వాళ్లు సొంతంగా ఆలోచించగలుగుతున్నారా లేదా అని తెలుసుకున్నా. పరిసరాల నుంచి సొంతంగా విజ్ఞానాన్ని సాధించుకోవడం ఎలా అనేది వాళ్లకు నేర్పించాను. ఆ బళ్లో ఉన్నవాళ్లంతా గిరిజన పిల్లలు. వారిని దృష్టిలో పెట్టుకుని సిలబస్‌లో మార్పులు చేసి నయా తరహా విద్యా విధానాన్ని పరిచయం చేశాను. ఐఐటీల నుంచి నిపుణులను తీసుకొచ్చి... సైన్స్, లెక్కల్లో పిల్లల్లో ఉండే సహజమైన నైపుణ్యాలు వెలికి తీసేందుకు వీలుగా ‘బటర్‌ఫ్లై ఫీల్డ్స్’ అనే కార్యక్రమం నిర్వహించా. సైన్స్ పాఠాలను సులువైన ప్రయోగాలతో నేర్పించే విధానం అది. పిల్లలూ, వారి తల్లిదండ్రుల్లో కూడా మార్పు కనిపించింది. ఒకాయనకి ముగ్గురు ఆడపిల్లలు. మొదటి ఆడపిల్లని బడిలో చేర్పించడానికి చాలా బాధపడ్డాడు. అవకాశం వస్తే చాలు ఆమెని బడి మాన్పించడానికి సిద్ధమయ్యేవాడు. అలాంటిది ఇప్పుడు ఆ ముగ్గురు ఆడపిల్లలు చైనాలో ఎంబీబీఎస్ చదువుతున్నారు. ఆ స్కూల్లో మొదట్లో ఎనిమిది వందల మంది వరకూ మాత్రమే చదివారు. ప్రస్తుతం రెండువేల మంది విద్యార్థులున్నారు. ఇందులో ప్రతిభ ఉండి ఆర్థికస్థోమత లేని పిల్లలకు మా సంస్థ నుంచి ఉపకారవేతనాలు అందుతాయి. ఈ స్కూల్ నుంచి వచ్చిన అనేక మంది పిల్లలు ఇప్పుడు ఇంజినీరింగ్, వైద్య విద్యల్లో రాణిస్తున్నారు. విదేశాల్లో చదవాలనుకునేవారికి మేం ఉపకారవేతనాలు అందిస్తున్నాం. ఈ బడి విజయవంతం కావడంతో గుంటూరులోని గోళ్లముడిపాడులో కూడా నాట్కో స్కూల్‌ని ప్రారంభించా.

> **మా స్కూలుకు వచ్చే పిల్లల తల్లులకు కూడా... కంప్యూటరు, డ్రైవింగ్, టైలరింగ్ తరగతుల్లో శిక్షణ ఇస్తున్నాం.**

వాటిల్లో ధాన్యం నింపేవారు...

అక్కడికి దగ్గర్లో పెద్దఊర మండలం అనే గ్రామం ఉంది. అక్కడ ఒక్క ఇంటికి కూడా మరుగుదొడ్డు లేదు. చొరవ తీసుకుని ఏదైనా చేద్దాం అనుకున్నా. ప్రభుత్వంతో కలిసి 200 మరుగుదొడ్లని కట్టించాం. అంతటితో పనయిపోయింది అనుకుంటున్నారా... అక్కడే ఎదురయ్యింది పెద్ద సవాల్. మరుగుదొడ్లని నిర్మించడం కాదు... వాటిని సద్వినియోగం చేసుకునేలా చేయడమే నా ముందున్న సవాలు. చాలామంది వాడకుండా వాటిల్లో ధాన్యం పోసి తాళం వేసుకునేవారు. వారిలో మార్పు తీసుకురావడానికే నాకు బోలెడు సమయం పట్టింది. ఆ తర్వాత హైదరాబాద్‌లోని బోరబండ ప్రభుత్వ స్కూల్‌ని దత్తత తీసుకున్నా. పక్కా స్కూల్‌ని కట్టించా. ముఖ్యంగా అక్కడికి వచ్చే పిల్లల తల్లులు కూడా ఏదో ఒక ఉపాధినిచ్చే పనిని నేర్చుకునేలా చేశాను. పిల్లలను దింపేసిన తర్వాత కంప్యూటర్, డేటా ఎంట్రీ, డ్రైవింగ్ తరగతులు, టైలరింగ్ వంటి కోర్సులని వాళ్లు నేర్చుకునేలా అవకాశం కల్పించాను. ఒక్కో అంశంలో 40 మంది వరకూ చేరుతుంటారు. అలా ఇంతవరకూ 32 బ్యాచులకు వివిధ అంశాల్లో శిక్షణ అందేలా చూశాను. ఎందుకు ఇవన్నీ చేస్తున్నారు అంటే నా సమాధానం ఒక్కటే మనం చెయ్యకపోతే ఎవరు చేస్తారు! అని..

> **నిమ్స్ వంటి పెద్ద ఆసుపత్రుల్లో వైద్యం కోసం వచ్చే పేదలకు సాయంగా ఓ ముగ్గురు అమ్మాయిల బృందాన్ని ఏర్పాటు చేశాను. ఆ అమ్మాయిలు వాళ్లకు అవసరమయ్యే సమాచారం తెలియజేస్తారు.**



క్యాన్సర్ పిల్లలకోసం...

చదువు తర్వాత మనందరం దృష్టి పెట్టాల్సిన విషయం ఆరోగ్యం అని నా అభిప్రాయం. నేను గ్రామాల్లో తిరిగేటప్పుడు చాలామంది స్త్రీల్లో పోషకాహారలేమిని గమనించాను. ఆ తర్వాత అదే విషయంపై దృష్టిపెట్టి ఓ నలభై గ్రామాల్లో న్యూట్రిషన్ సెంటర్లను ప్రారంభించా. పోషకాలు అందించే ‘కిచెన్ గార్డెన్ల’ పెంపకం పైనా వారికి అవగాహన కల్పించాను. నిమ్స్ వంటి పెద్ద ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకోవడానికి వెళ్లిన పేదలకు ఏ వైద్యం ఎక్కడ అందుతుందో తెలియక ఇబ్బంది పడుతుంటారు. అలాంటి వారికి సాయం అందించడం కోసం నిలోఫర్, గాంధీ, ఉస్మానియా, సరోజినీ దేవి, ఎమ్ఎన్‌జే ఆసుపత్రుల్లో ఓ ముగ్గురు అమ్మాయిలు ఉండే బృందాలని ఏర్పాటు చేశాను. వీళ్లు ఆసుపత్రికి వివిధ వైద్యసేవలకు సంబంధించిన సమాచారం అందిస్తారు. ఎమ్ఎన్‌జే ఆసుపత్రిలో క్యాన్సర్ బారిన పడిన చిన్నారుల కోసం 40 పడకల గదిని నిర్మించాం. నిలోఫర్ ఆసుపత్రికి ఎక్కడెక్కడో దూరాల నుంచి వస్తుంటారు. కానీ వారందరికీ ఆసుపత్రిలో ఉండేందుకు సదుపాయం ఉండదు కదా! అలాంటి వారి కోసం అవుట్‌పేషెంట్ బిల్డింగ్‌ని కట్టించాం. వీలైనంతమందికి సేవ చేయడమే నా ఆశయం.

– శ్రీసత్యవాణి

మా ఆస్తిపై అతనికి పాస్‌బుక్కా?

డియర్ వసుంధర



జి. వరలక్ష్మి
న్యాయవాది

? నా భర్తకి ఊర్లోని 1.34 సెంట్ల భూమిలో కొంత వాటా ఉంది. ఆ భూమిని మా రెండో మరిది సాగు చేస్తూ.. మావాటిని కౌలుకి ఇచ్చేవాడు. మా మావయ్య చనిపోయాక అతను 1.34లో మా వాటా సహా తనదాంట్లో కలిపేసుకుని తన పేరుమీద పాస్‌బుక్ పుట్టించాడు. 2010లో నా భర్త చనిపోయాడు. అప్పట్నుంచి 1.34 సెంట్ల భూమి మొత్తం తనదేననడం మొదలుపెట్టాడు. ఒకప్పుడు అతని పశువులకి మేత పెట్టుకుంటాననంటే దయతలచి మాకు వేరే చోట ఉన్న భూమిలో కొంత స్థలం ఇచ్చాను. ఇప్పుడు అదీ తన సొంతమంటున్నాడు. ‘మీ ఆయన నుంచి పదిహేను వందల రూపాయలకి కొనేశాను..’ అని చెబుతున్నాడు. కానీ ఏ సాక్ష్యాధారాలూ చూపడం లేదు. అదే ఊర్లో మావారు ఇదివరకు నాలుగు సెంట్ల భూమి కొన్నారు. ఆ 1.34 సెంట్లపై మా మరిది చేస్తున్న అన్యాయాన్ని పెద్ద మనుషుల ముందు ఉంచాను. వాళ్ల అనుమతితో నా వాటా కొలిపించి.. గత ఏడాది నేనే వ్యవసాయం చేశాను. కానీ ఆ వాటాకి సంబంధించి నాకంటూ పాసుపుస్తకం రావాలంటే అతని సంతకం ఉండాలట. మా ఆయన కొన్న నాలుగుసెంట్ల భూమిని తనకి అప్పగిస్తేనే.. ఆ సంతకం పెడతానంటున్నాడు. అవునా! అతని సంతకం ఉంటేనే మా వాటాపై పాసుబుక్ వస్తుందా? - రేణుక, వరంగల్


✔ మీ మరిది మీ భూమిపై హక్కు చలాయించడంపై అప్పట్లోనే అభ్యంతరం చెప్పి ఉంటే.. ఇంతదాకా వచ్చేది కాదు. ఇప్పటికే చాలా ఆలస్యమైంది. మీరు వెంటనే మీ భూమిపై పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకోండి. అప్పుడు దానిపై అధికారులు విచారణ నిర్వహిస్తే.. రికార్డుల్లో తనపేరే ఉందని అతను నిరూపించాల్సి ఉంటుంది. దీనిపై చట్టం ఏం చెబుతుందో చూద్దాం. ‘ఆంధ్రప్రదేశ్ రైట్స్ ఇన్ ల్యాండ్ అండ్ పట్టాదారు పాస్‌బుక్స్ యాక్ట్ 1971’లోని సెక్షన్ 3 ప్రకారం ప్రతిగ్రామంలోని వ్యవసాయ భూముల సొంతదారు(పట్టాదారు, రుణగ్రహీత, స్వాధీనదారు, కౌలుదారు కూడా కావొచ్చు)కి సంబంధించిన ఓ రికార్డు రెవెన్యూ అధికారుల దగ్గర ఉండాలి. దీన్ని ఆర్ఓఆర్ అంటారు. పిత్రార్జితం ద్వారాగానీ లేదా భాగస్వామ్య, వారసత్వం, కోర్టు తీర్పుతోకానీ ఆ ఆస్తి చేతులు మారిందనుకుందాం. అప్పుడు దాన్ని పొందిన వ్యక్తి 90 రోజుల్లోపు ఆర్ఓఆర్‌లో భూమిహక్కుదారుగా తన పేరు రాయలని ఎమ్మార్వోకి విన్నవించుకోవాలి. అప్పుడు అధికారులు అభ్యంతరాలుంటే చెప్పండంటూ సంబంధిత వ్యక్తులకి నోటీసులు పంపి విచారణ చేస్తారు. ఏ సమస్యా లేకపోతేనే ఆర్ఓఆర్‌లో పేర్లు మారుస్తారు. దాన్నే మ్యుటేషన్ అంటారు. ఈ చట్టంలోని సెక్షన్ 6(2) ప్రకారం పట్టాదారు పాసుపుస్తకం, టైటిల్ డీడ్‌కి దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పుడూ అంతే.. నోటీసులు పంపి విచారణ చేసి గానీ వాటిని ఇవ్వరు. ఒకవేళ ఎవరికైనా అభ్యంతరం ఉంటే.. ఆ పట్టా రద్దు కోరుతూ ఆర్డీఓకిగానీ, కలెక్టర్‌కిగానీ దరఖాస్తు చేసుకోవాలి. మీ మరిది భూమికి సంబంధించి పట్టా తీసుకున్నాడంటే ఇవన్నీ జరిగి ఉండాలి. లేదా నకిలీదైనా సృష్టించి ఉండాలి! అందుకే ఇప్పుడు మీరు అతని ప్రమేయం లేకుండా మీ భూమిపై పట్టాదారు పాసుపుస్తకం కోసం దరఖాస్తు చేసుకోండి. అతను అభ్యంతరం వ్యక్తంచేస్తే.. రికార్డుల్లో తనపేరే ఉందని అతను నిరూపించాల్సి ఉంటుంది. ఒకవేళ ఈ వ్యవహారంపై అధికారులు న్యాయస్థానానికి వెళ్లమంటే అలాగే చేయండి. కాకపోతే.. పరిష్కారానికి ఏళ్లూపూళ్లూ పట్టే ప్రమాదముంది. మరేం చేయొచ్చు? ఇలాంటి భూ వ్యవహారాల పరిష్కారానికి కలెక్టర్లూ, ఆర్డీఓలు వారానికోసారి ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తున్నారు. అవి మీకు ఉపయోగపడొచ్చు. అతని దగ్గర ఏ నమ్మదగ్గ రికార్డులూ లేవు కాబట్టి.. మీకు అనుకూలంగానే అధికారులు స్పందించే అవకాశం ఉంది. మీరు అతనికిచ్చిన భూమి విషయంలోనూ ఇంతే. మీరు అతనికి ఇచ్చినట్టు ఏ కాగితం ముక్కా లేకపోతే.. ఇప్పటికీ అది మీ సొంతమే అవుతుంది. దానిపైనా మీరు పాసుపుస్తకం తీసుకోవచ్చు.

పరుగు పెట్టండి మరి !

బరువు తగ్గితే... తీరైన ఆకృతి సొంతం కావడం మాత్రమే కాదు.. శరీరం కూడా చురుగ్గా మారుతుంది. దానికి పరిష్కారం తిండి మానేయడం కాదు. మరి.. వ్యాయామాలతో సన్నగా మారే మార్గాల్ని వెతుక్కోవాలి. అదెలాగంటే..



- నడకకు ఎంత ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే అంత మంచిది. దానివల్ల బరువు తగ్గడంతోపాటూ శరీరం కూడా చురుగ్గా తయారవుతుంది.
- జిమ్‌కు వెళ్లడానికి ఇష్టపడని వారు ‘హిప్ హాప్, ఏరోబిక్స్’’ తరగతుల్లో చేరొచ్చు. కనీసం రోజులో అరగంట సేపు ఆడుతూ పాడుతూనే వ్యాయామం చేయొచ్చు. మీరు కూడా కుదిరినప్పుడల్లా ఇష్టమైన సంగీతాన్ని పెట్టుకుని ఓ అరగంటసేపు డాన్స్ వేసి చూడండి. శరీరంలోని అవయవాలన్నింటికి మంచి వ్యాయామం అందుతుంది.
- టీవీ, కంప్యూటర్ అంటూ.. ఒకేచోట ఎక్కువ సేపు కూర్చోవడానికి ఆసక్తి చూపొద్దు. మధ్యమధ్యలో వ్యాయామాలు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ రోజుల్లో వ్యాయామానికి సంబంధించిన వీడియోలు ఎన్నోరకాలు యూట్యూబ్‌లో ఉంటున్నాయి. వాటిని ఎంచుకుంటే ఇంట్లోనే మనకున్న సమయంలోనే చేయొచ్చు.
- రోజుకు ఏడు నుంచి ఎనిమిది గ్లాసుల మంచినీళ్లు తాగాలి. అలాగే శీతలపానీయాలు కాకుండా... తాజా పండ్లరసాలను ఎంచుకోవాలి. దాని వల్ల కూడా శరీర బరువు అదుపులో ఉంటుంది.



30న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	-------	-------	30,350	30,150
ఆర్నమెంట్	-------	-------	28,300	27,800
వెండి (కిలో)	-------	-------	41,000	40,200
	ప్రొద్దుటూరు		**రాజమండ్రి**	
బంగారం(24క్యా)	30,040	30,036	29,730	29,990
ఆర్నమెంట్	29,130	28,200	28,240	28,490
వెండి (కిలో)	40,800	40,800	40,200	40,400
	విశాఖపట్నం		**తమిళనాడు**	
బంగారం(24క్యా)	30,350	30,430	-------	-------
ఆర్నమెంట్	28,230	28,300	2,824	2,849 గ్రా
వెండి (కిలో)	40,900	40,900	43.00	43.30 గ్రా

అలా దహించుకుపోతుంటే..

విపరీతమైన పని భారం. శ్రమకు తగ్గట్టులేని వేతనం. రోజులతరబడి ఒకే తరహా పని నిరాసక్తంగా చేయడం.. ఇవన్నీ ఉద్యోగిగా మనలో ఓ సమస్యని తెచ్చిపెడతాయి! ‘ఒత్తిడి’ అనుకుంటున్నారా? కాదు.. ఇది అంతకుమించి. ఆంగ్లంలో ‘బర్న్ అవుట్’ అంటారు దీన్ని. ఏమిటీ సమస్య.. ఇందులో నుంచి బయటపడటమెలా? రండి చూద్దాం..



లోపల్లోపలే : ఒకప్పుడు మనకున్న ఉద్విగ్నం, ఉత్సాహం లోపల్లోపల దగ్ధమై బూడిదగా మిగలడమే ఈ బర్న్ అవుట్! కొత్తల్లో మనకెంతో ఉత్సాహంగా అనిపించిన పనినే ఇప్పుడు ‘ఎందుకొచ్చిందిరా దేవుడా!’ అనుకుంటూ చేస్తాం. ప్రతి కొత్త పనినీ విమర్శించి.. కాకుండా చేస్తాం! వీటితోపాటూ కొందరిలో తలనొప్పి, కడుపుబ్బరంలాంటి శారీరక సమస్యలూ ఉండొచ్చు. దీన్నుంచి బయటపడే మార్గాలేంటీ?

లక్ష్యం నిర్దేశించుకోండి : ఉద్యోగంలో మీకంటూ లక్ష్యం ఏర్పరుచుకోండి. దాన్ని సాధించడానికి మీరు వేటికి ప్రాధాన్యం ఇవ్వాలో తెలుసుకోండి. రోజుకోసారైనా ఆ పనులు చేయండి. వారానికో, నెలకోసారో మీ లక్ష్యాన్ని బేరీజు వేసుకోండి.

మీ పట్ల శ్రద్ధ : పని ఎక్కువై రాత్రుల్లో ఆలస్యంగా నిద్రపోయేవారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. ఎన్నిపనులున్నా ఉదయం కాస్త ముందుగానే ప్రారంభించండి. రాత్రిమాత్రం తొందరగా పడుకుని, వేకువనే లేవండి. ఏ పరిస్థితుల్లోనూ ఉదయం అల్పాహారాన్ని మానేయొద్దు. ఈ ఆకలి మనకి తెలియకుండానే పనిలో చికాకు పెంచుతుంది.

పక్కా ప్రణాళిక : ముందురోజు రాత్రే రేపటికి చేయాల్సిన కీలకమైన పనులేమిటో రాసుకోండి. తర్వాతి రోజు వాటికే ప్రాధాన్యం ఇవ్వండి. కార్యాలయానికి రాగానే తొలి 90 నిమిషాలు ఆ పనుల్లో ఒకదాన్ని పూర్తిచేయాలని లక్ష్యం పెట్టుకోండి. ఇలాచేస్తే పనిపట్ల ఆసక్తి ఎప్పుడూ తరిగిపోదు.

సెన్సెక్స్ ▲ 258	నిఫ్టీ ▲ 88	రూపాయి 64.01 ▲	బంగారం 29,915 ▲	వెండి 40,030 ▲	ముడి చమురు 50.85 ▼
31646	9884	(ఒక అమెరికా డాలరుకు) 01 పైసలు	(ముంబయిలో 10 గ్రా. 99.9 స్వచ్ఛత)	ముంబయిలో కిలో	(బ్రెంట్ ధర డాలర్లలో)

ఈనాడు బిజినెస్

ప్రధాన ప్రపంచ మార్కెట్లు

సూచీ	ముగింపు	లాభం/నష్టం
డోజోన్స్	21,912	+47
నాస్‌డాక్	6,370	+69
నిక్కీ 225 (జపాన్)	19,507	+144
స్ట్రెయిట్స్ టైమ్స్ (సింగపూర్)	3,265	+16
షాంఘై(చైనా)	3,363	−02
ఎఫ్‌టీఎస్‌ఈ (బ్రిటన్)	7,365	+28
డాక్స్ (జర్మనీ)	12,002	+51


డోజోన్స్, నాస్‌డాక్ సూచీలు అమెరికా కాలమానం ప్రకారం బుధవారం మధ్యాహ్నం 1.00కు (భారత కాలమానం ప్రకారం రాత్రి 11:30 గంటలకు).

విదేశీ మారకపు రేట్లు

(థామస్ కుక్) (రూ.లలో)

కరెన్సీ	కొనుగోలు	అమ్మకం
అమెరికా డాలరు	58.18	67.47
పౌండ్ స్టెర్లింగ్	75.24	87.26
యూరో	69.71	80.85
జపనీస్ యెన్/100	53.01	61.47
ఆస్ట్రేలియా డాలరు	46.49	53.79
సింగపూర్ డాలరు	42.95	50.87
థాయ్ బాత్/100	175.22	209.55
బహ్రెయిన్ దీనార్	157.37	180.58
కువైట్ దీనార్	175.54	218.60
సౌదీ రియాల్	15.75	18.68
యూఏఈ దిర్హమ్	15.80	18.51
మలేషియా రింగిట్	13.34	16.40
చైనీస్ యువాన్	6.88	11.15





బుధవారం నిఫ్టీ కదలికలు



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కాజుతోషి ఒయామా, పి.వి.సింధు, బ్రిడ్జ్‌స్టోన్ ఏషియా పసిఫిక్ పీటీఈ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ఫ్రాంకో అనున్‌జియాటో, బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా చీఫ్ జనరల్ మేనేజర్ వైభవ్ సరాఫ్.

బ్రిడ్జ్‌స్టోన్‌కు సింధు ప్రచారం

- మూడేళ్ల ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి.సింధును ప్రచారకర్తగా టైర్ల తయారీ కంపెనీ బ్రిడ్జ్‌స్టోన్ నియమించుకుంది. బ్రిడ్జ్‌స్టోన్‌కు సింధు తొలి స్థానిక ప్రచారకర్తని బ్రిడ్జ్‌స్టోన్ ఇండియా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కాజుతోషి ఒయామా తెలిపారు. 2016 రియోలో జరిగిన ఒలింపిక్స్‌లో సింధు రజత పతకాన్ని కైవశం చేసుకుంది. ఇటీవల జరిగిన ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లోనూ రజత పతకాన్ని దక్కించుకుంది. కంపెనీతో కుదిరిన ఒప్పందం ప్రకారం బ్రిడ్జ్‌స్టోన్‌కు సింధు మూడేళ్లు ప్రచారం చేస్తారు. ప్రపంచ వ్యాప్త ఒలింపిక్ భాగస్వామిగా బ్రిడ్జ్‌స్టోన్ ఉంది. సింధు విజయాలు యువతకు స్ఫూర్తిదాయకమని, కలలు తీరే వరకు కష్టపడాలన్న (ఛేజ్ ద డ్రీమ్) సందేశాన్ని ఇస్తున్నారని బ్రిడ్జ్‌స్టోన్ ఏషియా పసిఫిక్ పీటీఈ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, సీఈఓ ఫ్రాంకో అనున్‌జియాటో అన్నారు. ఆమెలోని విజయం సాధించాలనే శైలి తమ కంపెనీ విధానానికి సరిగ్గా సరిపోతుందన్నారు. ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ.. భారత్‌లో తొలి ప్రచారకర్తగా బ్రిడ్జ్‌స్టోన్ తనను నియమించడం ఆనందం కలిగిస్తోందని, దీన్ని తాను ఒక గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. భారత్ ప్రజలు తన నుంచి మరిన్ని విజయాలను కోరుకుంటున్నారని, మరింత బాగా ఆడేందుకు శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. తన ప్రయాణం ఇప్పుడే ప్రారంభమైందని, ఇంకా ప్రయాణించాల్సింది చాలా ఉందని వ్యాఖ్యానించారు.

మళ్లీ లాభాల్లోకి..

- బలంగా పుంజుకున్న సెన్సెక్స్ - కలిసొచ్చిన జీఎస్‌టీ వసూళ్లు

సమీక్ష

సూచీలు గోడక్కొట్టిన బంతిలా బలంగా పుంజుకున్నాయి. ఉత్తర కొరియా క్షిపణి పరీక్షలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలతో అంతర్జాతీయ మార్కెట్లు కళకళలాడాయి. దీంతో నిఫ్టీ తిరిగి 9800 పాయింట్ల ఎగువకు చేరింది. జులైలో జీఎస్‌టీ వసూళ్లు రూ.92,282 కోట్లుగా నమోదు కావడం సెంటిమెంట్‌పై సానుకూల ప్రభావం చూపింది. ఆగస్టు డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగింపు నేపథ్యంలో మదుపర్లు షార్ట్ పొజిషన్లను కవర్‌చేయడం సైతం కలిసొచ్చింది. లోహ, ఆర్థిక రంగ షేర్లు రాణించాయి. జేఎస్‌డబ్ల్యూ స్టీల్, జిందాల్ స్టీల్, హిందుస్థాన్ జింక్, హిందాల్కో, ఎన్‌ఎమ్‌డీసీ, వేదాంతా, నాల్కో, కోల్ ఇండియా, టాటా స్టీల్, సెయిల్ షేర్లు 4.82 శాతం వరకు లాభాలు నమోదు చేశాయి. మార్కెట్ల పరుగులతో బీఎస్‌ఈలో మదుపర్ల సంపద రూ.1,54,494 కోట్లు పెరిగింది.

సెన్సెక్స్ ఉదయం 31,534.57 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమైంది. ఆద్యంతం అదే జోరు కొనసాగించిన



సూచీ.. ఒకానొకదశలో 31,727.98 పాయింట్ల వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని తాకింది. చివరకు 258.07 పాయింట్లు పెరిగి 31,646.46 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇక ఇంట్రాడేలో 9900 పాయింట్ల ఎగువకు చేరిన నిఫ్టీ.. అనంతరం లాభాల స్వీకరణ ఎదురైంది. ఫలితంగా 88.35 పాయింట్ల లాభంతో 9,884.40 దగ్గర ముగిసింది.

సెన్సెక్స్ 30 షేర్లలో 24 లాభాలతో ముగిశాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.12%, అదానీ పోర్ట్స్ 1.94%, హెచ్‌డీఎఫ్‌సీ 1.83%, కోల్ ఇండియా 1.39%, టాటా స్టీల్ 1.35%, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.24%, హిందుస్థాన్ యునిలీవర్ 0.97%, హీరో మోటోకార్ప్ 0.97%, ఓఎన్‌జీసీ 0.86%, ఎల్ అండ్ టీ 0.86%లు రాణించిన వాటిలో ఉన్నాయి. ఎం అండ్ ఎం (1.28%), ఎన్‌టీపీసీ (0.30%), సిప్లా (0.19%) చొప్పున నష్టాలను చవిచూశాయి. రంగాల వారీగా చూస్తే బీఎస్‌ఈ లోహ సూచీ 2.64 శాతం పెరిగింది. చమురు- గ్యాస్, స్థిరాస్తి, పీఎస్‌యూ రంగాలు సైతం అదే బాటలో నడిచాయి.

లావాదేవీలపై వరదల ప్రభావం

దేశ ఆర్థిక రాజధాని ముంబయిను వరదలు ముంచెత్తడం, ట్రేడింగ్ కార్యాకలాపాలపై స్వల్ప ప్రభావం చూపింది. ఎక్కువ మంది ఉద్యోగులు ఇళ్లకే పరిమితం కావడంతో ట్రేడింగ్ పరిమాణం తగ్గింది. బీఎస్‌ఈ, ఎన్‌ఎస్‌ఈలకు చెందిన వందలాది ఉద్యోగులు మంగళవారం ఇళ్లకు వెళ్లే అవకాశం లేకపోవడంతో.. కార్యాలయాల్లోనే గడిపారు. బుధవారం వారు పనిచేసేందుకు వీలుగా ఎక్స్ఛేంజీలు వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాయి. కొంత మందిని సమీప హోటళ్లకు తరలించాయి. ఎక్కువ సంఖ్యలో కార్యాలయాలు మూతపడగా, ఉద్యోగులు ఇళ్ల నుంచే పనిచేయడానికి మొగ్గుచూపారు. అగ్రగామి బ్రోకర్లు సైతం కార్యాలయాలకు సెలవులు ప్రకటించారు.

నేటి మార్కెట్

నేడు సూచీలు స్వల్ప శ్రేణిలో కదలాడొచ్చు. ఆగస్టు డెరివేటివ్ కాంట్రాక్టుల గడువు ముగియనున్న నేపథ్యంలో కొన్ని షేర్లలో హెచ్చుతగ్గులు కనిపించే అవకాశం ఉందని డీలర్లు అభిప్రాయపడుతున్నారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వస్తున్న సానుకూల సంకేతాలను సూచీలు అందిపుచ్చుకోవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఏప్రిల్- జూన్ త్రైమాసికానికి జీడీపీ గణాంకాలు వెలువడనున్న నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తంగా వ్యవహరించొచ్చు. నేడు మార్కెట్లు ముగిసిన అనంతరం ఈ గణాంకాలు వెల్లడికానున్నాయి. ఉత్తర కొరియాతో సంబంధాలపై అన్ని అవకాశాలను పరిశీలిస్తున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొనడం.. ప్రపంచ మార్కెట్లకు ఉపశమనం అందించింది. నిఫ్టీ 50 ఆగస్టు ఫ్యూచర్స్ 9900- 9950 పాయింట్ల శ్రేణిలో ముగిసేందుకు ఆస్కారం ఉంది. నేడు నిఫ్టీ 9910 పాయింట్ల వద్ద తక్షణ నిరోధం ఎదురు కావొచ్చు. ఇది అధిగమిస్తే 9960- 10010 పాయింట్ల వద్ద తదుపరి నిరోధం కనిపిస్తోందని సాంకేతిక విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 9850 పాయింట్ల దగ్గర బలమైన మద్దతు లభించొచ్చని అంటున్నారు.

చిన్న బ్యాంకు విలీనంపై బీఓబీ దృష్టి

దిల్లీ: విలీన ప్రతిపాదనతో ప్రభుత్వ రంగ బ్యాంకుల (పీఎస్‌బీ) బోర్డులే ముందుకు రావాలని ప్రభుత్వం తేల్చిచెప్పడంతో.. ఆ దిశగా ఒక్కో అడుగు పడుతోన్నట్లు కనిపిస్తోంది. దేశంలో దిగ్గజ బ్యాంకుల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా (బీఓబీ) ఇప్పటికే ఇదే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తోంది. ఓ చిన్న పీఎస్‌బీని విలీనం చేసుకునేందుకు బీఓబీ చర్చలు జరుపుతోన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. అయితే ఆ బ్యాంకు పేరు మాత్రం ఇంతవరకు వెల్లడికాలేదు. విశ్వసనీయ వర్గాలు చెబుతున్న దాని ప్రకారం.. దిద్దుబాటు చర్యలు తీసుకునేందుకు ఆర్‌బీఐ గుర్తించిన ఆరు బ్యాంకుల్లో ఈ బ్యాంకు కూడా ఒకటి. ఆ ఆరు బ్యాంకులేమిటంటే.. దేనా బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఐడీబీఐ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, యూకోబ్యాంక్. మరోవైపు విలీనం చేసుకునేందుకు ఈ ఆరింటి నుంచి ఒక దానిని ఎంపిక చేసుకోవాల్సిందిగా ఇప్పటికే ప్రభుత్వం కూడా బీఓబీకి సూచించినట్లు తెలుస్తోంది. ఇదే విషయం ధృవీకరణ కోసం ఆ బ్యాంకు ఎండీ, సీఈఓకు కోజెన్సిస్ వార్తా సంస్థ సంక్షిప్త సందేశాన్ని పంపగా ఆయన నుంచి ఎలాంటి సమాచారం రాలేదు.

దిద్దుబాటు చర్యలు వేటికి..: రెండేళ్లకు పైగా నష్టాలను చవిచూసిన, నిరర్థక ఆస్తులు 6 శాతాన్ని మించిన బ్యాంకులను దిద్దుబాటు చర్యలు తీసుకోవాల్సిన జాబితాలో ఆర్‌బీఐ చేర్చింది. ఇప్పటివరకు రెండేళ్లకు పైగా భారీ నష్టాలను నమోదుచేసిన, మొత్తం రుణాల్లో నికర నిరర్థక ఆస్తులు 10 శాతాన్ని మించిన బ్యాంకులపైనే ఆర్‌బీఐ ఈ తరహా నిర్ణయాన్ని తీసుకుంది.

ఈ ఏడాది 50,000 పాలసీల విక్రయం

ఎడెల్‌వైజ్ టోకియో లైఫ్ లక్ష్యం

ఈనాడు, హైదరాబాద్: జీవిత బీమా రంగంలోని ఎడెల్‌వైజ్ టోకియో లైఫ్ ఇన్సూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 50 వేలకు పైగా పాలసీలను విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకుంది. గత ఆర్థిక సంవత్సరంలో 40 వేల పాలసీలను కంపెనీ విక్రయించిందని ఎడెల్‌వైజ్ టోకియో అమ్మకాల అధిపతి యశ్ మోహన్ ప్రసాద్ తెలిపారు. దాదాపు ఏడాదిన్న క్రితం కార్యకలాపాలు ప్రారంభించిన ఎడెల్‌వైజ్ టోకియోకు ప్రస్తుతం 91 శాఖలు ఉండగా.. 2017-18లో దేశ వ్యాప్తంగా 29 శాఖలను ప్రారంభించనుందని మోహన్ చెప్పారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రస్తుతం 3 శాఖలు ఉన్నాయని తాజాగా సికింద్రాబాద్‌లో 4వ శాఖను ప్రారంభించామన్నారు. ఈ శాఖను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే రెండు నెలల్లో మరో 4 శాఖలను తెలుగు రాష్ట్రాల్లో ప్రారంభించనున్నట్లు చెప్పారు. గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ కొత్త ప్రీమియం ఆదాయం రూ.225 కోట్లు ఉండగా.. ఈ ఏడాది 40 శాతానికి పైగా వృద్ధిరేటు నమోదు కాగలదని కంపెనీ అంచనా వేస్తోంది. దేశ వ్యాప్తంగా కంపెనీకి 22 వేల మంది వ్యక్తిగత ఏజెంట్లు (బీమా సలహాదారులు) ఉండగా.. మరో 10 వేల మందిని ఈ ఏడాది నియమించుకోంది.

మార్కెట్ కబుర్లు

- గుజరాత్‌లో 100 మెగావాట్ల పవన విద్యుత్ ప్రాజెక్ట్ అభివృద్ధి కోసం అదానీ గ్రీన్ ఎనర్జీ నుంచి ఆర్డరు దక్కించుకున్నట్లు **ఐనాక్స్ విండ్** వెల్లడించింది.
- ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్‌ఎస్) పద్ధతి ద్వారా **ఎన్‌టీపీసీ**లో 7 శాతం వాటా విక్రయాన్ని ప్రభుత్వం పూర్తి చేసింది. తద్వారా ఖజానాకు రూ.9100 కోట్లు జమయ్యాయి. కేటాయించిన 11.58 కోట్ల షేర్లలో 73 శాతానికి సమానమైన 8.45 కోట్ల షేర్లకు మాత్రమే దేశీయ మదుపర్లు బిడ్‌లను దాఖలు చేశారు. మరోవైపు మూలధన వ్యయాల అవసరాల కోసం ఐసీఐసీఐ బ్యాంక్‌తో రూ.3000 కోట్ల కాలావధి రుణ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఎన్‌టీపీసీ ప్రకటించింది.
- సెప్టెంబరు 1న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో ఏవీ బిర్లా గ్రూప్ ఆర్థిక సేవల సంస్థ **ఆదిత్య బిర్లా కేపిటల్** నమోదు కానుంది. గ్రాసిమ్ ఇండస్ట్రీస్‌తో ఆదిత్య బిర్లా నువో విలీనం కావడంతో.. ఆదిత్య బిర్లా కేపిటల్ ప్రత్యేక సంస్థగా ఏర్పాటు కానుంది.
- రూ.11000 కోట్ల విలువైన షేర్ల తిరిగి కొనుగోలు (బైబ్యాక్) ప్రతిపాదనకు ఐటీ దిగ్గజం **విప్రో** వాటాదార్లు ఆమోదం తెలిపారు. బైబ్యాక్ ఆఫర్‌కు రికార్డు తేదీగా సెప్టెంబరు 15గా కంపెనీ నిర్ణయించింది.

విక్రమ్ భక్షితో వివాద పరిష్కారం అసంభవం

- ఎన్‌సీఎల్‌ఏటీకి తెలిపిన మెక్‌డొనాల్డ్ - పరిష్కారానికి మేము సిద్ధమే: భక్షి తరఫు న్యాయవాది

దిల్లీ: విక్రమ్ భక్షితో వివాద పరిష్కారం అసంభవమని నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ)కు మెక్‌డొనాల్డ్ తెలిపింది. విక్రమ్ భక్షితో కలిసి కనాట్ ప్లాజా రెస్టారెంట్ లిమిటెడ్ (సీపీఆర్‌ఎల్)ను మెక్‌డొనాల్డ్ ఏర్పాటు చేసింది. తూర్పు, ఉత్తర భారత్‌లో ఇది కార్యకలాపాలు నిర్వహిస్తోంది. దీనికి 169 విక్రయ కేంద్రాలున్నాయి. ఈ విక్రయ కేంద్రాలకు సంబంధించి కుదుర్చుకున్న ఫ్రాంఛైజీ ఒప్పందాన్ని ఈ నెల 21న మెక్‌డొనాల్డ్ రద్దు చేసుకుంది. అయితే భక్షి, మెక్‌డొనాల్డ్ మధ్య వివాదం చాలా ఏళ్ల నుంచే నడుస్తోంది. ఈ వివాదాన్ని పరిష్కరించుకునే అంశాన్ని పరిశీలించాల్సిందిగా ఇరు పక్షాలకు గతవారం ఎన్‌సీఎల్‌ఏటీ సూచించింది. వీటన్నింటిపై ఆగస్టు 30 లోగా నిర్ణయం తీసుకోవాలని తెలిపింది. ఇరుపక్షాలు దాఖలు చేసిన పిటీషన్లపై బుధవారం ఎన్‌ఎస్‌ఎల్‌ఈటీ విచారణ చేపట్టింది. భక్షితో వివాద పరిష్కరం అసంభవమని విచారణ సందర్భంగా మెకొడొనాల్డ్ తరఫు న్యాయవాది రాజీవ్



నయ్యర్ తెలిపారు. భక్షి ప్రవర్తనపై కూడా సందేహాలు వ్యక్తం చేశారు. గత కొన్నివారాలుగా సీపీఆర్‌ఎల్ నుంచి పెద్ద మొత్తంలో భక్షి నిధులు మళ్లించారని కూడా ఆరోపించారు. మరోవైపు మెక్‌డొనాల్డ్‌తో వివాద పరిష్కారానికి సిద్ధంగా ఉన్నామని భక్షి తరఫు న్యాయవాది వెల్లడించారు. అయితే మెక్‌డొనాల్డ్ మాత్రం వివాద పరిష్కారినికి ముందుకు రావడం లేదని తెలిపారు. ఈ వాదనలు విన్న అనంతరం ఇరు పక్షాల మధ్య సామరస్య పరిష్కారానికి అవకాశం లేదనే విషయాన్ని ఎన్‌ఎస్‌ఎల్‌టీ తేల్చింది. దీంతో తదుపరి విచారణను సెప్టెంబరు 21కి వాయిదావేసింది. అలాగే ఒకరికి వ్యతిరేకంగా మరొకరు దాఖలు చేసిన పిటిషన్లపై వారం రోజుల్లోగా ఇరువురు సమాధానమివ్వాలని కూడా ఆదేశించింది.

భారత్ రోడ్ ఐపీఓ ధరల శ్రేణి రూ.195-205


దిల్లీ: శ్రేయీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫైనాన్స్‌కు చెందిన భారత్ రోడ్ నెట్‌వర్క్ తన రాబోయే తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ)కు ధరల శ్రేణిని రూ.195- 205గా నిర్ణయించింది. ఈ ఐపీఓ సెప్టెంబరు 6న మొదలై 8న ముగియనుంది. ఈ శ్రేణిలోని గరిష్ఠ ధర (రూ.205) ప్రకారం అయితే ఇష్యూ ద్వారా రూ.600 కోట్లు వస్తాయని కంపెనీ భావిస్తోంది. ఐపీఓలో భాగంగా రూ.2.93 కోట్ల విలువైన తాజా షేర్లను జారీ చేస్తారు. ఇష్యూ అనంతరం 34.90 శాతానికి సమానమైన మూలధన వాటాను కంపెనీ విక్రయించనుంది. ఐపీఓ ద్వారా వచ్చిన నిధులను అనుబంధ సంస్థ ఎస్‌టీపీఎల్ రుణం తీర్చేందుకు వినియోగించనుంది.

ఐఓసీ



రూ.439.50 వద్ద ప్రారంభమై రూ.437.80- 454.90 మధ్య కదలాడి క్రితం ముగింపు రూ.434.50తో పోలిస్తే రూ.18.35 (4.22%) లాభంతో రూ.452.85 వద్ద స్థిరపడింది. ఎన్‌ఎస్‌ఈలో చేతులు మారిన షేర్లు 87,48,458.

టెక్ మహీంద్రా



రూ.434 వద్ద మొదలై రూ.425.05- 436 మధ్య చలించి క్రితం ముగింపు రూ.431.75తో పోలిస్తే రూ.6 (1.39%) నష్టంతో రూ.425.75 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలో 23,80,800 షేర్లు చేతులు మారాయి.

52 వారాల గరిష్ఠం (రూ.లలో)

పీఎన్‌బీ హౌసింగ్	1717.65
హిందుస్థాన్ యునిలీవర్	1209.60
కంటైనర్ కార్పొరేషన్	1316.00
సీఈఎస్‌సీ	1037.40
బ్లూస్టార్	761.80
బాటా ఇండియా	694.95
ఐఓసీ	454.90
చెన్నై పెట్రోలియం	437.85

52 వారాల కనిష్ఠం (రూ.లలో)


క్లారియెంట్ కెమికల్స్	563.25
జేబీ కెమికల్స్	277.00
మగధ్ షుగర్	160.00

ఎఫ్‌ఐఐలు, డీఐఐల లావాదేవీలు (రూ.కోట్లలో)

	విదేశీ మదుపర్లు (ఎఫ్‌ఐఐలు)			దేశీయ మదుపర్లు (డీఐఐలు)		
తేదీ	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం	కొనుగోళ్లు	అమ్మకాలు	నికరం
30/08	4,170	4,182	−12	2,239	1,948	291
28/08	5,927	6,052	−125	2,546	2,070	476
23/08	3,415	4,244	−829	2,843	2,408	435
22/08	3,415	4,244	−829	2,843	2,408	435
17/08	3,453	4,434	−981	2,765	1,936	829

30వ తేదీకి ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)



కోడిగుడ్లు

హైదరాబాద్	355	వరంగల్	357
చిల్లరగా(ఒక గుడ్డు)	4.15	విశాఖపట్నం	362
బెంగళూరు	382	చెన్నై	397
31న		చిత్తూరు	390
విజయవాడ/గోదావరి	359	నమక్కల్	387

ఎన్‌ఎస్‌ఈ

బుధవారం ముగింపు, క్రితం ముగింపు, ట్రేడింగ్ పరిమాణం (వరుసగా)

నిఫ్టీ 50

ACC 1811.20 (1801.50) 206085
ADANI PORT & 389.75 (383.30) 2979277
AMBUJA CEMEN 280.15 (275.00) 1271563
ASIAN PAINTS 1153.35 (1151.70) 674280
AUROBIND PHA 735.20 (731.05) 1878114
AXIS BANK LT 503.90 (503.60) 3972126
BAJAJ AUTO L 2750.55 (2726.60) 147597
BANK OFBAROD 139.45 (140.05) 11604114
BHARTI AIRTE 429.00 (428.10) 2153282
BHARTI INFRA 384.75 (380.30) 838089
BOSCH LTD 22465.20 (21693.35) 8896
BPCL 520.95 (504.10) 4117206
CIPLA 566.35 (568.90) 596376
COAL INDIA L 241.80 (238.25) 3263209
DR. REDDYS 2038.90 (2042.05) 401449
EICHER MOTOR 30984.00 (30859.15) 27311
GAIL 381.00 (379.00) 1315332
HCL TECH 849.20 (852.55) 1693925
HDFC 1759.05 (1727.80) 2399821
HDFC BANK 1768.55 (1746.15) 673580
HERO MOTOCOR 3988.10 (3945.70) 261951
HINDALCO IND 236.35 (227.30) 12685001
HINDUSTAN UN 1204.30 (1190.45) 666156
ICICI BANK 300.30 (299.50) 8552010
INDIABULLS H 1208.00 (1202.30) 1196811
INDIAN OIL 452.85 (434.50) 8748458
INDUSINDBANK 1655.80 (1643.30) 379651
INFOSYS LTD 926.65 (927.45) 8074832
ITC 282.00 (280.25) 6534233
KOTAK MAHIND 971.35 (964.40) 997329
LARSEN & TOU 1139.65 (1130.05) 895791
LUPIN 988.00 (989.30) 700248
M&M 1358.15 (1376.95) 1055176
MARUTI SUZIK 7557.45 (7521.50) 471048
NTPC LTD 167.95 (168.40) 20715128
ONGC 158.40 (157.25) 5219322
POWER GRID C 215.60 (215.30) 5238874
RELIANCE IND 1564.10 (1532.15) 2362387
SBI 276.60 (277.00) 7648702
SUN PHARMA 484.25 (481.80) 2523480
TATA CONSULT 2484.55 (2470.85) 485391
TATA MOT DVR 220.85 (220.25) 1649635
TATA MOTORS 378.50 (376.10) 3734824
TATA POWER 77.65 (76.95) 2203355
TATA STEEL L 638.65 (630.20) 3524171
TECH MAHINDR 425.75 (431.75) 2380800
ULTRATECH 4013.05 (3931.60) 415975
VEDANTA LIMI 305.55 (299.05) 7689067
WIPRO 291.20 (290.75) 1837382
YES BANK LTD 1752.10 (1721.55) 1972851
ZEE ENTERTAI 520.35 (518.25) 1662465

నిఫ్టీ నెక్స్ట్ 50

ABB 1348.60 (1351.25) 22051
ASHOK LEYLAN 107.30 (105.05) 7845394
BAJAJ FINANC 1788.05 (1773.40) 1064601
BAJAJ FINSER 5489.65 (5442.95) 139515
BEL 191.85 (185.15) 4864911
BHEL 127.75 (126.85) 2458131
BRITANNIA 4241.35 (4172.60) 101234
CADILA HEALT 504.30 (498.60) 1270280
COLGATE PALM 1105.20 (1096.80) 180346
CONTAINER 1311.35 (1259.90) 449887
CUMMINS INDI 932.80 (902.25) 325916
DABUR INDIA 314.35 (309.25) 790493
DIVIS LAB 702.60 (687.45) 1072727
DLF LIMITED 183.05 (181.60) 8982352
EMAMI LIMITE 1080.50 (1075.65) 40228
GLAXOSMI CON 5396.05 (5349.85) 7062
GLAXOSMI PHA 2425.80 (2435.80) 7679
GLENMARK PHA 616.60 (615.05) 477024
GODREJ CONSU 926.00 (915.10) 366079
HAVELLS INDI 485.20 (481.25) 503207
HINDUSTAN ZI 295.35 (284.10) 1822670
HPCL 485.95 (466.95) 7197590
ICICI PRU LI 426.95 (424.30) 561200
IDEA CELLULR 88.00 (87.45) 3125061
INTERGLOBE A 1195.85 (1172.05) 307426
JSW STEEL LT 259.05 (246.90) 6400191
LIC HOUS.FIN 663.90 (659.00) 1208591
MARICO LIMIT 314.75 (312.65) 1029028
MCDOWELL 2555.55 (2563.55) 161317
MOTHERSON 309.25 (303.80) 3480614
NHPC LTD 29.05 (29.00) 4562755
NMDC LTD 126.50 (121.80) 6223495
OIL INDIA 292.05 (289.20) 736505
ORACLE FIN S 3425.25 (3456.50) 23457
P&G HYG&HEAL 8294.95 (8246.45) 9065
PETRONET LNG 226.80 (222.95) 4378939
PIDILITE IND 831.30 (827.25) 228155
PIRAMAL ENTE 2716.50 (2657.15) 115790
PNB 142.50 (141.00) 4286281
POWER FIN CO 123.50 (120.70) 3697716
RURAL ELEC C 166.90 (164.45) 4723805
SAIL 61.80 (61.05) 3036384
SHREE CEMENT 17699.55 (17363.15) 20413
SHRIRAM TRAN 975.30 (971.60) 247068
SIEMENS 1276.85 (1273.10) 113266
SUN TV LTD 704.15 (701.40) 797134
TITAN IND 611.60 (600.45) 977962
TORRENT PHAR 1209.65 (1217.10) 125346
UNITED BREWE 801.65 (802.10) 217702
UPL LIMITED 839.85 (840.15) 1179595

ఇతర ప్రధాన షేర్లు

ABAN OFFSHOR 177.25 (174.95) 655794
ADANI ENTERP 128.15 (118.95) 16432031
ADANI POWER 32.15 (29.80) 24058760
ALL BANK 67.95 (67.10) 1497701
AMARA RAJA 781.85 (763.65) 911418
ANANT RAJIND 55.45 (54.55) 546039
ANDHRA BANK 52.15 (51.80) 848950
APOLLO HOSPI 1092.50 (1077.05) 409962
APOLLO TYRES 248.35 (249.15) 3302942
APTECH 308.00 (301.90) 1251367
BAJAJ ELECT. 342.15 (337.10) 120624
BAJAJ HIND 14.55 (14.55) 3142735
BAJAJ HOLDIN 2962.05 (2970.80) 59314
BALAJI TELE 169.85 (166.65) 294019
BALLARPUR IN 13.80 (12.95) 2826435
BALRAMPUR CH 169.35 (168.85) 1283988
BANK OF MAHA 26.85 (26.90) 46297
BANK OFINDIA 143.00 (141.65) 2367920
BATA INDIA 687.05 (675.75) 933126
BGR ENERGY S 134.45 (132.10) 104848
BHARAT FORGE 1143.90 (1129.10) 404234
BHUSHAN STEE 70.35 (68.05) 925249
BIOCON LTD 343.80 (342.55) 1248928
BOMBAY DYE 104.45 (93.70) 27471624
CANARA BANK 339.30 (337.45) 921928
CEAT LIMITED 1661.60 (1653.55) 384747
CENTRAL BANK 83.95 (77.95) 5486323
CHAMBAL FERT 146.45 (147.80) 895940
CHENNAI PETR 431.65 (424.05) 1634794
CITY UNIBANK 159.00 (159.15) 268622
CORPO BANK 45.20 (45.10) 101489
COX & KINGS 262.20 (262.40) 92081
D B REALTY L 36.85 (36.05) 204441
DELTA CORP L 188.25 (185.05) 3311141
DENA BANK 30.90 (30.85) 387117
DHANALAKBANK 36.25 (34.25) 1053076
EDELWEISS CA 242.00 (240.10) 1731389
EDUCOMP SOLU 8.00 (7.90) 102431
EID PARRY 321.05 (316.45) 128710
EIH 134.00 (133.65) 52133
ESSAR SHIPPI 29.75 (29.40) 303845
ESTER INDUST 36.85 (37.25) 152583
EXIDE INDUST 196.40 (195.55) 2613774
FEDERAL BANK 108.70 (107.75) 4091593
FINOLEX CABL 530.10 (528.20) 38340
G E SHIP LTD 388.75 (387.10) 59828
GAMMON INDIA 8.30 (8.25) 387949
GAMMON INFRA 3.85 (3.80) 6719584
GATI LIMITED 113.45 (113.30) 294226
GAYATRI PROJ 179.40 (178.10) 59459
GITANJALIGEM 61.15 (60.75) 162675
GMR INFRASTR 17.20 (16.85) 23081553
GODREJ IND 620.25 (601.95) 397893
GRASIM IND 1173.05 (1132.85) 1518388
GUJ ALK&CHEM 444.40 (439.75) 124154
HCL INFOSYS 47.75 (47.95) 1752435
HEXA TECH 273.95 (270.05) 553226
HIMACHAL FUT 16.90 (17.00) 3205015
HINDU MOTORS 8.00 (7.95) 98784
HOUSING DEV 62.25 (60.30) 12794288
IDBI 55.30 (55.45) 4861705
IDFC 54.60 (54.05) 1792508
IFCI 23.80 (23.60) 2336032
IL&FS TRANS 79.55 (80.35) 225916
IND SWIFTLAB 33.45 (33.05) 7039
INDBULLS REL 229.30 (224.60) 6628779
INDIA CEM 173.75 (171.00) 4258257
INDIAN BANK 290.30 (289.50) 760461
INDO RAMA SY 27.05 (26.90) 64449
INDRAPRASTHA 1256.85 (1241.55) 304413
IND-SWIFTLTD 7.65 (7.35) 6763
INGERSOLL-R 804.60 (798.20) 7277
IOB 22.80 (22.60) 385529
IPCA LAB 416.25 (415.25) 275487
IRB INFRA DE 213.50 (210.75) 929859
J&K BANK 80.25 (78.35) 554972
JAI CORP 82.55 (78.60) 1218488
JAIN IRRIGAT 97.45 (96.00) 2415464
JAYPEE INFRA 16.85 (16.05) 6642703
JAYSHREE TEA 100.70 (98.75) 67860
JET AIRWAYS 560.50 (545.70) 2409777
JINDAL SAW 92.85 (91.15) 794505
JINDAL STEEL 137.15 (131.40) 6543595
JK LAKSHMI C 416.95 (414.05) 50962
JK PAPER LIM 99.55 (98.85) 496913
JM FINANCIAL 126.80 (126.35) 434750
JP ASSOCIATS 23.90 (21.25) 189259365
JSW ENERGY L 66.60 (65.35) 6994365
JUBILANT FOO 1366.05 (1344.85) 1157869
JUBILANT ORG 692.35 (699.55) 229122
JYOTHY LABS 380.45 (382.75) 47146

ఘనం (+)

నిఫ్టీ	30న	మార్పు %
INDIAN OIL CORP	452.85	4.22
HINDALCO	236.35	3.98
BOSCH	22465.20	3.56
BPCL	520.95	3.34
VEDANTA	305.55	2.17
RELIANCE IND	1564.10	2.09
ULTRATECH CEM	4013.05	2.07

గ్రహణం (-)

నిఫ్టీ	30న	మార్పు %
TECH MAHINDRA	425.75	-1.39
M & M	1358.15	-1.37
CIPLA	566.35	-0.45
BANK OF BARODA	139.45	-0.43
HCL TECH	849.20	-0.39
NTPC	167.95	-0.27
DR. REDDYS LAB	2038.90	-0.15

KARNATA BANK 150.15 (147.90) 1106762
KEC INTL LTD 316.95 (312.05) 1956484
KOLTE PATIL 157.20 (159.70) 128047
KPIT CUMMINS 117.45 (116.15) 514255
L&TFIN.HOLD 197.10 (189.65) 16613568
LAK VIL BANK 173.70 (174.70) 535982
M & M FINANC 425.35 (411.40) 2002080
MANAPPURAM G 95.75 (92.75) 7613406
MMTC LIMITED 56.30 (55.50) 448849
MOSER-BEAR 4.35 (4.35) 318310
MPHASIS LTD 612.25 (609.60) 75861
MRPL 132.65 (126.40) 3957323
MTNL 19.45 (19.25) 872285
NCC LIMITED 85.05 (84.35) 1794393
NETWORK18 FI 49.55 (48.90) 299245
NEULAND LAB 1241.70 (1209.95) 2474
NIIT LTD 93.75 (90.95) 521771
NIIT TECHNOL 502.25 (498.25) 326487
OMAXE LTD 202.90 (202.50) 620156
ONMOBILE GLO 60.25 (57.90) 535561
ORIENT PAPER 95.35 (92.30) 339269
ORIENTALBANK 126.10 (124.45) 1706625
PATEL ENGG 69.80 (70.15) 128085
PFIZER 1797.90 (1806.85) 10887
POLARIS SOFT 243.90 (242.00) 30596
POWERTRADING 115.90 (114.25) 1651960
PRAJ IND 68.45 (67.40) 135164
PRISM CEMENT 109.10 (109.45) 151536
PROVOGUE (IN 4.05 (4.10) 66565
PUNJ LLOYD 18.95 (18.80) 791912
PUNJAB & SIN 48.65 (48.30) 47932
PURAVANKARA 72.45 (70.90) 83370
PVP VENTURES 5.50 (5.40) 124305
PVR LIMITED 1309.95 (1261.50) 184144
RADICO KHAIT 168.25 (161.50) 1413688
RAJ OIL MILL 1.25 (1.30) 36207
RAJESH EXPOR 739.20 (731.35) 477889
RALLIS INDIA 227.25 (228.30) 213850
RAMCO IND 271.95 (255.05) 630311
RAMCO SYS 380.95 (353.35) 106307
RAMKY INFRA 91.35 (82.55) 471908
RAYMOND 763.05 (756.20) 528353
RELIANCE CAP 779.90 (769.50) 4144080
RELIANCE COM 22.70 (22.55) 13658571
RELIANCE INF 507.00 (498.20) 3291052
RELIANCE POW 40.40 (39.75) 1537725
ROLTA INDIA 54.25 (53.00) 472746
SAGAR CEMENT 847.95 (822.95) 4953
SAREGAMA 425.45 (416.50) 186834
SHANTHI GEAR 135.30 (135.70) 11316
SHIPPNG CORP 97.95 (95.20) 2008904
SHREE RENUKA 17.05 (16.90) 1504125
SINTEX IND 30.80 (29.85) 18827998
SOBHA DEVELO 384.80 (376.75) 56789
SOUTHINDBANK 27.90 (27.55) 5118467
SRS LIMITED 2.75 (2.70) 1504314
STERLITE TEC 219.50 (216.30) 452885
SUJANA METAL 1.60 (1.55) 42926
SUN PHARMA 392.60 (384.50) 354373
SUND FASTNER 403.45 (400.20) 108282
SUZLON ENERG 16.45 (16.25) 36461208
SYND. BANK 65.00 (64.55) 677002
TATA CHEM 588.85 (586.60) 598100
TATA COFFEE 135.80 (132.55) 527978
TATA COMMUN 652.45 (648.00) 556505
TATA GLOBAL 197.05 (190.35) 7173447
TATA METALIK 643.50 (635.25) 101048
TATA TELESER 6.65 (6.55) 748313
THE INDIAN H 115.00 (114.75) 417368
TORRENT POWE 211.90 (210.40) 1049800
TRIVENI ENGG 93.35 (91.45) 1060049
TTK PRESTIGE 6357.15 (6304.85) 1258
TV TODAY NET 243.00 (244.15) 87500
TV18 BROADCA 37.20 (36.15) 3975702
TVS MOTOR 610.55 (594.55) 2623217
UCO BANK 30.85 (31.00) 338117
UNION BANK 136.55 (134.75) 2149784
UNITECH 7.40 (7.35) 13232007
UNITED BANK 18.05 (18.10) 498826
USHA MARTIN 19.30 (18.95) 268620
VADILAL INDU 906.85 (849.85) 102656
VENKYS 2018.60 (1996.10) 77712
V-GUARD IND 183.90 (182.95) 343748
VIJAYA BANK 69.65 (68.60) 1021930
VIP 220.65 (216.20) 691005
VOLTAS 523.20 (520.05) 1053566
ZEE LEARN LI 42.05 (42.15) 82918
ZUARI GLOBAL 119.60 (119.15) 10567
ZYDUS WELLNE 864.80 (862.55) 1386

ALPHAGEO 770.35 (759.45) 1287
AMAR RAJA BA 782.95 (764.20) 262485
ANDHRA BANK 52 (51.70) 124036
ANDHRA CEMEN 11.95 (9.96) 629136
ANDHRA PAPER 296.25 (291.45) 2530
ANDHRA PETRO 30.60 (30.50) 21378
ANDHRA SUGAR 336.75 (333.80) 2994
ANJANI PORTL 289.95 (241.65) 169264
ASTRA MICROW 126.05 (124.70) 9497
AUROBINDO PH 735.85 (731.45) 121619
AVANTI FEEDS 1869.70 (1824.70) 11331
BALAJI AMIN 309.95 (309.75) 3513
BARTRONICS 14 (13.75) 10814
BHAGIRA CHEM 179.90 (183) 7609
BHAGYA NAG 23.65 (21.45) 31866
CAMBRIDGE TE 79.90 (79.35) 16673
COMBAT DRUGS 11.71 (11.71) 2710
CONT COFFEE 279.35 (275.05) 349
COROMAN FERT 437.10 (435.75) 7930
CUBEX TUB 16.30 (16.35) 2936
DECCAN CEMEN 1116 (1119.20) 738
DIVI'S LAB 701.95 (686.45) 316587
DIVYA GRANIT 103.55 (103.10) 2357
DR REDDY 2040.35 (2043.55) 31448
FOUR SOFT 97 (92.50) 5730
GATI CORPN 113.75 (113.50) 49214
GAYATRI PROJ 178.75 (177.70) 3398
GMR INFRASTR 17.15 (16.80) 1999644
GOLDST INFRA 158.45 (150.95) 457434
GRANULES (I) 127.85 (126.25) 62363

బీఎస్‌ఈలో రాష్ట్ర కంపెనీలు

GVK POWER 12.29 (12.07) 487242
HBL NIFE POW 49.45 (47.60) 162740
HERITAGE FOO 1519.70 (1462.90) 10106
HYD INDUS 1224.10 (1196) 3623
ILFS ENGINEE 39.35 (39.30) 8443
INNAREDY COM 2.56 (2.65) 10030
IVRCL INFRAS 4.36 (4.35) 622920
KAKATIYA CEM 361.85 (342.70) 9627
KAVERI SEED 550.25 (540.35) 34229
KCP LTD 105.55 (103.60) 23310
LANCO INDUS 357.45 (352.90) 4048
LANCO INFRAT 0.82 (0.84) 3876080
LAURUS LABS 517.85 (506.10) 15060
MADHUCON PRO 27.30 (28) 41605
MIC ELECTRON 7.90 (7.63) 76197
MOLD-TEK.TEC 52.75 (52.95) 17180
MOLDTK PLA 299.95 (289.90) 5660
NAGARJAGRICH 35.40 (35.10) 12486
NATCO PHARMA 721.35 (719.65) 27890
NAVA BH VENT 121.35 (121.40) 542876
NCC 85.10 (84.20) 177125
NCL IND 237.40 (234.80) 18824
NEHA INTER 5.10 (5.01) 7437
NETTLINX 81.70 (83.85) 21060
NEULAND LAB 1249.90 (1226.25) 110
NIHAR INFO 15.10 (15) 1150
NILE 602.65 (600) 6726
PANYAM CEMEN 61.55 (59.35) 12045
PENNER IND 64.95 (60.80) 414321
PIONEER DIST 189.50 (194.80) 1057
POKARNA 1263.10 (1260.40) 737
PREMIER EXPL 441.55 (441.60) 2544
PRISM CEMENT 109.05 (109.20) 12172
PRUDENTL PHA 3.78 (3.79) 76355
RAIN INDUSTR 143.20 (139.40) 206622
SAGAR CEM 845 (811.75) 1833
SATVAH. ISPA 46.20 (42.55) 97501
SMS PHARMA 77.25 (77.05) 3333
SPHERE GLOBA 46.95 (45.65) 2682
SREE RAYAL A 30.25 (29.20) 415859
SRINIVASA SH 78.60 (73.65) 21960
STEEL EXCHAN 81.60 (82) 90811
SUJANA METAL 1.55 (1.58) 8750
SUJANA TOWER 4.05 (4.02) 2800
SURYALAKSH.C 93.20 (93.10) 8056
SURYALATA SP 130.80 (132.55) 1832
SUVEN PHARMA 162.10 (163.45) 29644
TAJ GVK HOTE 155.35 (150.95) 5718
TANLA 32.80 (32.65) 30080
TERA SOFTWAR 62.65 (63.45) 2534
VICEROY HOTE 18.55 (18.65) 37599
VIJAY TEXTIL 65.70 (65.15) 45381
VIMTA LABS 130.05 (130) 6929
VISAKA IND 679.35 (617.25) 200687
VIVIMED LABS 99.25 (99.70) 142155
YBRANT DIGIT 6.22 (5.78) 1850572
ZENTECH 50.25 (49.60) 22656

బ్యాంక్ ఆఫ్ అమెరికాలో అత్యధిక వాటా బఫెట్‌దే

ప్రపంచ ప్రఖ్యాత మదుపరి వారెన్ బఫెట్ బ్యాంక్ ఆఫ్ అమెరికాలో అత్యధిక వాటాను సొంతం చేసుకున్నారు. ఆయన కంపెనీ బెర్క్‌షైర్ హాథ్‌వే 70 కోట్ల షేర్లను కొనుగోలు చేయడంతో అతిపెద్ద వాటాదారు అయ్యారు. బ్యాంక్ ఆఫ్ అమెరికా.. అమెరికాలోనే రెండో అతి పెద్ద బ్యాంకు. బెర్క్‌షైర్ తనకున్న కొనుగోలు హక్కుల మేరకు ఒక్కో షేరును 7.14 డాలర్లకు కొనుగోలు చేసిందని బ్యాంక్ ఆఫ్ అమెరికా తెలిపింది. తాజా కొనుగోలుతో బ్యాంకులో బెర్క్‌షైర్ వాటా 6.6 శాతానికి పెరిగింది. అంతేకాకుండా ప్రస్తుతం బెర్క్‌షైర్ పెట్టిన పెట్టుబడి ఆరేళ్ల క్రితం పెట్టిన దానితో పోలిస్తే మూడింతలు ఎక్కువ కావడం గమనార్హం.


ఈనాడు బిజినెస్

టెలినార్, ఎయిర్‌టెల్ రోమింగ్ ఒప్పందం

ఈనాడు, హైదరాబాద్: ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సర్కిల్‌లో చందాదారులకు విస్తృతంగా 3జీ, 4జీ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఎయిర్‌టెల్‌తో ఇంట్రా సర్కిల్ రోమింగ్ ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు టెలినార్ తెలిపింది. దీని వల్ల సర్కిల్ పరిధిలో రోమింగ్ చేసే టప్పుడు చందాదారులు 3జీ, 4జీ సేవలను విస్తృతంగా వినియోగించుకోవచ్చని టెలినార్ ఇండియా ఏపీ, తెలంగాణ వ్యాపార అధిపతి శ్రీనాథ్ కోటియన్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లోని 13 పట్టణాల్లో 2జీ డేటా, 4జీ సేవలను టెలినార్ అందిస్తోంది. ఈ ఒప్పందం ద్వారా సర్కిల్ పరిధిలో చందాదారులు రోమింగ్ చేసేటప్పుడు ఈ సేవలకు అంతరాయం ఉండదు.

షేర్ల తాకట్టుబాటు వేరయా

- విలువ పడిపోతే మరికొన్నింటితో సర్దుబాటు
- తనఖా మితిమీరడం కంపెనీకి ప్రతికూలమే
- 60% సంస్థల ప్రమోటర్ల షేర్లు తాకట్టులోనే
- విలువ రూ.2.64 లక్షల కోట్లు



ఈనాడు వాణిజ్య విభాగం

బంగారం తాకట్టు తెలుసు.. ఆస్తుల కుదవనూ చూస్తుంటాం షేర్ల తనఖాను కూడా వింటుంటాం.. అయితే పై రెండింటిది ఓ లెక్కయితే.. షేర్ల తాకట్టుది మరో లెక్క.

ఆస్తులు, పసిడి విలువలో హెచ్చుతగ్గులు తీవ్ర స్థాయిలో ఉండవు. అదే స్టాక్ మార్కెట్ ఎప్పుడు గుభాలిస్తుందో.. ఎప్పుడు గుబేల్‌మనిపిస్తుందో ఎవరికి ఓ పట్టానా అంతుపట్టదు.

తనఖా పెట్టిన వస్తువు/ ఆస్తి విలువ తగ్గితే.. తగ్గిన విలువకు సమానంగా మరో ఆస్తిని కుదువపెట్టమని ఏ రుణదాత అడగడు. మనకు కావాలనిపిస్తే వాటిని విడిపించుకుంటాం. లేదంటే తాకట్టు కిందనే వదిలేస్తాం.

షేర్ల విషయంలో ఇలా చేస్తే కుదరదు. షేర్ల ధర పడిపోతే.. తగ్గిన విలువకు సరిపోయేలా మరికొన్ని షేర్లను తాకట్టు పెట్టాల్సిందే. లేని పక్షంలో రుణ సంస్థలు తామిచ్చిన రుణం కింద తాకట్టులో ఉన్న షేర్లను విక్రయిస్తాయి. కొన్ని సందర్భాల్లో యాజమాన్య నియంత్రణను కూడా తమ చేతిలోకి తీసేసుకుంటాయి. ఇది కూడా కంపెనీ పరిస్థితి బాగుంటేనే చేస్తాయి. అదే అధ్వానంగా ఉంటే దివాలానే శరణ్యం.

అందుకే కంపెనీల షేర్ల తనఖా సమాచారాన్ని వాటాదార్లు ఎప్పటికప్పుడు తెలుసుకుంటుండాలి. ఆదమరిచామో మన పెట్టుబడి బూడిదలో పోసిన పన్నీరే అవుతుంది.

ఎవరు.. ఎందుకు

సాధారణంగా కంపెనీల ప్రమోటర్లు వివిధ అవసరాల నిమిత్తం షేర్లను తనఖా పెడుతుంటారు.

- ✦ ఇతర రుణమేదైనా పీకలమీదకు వచ్చినప్పుడు.. షేర్లను తనఖా పెట్టి ఆ వచ్చిన నిధులతో రుణాన్ని తీర్చేస్తుంటారు.
- ✦ ఎక్కువ మంది ప్రమోటర్లు కంపెనీ కార్యకలాపాలను విస్తరించే ఉద్దేశంతో షేర్లను తాకట్టుపెడుతుంటారు
- ✦ ఇతర ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టేందుకు కూడా షేర్లను తనఖా పెడుతుంటారు.
- ✦ సొంత అవసరాల కోసం కూడా కుదువపెట్టే వాళ్లూ లేకపోలేదు.

ఎక్కువైతే ఏంటి..

కంపెనీని వృద్ధి దిశగా నడిపించాలంటే నిధులు అవసరం. అందుకే పబ్లిక్ ఇష్యూల బాట కంపెనీలు పడుతుంటాయి. బాండ్ల జారీ ద్వారా కూడా నిధులు సమీకరిస్తుంటాయి. షేర్లను తనఖా పెట్టి రుణాలను పొందడం కూడా సర్వసాధారణంగా జరిగే ప్రక్రియే. బీఎస్‌ఈలోని నమోదిత కంపెనీల్లో 60% కంపెనీల ప్రమోటర్ల షేర్లు తనఖాలో ఉండటమే ఇందుకు నిదర్శనం. ఆగస్టు చివరినాటికి బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల ప్రమోటర్లు తనఖా పెట్టిన షేర్ల విలువ అంతకు ముందు నెలతో పోలిస్తే 6 శాతం పెరిగి రూ. 2.64 లక్షల కోట్లకు చేరింది. జూన్ చివరినాటికి ఈ విలువ రూ. 2.5 లక్షల కోట్లు. అయితే షేర్ల తాకట్టు మితిమీరితే ఆ కంపెనీ విశ్వాసంపైనే ప్రతికూల ప్రభావం పడుతుంది. మెజార్టీ షేర్లు తాకట్టులో ఉన్నప్పుడు ఒక్కసారి షేర్ల ధర అమాంతంగా పడిపోతే ఆ కంపెనీ పరిస్థితి ఎంత అధ్వానంగా మారుతుందో అర్థం చేసుకోవచ్చు. పడిపోయిన షేర్ల విలువను పూడ్చేందుకు మరిన్ని షేర్లను.. ఒకానొక సమయంలోనూ ఆస్తులనూ అమ్మేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఆఖరుకు కంపెనీ దివాలా తీయడానికి కూడా ఇది దారి తీస్తుంది.

బీఎస్‌ఈ చేస్తోంది అదే..

కంపెనీల షేర్ల తాకట్టుపై మదుపర్లకు ప్రతి నెలా బీఎస్‌ఈ సమాచారమిస్తోంది. ఎన్ని నమోదు కంపెనీలున్నాయి.. వాటి మార్కెట్ విలువ ఎంత ఉంది? ఎన్ని కంపెనీల షేర్లు తాకట్టులో ఉన్నాయి? వాటి విలువెంత? ఇత్యాది వివరాలతో ప్రతి నెల తొలి ఐదు రోజుల్లోపు ఓ ప్రకటనను విడుదల చేస్తోంది. బీఎస్‌ఈ ఇచ్చిన సమాచారంతోనే సరిపెట్టుకోకుండా, మనం పెట్టుబడులు పెట్టిన కంపెనీల తనఖా షేర్ల వివరాలను ఎప్పటికప్పుడు మదుపర్లు తెలుసుకోవడం మంచిది. ఏదేని కంపెనీలో పెట్టుబడులు పెట్టే ముందు కూడా షేర్ల తనఖాపై దృష్టి సారించడం మేలు.

బీఎస్‌ఈలో నమోదిత కంపెనీలు	ప్రమోటర్ల షేర్లు 30-50% తనఖాలో ఉన్న కంపెనీలు
5,291	146
షేర్లు తనఖాలో ఉన్న కంపెనీలు	**50-75% వరకు తనఖాలో ఉన్న కంపెనీలు**
3,072	84

రూపాయిల్లో తనఖా షేర్ల విలువ రూ.2.64 లక్షల కోట్లు

బ్యాంకింగేతర సంస్థల్లో తాకట్టులో ఉన్న షేర్ల విలువ రూ. 62,835 కోట్లు

(పై వివరాలన్నీ జులై చివరి నాటివి)

ఆ వినాయకుడి విగ్రహం రూ.4.5 లక్షలు

యాద్రో ఆవిష్కరణ

ఈనాడు, హైదరాబాద్: పోర్స్లైన్ లోహంతో తయారు చేసిన ఖరీదైన విగ్రహాలను, శిల్పాలను విక్రయిస్తున్న స్పానిష్ కంపెనీ యాద్రో వినాయక చవితి సందర్భంగా దేశీయ విపణిలోకి ప్రత్యేక వినాయక (లిమిటెడ్ ఎడిషన్) విగ్రహాలను ప్రవేశపెట్టింది. వీటి ధర రూ. 4.5 లక్షలు. బహుమతులు, గృహ అలంకరణ కోసం పోర్స్లైన్‌తో 500 రకాల విగ్రహాలను యాద్రో తయారు చేస్తోంది. భారత్‌లో 200 రకాల వరకూ విక్రయిస్తోంది. 'స్పిరిట్ ఆఫ్ ఇండియా' పేరుతో భారతీయ దేవతా విగ్రహాలను, గాంధీ వంటి ప్రముఖుల విగ్రహాలను తయారు చేసి విక్రయిస్తోంది. ప్రస్తుతం భారత్‌లో తమకు 8 బొటిక్‌లు ఉన్నాయని, రూ. 50 వేల నుంచి రూ. 2 లక్షల ఖరీదైన విగ్రహాలు భారత్‌లో అధికంగా విక్రయం అవుతున్నాయని యాద్రో ఇండియా సీఈఓ నిఖిల్ లంబా తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా యాద్రో 120 దేశాల్లో పోర్స్లైన్ శిల్పాలను విక్రయిస్తోంది. ప్రపంచ వ్యాప్త అమ్మకాల్లో భారత్ వాటా 6-7 శాతం ఉంటుందని, విక్రయాల్లో ఏటా 12-15 శాతం వృద్ధిని నమోదు చేస్తున్నామని వివరించారు. యాద్రో విక్రయించే శిల్పాల్లో 'కార్నివాల్ ఇన్ వెనిస్' ధర అత్యధికంగా రూ. 1.66 కోట్లు. వాలెన్సియాలోని ఫ్యాక్టరీలో మాత్రమే ఈ విగ్రహాలను కంపెనీ తయారు చేస్తుంది. ఒక్కో విగ్రహాన్ని తయారు చేయడానికి 6 నెలల నుంచి సంవత్సరం పడుతుందని లంబా తెలిపారు. వేంకటేశ్వర స్వామి శిల్పాలను తయారు చేసే ఆలోచన ఉన్నట్లు చెప్పారు.



హైదరాబాద్‌లోని బొటిక్‌లో యాద్రో ఇండియా సీఈఓ నిఖిల్ లంబా

మోటరోలా కొత్త స్మార్ట్‌ఫోన్లు

దిల్లీ: వెనుకవైపు రెండు కెమేరాలతో మోటరోలా కొత్త స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. మోటో జీ5ఎస్ (రూ. 13,999), మోటో జీ5ఎస్ ప్లస్ (రూ. 15,999) విడుదల చేసింది. మోటో జీ5ఎస్ విక్రయశాలల్లో, మోటో జీ5ఎస్ ప్లస్ మాత్రం ఆన్‌లైన్ పోర్టళ్లు అమెజాన్, మోటోహబ్‌లలో మాత్రమే లభిస్తుందని సంస్థ తెలిపింది.

సెస్సు.. ధరలు కస్సుబుస్సు



- విలాసవంతమైన కార్లపై 25 శాతానికి సెస్
- జీఎస్‌టీ చట్ట సవరణకు ఆర్డినెన్స్ ఆమోదం
- ధరలు పెంచుతామంటున్న తయారీదార్లు
- ఆ లోపు కార్లు కొనాలనుకుంటున్న కొనుగోలుదార్లు

ఈనాడు వాణిజ్య విభాగం

డామిట్ కథ అడ్డం తిరిగింది. జులై 1 తర్వాత అమలైన వస్తువులు, సేవల పన్ను(జీఎస్‌టీ) వల్ల ఎస్‌యూవీలు, మధ్య స్థాయి, పెద్ద, విలాసవంతమైన కార్ల ధరలు కాస్త చౌకయ్యాయి. అయితే ఇపుడు అవన్నీ మళ్లీ ప్రియం కానున్నాయి. ఇప్పటిదాకా సెస్ 15 శాతంగా ఉండగా.. తాజాగా దీనిని 25 శాతానికి పెంచడానికి వీలయ్యేలా జీఎస్‌టీ చట్టానికి సవరణ చేయనున్నారు. ఆ మేరకు ఆర్డినెన్స్‌కు కేంద్ర మంత్రి మండలి ఆమోదం తెలపడమే ఇందుకు నేపథ్యం.

అప్పుడే ఎందుకు

తాజా పరిణామం వల్ల వాహన రంగ వృద్ధిపై ప్రభావం పడుతుందని మెర్సిడెజ్ బెంజ్, ఆడి, జేఎల్‌ఆర్ వంటి విలాసవంత కార్ల తయారీ కంపెనీలు అభిప్రాయపడుతున్నాయి. జీఎస్‌టీ ప్రభావం ఎలా ఉంటుందో ఆరు నెలల పాటు పరిశీలించిన తర్వాత సెస్‌పై కేంద్రం నిర్ణయం తీసుకుని ఉంటే బాగుండేదని.. అంత తొందర ఇపుడు ఏమొచ్చిందని అవి విమర్శిస్తున్నాయి. విలాసవంతమైన కార్లకు గిరాకీని పెంచకపోగా.. వృద్ధిపై ఈ నిర్ణయం ప్రభావం చూపుతుందని అంటున్నాయి. ఎందుకంటే జీఎస్‌టీ కింద ఇప్పటికే విలాసవంతమైన కార్లపై అధిక పన్ను రేటు ఉందని.. ఇక సెస్సు పెంపుతో జీఎస్‌టీకి ముందు పన్నుల కంటే ఎక్కువ స్థాయికి పన్ను రేట్లు వెళతాయని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సెస్ పెంపు వల్ల భవిష్యత్ ప్రణాళికలపై ప్రభావం పడొచ్చని కూడా వారు అంటున్నారు.

ప్రభుత్వం ఆలోచన ఏమిటంటే..

జీఎస్‌టీ అమలు తర్వాత మోటార్ వాహనాలపై మొత్తం పన్ను(జీఎస్‌టీ+పరిహార సెస్) కాస్తా.. జీఎస్‌టీ కంటే ముందు పన్నుతో పోలిస్తే కిందకు వచ్చింది. జీఎస్‌టీకి ముందు మోటార్ వాహనాలపై మొత్తం పన్ను 52-54.72 శాతంగా ఉంది. దీనికి సీఎస్‌టీ, ఆక్ట్రాయ్ కింద మరో 2.5 శాతం అదనం. దీనితో పోలిస్తే జీఎస్‌టీ అమలయ్యాక మొత్తం పన్నే(43 శాతం) తక్కువగా ఉంది. దీంతో గరిష్ఠ సెస్ వర్తించేలా చట్టబద్ధ సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి జీఎస్‌టీ మండలి సిఫారసు చేసింది. దీనికి ఆర్థిక శాఖ ఆమోదమూ దక్కింది.

జీఎస్‌టీ తర్వాత ధరల కోతలను ప్రకటించిన కంపెనీలు

మోడల్	ధర(రూ.లలో)
ఆల్టో	2000-5000
వ్యాగన్‌ఆర్	5000-8300
స్విఫ్ట్	6700-10,700
విటారా బ్రెజా	10,400-14,700
వెర్నా, ఎలాంట్రా	27,000-70,000
టియాగో, జెస్ట్, ఇండికా	5,000-21,000
ఎథియోస్, కరోలా	57,000 దాకా
క్విడ్, పల్స్	17,000 దాకా

ఇక పెరుగుతాయ్

జీఎస్‌టీ తర్వాత పన్ను రేట్లు తగ్గడంతో చాలా వరకు ఎస్‌యూవీ మోడళ్ల ధరలు తగ్గాయి. రూ. 1-3 లక్షల వరకు తగ్గించారు. సెస్ పెంపుతో ఆ తగ్గింపులను కంపెనీలు ఉపసంహరించుకోవడంతో పాటు మరికొంత పెంచే అవకాశం ఉందని విశ్లేషకులు అంటున్నారు.(అప్పట్లో తగ్గిన రేట్లను పట్టికలో చూడొచ్చు). ఇప్పటికే మారుతీ సుజుకీ తమ వాహన ధరలను పెంచుతామని ప్రకటించడం గమనార్హం.

ఇప్పుడే కొనేస్తే పోలా..

ప్రభుత్వం విలాసవంతమైన కార్లపై సెస్‌ను 15 శాతం నుంచి 25 శాతానికి పెంచడానికి జీఎస్‌టీ చట్టానికి సవరణ చేయడానికి కేబినెట్ ఆర్డినెన్స్‌కు అనుమతినిచ్చినప్పటికీ.. ఎప్పటి నుంచి ఈ పెంపు ఉంటుందనేది జీఎస్‌టీ మండలి నిర్ణయిస్తుంది. మరి ఆ లోపు విలాసవంతమైన కార్లను కొనుగోలు చేస్తే ఆ భారం తప్పించుకోవచ్చని కొంత మంది భావిస్తున్నారు. భావించడం ఏమిటి.. అసలు ఈ ప్రతిపాదన వచ్చిన(ఆగస్టు 6) రోజు నుంచే బుకింగ్‌లు పెరిగాయని కొన్ని వాహన కంపెనీలు చెబుతున్నాయి. అదీకాక కొన్ని రాష్ట్రాల్లో పండుగల సీజను మొదలైంది. ఇది కూడా గిరాకీని పెంచొచ్చని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే కొన్ని మోడళ్లకు వేచిచూసే సమయం అమాంతం పెరిగిపోయింది. ఉదాహరణకు.. ఇన్నోవా క్రిస్టా, ఫార్చునర్‌లకు ఈ సమయం వరుసగా రెండు, మూడు నెలలకు చేరింది. సెస్ 10% పెరిగితే ఫార్చునర్ రూ. 2 లక్షల దాకా, ఇన్నోవా రూ. లక్ష దాకా ప్రియం కావొచ్చని టయోటా డీలర్లు కొందరు అంచనా వేస్తున్నారు.

సెస్ పెంపు వీటిపై..

అన్ని కార్లకు జీఎస్‌టీ 28 శాతంగా ఉన్నప్పటికీ.. పెద్ద కార్లు, ఎస్‌యూవీలు, మధ్య స్థాయి, హైబ్రిడ్ కార్లపై 15 శాతం సెస్సు అదనంగా విధించారు. చిన్న పెట్రోలు కార్ల(4 మీటర్ల లోపు, 1200 సీసీ కంటే తక్కువ ఇంజిన్ సామర్థ్యం)పై 1 శాతం సెస్, చిన్న డీజిల్ కార్ల(4 మీటర్ల లోపు; 1500 సీసీ ఇంజిన్ సామర్థ్యం లోపు)పై 3 శాతం సెస్ ఉంటోంది. ఇపుడు తాజా సెస్ పెంపు కింది వాటికి వర్తిస్తుంది.

- ✦ అన్ని మధ్య స్థాయి, పెద్ద కార్లు, ఎస్‌యూవీలు, మోటార్ వాహనాలు(పది కంటే ఎక్కువ మంది, 13 కంటే తక్కువ మంది ప్రయాణించేవి).
- ✦ 1500 సీసీ కంటే ఎక్కువ ఇంజిన్ సామర్థ్యం ఉన్న హైబ్రిడ్ వాహనాలు; మధ్య స్థాయి హైబ్రిడ్ కార్లు(1500 సీసీ కంటే తక్కువ సామర్థ్యం ఉన్నవి).



బుధవారం రామోజీ ఫిల్మ్ సిటీలో డాల్ఫిన్ హోటల్స్ 20వ వార్షికోత్సవం సందర్భంగా కేక్ కోస్తున్న ఎండీ సీహెచ్ విజయేశ్వరి, రామోజీ ఫిల్మ్ సిటీ ఎండీ రామ్మోహన్ రావు, డాల్ఫిన్ వైస్ ప్రెసిడెంట్ రాజేంద్ర ప్రసాద్. చిత్రంలో రామోజీ గ్రూప్ మానవవనరుల విభాగాధిపతి గోపాల్‌రావు, సుధాకర్ బాబు, కన్సల్టెంట్ తిమ్మయ్య తదితరులు

ఆతిథ్య రంగంలో అగ్రగామిగా నిలుస్తాం

- డాల్ఫిన్ హోటల్స్ ఎండీ విజయేశ్వరి
- కనులపండువగా 20వ వార్షికోత్సవం
- ఉద్యోగులకు ప్రోత్సాహక బహుమతుల ప్రదానం

అబ్దుల్లాపూర్‌మెట్, న్యూస్‌టుడే : రామోజీ గ్రూప్ ఛైర్మన్ రామోజీరావు లక్ష్యాలకు అనుగుణంగా డాల్ఫిన్ హోటల్స్‌ను అగ్రగామిగా నిలుపుతామని డాల్ఫిన్ హోటల్స్ ఎండీ సీహెచ్. విజయేశ్వరి పేర్కొన్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీలో బుధవారం జరిగిన డాల్ఫిన్ హోటల్స్ 20వ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్పును ఆహ్వానిస్తూ.. సిద్ధాంతాలకు అనుగుణంగా అత్యుత్తమ సేవలందిస్తూ సంస్థకు మంచి పేరు తీసుకురావాలన్నారు. నగరంలోని 320 హోటళ్లలో ప్రథమ స్థానం సాధించిన తార హోటల్ బృందాన్ని ఆమె అభినందించారు. అదే స్ఫూర్తితో అందరూ ముందుకుసాగాలన్నారు. ప్రపంచంలోనే ప్రత్యేక స్థానం కలిగిన రామోజీ ఫిల్మ్‌సిటీకి ఉన్న గుర్తింపును దృష్టిలో పెట్టుకొని అతిథులకు ఉత్తమ సేవలందిస్తామని ఆమె స్పష్టం చేశారు. రామోజీ ఫిల్మ్‌సిటీ ఎండీ రామ్మోహన్‌రావు, సీఈఓ రాజీవ్ జల్నాపుర్కర్, రామోజీ గ్రూప్ సంస్థల మానవ వనరుల విభాగం ప్రెసిడెంట్ డా. గోపాల్‌రావు, డాల్ఫిన్ హోటల్స్ వైస్‌ప్రెసిడెంట్ సుధాకర్‌బాబు, వైస్‌ప్రెసిడెంట్(ఆపరేషన్స్) రాజేంద్రప్రసాద్, కన్సల్టెంట్ తిమ్మయ్య తదితరులు మాట్లాడుతూ అతిథుల అభినందనలే నిత్య అవార్డులుగా స్వీకరిస్తూ పనిచేయాలన్నారు. ఉద్యోగుల సంక్షేమానికి అమలు చేస్తున్న కార్యక్రమాలను డా. గోపాల్‌రావు వివరించారు. 20వ వార్షికోత్సవం సందర్భంగా సుమారు 218 మంది ఉద్యోగులకు రూ. 25లక్షల విలువైన బహుమతులు అందజేశారు. 88 మంది ఉద్యోగులకు లాయల్టీ అవార్డులుగా ఒక్కొక్కరికి రూ. 25వేల విలువ చేసే బంగారు నాణాన్ని అందజేశారు. ఉత్తమ నాయకత్వ(బెస్ట్ లీడర్‌షిప్) అవార్డును జి. శ్రీనివాస్‌కు ప్రకటించారు. అంతకుముందు అతిథులు కేక్ కోశారు. ఉద్యోగుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



ఎయిరిండియా వాటా విక్రయం త్వరలో !

- ఆర్థిక మంత్రి జైట్లీ సంకేతాలు
- కొనుగోలుకు 2 సంస్థల ఆసక్తి

దిల్లీ: ఎయిరిండియాలో వాటా విక్రయంపై ప్రభుత్వం వేగంగా నిర్ణయం తీసుకుంటుందనే దిశగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ సంకేతాలు ఇచ్చారు. ఎయిరిండియాలో వాటా కొనేందుకు ఆసక్తిగా ఉన్నామని ఇప్పటికే 2 సంస్థలు తెలిపాయని మంత్రి పేర్కొన్నారు. నష్టాలతో కొట్టుమిట్టాడుతున్న ఎయిరిండియాలో వ్యూహాత్మక వాటా విక్రయానికి, విధి విధానాలు నిర్ణయించేందుకు జైట్లీ నేతృత్వంలో మంత్రివర్గ బృందం పనిచేస్తోంది. ఈ బృందం సమావేశమయ్యాక, మంత్రి విలేకరులతో మాట్లాడారు. 'ఎయిరిండియాలో వాటా విక్రయం కోసం సలహాదారులను నియమించాలని నిర్ణయించాం' అని జైట్లీ ఇక్కడ తెలిపారు. ఎయిరిండియా, దాని అనుబంధ 5 సంస్థల్లో వ్యూహాత్మక వాటాల విక్రయానికి గత జూన్‌లో కేంద్ర మంత్రివర్గం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిన సంగతి విదితమే. ఎయిరిండియా ఎయిర్ ట్రాన్స్‌పోర్ట్ సర్వీసెస్ (ఏఐఏటీఎస్ఎల్), ఎయిరిండియా చార్టర్స్ లిమిటెడ్, ఐఏఎల్ ఎయిర్‌పోర్ట్ సర్వీసెస్, ఎయిర్‌లైన్ అలైడ్ సర్వీసెస్, ఎయిరిండియా ఇంజినీరింగ్ సర్వీసెస్ లిమిటెడ్ అనుబంధ సంస్థలుగా ఉన్నాయి. ఎయిరిండియాను పూర్తిగా ప్రైవేటీకరించాలని నీతి ఆయోగ్ కూడా సూచించింది. రూ. 52,000 కోట్ల రుణభారం కలిగిన ఎయిరిండియా, 2012లో యూపీఏ ప్రభుత్వం ప్రకటించిన రూ. 30,000 కోట్ల ఉద్దీపన పథకం ఆధారంగా మనుగడ సాధిస్తోంది.

అనుబంధ సంస్థపై బర్డ్‌గ్రూప్ ఆసక్తి

ఎయిరిండియాకు చెందిన గ్రౌండ్ హ్యాండ్లింగ్ సేవల అనుబంధ సంస్థ ఏఐఏటీఎస్ఎల్‌ను స్వాధీనం చేసుకునేందుకు ఆసక్తిగా ఉన్నామని విమానయాన సేవల సంస్థ బర్డ్ గ్రూప్ తెలిపిందని పౌరవిమానయాన కార్యదర్శి ఆర్.ఎన్.చౌబే తెలిపారు. ఎయిరిండియా అంతర్జాతీయ సేవల విభాగాన్ని తీసుకోవడంపై ఇండిగో ఆసక్తి చూపిన సంగతి విదితమే. ఇప్పుడు ఎయిరిండియా అనుబంధ సంస్థపై బర్డ్‌గ్రూప్ ఆసక్తి చూపిందని వివరించారు. అసోచామ్ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వివరాలు తెలిపారు. సాధారణ విమానయాన సేవలతో పాటు విమానాశ్రయాల్లో విమానం కిందకు దిగే, పైకి ఎగిరే సందర్భాల్లో సేవలు (గ్రౌండ్‌హ్యాండ్లింగ్), సరకు నిర్వహణ సేవలు కూడా అందిస్తోంది. 'మేము ఎయిరిండియా అనుబంధ సంస్థను కొనుగోలు చేయాలనుకోవడం లేదు. బిడ్ వేస్తాం. ఎయిరిండియా, అనుబంధ సంస్థల్లో వాటాలను విడిగా విక్రయించమని ప్రభుత్వాన్ని కోరాం' అని బర్డ్‌గ్రూప్ ప్రతినిధి తెలిపారు.

ఎగవేతదార్లను వదిలిపెట్టం

పన్ను ఎగవేతదార్లపై ప్రభుత్వం దృష్టి సారించనుంది. జీఎస్‌టీ అనంతరం పన్ను చెల్లింపులకు, ఇన్‌వాయిస్‌లకు తేడా ఉంటే ఐటీ విభాగం వారిని వదిలిపెట్టదని ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పేర్కొన్నారు. గత రెండు మూడేళ్లలో పన్ను ఎగవేత క్లిష్టంగా మారిందని కూడా ఆయన అన్నారు. ఇది చాలా మందికి దిగ్భ్రాంతికి గురిచేసిందని జైట్లీ వివరించారు. జీఎస్‌టీ వల్ల పరోక్ష పన్ను వసూళ్లతో పాటు.. ప్రత్యక్ష పన్ను వసూళ్లు కూడా పెరిగే అవకాశం ఉంది. పన్నుల విషయంలో నిజాయతీగా ఉన్నవారిని వేధించే అవకాశమే లేదని.. ఓచర్లు సరిపోలకపోతే మాత్రం ఐటీ విభాగం నుంచి ప్రశ్నలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఆయన అన్నారు. జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన జీఎస్‌టీ కింద ఇన్‌పుట్ క్రెడిట్ ప్రయోజనాన్ని పొందవచ్చు. ఇందు కోసం ఇన్‌వాయిస్‌లను జతపరచాల్సి ఉంటుంది. పన్ను చెల్లింపుదారు, అధికారి భౌతికంగా కలావాల్సిన అవసరం లేకుండా మరింత సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాల్సి ఉందని జైట్లీ అన్నారు. అదే సమయంలో ఎవరైనా పన్ను ఎగవేతకు పాల్పడుతుంటే కర్ర పట్టుకుని వారిని దారిలోకి తీసుకురావాల్సిన అవసరం కూడా ఉందని తేల్చి చెప్పారు.

గతేడాది 'శివాయ్'తో మంచి విజయాన్నందుకున్నాడు అజయ్ దేవగణ్. ఈ ఏడాది 'బాద్షాహో'తో ప్రేక్షకుల ముందుకొస్తున్నాడు. ఈ చిత్రంలో అజయ్‌తో పాటు ఇమ్రాన్ హష్మి మరో కథానాయకుడిగా నటించాడు. ఇలియానా, ఇషా శర్మ నాయికలుగా అలరించనున్నారు. సన్నీ లియోని ప్రత్యేక గీతంలో అందాల కనువిందు చేయనుంది. విద్యుత్ జమ్‌వాల్, సంజయ్ మిశ్రా కీలక పాత్రల్లో కనిపిస్తారు. ఈ చిత్రానికి మిలన్ లూథ్రియా దర్శకత్వం వహించారు. 1975-77 మధ్య ఎమర్జెన్సీ కాలంలో జరిగే యాక్షన్ థ్రిల్లర్ కథతో ఈ చిత్రం తెరకెక్కింది. ఈ శుక్రవారం ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆ చిత్ర విశేషాలివీ.

దొంగ.. పోలీసు.. మేజర్.. మధ్యలో మహారాణి!



మిలన్ లూథ్రియా 'డర్టీపిక్చర్', 'ఒన్స్ ఎపాన్ ఏ టైమ్ ఇన్ ముంబయి' లాంటి విజయవంతమైన చిత్రాలతో గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన చివరి సారిగా 2013లో అక్షయ్ కుమార్‌తో 'ఒన్స్ ఎపాన్ ఏ టైమ్ ఇన్ ముంబయి దొబారా'ను తెరకెక్కించాడు. నాలుగేళ్ల విరామం తర్వాత ఇప్పుడు 'బాద్షాహో'ను రూపొందించాడు. గతేడాది స్వీయ దర్శకత్వంలో వచ్చిన 'శివాయ్'తో ఘన విజయాన్నందుకున్నాడు అజయ్ దేవగణ్. ఆ ఉత్సాహంతో 'బాద్షాహో'లో నటించాడు. ఆయనకు తోడు యువ కథానాయకుడు ఇమ్రాన్ హష్మి, అందాల ముద్దుగుమ్మలు ఇలియానా, ఇషా శర్మ నటించడంతో చిత్రంపై మంచి అంచనాలున్నాయి.

కలయికల్లో ఎన్ని ప్రత్యేకతలో

ఈ చిత్రం కాంబినేషన్ల పరంగా ప్రత్యేకంగా నిలిచింది. అజయ్ దేవగణ్‌తో మిలన్ లూథ్రియా రూపొందించిన నాలుగో చిత్రమిది. మరో కథానాయకుడు ఇమ్రాన్ హష్మి మిలన్ దర్శకత్వంలో నటించిన మూడో చిత్రం. అజయ్ దేవగణ్, ఇమ్రాన్ హష్మి గతంలో 'ఒన్స్ ఎపాన్ ఎ టైమ్ ఇన్ ముంబయి', 'దిల్‌తో బచ్చా హై జీ' చిత్రాల్లో కలసి నటించారు. 'బాద్షాహో'తో వారు మూడోసారి తెరను పంచుకున్నారు. 'జన్నత్ 2', 'రాజ్ 3' తర్వాత ఇమ్రాన్, ఇషా గుప్తా కలసి నటించిన మూడో చిత్రమిది. 'రుస్తుం' తర్వాత ఇలియానా, ఇషా గుప్తా ఈ చిత్రంతో మరోసారి తెరను పంచుకున్నారు.

దొంగా పోలీసాట

ఎమర్జన్సీ కాలం నాటి యధార్థ సంఘటన ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. ఇందులో అజయ్ దేవగణ్ దొంగగా, ఇమ్రాన్ హష్మి అండర్‌కవర్ పోలీస్‌గా, విద్యుత్ జమ్‌వాల్ మేజర్‌గా, ఇలియానా మహారాణి గాయత్రీదేవి స్ఫూర్తితో రూపొందిన పాత్రలో నటిస్తున్నారు. ప్రధానంగా ఈ నలుగురి చుట్టే కథ నడుస్తుంది. బంగారం భారీ చోరీ నేపథ్యంలో నడిచే ఈ చిత్రంలో దొంగకు, పోలీస్‌కు మధ్య వచ్చే యాక్షన్ సన్నివేశాలు థ్రిల్లింగ్‌గా ఉంటాయని చిత్రబృందం చెబుతోంది. ఈ ఏడాది జనవరిలోనే విడుదల కావాల్సిన ఈ చిత్రం పలు కారణాలతో వాయిదాలు పడుతూ ఇప్పుడు విడుదలవుతోంది.

అభిమానుల కోసమే ఈ నిర్ణయం


ఎన్టీఆర్

ఎన్టీఆర్ కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'జై లవకుశ'. రాశీఖన్నా, నివేదా థామస్ కథానాయికలు. బాబి దర్శకుడు. కల్యాణ్ రామ్ నిర్మాత. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని గీతాల్ని సెప్టెంబరు 3న విడుదల చేయనున్నారు. 10న ట్రైలర్ ఆవిష్కరిస్తారు. దసరా సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి చిత్రబృందం సన్నాహాలు చేస్తోంది. కల్యాణ్‌రామ్ మాట్లాడుతూ "ఆడియో వేడుక భారీ ఎత్తున నిర్వహిద్దామనుకొన్నాం. కానీ అభిమానుల భద్రతని దృష్టిలో ఉంచుకొని సీడీల్ని నేరుగా మార్కెట్‌లోకి విడుదల చేస్తున్నాం. అత్యుత్తమ సాంకేతిక విలువలతో తెరకెక్కించిన చిత్రమిది. సోదరుడు ఎన్టీఆర్‌తో ఓ చిత్రాన్ని నిర్మించడం సంతోషంగా ఉంద"న్నారు. ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: చోటా కె.నాయుడు, కళ: ఏఎస్ ప్రకాష్, కూర్పు: కోటగిరి వెంకటేశ్వరరావు.

పల్లెటూరి ప్రేమాయణం


బెల్లంకొండ శ్రీనివాస్, పూజా హెగ్డే

బెల్లంకొండ శ్రీనివాస్ కథానాయకుడిగా అభిషేక్ పిక్చర్స్ సంస్థ ఓ చిత్రాన్ని నిర్మిస్తోంది. పూజా హెగ్డే కథానాయిక. శ్రీవాస్ దర్శకుడు. అభిషేక్ నామా నిర్మాత. రామోజీ ఫిల్మ్‌సిటీలో రూపొందించిన ఓ భారీ సెట్‌లో కీలక సన్నివేశాల్ని తెరకెక్కించారు. ఇప్పుడు చిత్ర బృందం పొలాచ్చి వెళ్తోంది. అక్కడ నాయకానాయికలు, ఇతర ప్రధాన తారాగణంపై కొన్ని సన్నివేశాల్ని చిత్రీకరిస్తారు. "బలమైన కథ, కథనాల నేపథ్యంలో సాగే చిత్రమిది. పొలాచ్చిలో ఓ పల్లెటూరి సెట్ వేశాం. 15 రోజుల పాటు అక్కడే షూటింగ్ సాగుతుంది. ఇప్పటి వరకూ 40 శాతం చిత్రీకరణ పూర్తయింది. త్వరలో పీటర్ హెయిన్స్ ఆధ్వర్యంలో పోరాట సన్నివేశాల్ని తెరకెక్కిస్తాం. ప్రేక్షకుల్ని ఉత్కంఠకు గురి చేసే అంశాలు ఈ చిత్రంలో చాలా ఉన్నాయ"న్నారు నిర్మాత. జగపతిబాబు, శరత్‌కుమార్, మీనా, వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్

షాలిని...కహానీ


అర్చన

అమోగ్ దేశపతి, అర్చన, శ్రేయవ్యాస్ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'షాలిని'. షెరాజ్ దర్శకత్వం వహించారు. సాయివెంకట్ సమర్పకుడు. పి.వి. సత్యనారాయణ నిర్మాత. సెప్టెంబర్ 2న విడుదల కానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో చిత్రబృందం విలేకర్ల సమావేశాన్ని ఏర్పాటు చేసింది. దర్శకుడు మాట్లాడుతూ "పల్లె నుంచి పట్నం వెళ్లిన ముగ్గురు ఓ భవంతిలో బస చేస్తారు. అక్కడ వీరిని ఓ దెయ్యం భయపెడుతూ, చంపే ప్రయత్నాలు చేస్తుంది. ఇంతకీ ఈ దెయ్యం ఎవరు? ఎందుకు చంపాలనుకొంటోంది? అనే అంశాల్ని సినిమా చూసి తెలుసుకోవాల"న్నారు. "నవనీత్ స్వరపరచిన పాటలకి చక్కటి ఆదరణ లభిస్తోంద"న్నారు నిర్మాత.

కళ్ల ముందు కటిక నిజం
కానలేని గుడ్డి జపం
సాధించదు ఏ పరమార్థం
బ్రతుకును కానీయకు వ్యర్థం

గీతం: చుట్టుపక్కల చూడరా చిన్నవాడా...
చిత్రం: రుద్రవీణ
రచన: సిరివెన్నెల సీతారామశాస్త్రి
- పంపినవారు: తమ్మినేని చంద్రబాబు, జంబులపాడు

గీతోపదేశం

ఈనాడు సినిమా



నందమూరి బాలకృష్ణ... బాక్సాఫీసుకి ఓ కొత్త ఉత్సాహం తెప్పించే పేరు. రికార్డులకి పని పెట్టే ఓ వ్యాపార సూత్రం. నాలుగు దశాబ్దాలుగా ఆయన తెలుగు సినిమా పరిశ్రమపై తిరుగులేని ప్రభావాన్ని చూపిస్తున్నారు. ఎలాంటి పాత్రలోనైనా ఇట్టే ఒదిగిపోతారు. ఎప్పటికప్పుడు ఓ కొత్త ట్రెండ్‌ని సృష్టిస్తారు. ఇటీవలే సెంచరీ పూర్తి చేసిన బాలకృష్ణ... ఇప్పుడు మరింత వేగం పెంచారు. వరుసగా సినిమాలు చేస్తూ అభిమానుల్ని అలరిస్తున్నారు. పూరి జగన్నాథ్ దర్శకత్వంలో నటించిన 101వ చిత్రం 'పైసా వసూల్' శుక్రవారమే ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బాలకృష్ణతో 'ఈనాడు సినిమా' ప్రత్యేకంగా ముచ్చటించింది. ఆ విషయాలివీ...

వారసత్వంగా పొందిందీ.. నిలబెట్టుకొన్నదీ అదే!

ఎన్టీఆర్ జీవిత చరిత్రపై సినిమా త్వరలోనే ప్రారంభం

'పైసా వసూల్' నా మొదటి సినిమా అని వేడుకల్లో చెప్పారు...

ఒక కొత్త ఉత్సాహంతో చేసిన సినిమా ఇది. ఇది వరకు నేనేం చేశాననేది పక్కనపెట్టి తాజా ఆలోచనలతో ఈ సినిమా చేశా. ప్రచార చిత్రాలు చూసినవాళ్లంతా కూడా 'ఓ కుర్రాడిలా.. ఇంతకు ముందు సినిమాలతో పోలిస్తే పూర్తి భిన్నంగా కనిపిస్తున్నార'ని అంటున్నారు. వంద సినిమాల తర్వాత ఒక నటుడికి అలాంటి ప్రశంస రావడం అంటే మాటలు కాదు. అలాంటి కొత్త పాత్రలు చేసే అవకాశం దొరకడమే నా అదృష్టం.

చారిత్రక చిత్రం 'గౌతమిపుత్ర శాతకర్ణి' తర్వాత, 'పైసా వసూల్' ఎంచుకోవడానికి కారణమేమైనా ఉందా?

నా అనుభవమే ఆ నిర్ణయం తీసుకోవడానికి కారణం. ఎప్పుడైనా నా స్ఫురణలోకి వచ్చిన ఆలోచనే సరైనదని నమ్ముతా. పక్కనోళ్లు చెడగొడితే చెప్పలేమంతే. ఇకపై దానికి కూడా ఆస్కారమివ్వను. స్వతహాగా నేను తీసుకొన్న నిర్ణయాలు మంచి ఫలితాల్నిస్తుంటాయి. ఒక కథని విన్నాక దాని గురించి ఓ నిర్ణయం తీసుకోవడానికి సమయం తీసుకొనే అలవాటు కూడా నాకు లేదు. 'గౌతమిపుత్ర...' తర్వాత, అందుకు భిన్నమైన ఓ క్రేజీ ప్రాజెక్టు అయితేనే బాగుంటుందని నమ్మా.

ఈ కథలో మిమ్మల్ని ఆకట్టుకొన్న విషయాలేమిటి?

పూరి జగన్నాథ్‌కి ఓ బ్రాండ్ ఉంది. ఆయన కథలు, పాత్రలు ప్రేక్షకుడికి వెంటనే నచ్చేస్తాయి. పూరి 'పైసా వసూల్' కథ చెప్పగానే వందశాతం బాగుందనే ఓ నమ్మకం, ధైర్యం కలిగాయి. ఆ రెండే నాతో ఈ సినిమాని చేయించాయి. నాతో ఇలాంటి సినిమా చేయమని నా ఇష్టాన్ని దర్శకులపై రుద్దడం నాకు నచ్చదు. నాతో ఎలాంటి సినిమా చేస్తే బాగుంటుందనే విషయాన్ని దర్శకులకే వదిలేస్తా.

పూరి జగన్నాథ్ పనితీరుపై మీ అభిప్రాయం?

నేనే సినిమా చేసినా దర్శకుడు నాలో పరకాయ ప్రవేశం చేయాల్సిందే. దర్శకుల నటుడిని నేను. ఈ సినిమా విషయంలోనూ పూరి జగన్నాథ్‌నే అనుసరించా. ఆయన సృష్టించే పాత్రల హావభావాలు, ఆయన రాసే సంభాషణలు చాలా బాగుంటాయి. నటిస్తున్నప్పుడు నాకే కొత్తగా అనిపించాయి. ఇందులో నా డైలాగ్ డెలివరీ కూడా చాలా బాగుంటుంది. పూరి సినిమా సెట్‌లో వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది.

ఇదివరకు పనిచేయని దర్శకులతోనే ఎక్కువగా సినిమాలు చేస్తున్నారు. కొత్తదనం కోసమేనా?

కొత్త కాంబినేషన్లు అవసరం. కొత్తవాళ్లతో పనిచేస్తున్నకొద్దీ మనకు తెలియని మరిన్ని విషయాలు అర్థమవుతుంటాయి.

'రామకృష్ణ థియేటర్ సందుల్లో పెరిగినోడిని, నాది నేల టికెట్ బ్యాచ్' అంటున్నారు. అసలు మీరు సినిమా చూసే విధానం ఎలా ఉంటుంది?

థియేటర్‌కి వెళ్లానంటే నేనొక నటుడిని అనే విషయం మరిచిపోతా. సగటు ప్రేక్షకుడినే. ఉత్సాహం కలిగితే ఈలలు వేస్తా, చప్పట్లు కొడతా. మల్టీప్లెక్స్ థియేటర్‌కి వెళ్లినా సరే నా పద్ధతి మారదు. నేనే కాదు, మా అభిమానులు కూడా అంతే. నా సినిమాల్ని థియేటర్లలో చూడటమే వాళ్లకిష్టం. మల్టీప్లెక్స్‌ల్లోనూ వాళ్లు పేపర్లు ఎగరేస్తూ, సందడి చేస్తూ సినిమాల్ని ఆస్వాదిస్తుంటారు. 'సింహా' నుంచే ఆ ట్రెండ్ మొదలైంది. నిజంగానే నేను రామకృష్ణ థియేటర్ సందుల్లో పెరిగినోడిని. ఆరో యేట నుంచే అక్కడున్నా. ట్రూప్ బజార్, సుల్తాన్ బజార్, ఓల్డ్ సిటీల్లో ఎక్కువగా తిరిగేవాణ్ని.

వంద తర్వాత మరింత వేగం పెంచినట్టున్నారు...

పరిశ్రమపై ఎంతో మంది ఆధారపడుతున్నారు. వాళ్లందరికీ ఉపాధి దొరకాలంటే వేగంగా సినిమాలు చేయాల్సిందే. నా సినీ ప్రయాణం మొదలై 43 యేళ్లు అయింది. ఆరంభంలో నాన్నగారు చదువుపై దృష్టిపెట్టు అని చెప్పేవారు. స్వతహాగా నేను నాణ్యతకి ప్రాధాన్యమిస్తూ సినిమాలు చేశా. లేదంటే నా సినిమాల సంఖ్య ఇంకా ఎక్కువగానే ఉండేది.

> "పని లేకపోతే పిచ్చిపడుతుంది నాకు. నా స్వభావానికి తగ్గట్టుగానే అవకాశాలు వస్తున్నాయి. ఉదయం 3.30 గంటలకే లేస్తాను కాబట్టి నాకు లాంగ్ డే ఉంటుంది. నటుడిగా, ఎమ్మెల్యేగా, బసవ తారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్‌గా నేను చేస్తున్న పనులన్నీ సంతృప్తినిస్తున్నాయి"

మీ వేగానికి తగ్గట్టుగానే కథలొస్తున్నాయి కదా..

కథలు ఎప్పుడూ పుడుతూనే ఉంటాయి. ఎంపిక కీలకం. నాకు ఒక సాంకేతిక నిపుణుడి మీద గురి కుదరాలి. మంచి సినిమా చేద్దామనే ఆసక్తితో వచ్చినవాళ్లతోనే కలిసి ప్రయాణం చేస్తుంటా.

పరిశ్రమలో ఎవరినీ ఎక్కువగా కలవరు. మరి ట్రెండ్, ప్రేక్షకుల అభిరుచులు ఎలా తెలుస్తాయి?

జనం మధ్య ఉండే మనిషిని నేను. అక్కడే నాకు అన్నీ తెలిసిపోతుంటాయి. అభిమానులు కూడా మాకు ఇలాంటి సినిమా కావాలని నాకు ఎప్పుడూ చెప్పరు. చెప్పాలని వస్తుంటారు కానీ, వాళ్లు నా ముందుకొచ్చి నిలబడగానే అన్నీ మరిచిపోతారు. ఇక ట్రెండ్ అంటారా? ఆ విషయాన్ని అంతగా నమ్మను. మేం సృష్టించేదే ట్రెండూ, రికార్డు.

ప్రేక్షకుల్లోకి నేరుగా వెళ్లిపోతుంటారు. సెట్‌లోనూ నేలమీద పడుకొని నిరాడంబరంగా గడుపుతుంటారు. ఆ విషయంలో మీకు స్ఫూర్తి ఎవరు?

సెట్‌లో ఇప్పుడున్నన్ని సదుపాయాలు ఇదివరకు ఉండేవా? సన్నివేశం పూర్తవ్వగానే ఎవరికివారు పక్కన ఓ కుర్చీ వేసుకొని కూర్చోవాల్సిందే. ఇప్పటికీ నాకదే అలవాటు. నేనెక్కడికి వెళ్లినా ప్రేక్షకులు వాళ్లలో ఒకడిగానే చూస్తుంటారు. వాళ్ల వర్గం వాడిగా, వాళ్ల ఊరి మనిషిగా చూస్తారు.



ఎన్టీఆర్ జీవిత కథతో తెరకెక్కబోయే సినిమా పనులు ఎంతవరకొచ్చాయి?

రెండు మూడు రోజుల్లో దర్శకుడు ఎవరనేది ప్రకటిస్తాం. సినిమా కూడా త్వరలోనే ప్రారంభమవుతుంది. పరిశోధన, స్క్రిప్టు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బంధువుల్ని, నాన్నగారి సహచరుల్ని, ఆయన దగ్గర పనిచేసిన అధికారుల్ని కలిసి వివరాలు సేకరిస్తున్నాం. ఈమధ్య నేను కూడా చెన్నైకి వెళ్లి అక్కడ కూడా పలువురిని కలిసొచ్చా. నాన్నగారు సినిమా రంగానికి రాక ముందు విషయాలు, ఊరికి సంబంధించినవీ తెలుసుకొంటున్నకొద్దీ ఆసక్తికరంగా అనిపిస్తున్నాయి.

పౌరాణిక చిత్రాలనగానే ఇప్పుడున్న తరంలో మొదట గుర్తుకొచ్చే నటుడు మీరే. ఆ చిత్రాల గురించి మీ ఆలోచనలు ఎలా ఉంటాయి?

పౌరాణిక చిత్రాలకి దర్శకులు, తారాగణం చాలా కీలకం. కొన్ని పాత్రలు గుర్తుకొచ్చినప్పుడు వాటికి సరిపడే నటులు ఎవరున్నారా? అనే ప్రశ్న ఉదయిస్తుంది. దాంతో ఆ ఆలోచన అక్కడితో ఆగిపోతుంది. నేను ఇదివరకు 'నర్తనశాల' మొదలుపెట్టా. ఇప్పుడు దాన్ని తీయాలంటే సౌందర్య కావాలి. పౌరాణిక స్క్రిప్టులతో దర్శకులు కూడా చాలా మందే వస్తున్నారు. కానీ ఎంతవరకు చేయొచ్చనేది చూడాలి. దర్శకుడు బాపుగారు కాబట్టే 'శ్రీరామరాజ్యం' చేశా. రామాయణంపై వాళ్లకు పూర్తి పట్టుంది. అలాంటి దర్శకులు, సరైన నటులు కుదిరితే చేయొచ్చు.

> "నేర్చుకోవాలనే తపన నన్ను మరింత ఉత్సాహంగా ముందుకు నడిపిస్తుంటుంది. 43 యేళ్ల అనుభవం నా వెనక ఉన్నా నేను ఇంకా తెలుసుకోవల్సింది చాలా ఉందనుకొంటా. దర్శకుడు ఒకసారి కథ చెప్పగానే అది నా మనసులో తిరుగుతూనే ఉంటుంది. అందులోని పాత్ర కోసం ఏం చేయాలి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? అనే ఆలోచిస్తుంటా. దానికితోడు ప్రతి క్షణం క్రమశిక్షణతో వ్యవహరించడం మరిచిపోను. నాన్నగారి నుంచి వారసత్వంగా పొందిందీ... నిలబెట్టుకొన్నదీ అదే"

ఈ ఏడాది తెలుగు చిత్రసీమకి మంచి ఫలితాలు లభిస్తున్నాయి. దానిపై మీ అభిప్రాయం?

చిత్రసీమ గ్లామర్‌గా ఉండాలి. గ్లామర్ అంటే కేవలం తారలకి సంబంధించిన విషయమే కాదు. నిర్మాతలకి కూడా గ్లామర్ కావాలి. విజయాలు నమోదైనప్పుడే అది సాధ్యమవుతుంది. ప్రస్తుతం తెలుగు చిత్రసీమ మంచి మార్గంలో వెళుతోంది. కొత్త రకమైన కథల సృష్టితో పాటు, ప్రేక్షకుల అభిరుచికి తగ్గట్టుగా సినిమాలు తీస్తుండడంతో విజయాలు సాధ్యమవుతున్నాయి. ఇది మంచి పరిణామం.

> "నంద్యాలలో తెదేపా విజయం నేను ఊహించిందే. మెజారిటీ కూడా 25 వేలు, 30 వేలు మధ్య రావడం ఖాయమని బావగారికి చెప్పా. అదే జరిగింది. తెలుగుదేశం ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాల్ని చూసే ప్రజలు విజయాన్ని కట్టబెట్టారు. హంద్రీనీవా సుజల స్రవంతికి పూర్తి స్థాయిలో నీళ్లు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నా."

కచేరీల కోసం రెహమాన్ ఏం చేస్తారు?



ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సినిమాలతో పాటు ప్రపంచవ్యాప్తంగా సంగీత కచేరీలు నిర్వహిస్తూ సంగీత ప్రియులను ఆనందింపచేస్తుంటారు. ఆ కచేరీల కోసం రెహమాన్ చేసే కసరత్తు వెనుక ఎన్నో ఆసక్తికర విశేషాలు ఉన్నాయట. వాటిని ప్రేక్షకుల కోసం ఓ సినిమా రూపంలో తెరపై ఆవిష్కరించబోతుండటం విశేషం. 'ఒన్ హార్ట్: ఏఆర్ రెహమాన్ కాన్సర్ట్ ఫిలిం' పేరుతో ఈ చిత్రం రాబోతోంది. అయితే ఇది డాక్యుమెంటరీ కాదు... నటన, పాటలు ఇలా సినిమాకు కావాల్సిన అన్ని అంశాలూ ఇందులో ఉంటాయని చెబుతున్నారు రెహమాన్. "నేను చేసిన సంగీత కచేరీలను రికార్డ్ చేయిస్తుంటాను. అవి చూసిన ఓ నిర్మాత వాటి ఆధారంగా సినిమా తీసే ప్రతిపాదన తీసుకొచ్చారు. నాకూ ఆ ఆలోచన నచ్చింది. తెరపై నన్ను నేను చూసుకోవడం నాకు నచ్చదు. అందుకే కొన్ని సన్నివేశాలను రీషూట్ చేశామ"ని చెప్పారు రెహమాన్. ఆయన జీవితంపై పుస్తకం రాసిన నస్రీన్ మున్నీ కబీర్ ఈ చిత్రానికి రచయితగా వ్యవహరించారు. ఈ చిత్రం ద్వారా వచ్చే ఆదాయాన్ని తన ఒన్ హార్ట్ స్వచ్ఛంద సంస్థ ద్వారా వృద్ధ సంగీత కళాకారుల వైద్యం కోసం వినియోగించనున్నట్లు చెప్పారు రెహమాన్. ఈ చిత్రం సెప్టెంబరు 7న విడుదలవుతుంది.


శర్వానంద్


నాగచైతన్య

రెండు చిత్రాలకు శ్రీకారం

హారిక హాసిని క్రియేషన్స్ అనుబంధ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్. 'ప్రేమమ్', 'బాబు బంగారం' ఈ సంస్థ నుంచే వచ్చాయి. ఇప్పుడు మరో రెండు కొత్త చిత్రాలకు శ్రీకారం చుట్టింది. ఓ చిత్రంలో నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తారు. మరో సినిమాలో శర్వానంద్ కథానాయకుడు. ఈ చిత్ర విశేషాల్ని నిర్మాత సూర్య దేవర నాగ వంశీ చెబూతూ "ఒకేసారి రెండు కొత్త చిత్రాలు ప్రకటించడం ఆనందంగా ఉంది. నాగచైతన్య - మారుతి కలయికలో ఓ సినిమా మొదలెడుతున్నాం. శర్వానంద్ చిత్రానికి సుధీర్ వర్మ దర్శకత్వం వహిస్తారు. పూర్తి వివరాలు త్వరలో ప్రకటిస్తామ"న్నారు.

చిత్తు కాలేదు.. ముంచెత్తాయి

● బ్యాంకులను 99శాతం నోట్లు

ముంబయి: రద్దయిన పెద్ద నోట్లపై ఎట్టకేలకు రిజర్వు బ్యాంకు వివరాలను వెల్లడించింది. నల్లధనం తులు భారీగా నష్టపోతారని, వారి వద్ద ఉన్న నగదు చిత్తుకాగితాలుగా మారిపోతాయని భావించిన వారికి నిరాశే ఎదురయింది. రద్దయిన రూ.500, రూ.1000 నోట్లలో దాదాపు 99 శాతం తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి చేరాయి. ఈ విషయాన్ని బుధవారం వెలువరించిన 2016-17 వార్షిక నివేదికలో పేర్కొంది.

నివేదికలో ఏముంది?

"తనిఖీ ప్రక్రియ పూర్తికానందున, భవిష్యత్తులో చేసే దిద్దుబాటుకు లోబడి, 2017 జూన్ 30 నాటికి రూ.15.28 లక్షల కోట్ల విలువైన స్పెసిఫైడ్ బ్యాంక్ నోట్లు (ఎస్‌బీఎన్‌లు) అందాయి" అని నివేదికలో ప్రస్తావించింది. ఈ కారణంగా రిజర్వుబ్యాంకుకు, ప్రభుత్వానికీ నష్టం జరిగినట్లు పేర్కొంది. 2016-17లో రిజర్వు బ్యాంకు ఆదాయం 23.56 శాతం మేర పడిపోయింది. వ్యయం 107.84 శాతం మేర పెరిగింది. మొత్తం మిగులులోనూ 53.46 శాతం తగ్గుదల కనిపించింది. 2015-16లో మిగులు రూ.65,876 కోట్లు ఉండగా, అది రూ.30,659 కోట్లుకు పడిపోయింది. ప్రభుత్వానికి రిజర్వు బ్యాంకు చెల్లించే డివిడెండ్‌లో తగ్గుదల కనిపించింది.

నకిలీ నోట్ల వివరాలేమిటి?

నోట్ల రద్దు కారణంగా 7,62,072 నకిలీ నోట్లను గుర్తించగలిగారు. అంతకుముందు సంవత్సరంతో పోల్చితే 2016-17లో నకిలీ నోట్లు 20.4 శాతం అధికంగా పెరిగినట్లు తేలింది. 2105-16లో 6.32 లక్షల నకిలీ నోట్లను గుర్తించారు. రూ.500 నోట్ల విభాగంలో ప్రతి పది లక్షలకు 7.1 నకిలీ నోట్లు, రూ.1000 విభాగంలో ప్రతి పది లక్షలకు 19.1 నకిలీ నోట్లు బయటపడ్డాయి. 2015-16లో ఇది 2.4, 5.8గా ఉండేది.

నేపాల్‌లోని నోట్లపై చర్చిస్తున్నాం

నేపాల్‌కు చెందిన ప్రజలు, అక్కడి ఆర్థిక సంస్థల వద్ద ఉన్న రద్దయిన నోట్లను తిరిగి తీసుకోవాలా వద్దా అన్న విషయమై ప్రభుత్వంతో చర్చిస్తున్నట్లు తెలిపింది. జిల్లా సహకార బ్యాంకులు నవంబరు 10-14 తేదీల మధ్య ఖాతాదార్ల నుంచి తీసుకున్న నోట్లను ఆమోదించాలని ప్రభుత్వం సూచించిందని పేర్కొంది.

నగదు లావాదేవీలు తగ్గాయి

డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడం కూడా నోట్ల రద్దు మరో ఆశయమని, ప్రస్తుతం నగదు లావాదేవీలు 17 శాతం మేర తగ్గాయని జైట్లీ వివరించారు. బ్యాంకు ఖాతాల సమాచారాన్ని విశ్లేషించినప్పుడు చాలా మంది తమ నల్లధనాన్ని జమ చేసినట్టు వెల్లడయిందని అన్నారు. నల్లధనాన్ని బ్యాంకుల్లో జమ చేసేలా ఒత్తిడి తీసుకురావడమే పెద్ద విజయమని అభివర్ణించారు. ఎన్నికల్లో నల్లధనం ప్రభావం లేకుండా చేయడమే తదుపరి లక్ష్యమని చెప్పారు. నోట్ల రద్దు అనంతరం ఉగ్రవాదులకు అందే నిధుల్లో తగ్గుదల కనిపించిందని వివరించారు. ప్రతిపక్షాలు చేసిన విమర్శలను తిప్పికొడుతూ నల్లధనంపై పోరాటాలు చేయని వారు దీని ప్రాధాన్యాన్ని అర్థం చేసుకోలేరని వ్యాఖ్యానించారు.

చర్చ ముగిసినట్టే: ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి

కేంద్ర ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ ట్వీట్ చేస్తూ "తిరిగి వచ్చిన నోట్లపై ఈ రోజు రిజర్వు బ్యాంకు లెక్కలు వెల్లడించింది. ఆ కార్యక్రమం (నోట్ల రద్దు) విజయవంతంగా అమలయింది. అందువల్ల దీనిపై చర్చను ముగింపు పలకాలి" అని పేర్కొన్నారు.

అదుపులో నల్లధనం

బ్యాంకులో జమ చేసిన నగదులో నల్లధనం, వివరాలు చెప్పలేని సొమ్ము కూడా ఉందని ఆర్థిక శాఖ తన ప్రకటనలో అభిప్రాయపడింది. "గత జనవరి 31న ప్రారంభించిన 'ఆపరేషన్ క్లీన్ మనీ' కింద నల్లధనం వెలుగులోకి వచ్చింది. నోట్ల రద్దు తరువాత ప్రజల పొదుపు చేసే తీరులో మార్పు వచ్చింది. దేశ ఆర్థిక వ్యవస్థకు పెద్ద షాక్ తగులుతుందని కొందరు అనుకున్నారు. అయితే వారి అంచనాలు తప్పయ్యాయి. ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతోంది" అని ఆ ప్రకటనలో వివరించింది.

ఆర్బీఐకి అవమానకరం: చిదంబరం

నోట్ల రద్దు రిజర్వు బ్యాంకుకు అవమానకరమని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర ఆర్థిక శాఖ మాజీ మంత్రి పి.చిదంబరం వ్యాఖ్యానించారు. రిజర్వు బ్యాంకు నివేదికపై ఆయన పలు ట్వీట్లు చేశారు.

"99 శాతం నోట్లను చట్టబద్ధంగా మార్చుకున్నారు. నల్లధనాన్ని సక్రమైనదిగా మార్చుకోవడానికే నోట్లను రద్దు చేశారా?"

"రూ.15,44,000 కోట్లను రద్దు చేస్తే అందులో రూ.16,000 కోట్లు మాత్రమే తిరిగి రాలేదు. ఇది 1% మాత్రమే. నోట్ల రద్దును సిఫార్సు చేసిన రిజర్వు బ్యాంకుకు ఇది సిగ్గుచేటు".

"రిజర్వు బ్యాంకు రూ.16,000 కోట్ల మేర లబ్ధి పొందింది. కానీ కొత్త నోట్ల రద్దుతో రూ.21,000 కోట్లు నష్టపోయింది. ఆ ఆర్థిక శాస్త్రవేత్తలు నోబెల్ పురస్కారానికి అర్హులు".

జాతి క్షమించదు: ఏచూరి

సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి ట్వీట్ చేస్తూ.. "99.9 శాతం నోట్లు తిరిగి బ్యాంకింగ్ వ్యవస్థలోకి వచ్చాయి. వందలాది మంది క్యూ లైన్లలో చనిపోయారు. పేదలు ఎక్కువగా ఇబ్బంది పడ్డారు. ఇదంతా ఎందుకోసం? ఆర్థిక వ్యవస్థ షాక్‌కు గురయింది. మోదీ ప్రభుత్వం తీసుకున్న ఈ జాతి వ్యతిరేక చర్యలను భారత్ ఎప్పుడూ క్షమించదు."

ఒక్క లక్ష్యమూ నెరవేరలేదు: ఆనంద్ శర్మ

కాంగ్రెస్ అధికార ప్రతినిధి ఆనంద్ శర్మ మాట్లాడుతూ "నోట్ల రద్దుకు సంబంధించిన లక్ష్యాల్లో ఒక్కటీ నెరవేరలేదు. ఈ నిర్ణయం దేశంలో ఆర్థిక అరాచకాన్ని సృష్టించింది. నల్లధనం ఎక్కడికి పోయిందో ఇప్పుడు ప్రధాని చెప్పగలరా?" అని ప్రశ్నించారు. ప్రధాని క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా డిమాండు చేశారు.

ఆర్బీఐ గవర్నర్‌పై హక్కుల తీర్మానం: ఎస్పీ

సమాజ్‌వాదీ పార్టీ నాయకుడు నరేష్ అగర్వాల్ మాట్లాడుతూ.. "రిజర్వు బ్యాంకు గవర్నర్ ఊర్జిత్ పటేల్‌పై హక్కుల తీర్మానం ప్రవేశపెడుతాం. తిరిగి వచ్చిన నోట్ల సమాచారం ఇవ్వకుండా ఆయన పార్లమెంటరీ కమిటీని తప్పుదోవ పట్టించార"ని చెప్పారు.

ఇదే పెద్ద కుంభకోణం: మమత

ఫేస్‌బుక్‌లో పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానిస్తూ.. "నోట్ల రద్దే పెద్ద కుంభకోణం. దీని వెనుక రహస్య అజెండా ఉన్నట్టు అనిపిస్తోంది. ఇదో పెద్ద వైఫల్యం" అని పేర్కొన్నారు.

నోట్ల రద్దుకు 5 లక్ష్యాలు

ఈ నివేదికపై ఆర్థిక శాఖ ఓ ప్రకటన ద్వారా తన స్పందన తెలియజేసింది. నోట్ల రద్దుకు అయిదు లక్ష్యాలు ఉన్నాయని పేర్కొంది.

1. నల్లధనాన్ని పారదోలడం
2. నకిలీ కరెన్సీ నోట్లను ఏరివేయడం
3. ఉగ్రవాదులు, వామపక్ష తీవ్రవాదుల నిధులు అందజేస్తున్న మూలాలను పెకిలించడం
4. అసంఘటిత ఆర్థిక వ్యవస్థను సంఘటితంగా మార్చి, పన్ను చెల్లింపుదార్లు, ఉద్యోగాల విస్తృతిని పెంచడం
5. నగదు రహిత ఆర్థిక వ్యవస్థగా మార్చే ప్రక్రియలో భాగంగా డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడమని వివరించింది.

నోట్ల రద్దు ప్రజల ధనం తీసుకునేందుకు కాదు: జైట్లీ

నోట్ల రద్దు ఆశయం నల్లధనాన్ని అరికట్టడమేనని, ప్రజల సొమ్మును తీసుకోవడం కాదని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ స్పష్టం చేశారు. రిజర్వు బ్యాంకు నివేదికపై ఆయన స్పందిస్తూ కేవలం ఒక్క లక్ష్యంతోనే కాకుండా పలు అంశాలను దృష్టిలో పెట్టుకొని ఈ నిర్ణయం తీసుకున్నామని అన్నారు. పన్నులు వసూళ్లు పెరగడం ద్వారా మిగిలిన లక్ష్యాలన్నీ నెరవేరాయని అన్నారు. 'ఎంత సొమ్ము తిరిగి వచ్చిందన్నది' నోట్ల రద్దు అసలు లక్ష్యం కాదని వివరణ ఇచ్చారు.

కోట్లు రాల్చని నోట్ల రద్దు

పెద్ద నోట్ల రద్దు ఎవరూ ఊహించని నిర్ణయం. చలామణిలో ఉన్న మొత్తం నోట్లలో 86 శాతం వరకూ ఉన్న రూ. 500, రూ. 1000 నోట్లను రద్దు చేస్తే ఎన్నో ఇబ్బందులు తప్పవు. అయినా ప్రభుత్వం కఠినమైన నిర్ణయం తీసుకుంది. దానిపై అప్పట్లో ఎన్నో విమర్శల వెల్లువ. వాటికి బదులిస్తూ దాదాపు రూ.3 లక్షల కోట్ల విలువైన నోట్లు వెనక్కి రాక పోవచ్చని, ఈ సొమ్ముతో ఎన్నో ప్రజాపయోగ కార్యక్రమాలు చేపట్టవచ్చని అధికార వర్గాలు నమ్మబలికాయి. అవినీతిని, టెర్రరిస్టు కార్యక్రమాలను అడ్డుకోవచ్చని.. అసాంఘిక శక్తుల ఆట కట్టించవచ్చని అభిప్రాయపడ్డాయి. రద్దయిన నోట్లను బ్యాంకుల్లో జమ చేసినా అందులో నల్లధనాన్ని గుర్తించి దానిపై ఆదాయపు పన్ను, అపరాధ రుసుము ముక్కుపిండి వసూలు చేయవచ్చని ప్రభుత్వం ఆశించింది. కానీ ఈ ఆశలు నెరవేరలేదని తాజాగా భారతీయ రిజర్వు బ్యాంకు (ఆర్‌బీఐ) గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి!

86 శాతం పెద్ద నోట్లే...

- కేంద్ర ప్రభుత్వం గత ఏడాది నవంబరులో పెద్ద నోట్ల రద్దు నిర్ణయం తీసుకునే నాటికి దేశవ్యాప్తంగా చలామణిలో ఉన్న నోట్ల విలువ రూ. 17.54 లక్షల కోట్లు. ఇందులో రూ. 500 నోట్ల వాటా దాదాపు 46 శాతం, రూ. 1000 నోట్ల వాటా 40 శాతం.
- అంటే రద్దయిన పెద్ద నోట్ల వాటా మొత్తం కరెన్సీలో 86 శాతం.
- అప్పటికి చలామణిలో ఉన్న రూ. 500 నోట్ల సంఖ్య 165 కోట్లు కాగా, రూ. 1000 నోట్ల సంఖ్య 670 కోట్లు ఉంది. రద్దయిన ఈ నోట్లను బ్యాంకుల్లో జమ చేసే అవకాశాన్ని కేంద్ర ప్రభుత్వం కల్పించింది.
- దాదాపుగా ఈ నోట్లు మొత్తం బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు, జమ కాని నోట్ల సంఖ్య చాలా తక్కువేనని అప్పట్లోనే వివిధ వర్గాలు విశ్లేషించాయి. అదే నిజమని ఇప్పుడు ఆర్‌బీఐ గణాంకాలు స్పష్టం చేశాయి.
- రూ.1000 నోట్లలో తిరిగి రానివి కేవలం 1.4 శాతం నోట్లేనని స్పష్టమైంది. మొత్తం 670 కోట్ల రూ. 1000 నోట్లలో బ్యాంకుల్లో జమ కానివి 8.90 కోట్లు మాత్రమేనని ఆర్‌బీఐ పేర్కొంది. అంటే రూ.8,900 కోట్ల మొత్తం మిగిలినట్లు స్పష్టమవుతోంది.
- బ్యాంకుల్లో జమ కాని రద్దయిన రూ. 500 నోట్ల సంఖ్య ఇంతకంటే ఎక్కువగా ఉండకపోవచ్చు. ఈ లెక్కను ఆర్‌బీఐ వెల్లడించలేదు.
- వెనక్కి రాని రూ. 1000, రూ. 500 నోట్ల రూపంలో ఆర్‌బీఐకి రూ. 16,000 కోట్ల మేరకు (రూ. 8,900 కోట్ల విలువైన రూ. 1000 నోట్లు, మిగిలినవి రూ. 500 నోట్లు) మిగిలినట్లు తాజాగా ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.



- ఈ మొత్తం ముందుగా మిగులుతుందని భావించిన రూ.3లక్షల కోట్లతో పోల్చితే ఎంతో తక్కువ.

ముద్రణ ఖర్చు తడిసి మోపెడు!

నోట్ల ముద్రణ నిరంతర ప్రక్రియ. 2015-16 ఆర్థిక సంవత్సరంలో నోట్ల ముద్రణకు ఆర్‌బీఐ రూ. 3,421 కోట్లు వెచ్చించింది. కానీ 2016-17లో ఈ ఖర్చు రెట్టింపు అయింది. దీనికి కారణం రద్దయిన పెద్ద నోట్ల స్థానంలో కొత్తగా ప్రవేశపెట్టిన రూ. 500 నోటు, రూ. 2000 నోటు ముద్రించటమే. అందువల్ల 2016-17 ఆర్థిక సంవత్సరంలో నోట్ల ముద్రణకు అయిన ఖర్చు రూ. 7,965 కోట్లకు పెరిగిపోయింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరంతో పోల్చితే అదనంగా రూ. 4,544 కోట్లు ఖర్చు చేయాల్సి వచ్చింది. ఇదంతా కొత్త నోట్ల ముద్రణ ఖర్చే. పెద్ద నోట్ల రద్దు వల్ల ఆశించిన తక్షణ ప్రయోజనాలు నెరవేరకపోగా అదనంగా నోట్ల ముద్రణ ఖర్చు నెత్తిన పడిందని ప్రతిపక్షాలు ఇప్పుడు విమర్శలు సంధిస్తున్నాయి.

ఆదాయపు పన్నుపై ఆశలు

అంచనాలకు భిన్నంగా రద్దయిన నోట్లన్నీ దాదాపుగా బ్యాంకు ఖాతాల్లో జమ కావటంతో ఆదాయపు పన్ను శాఖపై ఒత్తిడి పెరిగిపోయింది. నల్లధనాన్ని కూడా బ్యాంకుల్లో డిపాజిట్ చేశారని స్పష్టం కావటంతో దాన్ని వెలికి తీసి పన్ను, అపరాధ రుసుము వసూలు చేయాల్సిన బాధ్యత ఆ శాఖపై పడింది. దీంతో ఆ శాఖ అధికార్లు బ్యాంకు ఖాతాలను జల్లెడపట్టారు. అంతేకాకుండా పెద్ద నోట్లు రద్దు చేసిన వెంటనే నగల దుకాణాల్లో నమోదైన బంగారం కొనుగోళ్ల సమాచారాన్ని బయటకు తీసి నల్లకుబేరులను గుర్తించేందుకు ప్రయత్నించారు. స్థిరాస్తి రంగం లావాదేవీలపై దృష్టి సారించారు. రూ.2 లక్షలకంటే ఎక్కువ మొత్తం పెద్ద నోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన వారిని ఆ సమాచారాన్ని 2016-17 ఆర్థిక సంవత్సరానికి ఆదాయపు పన్ను రిటర్న్‌లో పొందుపరచాల్సిందిగా నిర్దేశించారు. ఇలా ఎన్నో కట్టుదిట్టాలు చేశారు.

నోటీసులు.. పన్ను వసూళ్లు

- కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు వివరాల ప్రకారం 2016 నవంబరు 9 నుంచి 2017 ఫిబ్రవరి 28వ తేదీ మధ్యకాలంలో ఆదాయపు పన్ను శాఖ నిర్వహించిన దాడుల్లో రూ. 9,334 కోట్ల నల్లధనం వెలుగుచూసింది.
- ఒక కోటికి పైగా బ్యాంకు ఖాతాల్లో రూ. 2 లక్షల కంటే అధిక మొత్తంలో పెద్ద నోట్లు జమ చేసినట్లు ఆదాయపు పన్ను శాఖ దృష్టికి వచ్చింది.
- 17.92 లక్షలమంది బ్యాంకు ఖాతాల్లో జమ అయిన పెద్ద నోట్ల వివరాలను విశ్లేషించిన ఆదాయపు పన్ను శాఖ, అందులో 9.46 లక్షల మందికి సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో ఎందుకు అంత పెద్ద మొత్తాలు జమచేసిందీ వివరించాల్సిందిగా ఆన్‌లైన్ మెమోలు జారీ చేసింది.
- మరో 18 లక్షలమంది విషయంలో వారి ఆదాయ వ్యయాల తీరుతెన్నులకు, బ్యాంకు లావాదేవీలకు పొంతన లేని విషయాన్ని గుర్తించింది.
- 2017 ఏప్రిల్- జులై మధ్య కాలంలో ప్రత్యక్ష పన్ను వసూళ్లు అంతకు ముందు ఏడాదితో పోల్చితే 19 శాతం పెరిగాయి. పన్ను చెల్లింపుదార్ల సంఖ్య కూడా 25 శాతం పెరిగింది. 2017-18 అసెస్‌మెంట్ ఏడాదికి రిటర్న్‌లు దాఖలు చేసినవారి సంఖ్య 2.82 కోట్లమంది కాగా, అంతకు ముందు ఏడాదిలో ఇది 2.26 కోట్లు మాత్రమే.

– ఈనాడు ప్రత్యేక విభాగం

దీర్ఘకాలిక ప్రయోజనాలు?

పెద్దనోట్ల రద్దుతో ప్రభుత్వం ఆశించిన తక్షణ ప్రయోజనాలు నెరవేరలేదనేది విస్పష్టం. కానీ దీర్ఘకాలంలో సత్ఫలితాలు ఉంటాయని కొందరు ఆర్థికవేత్తలు విశ్వసిస్తున్నారు. ఆదాయపు పన్ను చెల్లింపుదార్ల సంఖ్య, పన్ను వసూళ్లు పెరుగుతాయని, నల్లధనం చలామణి తగ్గుముఖం పడుతుందని వారి విశ్వాసం. కానీ పెద్ద నోట్ల రద్దు వల్ల కలిగిన నష్టం ఈ ప్రయోజనాల కంటే ఎంతో ఎక్కువనే వారి సంఖ్య కూడా అధికంగా ఉంది. కొత్త నోట్ల ముద్రణ ఖర్చు పెరగటం నుంచి రద్దయిన నోట్ల స్థానంలో కొత్త నోట్లు పొందటానికి సామాన్య ప్రజలు పడిన కష్టం, పని గంటలు నష్టపోవటం, ఉపాధికి కలిగిన నష్టం, వ్యాపార కార్యకలాపాలు కుంటుపడటం.. తదితర వ్యతిరేక అంశాలను ఆ వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. వాటిని పరిగణలోకి తీసుకుంటే ఈ ప్రక్రియ వల్ల నష్టమే ఎక్కువ జరిగిందని పేర్కొంటున్నాయి.

ఎన్నికల కోసమే సమన్వయ సమితులు తెరపైకి

- **ఉత్తర్వు 39 నిలిపేసి అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలి**
- **టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి డిమాండ్**

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఎన్నికల కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ రైతు సమన్వయ సమితులను తెరపైకి తెచ్చారని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. రాష్ట్రంలో సీఎం పాలన నకిలీ సర్వేలు, బోగస్ అవార్డుల్లా ఉందని ఎద్దేవా చేశారు. రైతులను మభ్య పెట్టేందుకు ఉత్తర్వు 39 తెచ్చారన్నారు. ఈ ఉత్తర్వును నిలిపేసి తక్షణమే అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం గాంధీభవన్‌లో ఎమ్మెల్యే సంపత్‌కుమార్, పార్టీ నేతలు మల్లు రవి, దాసోజు శ్రవణ్ తదితరులతో కలిసి ఉత్తమ్ విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెరాస ప్రభుత్వం మూడున్నరేళ్ల పాటు వ్యవసాయాన్ని భ్రష్టు పట్టించి సంక్షోభంలోకి నెట్టేసిందన్నారు. రైతు సమితిలు, భూసర్వేలను రాజకీయాలకతీతంగా చేయాలన్నారు. ప్రభుత్వం రైతు సమితిలను తెరాస నామినేటెడ్ సమితులుగా ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్ర ప్రజల సొమ్మును తెరాస ఫండ్‌గా వాడుకునేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. వివరాలు పొందుపర్చకుండా రూ.2 వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధమైందన్నారు. మూడున్నరేళ్ల పాటు మద్దతు ధర, బోనస్ రూపాయి కూడ ఇవ్వని ప్రభుత్వం ఇప్పుడు రూ.500 కోట్లు ఇస్తున్నట్లు ప్రకటించిందన్నారు. ముఖ్యమంత్రికి ఐసీఎఫ్ఐ సంస్థ ప్రకటించిన పురస్కారంపై ప్రముఖ శాస్త్రవేత్త స్వామినాథన్‌కు లేఖరాస్తామన్నారు.

ఏఐసీసీలో రాష్ట్ర కాంగ్రెస్ నేతలకు కీలక పదవులు: టీపీసీసీ నేతలకు ఏఐసీసీలో కీలక పదవులు దక్కుతాయని కాంగ్రెస్ పార్టీ ముఖ్యనాయకులు భావిస్తున్నారు. పార్టీ పునర్వ్యవస్థీకరణలో భాగంగా రాష్ట్రానికి చెందిన నేతలకు కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, అధికార ప్రతినిధి, కార్యదర్శులు సహా కొన్ని మరికొన్ని పదవులు దక్కుతాయని సమాచారం.

2వేల మంది నిరుద్యోగులకు ట్యాక్సీలు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన దాదాపు 2వేల మంది నిరుద్యోగ యువకులకు ట్యాక్సీ కార్ పథకం అమలు చేయాలని నిర్ణయించినట్లు ప్రభుత్వ సలహాదారు (సంక్షేమ) రామలక్ష్మణ్ తెలిపారు. ఉబర్ సంస్థ సహకారంతో ఈ పథకాన్ని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రూ.479కోట్లతో కొనుగోలు చేసిన 11,284 ఎకరాల భూమిని ఇప్పటి వరకు 4303 మందికి పంపిణీ చేశామని వివరించారు. బుధవారమిక్కడ సంక్షేమశాఖలపై సమీక్ష నిర్వహించారు. ఎస్సీ సహకార సంస్థ స్వయం ఉపాధి పథకాలకు 1.19లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. మిగతాశాఖలు ఈ మేరకు దరఖాస్తులు స్వీకరించి వివరాలు తెలియజేయాలని సూచించారు. న్యాక్‌లో శిక్షణ పొందిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగ యువకులకు ప్రభుత్వం చేపడుతున్న నిర్మాణ పనుల్లో తగిన ప్రాధాన్యమివ్వాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో గురుకులాల సొసైటీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, ఎస్సీ సహకార సంస్థ ఎండీ లచ్చిరాం తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పోలవరానికి రూ.979.36 కోట్లు మంజూరు

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టుకు ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేసిన మొత్తంలో రూ.979.36 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర జలవనరుల శాఖ ఉత్తర్వులిచ్చింది. ప్రధానమంత్రి కృషి సించాయి యోజన కింద 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఈ మొత్తాన్ని ఇస్తున్నట్లు పేర్కొంది. ఇవి జాతీయ జల అభివృద్ధి సంస్థ ఖాతా ద్వారా పోలవరం ప్రాజెక్టు అథారిటీకి తర్వాత రాష్ట్ర ప్రభుత్వానికి చేరతాయి.

మిషన్ భగీరథ పథకం భేష్

● మధ్యప్రదేశ్ ఇంజినీర్ల బృందం కితాబు

పుల్కల్, న్యూస్‌టుడే: తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఇంటింటికీ తాగు నీరందించాలన్న ఉద్దేశంతో చేపట్టిన మిషన్ భగీరథ పనులు బాగున్నాయని మధ్యప్రదేశ్ సాంకేతిక నిపుణుల బృందం కితాబిచ్చింది. మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన పదిమందితో కూడిన బృందం బుధవారం సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట శివారులోని సింగూరు ప్రాజెక్టు వద్ద చేపట్టిన మిషన్ భగీరథ పనులను పరిశీలించింది. అనంతరం బృందంలోని సభ్యులు విలేకరులతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ ఒక మంచి పథకాన్ని అందించి ఇతర రాష్ట్రాలకు దిశానిర్దేశం చేశారన్నారు. ఇలాంటి పథకాన్ని తమ రాష్ట్రంలో కూడా చేపట్టాలనే ఉద్దేశంతో ఇక్కడకు పరిశీలనకు వచ్చినట్టు వారు తెలిపారు. మొదటి రోజున సింగూరు వద్ద కొనసాగుతున్న పనులను చూశామని, అనంతరం గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండకు వెళ్లి పరిశీలిస్తామన్నారు. జిల్లా గ్రామీణ నీటి సరఫరా విభాగం చీఫ్ ఇంజినీర్ విజయప్రకాశ్ బృందానికి పథకం, చేపట్టిన పనుల గురించి వివరించారు.



పనులు పరిశీలిస్తున్న మధ్యప్రదేశ్ బృందం

రైల్వే స్టేషన్లలో పార్కింగ్ బాదుడు

- **కారు పెడితే రూ.50 వసూలు**
- **ద్విచక్ర వాహనానికి గంట గంటకు లెక్క**
- **రోజుకు రూ.284 ఛార్జీ**
- **జీఎస్టీతో మరికొంత అదనపు భారం**
- **బండి పెట్టేందుకు వాహనదారులు బెంబేలు**

ఈనాడు – హైదరాబాద్

- హబ్సిగూడకు చెందిన వెంకటేశ్ తన సోదరుడిని రైలు ఎక్కించేందుకు స్టేషన్‌కు వెళ్లాడు. కారును పార్కింగ్‌లో పెట్టి 20నిమిషాల్లో తిరిగి వచ్చాడు. పార్కింగ్ గుత్తేదారు వసూలుచేసిన రుసుం రూ.40. దానిపై జీఎస్టీ రూ.8కలిపి మొత్తం రూ.48. వంద నోటిస్తే చిల్లర లేదని రూ.50తిరిగిచ్చాడు.
- విజయవాడకు చెందిన కరుణాకర్ బైక్‌పై రైల్వే స్టేషన్‌కు వెళ్లాడు. రాజమహేంద్రవరం రైల్లో వెళ్లి రాత్రి తిరిగివచ్చాడు. పార్కింగ్ బిల్ గంటకు రూ.10 చొప్పున 11 గంటలకు రూ.110. దానిపై జీఎస్టీ మరో రూ.20.

దక్షిణమధ్యరైల్వే పరిధిలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని ప్రధాన రైల్వేస్టేషన్లలో పరిస్థితి ఇది. ప్రీమియం పేరుతో ప్రత్యేక పార్కింగ్ అనుమతులు, గంటగంటకు లెక్కించి వసూలుచేసే రుసుములతో వాహనదారుల జేబులకు చిల్లు పెడుతున్నాయి. దీనికి వస్తుసేవల పన్ను(జీఎస్టీ) భారం అదనం. గతంలో సర్వీసుట్యాక్సు ఉన్నప్పుడు పార్కింగ్‌ఛార్జీ మాత్రమే ఉండేది. జీఎస్టీ వచ్చాక వాహనపార్కింగ్‌పై 18శాతం పన్ను వసూలుచేస్తున్నారు.

రైల్వేకు ఆదాయమే ప్రాధాన్యం

సికింద్రాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతివంటి ప్రధానస్టేషన్లలో పార్కింగ్ రుసుముల భారం అధికంగా ఉందని వాహనదారులు వాపోతున్నారు. బుకింగ్ కౌంటర్లు వంటి ప్రధాన ప్రాంతాలకు దగ్గర్లో 'ప్రీమియం'పార్కింగ్ పేరుతో అధిక రుసుములు వసూలుచేస్తున్నారు. ఇక్కడ గంటగంటకు రుసుం వసూలుచేస్తున్నారు. మిగిలినచోట్ల కనీస వ్యవధి రెండు గంటలుగా నిర్ణయించినా ఇక్కడ రూ.15వరకు తీసుకుంటున్నారు. కార్లకైతే రైల్వేస్టేషన్లను బట్టి కనీసఛార్జీ రూ.30-40వరకు నిర్ణయించారు. వేలం పద్ధతిలో పార్కింగ్ లైసెన్సుల్ని రైల్వేశాఖ మంజూరుచేస్తోంది. ఆ మొత్తాన్ని రాబట్టుకోవడంతో పాటు అధిక లాభాలకు గుత్తేదారులు కోరినవిధంగా రుసుములు పెంచుతోందని ప్రయాణికులు వాపోతున్నారు.



సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్ రుసుములను చూపే సూచిక బోర్డు

- సికింద్రాబాద్ స్టేషన్ ప్రధానప్రాంతంలో ద్విచక్ర వాహనాలకు సంబంధించి రెండు ప్రీమియం పార్కింగ్‌లున్నాయి. వీటిలో ఒకదానికి ఏడాదికి రూ.75లక్షల వరకు రైల్వేశాఖకు ఆదాయం వస్తున్నట్లు సమాచారం. ఇక్కడ గంటకు రూ.10వసూలుచేస్తారు. ఆపై జీఎస్టీ రూ.2.. గంట దాటి పది, పదిహేను నిమిషాలు దాటినా రూ.24చెల్లించాల్సిందే. కారుకు కనీసం రూ.40. జీఎస్టీ రూ.8. రెండుగంటల వరకు రూ.48. ఆపై దాటితే ప్రతి రెండుగంటలకు మరో రూ.24చొప్పున చెల్లించాలి.
- సికింద్రాబాద్‌లోనే రేతిఫైల్ బస్‌స్టేషన్ పక్కనే రిజర్వేషన్ కేంద్రంలో ఓ పార్కింగ్ స్థలం ఉంది. కనీసం రుసుం రూ.15. జీఎస్టీ రూ.3. ఇదేమి రద్దీప్రాంతం కాకపోయినా ఛార్జీలు అధికం. వాహనాలు తక్కువ వస్తున్నాయని గుత్తేదారుకు ప్రయోజనం కల్గించేలా ఛార్జీ పెంచినట్లు తెలుస్తోంది.
- విజయవాడ జంక్షన్‌లో ద్విచక్రవాహనాలకు రెండు ప్రీమియం పార్కింగ్‌లున్నాయి. గంటకు రూ.10చొప్పున, జీఎస్టీ రూ.2చొప్పున వసూలుచేస్తున్నారు. ఆపై ప్రతిగంటకు మరో రూ.12చొప్పున వసూలుచేస్తున్నారు. కారు నిలిపితే రూ.30. ఆపై జీఎస్టీ. మూడుగంటల చొప్పున మరో రూ.36 కట్టాల్సిన పరిస్థితి. స్టేషన్‌కు కొంతదూరంలో ద్విచక్రవాహనాలకు సాధారణ పార్కింగ్ ఉంది. గతంలో ఆరుగంటల వరకు రూ.5మాత్రమే ఉండేది. దాన్ని మూడుగంటలకు రూ.10గా పెంచారు.
- తిరుపతిలో వాహనాల పార్కింగ్ సదుపాయమే లేదు. ఉత్తరం వైపున తన స్థలాన్ని మున్సిపల్ కార్పొరేషన్ లీజుకు ఇస్తోంది. ఇక్కడ కార్లపార్కింగ్‌కు కనీసఛార్జీ రూ.50. జీఎస్టీతో కలిపి మొత్తం రూ.59చెల్లించాలి.
- విశాఖపట్నంలో కారు పార్కింగ్ మూడు గంటలకు రూ.20. ద్విచక్రవాహనాలకు ప్రధానగేటు వైపు రెండుగంటలకు రూ.10వసూలుచేస్తున్నారు.

రద్దీ తగ్గించేందుకు

ప్రధాన స్టేషన్లలో రద్దీ ఎక్కువ. వాహనాల్లో వచ్చినవాళ్లు వెంటనే తిరిగి వెళ్లేందుకే అధిక రుసుములతో ప్రీమియం పార్కింగ్‌కు అనుమతించాం. ప్రధానస్టేషన్‌కు కొద్దిదూరంలో సాధారణ పార్కింగ్ సదుపాయాలున్నాయి. ఇక్కడ రుసుం తక్కువ. రోజూ వాహనాన్ని పార్కు చేసేవారికి రూ.700 నెలవారీ పాస్ సదుపాయం ఉంది.

– దక్షిణ మధ్య రైల్వే

టికెట్ కంటే పార్కింగ్ రుసుం అధికం

సికింద్రాబాద్ వంటి పెద్దస్టేషన్ల నుంచి దగ్గరల్లోని పట్టణాలకు ఉద్యోగాల కోసం నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. రైలు టికెట్ కంటే పార్కింగ్‌ఛార్జీ అధికం. స్టేషన్ దగ్గరలో రైల్వేకున్న ఖాళీ స్థలంలో బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించి పార్కింగ్‌కు సరసమైన ధర నిర్ణయించాలి. టెండర్ విధానంలో లైసెన్స్ కేటాయించడంతో గుత్తేదారులు భారీగా రుసుం వసూలుచేస్తున్నారు.

– సూర్యప్రకాశ్, దమరై జడ్‌ఆర్‌యూసీసీ (ప్రయాణికుల సమస్యల పరిష్కార కమిటీ) సభ్యుడు

నిలిచిన బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు

● హైదరాబాద్, నల్గొండ, మహబూబ్‌నగర్‌లో అంతరాయం

ఈనాడు, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్ బ్రాడ్‌బ్యాండ్‌కు వరుస సాంకేతిక సమస్యలు ఎదురవుతున్నాయి. దీంతో దక్షిణ భారతంలో 50 శాతం వరకు, ఆంధ్రప్రదేశ్‌లో 70 శాతం, తెలంగాణలో 60 శాతం వరకు కనెక్షన్లపై ఈ ప్రభావం పడింది. హైదరాబాద్‌లో పూర్తిగా, నల్గొండ, మహబూబ్‌నగర్ ప్రాంతాలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు నిలిచిపోయాయి. పరిస్థితిని చక్కదిద్దేందుకు అత్యున్నత సాంకేతిక నిపుణుల సహాయం తీసుకోవాలని నిర్ణయించింది. హైదరాబాద్ టెలికాం జిల్లా పరిధిలో బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లు 1.3లక్షలు, పూర్వ మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాలో మరో 20 వేల వరకు ఉంటాయని అంచనా. మంగళవారం ఉదయం నుంచి సర్వర్‌లో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. వీటిని సరిచేసేందుకు సిబ్బంది ప్రయత్నించారు. కొంత సమయం పనిచేసినట్లు కనిపించినా తిరిగి యథాస్థితి నెలకొంది. బుధవారమూ సర్వర్‌లను రీబూట్ చేసినా ఫలితం కనిపించలేదు. మరోవైపు బెంగళూరులోని కేంద్రీయ సర్వర్ ద్వారా ప్రయత్నించినా సమస్య పరిష్కారం కాలేదు. అవసరమైతే విదేశీ నిపుణుల సహకారం తీసుకోవాలని యోచిస్తున్నారు. బెంగళూరులోని కేంద్ర సర్వర్‌లలోనూ ఇదే సమస్య తలెత్తినట్లు సమాచారం.

భూఉష్ణోగ్రతల తీవ్రతకు సాగరాలూ ఉఫ్

● ఆవిరైపోతున్న కాస్పియన్ సముద్రం

హ్యూస్టన్: భూ వాతావరణంలో రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు సముద్రాలనూ ఆవిరయ్యేలా చేస్తున్నాయా! అవుననే అంటున్నారు అమెరికాలోని టెక్సాస్ ఆస్టిన్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు. ఐరోపా-ఆసియా ఖండాల మధ్యనున్న సువిశాలమైన కాస్పియన్ సముద్రంపై వారు జరిపిన పరిశోధనలు ఈ విషయాన్ని నిర్ధరిస్తున్నాయి. గత 20ఏళ్లలో ఈ సముద్ర నీట మట్టం ఏడాదికి 7 సెంటీమీటర్ల చొప్పున 1.4 మీటర్ల వరకు తగ్గిపోయిందని వెల్లడించారు. 1996 నుంచి 2015 వరకు ఈ సముద్ర నీటి మట్టం క్రమంగా తగ్గిపోవటాన్ని శాస్త్రవేత్తలు తమ పరిశీలనలో గుర్తించారు. వాతావరణంలో పెరిగిన ఉష్ణోగ్రతల వల్ల నీటి ఆవిరి పెరగటం, నదుల నుంచి వచ్చే వరద నీరు తగ్గిపోవటం దీనికి ప్రధాన కారణాలని వారు పేర్కొన్నారు. 1979-1995, 1996-2015ల మధ్య ఈ సముద్రంపై వాతావరణంలో యేటా ఒక సెంటీగ్రేడు చొప్పున ఉష్ణోగ్రతలు అధికమవటాన్ని వారు గుర్తించారు. వాతావరణంలో వస్తున్న మార్పులు ఈ అధిక ఉష్ణోగ్రతలకు కారణమని భావిస్తున్నారు. 1970ల్లో కాస్పియన్ సముద్రం నీటి మట్టం అత్యంత దిగువకు పడిపోయిందని, ప్రస్తుతం ఆనాటి పరిస్థితికి మరో మీటరు వ్యత్యాసం మాత్రమే ఉందని వారు పేర్కొన్నారు. 3,71,000 చదరపు కిలోమీటర్ల పరిధిలో విస్తరించి ఉన్న కాస్పియన్ సముద్రం 8 దేశాలతో సరిహద్దులు కలిగి ఉంది.

'ఎనిమిది' ఇలా ఉంటుందా?

ఐఫోన్ 8 విడుదలకు ముహూర్తం పెట్టేశారు. వచ్చే నెల 12న ఎనిమిదో తరం ఆపిల్ ఫోన్‌ను ఆవిష్కరించబోతున్నారని సమాచారం. ఈ ఫోన్ ఇలా ఉంటుందని ఇప్పటి వరకు సంస్థ చెప్పకపోయినా... 'ఫీచర్లు ఇవే, మొబైల్ ఇలానే ఉంటుంది' అంటూ అంతర్జాలంలో కొన్ని వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. అవే నిజమైతే ఐఫోన్ రూపురేఖలు ఇలా ఉండొచ్చని అంచనా!

- ఐఓఎస్ 11 ఆపరేటింగ్ సిస్టమ్ ఆధారంగా పని చేస్తుంది. 10 ఎన్ఎం డిజైన్, సరికొత్త ఏ 11 ప్రోసెసర్ ఉంటాయి.
- గతకొన్నేళ్లుగా ఐఫోన్స్‌లో వస్తున్న హోమ్ బటన్ ఇందులో ఉండదు. శాంసంగ్ ఎస్8, గూగుల్ పిక్సెల్ మొబైళ్ల తరహాలో వర్చువల్ హోమ్ బటన్ ఉంటుంది.
- కొత్త తరం ఆండ్రాయిడ్ మొబైళ్ల తరహాలో స్క్రీన్ మీద డబుల్ ట్యాప్ చేస్తే స్క్రీన్ వేక్ (డిస్‌ప్లే ఆన్) అవుతుంది.
- శాంసంగ్ ఎస్8, ఎల్‌జీ జీ6, ఎంఐ మిక్స్ మొబైల్స్ మాదిరిగా దీని అంచులు అత్యంత పలుచగా (బెజిల్ లెస్ స్క్రీన్) ఉంటాయి.
- ఆపిల్ వాచ్, శాంసంగ్ హైఎండ్ మొబైల్స్‌లో ఉండే వైర్‌లెస్ ఛార్జింగ్ సౌకర్యాన్ని ఇందులో అందిస్తున్నారు.
- త్రీడీ ఫేసియల్ రికగ్నిషన్ సాంకేతికత ఉంటుంది. దీంతో ఫోన్ అన్‌లాక్, మొబైల్ ఆధారిత పేమెంట్ ఆథరైజేషన్ చేయొచ్చు. వెలుతురు తక్కువగా ఉండే ప్రాంతాల్లో ఉపయుక్తంగా ఉండేలా దీనికి ఇన్‌ఫ్రారెడ్ సెన్సార్ కూడా ఉంటుంది.
- ఓఎల్ఈడీ తాకేతెర ఉంటుంది. శాంసంగ్ ఎస్ 8, మోటోరోలా జెడ్ 2 ఫోర్స్, వన్‌ప్లస్ 5 మొబైల్స్‌లో ఇలాంటి తెర ఉంది.
- ఐఫోన్ 4, ఐఫోన్ 4ఎస్ మోడళ్లలా వెనుకవైపు గ్లాస్ ఆధారిత ప్యానల్, స్టెయిన్‌లెస్ స్టీల్ ఎడ్జ్‌లు ఉంటాయి.
- ఆగ్యుమెంటెడ్ రియాలిటీ సాంకేతికతను సపోర్ట్ చేసేలా కెమెరాలో మార్పులు చేశారు. సీన్, ఆబ్జెక్ట్ డిటెక్షన్ సదుపాయం కూడా కల్పించారు.
- వచ్చే నెల 22 నుంచి వీటి అమ్మకాలు మొదలవుతాయట. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర సుమారు వెయ్యి డాలర్లు ఉంటుందని తెలుస్తోంది.



5.8 అంగుళాల తాకే తెర.. 3 జీబీ ర్యామ్.. 64, 256, 512 ఎంబీ అంతర్గత మెమొరీ వెర్షన్లు... వెనుకవైపు డ్యూయల్ కెమెరా ఉంటాయని సమాచారం.

సూపర్ జీమెయిల్!

జీమెయిల్‌లో రోజుకో కొత్త ఆప్షన్ వస్తుంటుంది... అయితే అవి అందించని కొన్ని అదనపు సౌకర్యాల్ని క్రోమ్ బ్రౌజర్ ఎక్స్‌టెన్షన్లతో పొందొచ్చు. వీటిని ఇన్‌స్టాల్ చేసుకొని మెయిల్స్ ట్రాకింగ్, అక్షరదోషాల నివారణ, మెయిళ్ల వర్గీకరణ, ... లాంటి కొత్త కొత్త ఆప్షన్లతో మీ జీమెయిల్‌ని సూపర్ జీమెయిల్‌గా మార్చేయొచ్చు. వాటికి ఉపయోగపడే క్రోమ్ బ్రౌజర్ ఎక్స్‌టెన్షన్‌లివీ!



పేరు మార్చుకోవచ్చు



రెండు నెలల క్రితం ఫ్లైట్ టికెట్ బుక్ చేశారు. ఆ టికెట్ పీడీఎఫ్ మెయిల్‌కి వచ్చింది కూడా. ఇప్పుడు దాని కోసం వెతుకుతుంటే దొరకడం లేదా? ఆ మెయిల్ సబ్జెక్ట్‌ను మీకు గుర్తుండేలా మార్చుకొని ఉంటే ఇప్పుడు ఇబ్బంది ఉండేది కాదు కదా. Rename Email ఎక్స్‌టెన్షన్ ద్వారా ఈ పని చేయొచ్చు. దీన్ని మీ క్రోమ్ బ్రౌజర్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే మీకు వచ్చే మెయిళ్ల సబ్జెక్ట్‌ను మార్చుకోవచ్చు. ఫ్లైట్ టికెట్‌నే తీసుకుంటే... ప్రయాణం తేదీ, రైలు పేరు లాంటివి సబ్జెక్ట్‌గా ఇస్తే వెతకడం సులభంగా ఉంటుంది.

సరి చేస్తుంది



ఒకే మెయిల్‌లోని టెక్స్ట్‌లో రెండు, మూడు రకాల ఫాంట్‌లు ఉంటే బాగుండదు కదా. వెబ్‌సైట్‌లో టెక్స్ట్ కాపీ చేసుకున్న టెక్స్ట్‌ను మెయిల్‌లో పేస్ట్ చేస్తే... అలానే కనిపిస్తుంది. Email Text Formatter ఎక్స్‌టెన్షన్‌తో ఈ ఇబ్బంది నుంచి తప్పించుకోవచ్చు. వెబ్‌సైట్ నుంచి తీసుకున్న మేటర్‌ను మెయిల్ బాక్స్‌లో పేస్ట్ చేసిన తర్వాత... పైన 'ఫిక్స్ ఫాంట్' అని ట్యాబ్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే మీరు పేస్ట్ చేసిన ఫాంట్ సాధారణ అక్షరాల్లా మారిపోతుంది.

ప్రశ్నలు ఉన్నాయా?



మీ పై అధికారి నుంచి మీకో మెయిల్ వచ్చింది... అందులో విషయంపై మీకు చిన్న సందేహం ఉంది. అప్పుడు అడుగుదామంటే ఆయన అందుబాటులో లేరు. తర్వాత అడుగుదామంటే గుర్తుండదు. ఆ మెయిల్‌కి ఓ నోట్ యాడ్ చేసుకుంటే ఈ సమస్య ఉండదు కదా. Simple Gmail Notes ఎక్స్‌టెన్షన్ ఈ పని చేసిపెడుతుంది. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత మీకు వచ్చే మెయిల్‌కుపైన ఒక బాక్స్ కనిపిస్తుంది. అందులో మీ సందేహాన్ని రాసుకోవచు.

తప్పొప్పులు తెలుస్తాయి



ఆంగ్లంలో మెయిల్ అయితే కంపోజ్ చేసేస్తారు కానీ... గ్రామర్‌లో తప్పులుంటాయేమో అని మీకు సందేహమా? అయితే DraftMap ఎక్స్‌టెన్షన్ మీ ఇబ్బంది తీరుస్తుంది. దీన్ని క్రోమ్ బ్రౌజర్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్న తర్వాత జీమెయిల్‌లో టైప్ చేస్తే... ఆ వాక్యాల్లోని పార్ట్స్ ఆఫ్ స్పీచ్, ఎక్కువగా వాడిన పదాలు, శైలి సరిగ్గా లేని పదాలు తదితర వివరాలు తెలుసుకోవచ్చు. వాటిలో ఒక్కొక్కటి ఒక్కో రంగు కనిపిస్తాయి. అనవసరం లేదా తప్పు అనుకున్న పదాల్ని అక్కడే మార్చేయొచ్చు.

మీ పేరు కొత్తగా



జీమెయిల్ సెట్టింగ్స్‌లో సిగ్నేచర్ అనే ఓ ఆప్షన్ ఉంటుంది. అందులో పేరు, వివరాలు ముందుగానే రాసిపెట్టేస్తే... ప్రతి సెంట్ మెయిల్ మేటర్ ఆఖరున అవి ఆటోమేటిక్‌గా వచ్చి చేరుతాయి. దానికి ఫొటో, మీ సోషల్ నెట్‌వర్కింగ్ ఐడీలు లాంటి కొత్త సొబగులు అద్దాలంటే WiseStamp - Email Signatures for Gmail ఎక్స్‌టెన్షన్ ఉండాల్సిందే. దీన్ని క్రోమ్ బ్రౌజర్‌లో ఇన్‌స్టాల్ చేసుకుంటే... ఓ వెబ్‌సైట్ ఓపెన్ అవుతుంది. అందులో మీ పేరు, మొబైల్ నెంబరు, ఫొటో, చిరునామా, సోషల్ నెట్‌వర్క్ ఐడీ తదితర సమాచారం ఇవ్వాలి. ఆ తర్వాత ఎప్పుడు మెయిల్ చేసినా ఆ వివరాలు అడుగున వస్తాయి.

చూశారా లేదా?




వాట్సాప్‌లో ఒక మెసేజ్ పంపిస్తే... దాన్ని చూశారా లేదా అనే విషయాన్ని టిక్ మార్క్ ద్వారా తెలుసుకోవచ్చు. జీమెయిల్‌లోనూ అలాంటి సౌకర్యం ఉంది. అయితే దాని కోసం Mailtrack ఎక్స్‌టెన్షన్‌ను బ్రౌజర్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తర్వాత మెయిల్ చేసినప్పుడు దిగువన ఉన్న బటన్ ద్వారా 'మెయిల్ ట్రాక్' ఆప్షన్‌ను యాక్టివేట్ చేసుకొని సెండ్ చేయాలి. అలా పంపించిన మెయిల్ అవతలి వ్యక్తికి చేరితే ఒక గ్రీన్ టిక్, దాన్ని ఓపెన్ చేస్తే రెండు గ్రీన్ టిక్‌లు వస్తాయి. ఎంత సేపటి క్రితం మెయిల్ ఓపెన్ చేశారనేది మీరూ తెలుసుకోవచ్చు.

వస్తే చెబుతుంది




మీకు మెయిల్ వచ్చినప్పుడల్లా మొబైల్‌లో నోటిఫికేషన్ వస్తుంది. అదే సిస్టమ్‌లో అయితే ప్రతిసారి మెయిల్ ఐడీ ఓపెన్ చేసి చూసుకోవాలి. అదే మీరు Checker Plus for Gmail ఎక్స్‌టెన్షన్ వాడుతుంటే... మీకు కంప్యూటర్‌లోనూ నోటిఫికేషన్ వస్తుంది. దీన్ని సిస్టమ్‌లో ఇన్‌స్టాల్ చేసుకున్నాక మీకు ప్రతిసారి మెయిల్ వచ్చినప్పుడు స్టార్ట్ బార్‌లో నోటిఫికేషన్ వస్తుంది. అక్కడే క్లిక్ చేసి మెయిల్‌ను చూడొచ్చు. వాటిని డిలీట్, మూవ్, ఫార్వర్డ్ లాంటివి కూడా చేయొచ్చు.

వర్గీకరణ సులభంగా...



వ్యక్తిగత మెయిల్స్, వృత్తిగత మెయిల్స్, బ్యాంకు వివరాలు... వీటి మధ్యలో టాస్క్‌లు. అలా గజిబిజిగా కాకుండా టాస్క్‌లను వేరుగా పెట్టుకుంటే పని సులభమవుతుంది. Sortd ఎక్స్‌టెన్షన్ ద్వారా ఈ పని చేయొచ్చు. దీనికి మీ మెయిల్ ఐడీని జోడించాక... సరికొత్త విండో ఓపెన్ అవుతుంది. అందులో టుడూ, ఫాలో అప్, లిస్ట్ అని విభాగాలు కనిపిస్తాయి. వాటి పక్కనే మీకు వచ్చిన మెయిల్స్, మీరు నమోదు చేసుకున్న టాస్క్‌లుంటాయి. వాటిని పక్కనున్న ట్యాబ్స్‌లోకి డ్రాగ్ అండ్ డ్రాప్ చేసి సులభంగా వర్గీకరించొచ్చు.

సమాధానం రాకపోతే...



మీ స్నేహితుని మెయిల్ చేశారు... సమాధానం కోసం రెండు రోజులు వేచి చూశారు. కానీ ఫలితం లేదు. దీంతో మళ్లీ మెయిల్ చేశారు. ఇలా సమాధానం రాని వారికి మీరే మళ్లీ మెయిల్ చేయాల్సిన అవసరం లేకుండా... ఆటోమేటిక్‌గా మెయిల్ వెళ్లే ఆప్షన్ ఒకటి ఉంది. Notifus ఎక్స్‌టెన్షన్‌తో ఈ పని చేయొచ్చు. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకున్నాక కంపోజ్ మెయిల్ ఐకాన్ క్లిక్ చేస్తే... దిగువ సెండ్, సెండ్+1డే, సెండ్+2డే అంటూ కొన్ని ఆప్షన్లు ఉంటాయి. సెండ్+1డేను ఎంచుకుంటే మీరు మెయిల్ పంపిన ఒక రోజులోగా దానికి సమాధానం రాకపోతే ఆ మెయిల్ రీసెండ్ అవుతుంది.

పెన్‌డ్రైవ్ చరిత్ర కావాలా?

నేను లేనప్పుడు నా సిస్టమ్‌లో ఎవరో పెన్‌డ్రైవ్ వాడారు' అని అనుమానం వ్యక్తం చేస్తుంటారు కొందరు. మీ సిస్టమ్‌లో USBDeview సాఫ్ట్‌వేర్ ఉంటే మీరు ఆ ప్రశ్నను ఎవరికీ అడగక్కర్లేదు. మీ సిస్టమ్‌కు కనెక్ట్ చేసిన పెన్‌డ్రైవ్‌లు, యూఎస్‌బీ కేబుళ్ల చరిత్రను ఈ సాఫ్ట్‌వేర్ చెప్పేస్తుంది. దీన్ని మీ కంప్యూటర్‌లో డౌన్‌లోడ్ చేసుకొని రన్ చేస్తే ఇప్పటివరకు మీ సిస్టమ్‌లో వాడిన డ్రైవ్‌లు, ప్రస్తుతం వినియోగంలో ఉన్న వాటి గురించి పూర్తి వివరాలు మీ ముందుంటాయి. పెన్‌డ్రైవ్‌ను ఎప్పుడు కనెక్ట్ చేశారు, దాని కంపెనీ ఏంటి, ఎప్పుడు డిస్‌కనెక్ట్ చేశారు లాంటి వివరాలూ తెలిసిపోతాయి.



– వెంకట సాయికిరణ్, మతుకుమల్లి

పాలిగన్ బొమ్మలుగా...

ఫొటోలను మొబైళ్లలో ఆర్ట్ పెయింట్లుగా మార్చే ఆప్‌లు చాలా చూసుంటారు. వాటిని పాలిగన్ ఆర్ట్‌లు మార్చే ఆప్ చూశారు. ఇదిగో PolyGen - Create Polygon Art ఆప్ ఇలాంటిదే. దీంట్లోకి ఫొటోను అప్‌లోడ్ చేసుకొని పాలిగన్ ఆర్ట్‌లుగా మార్చుకోవచ్చు. పాలిగన్ పాయింట్లను ఎడిట్ చేసుకునే అవకాశమూ ఈ ఆప్‌లో ఉంది. ఫొటో తొలుత ఒకే రంగులో పాలిగన్ ఆర్ట్‌గా మారుతుంది. ఆ తర్వాత రంగులు, పరిమాణం లాంటివి మార్చుకొని మీకు నచ్చినట్లు ఫొటోను రూపొందించుకోవచ్చు. మీరూ ట్రై చేయండి ఈ కొత్త ఫొటో కన్వర్టర్.



■ https:///goo.gl/tkTWNQ

– సత్య శ్రీవత్సవ్ (ఈమెయిల్)



డాల్ఫిన్లు ఆడుకోవడానికి...

నీటిలో ఈదడం, ఎవరైనా బంతి ఇస్తే దాంతో గమ్మత్తులు చేయడం... ప్రస్తుతం శిక్షణ పొందిన డాల్ఫిన్ల పనిదే. త్వరలో అవి మనలా మొబైల్‌లో గేమ్స్ ఆడతాయి. న్యూయార్క్‌లోని రాక్‌ఫెల్లర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు ఈ దిశగా ప్రయోగాలు చేస్తున్నారు. డాల్ఫిన్లకు స్నేహపూర్వకంగా ఉండే ప్రత్యేక మొబైల్, ఆప్స్, కీబోర్డు రూపొందిస్తున్నారు. అవి మొబైల్‌ను వాడేటప్పుడు వాటి ప్రతిస్పందనలను రికార్డు చేసి పరిశోధనలు చేస్తారు. ఈ ఆలోచన ఇంకా ప్రయోగ దశలోనే ఉంది.


మెమొరీ కార్డు ఆప్షన్‌తో...

షామీ సంస్థ నుంచి చాలా రోజుల తర్వాత మెమొరీ కార్డు కోసం ప్రత్యేక స్లాట్‌తో ఓ స్మార్ట్‌ఫోన్ వచ్చింది. గతకొన్నేళ్లుగా షామీ తమ మొబైల్స్‌లో హైబ్రిడ్ సిమ్ స్లాట్స్‌ను అమరుస్తోంది. అంటే రెండు సిమ్‌లు లేదంటే ఒక సిమ్, ఒక మెమొరీ కార్డు పెట్టుకునే ఆప్షన్ ఉండేది. ఇటీవల చైనాలో విడుదలైన రెడ్‌మీ నోట్ 5 సిరీస్ ఫోన్లలో మెమొరీ కార్డు కోసం ప్రత్యేక స్లాట్ ఇచ్చారు. స్పెసిఫికేషన్లు చూస్తే... నోట్ 5లో 5.5 అంగుళాల తాకే తెర, 1.4జీహెచ్‌జెడ్ ఆక్టాకోర్ ప్రోసెసర్, ముందువైపు 5 ఎంపీ కెమెరా, వెనుకవైపు 16 ఎంపీ కెమెరా, 3 జీబీ ర్యామ్, 32 జీబీ అంతర్గత మెమొరీ ఉంటాయి. నోట్ 5ఎలో 2 జీబీ ర్యామ్, 16 జీబీ అంతర్గత మెమొరీ, క్వాడ్ కోర్ ప్రోసెసర్ ఉంటాయి. సెల్ఫీ కెమెరాకు ఫ్లాష్ ఈ మొబైల్స్ అదనపు ప్రత్యేకత.



గూగుల్‌తో కలసి: షామీ, గూగుల్ కలసి ఓ మొబైల్‌ను రూపొందిస్తున్నాయా? ప్రస్తుతం అంతర్జాతీయ మొబైల్ రంగంలో ఇదే చర్చ. ఏ1 పేరిట షామీ నుంచి రానున్న కొత్త మొబైల్‌కు గూగుల్ సహకారం అందిస్తుందట. ఇది ఇటీవల చైనాలో విడుదలైన ఎంఐ 5ఎక్స్ తరహాలో ఉంటుంది. ఇందులో ఎంఐయూఐ ఇంటర్ఫేస్, గూగుల్ రక్షణ ఉంటాయి. గూగుల్ ఫొటోస్‌లో అన్‌లిమిటెడ్ స్టోరేజీ సౌకర్యం ఉంటుంది. గూగుల్ గతంలోనూ ఈ తరహా ప్రయత్నం చేసింది. మైక్రోమ్యాక్స్ కాన్వాస్ ఏ1, కార్బన్ స్పార్కల్ వి, స్పైస్ డ్రీమ్ యూనో, లావా పిక్సెల్ వీ1 అంటూ గూగుల్ సహకారంతో కొన్ని మొబైల్స్ వచ్చాయి.

అక్షరాల్లో వాట్సాప్ స్టేటస్




వాట్సాప్‌లో స్టేటస్ పెట్టాలంటే ఇప్పటివరకు బొమ్మలు లేదా వీడియోల రూపంలోనే కుదిరేది. త్వరలో అక్షరాల్లోనూ స్టేటస్ రాసుకోవచ్చు. ఫేస్‌బుక్‌లో టెక్స్ట్ పోస్ట్ తరహాలో ఇదీ పని చేస్తుంది. వాట్సాప్‌లోని స్టేటస్ ట్యాబ్‌లోకి వెళ్తే... టెక్స్ట్ ఐకాన్ ఉంటుంది. దాన్ని క్లిక్ చేసి అక్షరాల పోస్టులు పెట్టొచ్చు. దాని బ్యాగ్రౌండ్‌లో రంగులు వచ్చేలా కూడా చేయొచ్చు. ప్రస్తుతం ఈ ఆప్షన్ ప్రయోగాత్మకంగా కొందరికి అందుబాటులో ఉంది. త్వరలో అందరూ వాడొచ్చు.

తెర వెనక్కి వచ్చేస్తారు



'స్మార్ట్‌ఫోన్ స్క్రీన్ పగిలిపోయింది... సర్వీస్ సెంటర్‌లో అడిగితే రూ.నాలుగు వేలు అన్నారు... బయట షాపులో వేయించా!' ఇలాంటి మాటలు చాలామంది దగ్గర వింటుంటాం. అయితే తక్కువ డబ్బులతో పని అయిపోతుంది అనుకుంటే మీ 'పని' అయిపోతుంది అంటున్నారు నిపుణులు. థర్డ్ పార్టీ టచ్ స్క్రీన్లతోపాటు మీ మొబైల్‌లో హ్యాకింగ్ దొంగలు వచ్చే అవకాశం ఉందట. ఇజ్రాయిల్‌కు చెందిన బెన్-గురియన్ యూనివర్సిటీ ఆఫ్ నెగెవ్ శాస్త్రవేత్తలు హువాయ్ నెక్సస్ 6పి, ఎల్‌జీ జీ ప్యాడ్ 7.0 పై జరిపిన పరిశోధనలో ఈ విషయం తేలింది. అనధికారికంగా వేసే స్క్రీన్లలో ప్రమాదకర చిప్‌లు అమర్చి మీ ఫోన్, వ్యక్తిగత డేటాను సులభంగా తస్కరించొచ్చుట. కీబోర్డ్ ఇన్‌పుట్స్, ఆప్స్ ఇన్‌స్టాలింగ్, రిమోట్ కమాండ్స్ లాంటి వివరాల్ని ఈ చిప్‌లు రికార్డు చేసి అగంతుకులకు అందిస్తాయి. ఈ విధానాన్ని చిప్ ఇన్ ది మిడిల్ అంటారు.

అలనాటి గుడ్డు వచ్చేసింది



'టమగొచి'... ఇదేం పేరు అనుకుంటున్నారా? ఇది మన భాష కాదులెండి.. జపనీస్. 90వ దశకంలో ప్రపంచాన్ని ఓ ఊపు ఊపేసిన గ్యాడ్జెట్ పేరు ఇది. ఫీచర్ ఫోన్లు, స్మార్ట్‌ఫోన్లు లేని కాలంలో పిల్లల ఆట వస్తువు ఇది. గుడ్డు ఆకారంలో చేతిలో ఇమిడిపోయే గేమింగ్ కన్సోల్‌లా ఉంటుంది. ఇందులోని చిన్నలో విచిత్రమైన జంతువు బొమ్మ ఉంటుంది. దిగువనున్న బటన్స్‌తో దాన్ని ఒడుపుగా కదిపిస్తూ పై నుంచి పడుతున్న వస్తువులను పట్టుకోవాలి. ఇటీవల ఈ గ్యాడ్జెట్‌ను మళ్లీ జపాన్‌లో ప్రవేశపెట్టారు. త్వరలో ప్రపంచ మార్కెట్‌లోకి రానుంది. అన్నట్లు టమగొచి అంటే... గుడ్డు సమయం అని అర్థం. టమగో అంటే జపనీస్‌లో గుడ్డు... దానికి వాచ్ అనే ఆంగ్ల పదం కలిపి టమగొచి చేశారు.

ఎఫ్‌బీ 'ఏఆర్' అద్దాలు



ఫేస్‌బుక్ నుంచి ఆగ్యుమెంటెడ్ రియాలిటీ (ఏఆర్) సాంకేతికతతో గ్యాడ్జెట్లు వస్తాయనే విషయం తెలిసిందే. అక్యులెస్ పేరుతో 2022 కల్లా ఈ సర్వీసులు ప్రారంభంకానున్నాయి. ఇప్పుడు దీనికి చెందిన ఏఆర్ గ్లాస్ డిజైన్ బయటికొచ్చింది. ఇటీవల దీని పేటెంట్ కోసం ఫేస్‌బుక్ దరఖాస్తు చేసుకొంది. దాంతోపాటు సమర్పించిన డిజైనే ఇది. ఇందులో ట్రాన్స్‌పరెంట్ డిస్ప్లే ఉంటుందని సమాచారం.

యూట్యూబ్‌లో 'తాజా'



టీవీల్లో 'తాజావార్తలు', 'బ్రేకింగ్‌న్యూస్' అంటూ స్క్రీన్‌కు దిగువన ఓ బాక్స్ ఉంటుంది. దాన్ని టిక్కర్ అంటారు. త్వరలో యూట్యూబ్‌లోనూ అలాంటి టిక్కర్‌ను చూడొచ్చు. యూట్యూబ్ ఆప్, వెబ్ వెర్షన్‌లో తాజావార్తల టిక్కర్‌ను త్వరలో ప్రవేశపెట్టబోతున్నారు. ఇప్పటికే ఈ ఆప్షన్ కొంతమందికి ప్రయోగాత్మకంగా అందుబాటులో ఉంది. దానికి వచ్చే స్పందన బట్టి టిక్కర్‌ను కొనసాగించాలా వద్దా అనేది నిర్ణయిస్తారని సమాచారం.

తల్లడిల్లి.. మెల్లగా తెప్పరిల్లి..



భారీ వర్షాల కారణంగా రైళ్ల రాకపోకలు ఆలస్యం కావడంతో నడిచి వెళ్తున్న ముంబయి ప్రజలు

కోలుకుంటున్న ముంబయి ■ పాక్షికంగా సబర్బన్ సేవలు మొదలు

పలకరించిన బుధవారపు సూర్యుడు ■ వర్షాలు, వరదలకు 19 మంది మృతి

ముంబయి

గుక్కతిప్పుకోనీయకుండా పిడిగుద్దుల్లా ఎడాపెడా కొట్టేసిన జడివాన ధాటికి నివ్వెరపోయి.... మూగబోయిన ముంబయి నగరం బుధవారం మెలమెల్లగా తేరుకుంది. ముంచెత్తిన వరదనీటి ఉధృతికి కకావికలమైన జనజీవనం మెల్లగా తనను తాను కూడదీసుకుంది. కారుమబ్బులు కమ్మేసి...మాయమైపోయిన సూర్యుడు బుధవారం ఉదయం ముంబయిని వెచ్చగా పలకరించాడు. బుధవారం ఇక్కడి చరిత్రాత్మక చర్చ్‌గేట్, ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్‌ల నుంచి కొన్ని సబర్బన్ రైళ్లను పాక్షికంగా పునరుద్ధరించడంతో మంగళవారం నుంచీ కార్యాలయాలకే పరిమితమై బిక్కుబిక్కున గడిపిన ఉద్యోగులంతా అలసటగా ఇళ్లకు బైలుదేరారు. బుధవారం తెల్లవారు జామున నాలుగున్నరగంటల నుంచే రైల్వేస్టేషన్లలో సందడి కనిపించింది. వెల్లువెత్తిన నీటితో మడుగుల్లా మారిన రోడ్లు బుధవారం సాధారణ స్థితికి రావడంతో బస్సు సర్వీసులు యధావిధిగా నడిచాయి.



వరద నీటిలో కొట్టుకొచ్చిన కార్లు

భారీ వర్షాలకు 19 మంది మృతి

ముంబయినగరం, శివారుప్రాంతాలు, సమీపంలోని థానే, పాల్ఘార్‌జిల్లాలతో పాటూ వివిధ ప్రాంతాల్లో జరిగిన వేర్వేరు సంఘటనల్లో 19 మంది మృతి చెందారు. 16 మంది గాయపడ్డారు.

ముంబయికి చెందిన ప్రఖ్యాత వైద్యుడు(గాస్ట్రో ఎంట్రాలజిస్ట్) డాక్టర్. దీపక్ అమ్రాపూర్కర్ గల్లంతైనట్లు పోలీసులు బుధవారం నాడిక్కడ వెల్లడించారు. డాక్టర్. అమ్రాపూర్కర్ నడుస్తూ అక్కడే ఉన్న ఓ మ్యాన్‌హోల్‌లో పడిపోయినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. నగరం, శివారుప్రాంతాల్లోని మహారాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు బుధవారం కూడా పనిచేయలేదు. గురువారం దాకా కూడా ముంబయి నగరంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మంగళవారం ఉదయం 8.30 నుంచీ బుధవారం ఉదయం అదే సమయం దాకా శాంతాక్రజ్ వాతావరణ కేంద్రం పరిధిలో 331.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఇక, అదే వ్యవధిలో కొలబా అబ్జర్వేటరీ 110 పరిధిలో మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దాదాపు 450 మంది జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్) సిబ్బంది రంగంలోకి దిగినట్లు హోంశాఖ దిల్లీలో ఒక ప్రకటనలో తెలిపింది.

నిలిచిపోయిన 'డబ్బావాలా' సేవలు

నిత్యం రెండులక్షలకు పైగా టిఫిన్లను వివిధ కార్యాలయాల ఉద్యోగులకు వేడివేడిగా అందించే ముంబయి డబ్బావాలాలంతా... సబర్బన్ రైలు సేవల రద్దుతో, రోడ్డు రవాణా సదుపాయం సరిగా లేకపోవడంతో బుధవారం సేవలను రద్దు చేసుకున్నారు. గురువారం నుంచీ సేవలను పునరుద్ధరిస్తామని ముంబయి డబ్బావాలా అసోసియేషన్ ప్రతినిధి సుభాష్ తలేకర్ చెప్పారు.

ఉగ్రవాదానికి మతంతో ముడిపెట్టడం ప్రమాదకరం

- **ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**



ఈనాడు, దిల్లీ: ఉగ్రవాదానికి ఏదైనా మతంతో ముడిపెట్టడం ప్రమాదకరమనీ, ఇలాంటి ప్రయత్నాలను ప్రజలు తిప్పికొట్టాలనీ భారత ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ఉగ్రవాదానికి మతమే లేదన్నారు. బుధవారమిక్కడ 'భారత్-ఇస్లామిక్ సాంస్కృతిక కేంద్రం'లో నిర్వహించిన మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం రెండో స్మారక ఉపన్యాస సభలో ఆయన మాట్లాడారు. 'ఉగ్రవాదానికి మతం లేదు. ఆ విషయంలో మనందరికీ ఒక స్పష్టత అవసరం. ఉగ్రవాదాన్ని కొంతమంది ఏదో ఒక మతంతో ముడిపెడుతున్నారు. తద్వారా ప్రజల్ని గందరగోళంలో పడేయాలనుకుంటున్నారు. నిజానికి ఉగ్రవాదమనేది సమాజానికి ఓ బెడద. అది కొంతమంది వ్యక్తులు ఆడుతున్న అత్యంత ప్రమాదకర క్రీడ. మనం ఎంతో అప్రమత్తంగా ఉండాలి. ఏ మతమూ ఉగ్రవాదాన్ని ప్రబోధించదు' అని స్పష్టం చేశారు. ఏ భాషనూ మతంతో అనుసంధానించకూడదనీ, ముస్లింల కంటే మెరుగ్గా చాలా మంది హిందువులు ఉర్దూ మాట్లాడగలరనీ వెంకయ్యనాయుడు చెప్పారు. ఎవరిపైనా ఏ భాషనూ బలవంతంగా రుద్దరాదనీ, మాతృభాషను నేర్చుకోవడం మొట్టమొదటి ప్రాధాన్యంగా ఉండాలనీ తెలిపారు. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం 'మిస్సైల్ మ్యాన్'గా కన్నా ప్రజా రాష్ట్రపతిగానే ఎక్కువ గుర్తింపు పొందారని తెలిపారు. చట్టసభల్లో శాసనకర్తలు ఉత్తమ ఫలితాలు రాబట్టడానికి నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని ఉప రాష్ట్రపతి కోరారు. సభల్లో ఆటంకాలు సృష్టిస్తే అది పత్రికల్లో పతాక శీర్షికలకు అవకాశం కల్పించవచ్చేమోగానీ చివరకు దేశం నష్టపోతుందని చెప్పారు.

చంద్రబాబుతో తెలంగాణ తెదేపా నేతల భేటీ

ఈనాడు అమరావతి: తెలుగుదేశం పార్టీ తెలంగాణ నాయకులు బుధవారం ఏపీ ముఖ్యమంత్రి, తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబుని ఆయన నివాసంలోనూ, సచివాలయంలోనూ కలిశారు. నంద్యాల ఉప ఎన్నికలో పార్టీ విజయం సాధించినందుకు అభినందనలు తెలియజేశారు. వీరిలో తెలంగాణ తెదేపా కార్య నిర్వాహక అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సండ్ర వెంకట వీరయ్య, వేం నరేందర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకుడు కంభంపాటి రామ్మోహనరావు తదితరులున్నారు. కొందరు రేవంత్‌రెడ్డితో సెల్ఫీలు తీసుకున్నారు. తెలంగాణకు చెందిన తెదేపా నేతలతో ముఖ్యమంత్రి చంద్రబాబు గురువారం మధ్యాహ్నం సమావేశమవుతారు. తెలంగాణలో వివిధ పార్టీ కమిటీల ఏర్పాటు తదిర అంశాలపై చర్చించనున్నారు.

రెండో ప్రపంచ యుద్ధం నాటి బాంబు ఇప్పుడు కనిపించింది

ఫ్రాంక్‌ఫర్ట్: రెండో ప్రపంచయుద్ధ సమయంలో బ్రిటన్ జర్మనీపై వేసిన బాంబు ఒకటి తాజాగా ఫ్రాంక్‌ఫర్ట్ నగరంలో బయటపడింది. 1400 కిలోలు ఉన్న 'బ్లాక్‌బస్టర్' అనే ఈ బాంబును స్థానిక గోథీ యూనివర్సిటీ సమీపంలోని వెస్టెండ్ క్యాంపస్ వద్ద మంగళవారం కనుగొన్నారు.

బాలికను బలిగొన్న రక్తపు మరకలు!

- **తరగతి గదిలో 'రుతుస్రావం'పై ఉపాధ్యాయురాలి అవమానం**
- **తమిళనాడులో విద్యార్థిని ఆత్మహత్య**

చెన్నై

అవగాహన కల్పించి అక్కున చేర్చుకోవాల్సిన వారే అవమానించడంతో తట్టుకోలేక పోయింది ఆ బాలిక. రుతుస్రావంపై తోటి విద్యార్థుల ముందే ఉపాధ్యాయురాలు మందలిస్తుంటే జీర్ణించుకోలేక, ఏం సమాధానం చెప్పాలో తెలియక తల్లడిల్లింది. చివరకు ప్రాణాలను తీసుకోవాలని నిర్ణయించుకుంది. తెల్లవారుజామున మేడపై నుంచి దూకేసింది. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ ఘటన తమిళనాడులోని తిరునెల్వేలి జిల్లా పాళయంకొట్టైలో చోటుచేసుకుంది. పాళయంకొట్టైకు చెందిన సప్రీన్ హాజీరా స్థానికంగా ఉండే పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. తరగతి గదిలో రుతుస్రావం అవడంతో దుస్తులకు రక్తపు మరకలు అంటుకున్నాయి. దీన్ని చూసిన తోటి విద్యార్థులు ఆమెను ప్రశ్నించారు. సప్రీన్ శుభ్రం చేసుకుని వస్తానని ఉపాధ్యాయురాలి అనుమతి కోరింది. దీనిపై ఎందుకు అప్రమత్తంగా లేవని టీచర్ మందలించారు. రక్తపు మరకలపై అనుమానం వ్యక్తం చేస్తూ, వెంటనే తరగతి గది నుంచి వెళ్లాలని కోరారు. ఇదే విషయంపై పాఠశాల ప్రిన్సిపాల్‌కు కూడా ఫిర్యాదు చేశారు. ఈ అవమానకర ఘటనలతో కలత చెందిన సప్రీన్ అన్ని విషయాలను వివరంగా లేఖలో పొందుపర్చి సోమవారం ఉదయం మూడు గంటలకు పొరుగున ఉన్న ఇంటి మేడపైకి ఎక్కి దూకేసింది. కేకలు విన్న ఇరుగుపొరుగు వారు, కుటుంబ సభ్యులు వెంటనే బాలికను ఆస్పత్రికి తరలించారు. మార్గమధ్యలోనే ఆమె ప్రాణాలను కోల్పోయిందని పోలీసులు తెలిపారు. బాలిక లేఖ ద్వారా విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు, గ్రామస్థులు సదరు పాఠశాల ముందు ఆందోళనకు దిగారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



సప్రీన్ హాజీరా (పాతచిత్రం)

'రేరా'పై వ్యాజ్యాలన్నీ దిల్లీ హైకోర్టుకు..

బదిలీ చేయాలన్న కేంద్రం విజ్ఞప్తిపై విచారణ జరపనున్న సుప్రీం

దిల్లీ: స్థిరాస్తి నియంత్రణ, అభివృద్ధి చట్టం (రేరా)పై వివిధ హైకోర్టుల్లో దాఖలైన వ్యాజ్యాలన్నింటినీ దిల్లీ హైకోర్టుకు బదిలీ చేయాలన్న కేంద్రం విజ్ఞప్తిని పరిశీలించడానికి సుప్రీంకోర్టు అంగీకరించింది. దీనిపై కేంద్రం దాఖలు చేసిన వినతిపై సెప్టెంబరు నాలుగో తేదీన విచారణ జరుపుతామని బుధవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్ర, జస్టిస్ అమితావ రాయ్, జస్టిస్ ఎ.ఎం.ఖన్విల్కర్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. 'రేరా'ను సవాలు చేస్తూ బొంబాయి, కర్ణాటక హైకోర్టులు సహా దేశవ్యాప్తంగా 21 పిటిషన్లు దాఖలయినట్టు అదనపు సొలిసిటర్ జనరల్ మణీందర్ సింగ్ తెలిపారు. పలు రకాల విచారణలను నివారించడానికి వీలుగా వీటన్నింటినీ దిల్లీ హైకోర్టుకు బదలాయించాలని కోరారు.

ఈ ఏడాది 1256 మంది చిన్నారుల మృతి

- **ఒక్క ఆగస్టులోనే 296 మంది**
- **యూపీ బీఆర్డీ ఆసుపత్రి ప్రిన్సిపల్ వెల్లడి**

గోరఖ్‌పూర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బీఆర్డీ(బాబా రాఘవ్ దాస్) బోధనాసుపత్రిలో ఈ ఏడాది ప్రారంభం నుంచి 1256 మంది చిన్నారులు మృతి చెందినట్లు కళాశాల ప్రిన్సిపల్ పి.కె.సింగ్ వెల్లడించారు. ఆగస్టులో నెలలోనే 296 మంది మృత్యువాత పడ్డారని ఆయన బుధవారం తెలిపారు. ఎక్కువ మంది మరణాలకు కారణం మెదడువాపు, జనన సంబంధిత వ్యాధులేనని ఆయన చెప్పారు. నెలల నిండక ముందే జన్మించడం వల్ల చిన్నారులు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. తీవ్ర ఆరోగ్య సమస్యలతో పరిస్థితి విషమంగా ఉన్న పరిస్థితుల్లో తల్లిదండ్రులు తమ శిశువులను ఆసుపత్రికి తీసుకువస్తున్నట్లు ప్రిన్సిపల్ చెప్పారు. పరిస్థితి విషమించక ముందే ఆసుపత్రికి తీసుకువచ్చి ఉంటే ఎక్కువ మంది ప్రాణాలను కాపాడే అవకాశం ఉండేదన్నారు. గత 24 గంటల్లోనే మెదడువాపు వ్యాధి ఉన్న 17 మంది చిన్నారులు ఆసుపత్రిలో చేరారని, చికిత్స అందిస్తుండగా ఇద్దరు మృతి చెందారని అదనపు సంచాలకులు డాక్టర్ పుష్కర్ ఆనంద్ తెలిపారు. ఆక్సిజన్ సరఫరా చేసే సంస్థకు బీఆర్డీ ఆసుపత్రి యాజమాన్యం బిల్లులు చెల్లించకపోవడంతో ఆక్సిజన్ అందక పలువురు చిన్నారులు మృతిచెందడం దేశవ్యాప్తంగా ఇటీవల సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ చిన్నారుల మరణాలతో సంబంధం ఉందన్న ఆరోపణలతో బోధనాసుపత్రి మాజీ ప్రిన్సిపల్, అతని భార్యను ప్రత్యేక కార్యదళం మంగళవారం అరెస్టు చేసింది.

46 గంటల్లో 42 మంది మృతి...

బీఆర్డీ బోధనాసుపత్రిలో చిన్నారుల మరణాలు ఇంకా కొనసాగుతున్నాయి. ఆగస్టు 26 అర్ధరాత్రి నుంచి 28 రాత్రి మధ్య 42 మంది మృతి చెందారు.



టెక్సాస్‌లోని హంబుల్‌లో నీట మునిగిన పలు వాణిజ్య సముదాయ భవనాలు



టెక్సాస్‌లోని కొన్రో జలాశయం నుంచి ప్రవహిస్తున్న నీరు

పాఠశాలలు పుస్తకాలు విక్రయించవచ్చు

- **సీబీఎస్‌ఈ తాజా సవరణలో వెల్లడి**

దిల్లీ: కేంద్ర మాధ్యమిక విద్యా మండలి(సీబీఎస్‌ఈ) ఏప్రిల్‌లో తన అనుబంధ పాఠశాలలకు జారీచేసిన మార్గదర్శకాలకు సవరణలు చేసింది. దీనిప్రకారం సీబీఎస్‌ఈ అనుబంధ పాఠశాలల్లో పుస్తకాల విక్రయశాలలు ఏర్పాటుచేసుకోవచ్చు. వీటిల్లో విద్యార్థులకు అవసరమైన స్టేషనరీ వస్తువులతో పాటు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు విక్రయించవచ్చు. గత ఏప్రిల్‌లో విడుదల చేసిన సూచనల్లో పాఠశాలల్లో ఎటువంటి వ్యాపార దుకాణాలను ఏర్పాటుచేయవద్దని, బడి ఆవరణల్లో పుస్తకాలు, ఏకరూప దుస్తులు అమ్మకూడదని తెలిపింది. తాజా సవరణల ప్రకారం పాఠశాలలు తమ వెబ్‌సైట్ ద్వారా పుస్తకాలు విక్రయించవచ్చు. దీని కోసం అవసరమైతే బడి ఆవరణలో ఒక పుస్తక విక్రయశాలను సైతం ఏర్పాటు చేసుకోవచ్చని ఇటీవల జారీచేసిన ప్రకటనలో పేర్కొంది.

అమెరికాలో హరికేన్ హార్వీ బీభత్సం

- **5 రోజులుగా టెక్సాస్ రాష్ట్రాన్ని వదలని భారీ వర్షాలు, వరదలు**
- **బుధవారం లూసియానాను ముంచెత్తిన కుండపోత**
- **30 మందికిపైగా మృతి**

హ్యూస్టన్: అమెరికాలోని రెండు రాష్ట్రాలను హరికేన్ హార్వే కుదిపేస్తోంది. పెద్ద రాష్ట్రం టెక్సాస్‌ను గత అయిదురోజులుగా ముంచెత్తుతున్న కుండపోత వర్షాలు, వరదలు బుధవారం పొరుగునే ఉన్న లూసియానా రాష్ట్రంపైనా విరుచుకుపడ్డాయి. 30 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. పన్నెండేళ్ల క్రితం (2005) హరికేన్ కత్రినా ధాటికి విలవిలలాడిన లూసియానా తాజా విపత్తుతో వణికిపోతోంది. హార్వే ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు, వరద నీటితో అమెరికాలో నాలుగో పెద్ద నగరమైన హ్యూస్టన్, దాని పరిసరాలు పెద్ద జలాశయంలా మారిపోయాయి. ఎడతెరిపిలేని వర్షాలతో పాటు పెనుగాలులు వీస్తుండటంతో ప్రాణ, ఆస్తి నష్టం భారీగా జరిగే ప్రమాదం ఉందని భయపడుతున్నారు. సముద్ర తీర నగరాలైన బీమౌంట్, పోర్ట్ ఆర్థర్‌లలో 24 గంటలలో 66 సెంటీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది. ఏకధాటి కుండపోత వల్ల ఆకస్మిక వరదలు వస్తాయని భయపడుతున్నారు. గురువారం ఉదయానికి హరికేన్ క్రమంగా బలహీనపడి వాయుగుండంగా మారే అవకాశం ఉందని జాతీయ వాతావరణ సేవల సంస్థ అంచనావేస్తున్నప్పటికీ ఆగ్నేయ లూసియానా, దక్షిణ మిస్సిసిపీ, దక్షిణ అలబామా, ఆగ్నేయ ఆర్కన్సాస్ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తాయని చెబుతున్నారు.

టెక్సాస్‌లో వరద నీటిలో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు చేర్చేందుకు బుధవారమంతా విపత్తు నిర్వహణ సిబ్బంది శ్రమిస్తూనే ఉన్నారు. లూసియానా, టెక్సాస్‌లలో 18,600 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. 2,86,500 మంది వినియోగదారులకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. హ్యూస్టన్‌లో ఖాళీ చేసిన జనావాసాల్లో దోపిడీలను నివారించేందుకు రాత్రిపూట కర్ఫ్యూ విధించినట్లు నగర మేయర్ ప్రకటించారు. పలు ప్రాంతాలు వరద నీటిలో ఉండిపోవటంతో నష్టం తీవ్రతను అంచనావేయలేకపోతున్నారు. శుక్రవారం నుంచి బుధవారం వరకు 132 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ఇంత భారీ వర్షం కురవడం అరుదైన రికార్డుగా జాతీయ వాతావరణ సేవల అధికారులు వెల్లడించారు. వేలాది ఇళ్లలోకి వరద నీరు పోటెత్తింది. పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి.

ట్రంప్ పర్యటన: హరికేన్ టెక్సాస్‌లోని కార్పస్ క్రిస్టీ ప్రాంతాన్ని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం సందర్శించారు. వరద ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యల గురించి తెలుసుకున్నారు. గతంలో ఎన్నడూ చేయనంతగా సహాయ, పునరావాస చర్యలుండాలని గవర్నర్‌కు స్పష్టం చేశారు.

భారతీయ విద్యార్థి మృతి: శనివారం టెక్సాస్‌లోని ఓ సరస్సులో ఈతకు వెళ్లి ఆకస్మిక వరద వల్ల ప్రమాదానికి గురైన భారతీయ విద్యార్థి నిఖిల్ భాటియా ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. రాజస్థాన్‌లోని జైపుర్‌కు చెందిన భాటియా ఎ అండ్ ఎం యూనివర్సిటీ విద్యార్థి. ఇతనితో పాటు ఈతకు వెళ్లి ప్రమాదంలో చిక్కుకున్న శాలినీ సింగ్ అనే యువతి ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

భారత సంతతి కుటుంబాల ఉదారత: హ్యూస్టన్‌లోని సురక్షిత ప్రాంతాల్లో నివసిస్తున్న భారత సంతతి అమెరికన్ల కుటుంబాలు వరదల్లో చిక్కుకున్న సమీప ప్రాంతాల్లోని వారికి సహాయ సహకారాలు అందిస్తూ తమ ధాతృత్వాన్ని చాటుకుంటున్నారు. ఇండో అమెరికన్ చాంబర్ ఆఫ్ గ్రేటర్ హ్యూస్టన్ తోపాటు మద్రాస్ పెవిలియన్ అనే రెస్టారెంట్ వివిధ సురక్షిత ప్రాంతాల్లో తలదాచుకుంటున్న 500 మందికిపైగా బాధితులకు భోజనాలను సరఫరా చేశాయి. భారతీయులకు చెందిన రెస్టారెంట్లు, ధార్మిక సంస్థలు, ఆలయాల తరఫున బాధితులకు ఆహారాన్ని అందజేస్తున్నారు. సహాయక చర్యల్లో వందల మంది ఎన్‌ఆర్‌ఐ యువకులు, విద్యార్థులు చురుగ్గా పాల్గొంటున్నారు. హ్యూస్టన్, పరిసర ప్రాంతాల్లో లక్ష మంది వరకూ భారతీయ అమెరికన్లు ఉన్నట్లు సమాచారం.

దివంగత జయలలిత కుమార్తెను నేను

- **డీఎన్‌ఏ పరీక్ష చేసి వాస్తవాలను వెల్లడించాలి**
- **రాష్ట్రపతి, ప్రధాని, సీజేలకు బెంగళూరు మహిళ లేఖ**

చెన్నై: తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, దివంగత జయలలిత కుమార్తెను అంటూ బెంగళూరుకు చెందిన ఓమహిళ.. రాష్ట్రపతి, ప్రధాని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి లేఖలు రాశారు. తనకు డీఎన్‌ఏ పరీక్ష చేసి వాస్తవాలను వెల్లడించాలని కోరారు. దీనికి అవసరమైతే సమాధి నుంచి జయలలిత మృతదేహాన్ని బయటకు తీయాలని, సీబీఐ విచారణకూ తాను సిద్ధమన్నారు. జయలలితది సహజ మరణం కాదని, మృతిపై అనుమానాలు ఉన్నాయని చెప్పారు. దీనిపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో సీబీఐవిచారణ జరపాలని కోరారు. ప్రస్తుతం ఆమె ఆస్తులు కాజేయడానికి కొందరు ప్రయత్నాలు చేస్తున్నారని, తమిళనాడులో చోటు చేసుకుంటున్న పరిణామాలనేపథ్యంలో తాను ఎవరో వెల్లడించాలనే ఉద్దేశంతోనే ఈ లేఖలు రాశానని చెప్పారు.

లేఖలోని విషయాలివీ: "నా పేరు మంజుల అలియాస్ అమృత. జయలలిత మా అమ్మ. అమ్మమ్మ, తాతయ్య మరణం తర్వాత జయలలిత కుంగిపోయారు. అప్పుడు ఆమెకు నటుడు శోభన్‌బాబు దగ్గరయ్యారు. వారిద్దరి మధ్య చిగురించిన ప్రేమ ఫలితమే నేను. వారు పెళ్లి చేసుకోవాలని అనుకున్నప్పటికీ సాధ్యం కాలేదు. 1980 ఆగస్టు 14న నేను పుట్టాను. బెంగళూరులో ఉన్న అమ్మకు సోదరైన శైలజకు నన్ను అప్పగించారు. అప్పటి నుంచి అక్కడే ఉంటున్నాను. జయలలిత కుమార్తెనని వారు ఎక్కడా చెప్పలేదు. 1996లో ఒకసారి జయలలితను కలవమని చెప్పడంతో చెన్నైకి వచ్చాను. జయలలితను కలిశాను. నన్ను చూసి అమ్మ ముచ్చటపడ్డారు. ఆ తర్వాత చాలాసార్లు కలిశాను. ఎప్పుడూ జయలలిత నా సొంత అమ్మ అని ఎక్కడా చెప్పలేదు. ఆమె కూడా తన కుమార్తె అని వెల్లడించలేదు. రాజకీయాలు, సినిమా రంగంలోకి రావద్దని చెప్పారు. అందుకే ఇంతకాలం జయలలిత కుమార్తెను అని ఎక్కడా వెల్లడించలేదు. అమ్మ మరణం తర్వాత ఆవేదనకు గురయ్యాను" అని మంజుల పేర్కొన్నారు.



మంజుల

తృటిలో తప్పిన విమాన ప్రమాదం

- **రెక్కల్లోని చక్రాల్లో ఇరుక్కుపోయిన పక్షి**

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విమానం గాలిలోకి ఎగిరే సమయంలో ఓ పక్షి విమాన రెక్కల్లోని చక్రాల్లో ఇరుక్కుపోవడంతో... అత్యవసరంగా విమానాన్ని ల్యాండింగ్ చేసిన ఘటన బుధవారం విశాఖపట్నం విమానాశ్రయంలో చోటు చేసుకుంది. ఇండిగో సంస్థకు చెందిన విమానం ఉదయం 7-15 గంటలకు బెంగళూరు నుంచి విశాఖ చేరుకుంది. అనంతరం సుమారు 180 మంది ప్రయాణికులతో 7-50 గంటలకు విశాఖ నుంచి బెంగళూరు బయలుదేరింది. రన్‌వే నుంచి గాలిలోకి ఎగరడానికి సిద్ధమవుతున్న సమయంలో ఓ పక్షి విమాన రెక్కల్లో ఉండే చక్రాల్లో ఇరుక్కుపోయింది. పైలెట్ వెంటనే గుర్తించినా.... విమానాన్ని గాలిలోకి తీసుకెళ్లి పది నిమిషాల తర్వాత అధికారుల అనుమతితో విమానాశ్రయంలో అత్యవసరంగా దించేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. అనంతరం ప్రయాణికులను విమానం నుంచి కిందకి దింపి విమానానికి మరమ్మతులు చేపట్టారు. అవి ఎంతకూ పూర్తికాకపోవడంతో ప్రయాణికులు కౌంటరు వద్ద ఇండిగో సంస్థ ప్రతినిధులతో వాగ్వాదానికి దిగారు. చివరకు సాయంత్రం 3-30 గంటలకు మరో విమానాన్ని ఏర్పాటు చేసి ప్రయాణికులను బెంగళూరు పంపారు. దీంతో చాలా మంది ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మరికొందరు తమ ప్రయాణాన్ని రద్దు చేసుకున్నారు.

'ఎగ్జిబిషన్' స్థలం 99 ఏళ్లు లీజుకు

- **ఇచ్చేందుకు ప్రభుత్వం సుముఖంగా ఉంది: సొసైటీ కార్యదర్శి**

హైదరాబాద్, న్యూస్‌టుడే: హైదరాబాద్ నగరంలోని ఎగ్జిబిషన్ మైదానం స్థలాన్ని ఎగ్జిబిషన్ సొసైటీకి 99 ఏళ్లపాటు లీజుకిచ్చేందుకు అవసరమైన చర్యల్ని తెలంగాణ సర్కారు చేపడుతోందని సొసైటీ కార్యదర్శి ఆదిత్య మార్గం తెలిపారు. బుధవారం ఆయన 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్ మైదానం స్థలానికి సంబంధించిన లీజును రద్దు చేస్తున్నట్లు రోడ్లు, భవనాల శాఖ నుంచి నోటీసులందిన విషయం వాస్తవమేనని, సోమవారం నోటీసు అందగానే సొసైటీ అధ్యక్షుడు, ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌కు తెలియజేశామని చెప్పారు. సొసైటీ ప్రతినిధి బృందం బుధవారం ఉదయం కరీంనగర్ పర్యటనలో ఉన్న మంత్రిని కలిసి దీనిపై విన్నవించినట్లు తెలిపారు. ఎగ్జిబిషన్ మైదానం స్థలం లీజు విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం 99 ఏళ్ల పాటు లీజుకిచ్చే ప్రక్రియను వేగవంతం చేసినట్లు చెప్పారని వెల్లడించారు. అనంతరం సొసైటీ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసిందన్నారు. రెండ్రోజుల్లోపే ఎగ్జిబిషన్ స్థలం లీజు అంశాన్ని ఖరారు చేసేందుకు అధికార యంత్రాంగం పనిచేస్తోందని మంత్రి చెప్పినట్లు తెలిపారు.

నృత్యంతో వృద్ధాప్య లక్షణాలు వెనక్కి




బెర్లిన్: వయసు మీదపడటం వల్ల వచ్చే లక్షణాలను నృత్యంతో వెనక్కిమళ్లించే అవకాశముందట. జర్మనీలోని న్యూరోడీజనరేటివ్ డిసీజ్ కేంద్రం పరిశోధకులు జరిపిన అధ్యయనంలో ఈ విషయం బయటపడింది. వ్యాయమంతో పోల్చితే.. నృత్యం వల్ల వృద్ధాప్యంలో శరీర సమతౌల్యాన్ని మరింత పెంచుకోవచ్చని తేలింది. వృద్ధుల్లో వ్యాయామం, నృత్యం వల్ల కలుగుతున్న ఫలితాలను విశ్లేషించేందుకు.. సగటున 68 ఏళ్లున్న వ్యక్తులపై 18 నెలలపాటు పరిశోధకులు ఈ అధ్యయనం జరిపారు. రెండు బృందాలుగా వారిని విభజించి.. ఒక బృందానికి నృత్యం, మరో బృందానికి వ్యాయామ తరగతులు వారం వారం నిర్వహించారు. రెండు బృందాలకూ చెందినవారి మెదడుల్లో హిప్పోక్యాంపస్ ప్రాంతంలో వృద్ధి కనిపించిందని.. జ్ఞాపకశక్తి, కొత్త విషయాలు నేర్చుకోవడంలో ఇది కీలకపాత్ర పోషిస్తుందని పరిశోధకులు తెలిపారు. అల్జీమర్స్ లాంటి వ్యాధులు ఇదే ప్రాంతాన్ని ప్రభావితం చేస్తాయని చెప్పారు. ఇటు నృత్య బృందంలో ఉన్నవారిలో అదనంగా శరీర సమతౌల్యం మెరుగైందని పరిశోధకులు తెలిపారు. వ్యాయామం కన్నా ఎప్పటికప్పుడు వివిధ రకాల్లో విభిన్నంగా ఉండే నృత్యం వృద్ధులకు మంచి సవాళ్లు విసిరిందని.. అదే సమతౌల్యాన్ని పెంచి ఉంటుందని పేర్కొన్నారు.

నివురుగప్పిన నిప్పులా వాత హృద్రోగం



వాషింగ్టన్: నివురుగప్పిన నిప్పులా మరో రుగ్మత ఏటికేడు విస్తరిస్తూ, ప్రపంచాన్ని కుదిపేస్తోంది. వాత జ్వరానికి దారితీసే బ్యాక్టీరియా.. . గుండె కవాటాలను తొలిచేస్తూ 'వాత హృద్రోగం (రుమటాయిడ్ హార్ట్ డిసీజ్)'కు కారణమవుతోంది. ముఖ్యంగా ఇది పేద, వర్ధమాన దేశాల్లో విజృంభిస్తోందని, అందునా చిన్నారులను ఎక్కువగా పొట్టనపెట్టుకుంటోందని వాషింగ్టన్ విశ్వవిద్యాలయ తాజా అధ్యయనంలో వెల్లడైంది. 2015లో అత్యధికంగా ఇండోనేషియాలో 11.8 లక్షల మంది, కాంగోలో 8,05,000, భారత్‌లో 1,19,000, చైనాలో 72,600, పాకిస్థాన్‌లో 18,900 మంది ఈ వ్యాధి కారణంగా తనువు చాలించినట్లు లెక్కగట్టింది. అయితే... ఈ మరణాల రేటు అధికంగా (లక్షలో పది మంది) ఉండే ప్రాంతాలున్న దేశాల్లో భారత్ కూడా ఉందని పరిశోధకుడు జార్జ్ రోథ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా చూస్తే గత పాతికేళ్లలో ఈ జంట వ్యాధుల జాడ తగ్గినా... 1990 నుంచి పేద దేశాల్లో మాత్రం ఈ వ్యాధుల కారక మృతుల సంఖ్య నిలకడగా పెరుగుతూనే ఉందని మరో పరిశోధకుడు డేవిడ్ వాకిన్స్ పేర్కొన్నారు. ఛిద్రమైన గుండె కవాటాలను మార్చడం ద్వారా పునర్జన్మను ప్రసాదించే వీలున్నా- రోగుల ఆర్థిక పరిస్థితి; ఆయా దేశాల్లో వైద్య వసతులు అందుకు అనుకూలంగా లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ వ్యాధిని తొలిదశలోనే గుర్తించి, సరైన చికిత్స అందించేందుకు ప్రభుత్వాలు నడుం బిగిస్తేనే.. వాత హృద్రోగాన్ని అదుపు చేయగలమని సూచించారు.

నెమ్మదిగా నడిస్తే ముందస్తు మరణం



లండన్: నెమ్మదిగా నడిచే వ్యక్తులు గుండె సంబంధ వ్యాధులతో మరణించే ప్రమాదం ఉందని ఓ అధ్యయనం తెలిపింది. 2006 నుంచి 2010 మధ్య ఇంగ్లండ్ వ్యాప్తంగా ఉన్న మధ్య వయస్కుల వివరాలను యూకే బయోబ్యాంక్ విశ్లేషించి ఈ విషయాలను వెల్లడించింది. 4,20,727 మందిపై ఈ పరిశోధన చేశారు. సమాచారం సేకరించే సమయంలో వీరికి క్యాన్సర్, గుండె జబ్బులు లేవు. ఆ తర్వాత 6.3 ఏళ్లలో నమూనా జనాభాలో 1,654 మంది గుండె సంబంధ వ్యాధులతో, 4,850 మంది క్యాన్సర్‌తో చనిపోయారు. ' 'మా పరిశోధనలో ఓ ఆసక్తికరమైన విషయం తెలిసింది. వీరు నెమ్మదిగా, స్థిరంగా నడిచేవారని కొందరు మాకు తెలిపారు. దీని వల్లే వారు క్యాన్సర్, గుండె జబ్బుల బారిన పడ్డారని అంచనాకు వచ్చామని" ఇంగ్లండ్‌లోని లీసెస్టర్ విశ్వవిద్యాలయం పరిశోధకులు టామ్ యేట్స్ తెలిపారు. చురుకుగా నడిచే వారికన్నా, నెమ్మదిగా నడిచే వారిలో గుండె జబ్బులు వచ్చే ప్రమాదం రెండు రెట్లు అధికంగా ఉంటుందని యేట్స్ వెల్లడించారు.

ఎండుటాకులే ఎలక్ట్రానిక్ పరికరాలు



బీజింగ్: ఎండిపోయిన ఆకులను.. అద్భుతమైన విద్యుత్ ధర్మాలు ఉన్న కార్బన్ పొడిగా మార్చే ప్రక్రియను శాస్త్రవేత్తలు కనిపెట్టారు. ప్రస్తుతమున్న సూపర్ కెపాసిటర్ల కన్నా మెరుగైన సామర్థ్యంతో ఉన్న ఈ పదార్థం.. అధునాతన ఎలక్ట్రానిక్ పరికరాల ఉత్పత్తిలో కీలకమయ్యే ఆస్కారముంది. ఫినిక్స్ చెట్టు ఆకులను ఇలా కార్బన్ పొడిగా మార్చే బహుళ అంచెల పద్ధతిని.. చైనాలోని ఖిలు సాంకేతిక విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఎండిపోయిన ఆకులను పొడిగా మార్చి.. 220 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత వద్ద 12 గంటలపాటు మొదట వేడి చేశారు. దీంతో పొడిలో సూక్ష్మమైన కార్బన్ గోళాలు ఏర్పడ్డాయి. వీటిని పొటాషియం హైడ్రాక్సైడ్ ద్రావణంతో కలిపి.. 450 డిగ్రీ సెల్సియస్ నుంచి 800 డిగ్రీ సెల్సియస్ వరకు దశలవారీగా ఉష్ణోగ్రత పెంచుతూ వేడిచేశారు. ఫలితంగా గోళాలకు రంధ్రాలు పడి.. పదార్థానికి అధిక ఉపరితల వైశాల్యం వచ్చింది. తద్వారా అద్భుతమైన విద్యుత్ ధర్మాలు సంతరించాయి. ప్రతీ గ్రాముకు 367 ఫారడేల కెపాసిటెన్స్‌ను ఈ పదార్థం కనబరిచిందని.. గ్రాఫీన్ సూపర్ కెపాసిటర్ల కన్నా ఇది మూడు రెట్లు ఎక్కువని పరిశోధకులు తెలిపారు. విద్యుత్ నిల్వ అవసరాలకు.. ప్రత్యేకంగా కంప్యూటర్ సాంకేతికత, ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి ఇది కీలకమయ్యే అవకాశాలున్నాయని తెలిపారు.

నిర్లక్ష్యం వల్లే ముందస్తుగా కాలం చేస్తున్న హృద్రోగులు



★ ఇతర దీర్ఘకాలిక వ్యాధులు కూడా తోడైతే మరణ ముప్పు 250% ఎక్కువ!

న్యూయార్క్: పూర్తికాలం జీవించే అవకాశమున్నా... కొద్దిపాటి జాగ్రత్తలైనా పాటించని కారణంగానే 89% మంది హృద్రోగులు ముందుగా చనిపోతున్నారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. మూత్రపిండాల వైఫల్యం, పక్షవాతం, మధుమేహం వంటి దీర్ఘకాలిక వ్యాధులు కూడా ఉన్నవారికి ముందస్తుగా మరణించే ముప్పు 250% ఎక్కువని కూడా తేలింది! లీడ్స్ విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ క్రిస్ గాలె బృందం ఈ పరిశోధన చేపట్టింది. పదేళ్ల కాలంలో సంభవించిన ఏడు లక్షల గుండె వైఫల్య కేసుల్ని వీరు నిశితంగా పరిశీలించారు. వీరిలో 40% మందికి ఇతర దీర్ఘకాలిక వ్యాధులు కూడా ఉన్నా, చాలామంది తీవ్ర నిర్లక్ష్యంతో వాటికి అసలు వైద్యమే పొందలేదట. తరచూ అనారోగ్య లక్షణాలు బయటపడుతున్నా... 89% మంది ఎలాంటి జాగ్రత్తలూ పాటించలేదని గుర్తించారు. "హృద్రోగంతో పాటు ఇతర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారికి నిర్లక్ష్యం ఏమాత్రం పనికిరాదు. ఎప్పటికప్పుడు చికిత్స పొందడం ద్వారా పూర్తికాలం జీవించే అవకాశాన్ని వీరు అందిపుచ్చుకోవచ్చు" అని క్రిస్ పేర్కొన్నారు.

'దేవనార్'కు ప్రభుత్వం అండగా ఉంటుంది

వికలాంగుల సహకార సంస్థ ఛైర్మన్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌లోని దేవనార్ అంధుల పాఠశాలకు తెలంగాణ ప్రభుత్వం అండగా ఉంటుందని రాష్ట్ర వికలాంగుల సహకార సంస్థ ఛైర్మన్ కె.వాసుదేవరెడ్డి తెలిపారు. పాఠశాల ఛైర్మన్ సాయిబాబాగౌడ్‌కు టీన్యూస్ ఎండీ సంతోష్‌రావు రూ.4 లక్షలు, తెరాస రాష్ట్ర నేత పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి రూ.2 లక్షల చొప్పున మొత్తం ఆరు లక్షల సాయాన్ని బుధవారం తెలంగాణభవన్‌లో అందించారు. కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు విరాళం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాసుదేవరెడ్డి దాతలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ పాఠశాల విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని ఈ సందర్భంగా దాతలు ఆకాంక్షించారు.



దేవనార్ పాఠశాల ఛైర్మన్ సాయిబాబాగౌడ్‌కు రూ.6 లక్షల విరాళాన్ని అందజేస్తున్న సంతోష్, శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో వాసుదేవరెడ్డి

భారీ ప్రాజెక్టుల నిర్వహణ ప్రైవేటుపరం

- తద్వారా సాగునీటి నిర్వహణలో సమర్థత పెరుగుతుంది
- ప్రధాని నరేంద్ర మోదీకి యువ పారిశ్రామికవేత్తల సూచన

ఈనాడు - దిల్లీ

దేశంలోని భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణ బాధ్యతలను ప్రైవేటీకరించాలని యువ పారిశ్రామికవేత్తలు, సీఈఓలు ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సూచించారు. 'ఛాంపియన్ ఆఫ్ ఛేంజ్' పేరుతో ప్రధాని ఇటీవల దేశంలోని సుమారు 200 మంది యువ సీఈవోలు, పారిశ్రామికవేత్తలతో సమావేశమై ముఖాముఖి చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆరు బృందాల నుంచి ఆరు అంశాలపై అభిప్రాయాలు స్వీకరించారు. రైతుల ఆదాయం రెట్టింపు చేయడం ఎలా? అన్న అంశంపై నివేదిక ఇచ్చిన ఓ బృందం సాగునీటి రంగంలో ప్రైవేటు భాగస్వామ్యాన్ని పెంచాలని పేర్కొంది. భారీ సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ బాధ్యతను ప్రైవేటీకరిస్తే పోటీతత్వం పెరిగి సమర్థవంతమైన ఫలితాలు రావడానికి అవకాశం ఉంటుందని సూచించింది. వాటిని ఉపయోగించుకున్న రైతుల నుంచి నామమాత్రపు రుసుములు వసూలుచేసే విధానాన్ని తీసుకురావాలని పేర్కొంది. వ్యవసాయ అనుబంధ సేవల్లోకి ప్రైవేటు రంగాన్ని ఆహ్వానించాలని, దానివల్ల ఉత్పాదకత పెరుగుతుందని అభిప్రాయపడింది.

మరికొన్ని సిఫార్సులు...

★ మెట్ట, వెనుకబడిన ప్రాంతాల్లో సాగునీరు అందించడానికి వినూత్న విధానాలు తీసుకొచ్చే అంకుర సంస్థల(స్టార్టప్స్)కు ప్రోత్సాహకాలు, ప్రత్యేక ఆర్థిక చేయూతనందించాలి.

★ విద్యుత్తు, రహదారుల తరహాలోనే ప్రాంతీయ జలహారం (భారీ పైపింగ్ నెట్‌వర్క్) ఏర్పాటు చేయాలి. ఇందుకోసం ప్రైవేటు నిధులు, పెట్టుబడులను ఆహ్వానించాలి. జలహారాలను బీఓటీ పద్ధతిలోకానీ, మరేదైనా కొత్త విధానం ప్రకారం కానీ అమలుచేయాలి. ప్రస్తుతం రిమోట్ మీటరింగ్, డిజిటల్ వ్యాలెట్స్‌లాంటి అత్యాధునిక డిజిటల్ పద్ధతులు అందుబాటులోకి వచ్చినందున ఈ వ్యవస్థను అమలుచేయడం పెద్దకష్టమేమీకాదు.

★ పంజాబ్‌లాంటి రాష్ట్రాల్లో ఇష్టానుసారంగా వ్యవసాయ విధానాలు అవలంబిస్తూరావడంవల్ల భూగర్భజలాల నాణ్యత పూర్తిగా దెబ్బతినింది. అందువల్ల సమగ్ర నీటి యాజమాన్య పద్ధతులు తీసుకురావడంతో పాటు, తక్కువ నీటిని వాడే పంటలకు మళ్లాల్సిన అవసరం ఉంది. వాటర్‌షెడ్ యాజమాన్యంలోకి ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యాన్ని తీసుకురావాలి. రైతుల అలవాట్లను మార్చే కార్యక్రమాలు చేపట్టాలి. నీటియాజమాన్య పద్ధతులపట్ల అవగాహన పెంచడానికి మొబైల్ ఆధారిత తరగతులు నిర్వహించాలి.

★ వాటర్‌షెడ్ అభివృద్ధి సంబంధిత పనులన్నింటినీ ఒక మంత్రిత్వశాఖ పరిధిలోకి తీసుకొచ్చి ఒకే కార్యక్రమంగా మార్చాలి. ఈ కార్యక్రమాల అమలులో సామాజిక భాగస్వామ్యం పెంచాలి. నీటి లభ్యత పరిమితంగా ఉన్నందున సూక్ష్మసేద్యం తప్పనిసరి చేయాలి. మంచినీరు అందించలేనిచోట్ల సముద్రనీటిని మంచి నీరుగా మార్చి వ్యవసాయ అవసరాలకు అందించాలి. అధిక నీటి అవసరం ఉన్న చెరకులాంటి పంటలకు బిందు సేద్యం తప్పని సరిచేయాలి. ఇందుకు ప్రత్యేక కార్యక్రమం రూపొందించాలి.

★ గ్రావిటీ ఆధారిత బిందుసేద్య వ్యవస్థను ఉపయోగించాలి. దీనివల్ల బంజరుభూములు కూడా సాగులోకి వస్తాయి.

★ వివిధ రాష్ట్రాల్లో స్థానికంగా అనుసరించే అత్యుత్తమ నీటివినియోగ పద్ధతులను జాతీయస్థాయిలో విస్తరింపజేయాలి.

★ నూతన సాంకేతిక పరిజ్ఞానం స్థానిక అవసరాలకు ఉపయోగపడేలా ఉండాలి. చిన్న, సన్నకారు రైతులకు అత్యధికంగా ఉపయోగపడేలా దేశీయంగా అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రోత్సహించాలి.

ఏఈవో ఉద్యోగ ప్రకటన ఆలస్యం!

ఈనాడు, హైదరాబాద్: వ్యవసాయ శాఖలో భారీ సంఖ్యలో పోస్టులతో వెలువడాల్సిన వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో) ఉద్యోగ ప్రకటన ఆలస్యం కానుంది. ఇప్పటికే బీఎస్సీ వాణిజ్య వ్యవసాయం, వ్యాపార నిర్వహణ కోర్సు ఉత్తీర్ణులైన వారికి అవకాశం ఇవ్వాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ప్రకటన తాత్కాలికంగా వాయిదా వేసింది. ఈ కోర్సుకు ఐసీఏఆర్ గుర్తింపు లేదని గత ఏడాది వ్యవసాయ విశ్వవిద్యాలయం రద్దుచేసింది. అయితే గతంలో ఉత్తీర్ణులైనవారికి అవకాశమివ్వాలని నిరుద్యోగులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీంతో ఈ ఒక్కసారికి మాత్రమే అనుమతించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు రోస్టర్‌ను మార్చుతూ సవరణ ప్రతిపాదనలు పంపించాలని టీఎస్‌పీఎస్సీ.. వ్యవసాయశాఖను కోరింది. అక్కడి నుంచి ప్రతిపాదనలు వచ్చిన తరువాత ప్రకటన వెలువడుతుంది.

టీజీటీ పరీక్షకు 78.14 శాతం హాజరు

గురుకులాల్లో టీజీటీ పోస్టులకు బుధవారం ప్రధాన పరీక్ష ప్రశాంతంగా జరిగిందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి వాణీప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మూడు కేంద్రాల్లో నిర్వహించిన పరీక్షకు 2349 మంది హాజరయ్యారని, హాజరు శాతం 78.14గా నమోదైందన్నారు.

బినామీ భూములు పోతాయనే వారి భయం

- అందుకే భూప్రక్షాళనను అడ్డుకుంటామంటున్నారు
- కాంగ్రెస్ నాయకులపై మంత్రి హరీశ్‌రావు విమర్శ

ఈనాడు, హైదరాబాద్: భూ రికార్డులు సరిచేయాలన్న ప్రభుత్వ నిర్ణయంతో బినామీ రూపంలోని భూముల్ని కోల్పోవాల్సి వస్తుందని కాంగ్రెస్ నాయకులు వణుకుతున్నారని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. వివాదాలు, ఘర్షణలు, అవినీతి, అక్రమాలకు తావులేకుండా చేద్దామంటే కాంగ్రెస్ పార్టీ అడ్డుకోవాలని చూస్తోందని ఆరోపించారు. రికార్డులు సరిచేస్తే భూకబ్జాలు, అవినీతికి పాల్పడే అవకాశాలన్నీ దూరమవుతాయన్న ఆందోళన ఆ పార్టీ నాయకుల్లో నెలకొందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజాం కాలం తరువాత మళ్లీ భూ సర్వే జరగలేదని... ఇప్పుడు మరోసారి సర్వేతో రైతులకు భూమి హక్కులపై స్పష్టత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని కోర్టుకు వెళ్లి అడ్డుకుంటామని కాంగ్రెస్ నాయకులు ప్రకటించడం వారి దిగజారుడుదనానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఎకరాకు రూ.8వేలు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తుంటే అడ్డుకోవాలని చూస్తున్నారన్నారు. రాజకీయ స్వార్థం కోసం రైతులను బలిచేసే పద్ధతి మార్చుకోవాలని హితవు పలికారు. మునిగిపోతున్న నావలాంటి కాంగ్రెస్ పార్టీలోకి ఇక ఎవరూ రారని తెలిపారు. ఆ పార్టీలో పదవీ విరమణలే తప్ప... తిరిగి చేరికలు ఉండవని వ్యాఖ్యానించారు. 2019లో ప్రతిపక్ష హోదాను కోల్పోతుందని జోస్యం చెప్పారు. అధికారంలోకి రాలేమన్న మానసిక బాధ నుంచి బయటపడేందుకు అబద్ధాలతో పబ్బం గడుపుకుంటున్నారని విమర్శించారు. ఇప్పుడున్న పదిమంది ఎన్నికల నాటికి ఉంటారో... బయటకు వెళ్లిపోతారో చూసుకోవాలన్నారు. దిక్కుమాలిన మైండ్‌గేమ్‌లు ఆపాలని సూచించారు.



ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సాధికారతకు కేంద్రం కృషి: దత్తాత్రేయ

ఈనాడు, దిల్లీ: ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సాధికారతకు కేంద్రం కృషిచేస్తోందని కేంద్ర కార్మికమంత్రి బండారు దత్తాత్రేయ తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో వారి అభివృద్ధికి కేంద్రం నిధులిస్తోందని తెలిపారు. బుధవారమిక్కడ కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లోట్‌తో సమావేశమైన అనంతరం దత్తాత్రేయ మీడియాతో మాట్లాడారు. ' 'ఎస్సీ ఎస్టీ ఉప ప్రణాళికకు ప్రత్యేక సహాయం కింద ఏపీకి రూ.90కోట్లు, తెలంగాణకు రూ.84.85కోట్లను కేంద్రం విడుదల చేసింది. వివిధ కార్పొరేషన్ల ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏపీలో రూ.114.09కోట్లు, తెలంగాణలో రూ.55.72 కోట్లు విడుదల చేశారు. పలు పథకాలకు సంబంధించి ఇతరత్రా నిధులు కూడా కేంద్రం విడుదల చేస్తోంది' ' అని దత్తాత్రేయ తెలిపారు. జాతీయ బీసీ కమిషన్‌కు చట్టబద్ధత లేనందున ఓబీసీ పేదలు రిజర్వేషన్ల ఫలాలు అందుకోలేకపోతున్నారని గెహ్లోట్ దృష్టికి తీసుకెళ్లానన్నారు. వచ్చే పార్లమెంటు సమావేశాల్లో బిల్లు పెడతామని గెహ్లోట్ హామీ ఇచ్చారని దత్తాత్రేయ పేర్కొన్నారు.

విమోచన దినోత్సవం నిర్వహించాలి: సెప్టెంబరు 17న తెలంగాణ విమోచన దినోత్సవం నిర్వహించాలని, తెరాస ప్రభుత్వం అలా చేయకపోవడం బాధాకరమని దత్తాత్రేయ అన్నారు. విమోచన దినోత్సవం నిర్వహణ మైనార్టీలకు వ్యతిరేకం కాదన్నది తెరాస గ్రహించాలని ఆయన కోరారు.

కార్మికుడి శస్త్రచికిత్సకు రూ.15 లక్షలు: ఎముక మజ్జ వ్యాధితో బాధపడుతున్న రంగారెడ్డికి చెందిన కార్మికుడు బాలకృష్ణకు శస్త్రచికిత్స నిమిత్తం రూ.15లక్షలు ఇచ్చినట్లు దత్తాత్రేయ తెలిపారు. ఈఎస్ఐసీ కార్పొరేషన్ ద్వారా ఈ నిధులు విడుదల చేశామని ఆయన చెప్పారు.

మంత్రులు కేటీఆర్, నాయిని, పద్మారావులపై రైల్వే కేసు కొట్టివేత

సికింద్రాబాద్, న్యూస్‌టుడే: తెలంగాణ ఉద్యమ సమయంలో చేపట్టిన రైల్‌రోకో కేసు నుంచి మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, కేటీఆర్, టి.పద్మారావులకు ఊరట లభించింది. వారితోపాటు మరో 11మందిపై ఉన్న కేసును బుధవారం సికింద్రాబాద్ బోయిగూడ రైల్వే కోర్టు కొట్టివేసింది. 2011లో అఖిలపక్షం పిలుపుమేరకు మౌలాలిలో రైల్‌రోకో నిర్వహించారు. ఆరేళ్ల నుంచి విచారణకు 24 సార్లు హాజరయ్యారు. మంత్రి నాయిని మాట్లాడుతూ..తాము గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలును ఆపినట్లు తప్పుడు కేసులను రైల్వే పోలీసులు బనాయించారని జడ్జికి వివరించామని తెలిపారు. మంచిర్యాలలో రైల్‌రోకో కేసులోనూ కాజీపేట రైల్వే పోలీసుల నుంచి కేటీఆర్‌కు నోటీసు అందిందన్నారు.

నిరుద్యోగ భృతిని ఎగ్గొడితే ఫిర్యాదు చేయొచ్చు

- వేతనం ఆలస్యమైనా వెళ్లి చెప్పొచ్చు
- ఉపాధి హామీలో అంబుడ్స్‌మన్ వ్యవస్థపై కొత్త మార్గదర్శకాలు
- రాష్ట్రాల సూచనలతో పాత నిబంధనల్లో మార్పులు

ఈనాడు, హైదరాబాద్: ఉపాధి హామీ పథకం కింద పనులను కల్పించలేకపోయిన కాలానికి నిరుద్యోగ భృతిని ప్రభుత్వం అందజేయలేకపోతే ఇక ఆయా కూలీలు నేరుగా తమ జిల్లా అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయొచ్చు. వేతనం చెల్లింపుల్లో 15 రోజులకు మించి జాప్యం చోటు చేసుకొన్నా వెళ్లి చెప్పొచ్చు. ఉపాధి హామీ పథకం అమలు సందర్భంగా వచ్చే ఫిర్యాదులు, అభియోగాలు తదితరాలను పరిశీలించి తీర్పులిచ్చేందుకు ఉద్దేశించిన అంబుడ్స్‌మన్ వ్యవస్థపై కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తాజాగా మార్గదర్శకాలను వెలువరించింది. ఉపాధి హామీలో పాల్గొనే ఆయా వర్గాల వారు తమ సమస్యలను తెలియజేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం కాకుండా వేరే యంత్రాంగం ఉండాలనే ఉద్దేశంతోనే పదేళ్ల క్రితం ఉపాధి హామీ చట్టంలోనే అంబుడ్స్‌మన్ వ్యవస్థకు కేంద్రం రూపకల్పన చేసింది. తెలంగాణతో సహా పలు రాష్ట్రాలు ఇంతవరకు వారిని నియమించకపోవటంతో కేంద్రం పలుసార్లు రాష్ట్రాలకు లేఖలు రాస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో అంబుడ్స్‌మన్‌ల నియామక విధానం, వారి విధుల మార్గదర్శకాల్లో మార్పులు అవసరమంటూ రాష్ట్రాలు ఇటీవల కేంద్రాన్ని కోరాయి. ఈ సిఫార్సులను పరిగణనలోకి తీసుకున్న కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఇంతవరకు ఉన్న మార్గదర్శకాల్లో మార్పులు, చేర్పులు చేసి తాజాగా కొత్తవాటిని జారీ చేసింది. వీటి ప్రకారం ఇక 23 రకాల సందర్భాల్లో అంబుడ్స్‌మన్‌లకు ఫిర్యాదు చేయవచ్చు.

తనిఖీల్లో వెలుగుచూసిన అక్రమాలపైనా చర్యలు

వేతనాన్ని ఆలస్యం చేసినందుకు ప్రభుత్వం పరిహారాన్ని ఇవ్వకున్నా కూలీలు అంబుడ్స్‌మన్ దృష్టికి తీసుకెళ్లవచ్చు. పనులను కూలీలతో కాకుండా గుత్తేదార్లను, మిషన్లను పెట్టి చేయించటం, పనిని ఇవ్వాలని కోరినప్పుడు రశీదును ఇవ్వకపోవటం వంటి అంశాలపైనా ఫిర్యాదు చేయవచ్చు. వాటిని ఆయన 30 రోజుల్లోగా పరిశీలించి తీర్పును వెలువరిస్తారు. సామాజిక తనిఖీల్లో వెలుగుచూసిన అక్రమాలపైనా చర్యలు తీసుకోవచ్చు. తెలంగాణలో 30 గ్రామీణ జిల్లాలకు త్వరలోనే అంబుడ్స్‌మన్‌లు నియమితులు కానున్నారు.




మంటల్లో కాలిపోతున్న అయూబ్‌ఖాన్ ★ కాలిన గాయాలతో..

తెరాస నాయకుడి ఆత్మహత్యా యత్నం

- మంత్రి మహేందర్‌రెడ్డి ఎదుటే ఘటన
- తాండూరు పార్టీ సమావేశంలో కలకలం
- పరిస్థితి విషమం, నిమ్స్‌కు తరలింపు

తాండూరు, న్యూస్‌టుడే: వికారాబాద్ జిల్లా తాండూరులో బుధవారం జరిగిన పట్టణ తెరాస కార్యకర్తల సమావేశంలో..పార్టీ పట్టణ మాజీ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్ ఒంటికి నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. ఈ హఠాత్పరిణామంతో సమావేశంలో ఉన్న మంత్రి మహేందర్‌రెడ్డితోపాటు కార్యకర్తలు నిర్ఘాంతపోయారు. వెంటనే మంటలను ఆర్పేసి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో అయూబ్‌ఖాన్‌కు తల, ముఖం, కడుపు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌లోని నిమ్స్‌కు తరలించారు. అయూబ్‌ఖాన్‌కు ఆస్పత్రిలో చికిత్స చేయించిన మంత్రి మహేందర్‌రెడ్డి సైతం బాధితుడితోపాటు నిమ్స్‌కు వెళ్లారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ, గ్రామాల్లో తెరాసను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో తాండూరు నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మహేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా బుధవారం సాయంత్రం 5.30 గంటలకు తాండూరు పట్టణ కార్యకర్తల సమావేశం మొదలైంది. వేదికపై మంత్రితోపాటు ముఖ్యనాయకులు కూర్చున్నారు. కార్యకర్తల సమావేశం ప్రారంభం కాగానే తెరాస పట్టణ మాజీ అధ్యక్షుడైన అయూబ్‌ఖాన్ ప్రసంగించారు. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తున్నానని, తెలంగాణ సాధన ఉద్యమంలో పోలీసులతో దెబ్బలు తిన్నానని, తనపై కేసులు కూడా పెట్టారని చెప్పారు. శాసనసభ, పురపాలక ఎన్నికల్లో తెరాస విజయం కోసం కష్టపడ్డా తనకు గుర్తింపు దక్కలేదని వాపోయారు. మంత్రి మహేందర్‌రెడ్డిని కలిసి నామినేటెడ్ పోస్టు ఇవ్వాలని కోరగా హామీ ఇచ్చారని, అయితే ఇంకా సరైన గౌరవం దక్కడం లేదంటూ ప్రసంగాన్ని ముగించారు. కొన్ని నిమిషాలపాటు వేదికపై కూర్చున్న అయూబ్‌ఖాన్ బయటికి వెళ్లారు. అనంతరం మరో నాయకుడు ప్రసంగిస్తుండగా ఒంటికి నిప్పంటించుకున్న అయూబ్ మంటలతోనే సమావేశంలోకి వచ్చారు. వెంటనే అక్కడున్నవారు మంటలను ఆర్పేశారు.

ప్రమాదమేమీ లేదు: మంత్రి మహేందర్‌రెడ్డి

అయూబ్‌ఖాన్ ప్రాణానికి ప్రమాదమేమీ లేదు. ఆయనకు నామినేటెడ్ పోస్టు ఇవ్వాలని కోరుతూ మంగళవారమే ప్రభుత్వానికి లేఖ రాశా. ఈలోగానే ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం బాధాకరం.

భూ సమగ్ర సర్వేపై పక్కదోవ పట్టిస్తున్న ప్రభుత్వం: సీపీఐ

ఈనాడు, హైదరాబాద్: భూసమగ్ర సర్వేను తెలంగాణ ప్రభుత్వం పక్కదోవ పట్టిస్తోందని సీపీఐ ఆక్షేపించింది. ఉద్యోగులకు ఆర్థికభద్రత లేని కాంట్రిబ్యూటరీ పింఛను విధానాన్ని అమలుచేస్తూ వారిలో ఆందోళన పెంచుతోందని విమర్శించింది. 29, 30 తేదీల్లో హైదరాబాద్‌లో సీపీఐ రాష్ట్ర సమితి సమావేశాలు జరిగాయి. భూసమగ్రసర్వేపై, ఉద్యోగుల పింఛను విధానంపై సీపీఐ బుధవారం 2 తీర్మానాలు చేసింది. అంతకుముందు సీపీఐ జాతీయ ప్రధానకార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచంలో అనేక దేశాలు పెట్టుబడిదారుల చేతుల్లో చిక్కుకుపోయాయని ఆందోళన వ్యక్తంచేశారు.

పాత పింఛను విధానాన్నే కొనసాగించాలి: సీపీఎం

ఈనాడు, హైదరాబాద్: కాంట్రిబ్యూటరీ పింఛను పథకాన్ని (సీపీఎస్) రద్దు చేసి, పాత విధానాన్ని పునరుద్ధరించాలని సీపీఎం తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. సీపీఎస్ విధానంతో తెలంగాణలోని 1.20 లక్షల ఉద్యోగుల కుటుంబాలు ఆందోళన చెందుతున్నాయని.. ఇటీవల కాలంలో చనిపోయిన, పదవీవిరమణ చెందిన ఉపాధ్యాయ, ఉద్యోగ కుటుంబాలు గ్రాట్యుటీ, పీఎఫ్ లేక, కుటుంబ పింఛను అందక ఇబ్బంది పడుతున్నా ప్రభుత్వంలో చలనం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఓ ప్రకటనలో విమర్శించారు. సెప్టెంబరు 1న ఉద్యోగులు, ఉపాధ్యాయులు సామూహిక సెలవులు పెట్టి చేపట్టనున్న ఆందోళనకు సీపీఎం మద్దతు ఉంటుందన్నారు.

ఉపకారవేతనాల రిజిస్ట్రేషన్లు కొనసాగుతాయి

- ప్రభుత్వ పరిశీలనలో గడువు పెంపు దస్త్రం
- ఎస్సీ సంక్షేమశాఖ కమిషనర్ కరుణాకర్ వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, వికలాంగ విద్యార్థులకు 2017-18 విద్యాసంవత్సరానికి బోధన రుసుములు, ఉపకారవేతనాల రిజిస్ట్రేషన్ అవకాశం కొనసాగుతుందని ఎస్సీ సంక్షేమ శాఖ కమిషనర్ కరుణాకర్ తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన గడువు గురువారంతో ముగియనుందని.. అయితే ఇంటర్, డిగ్రీ, ఇతర కోర్సుల ప్రవేశాలు ఇంకా కొనసాగుతున్నందున గడువు పెంపు ప్రతిపాదనలను ఇప్పటికే ప్రభుత్వానికి పంపించామని పేర్కొన్నారు. అక్టోబరు వరకు గడువు ఇవ్వాలని కోరామన్నారు. విద్యార్థులు ఆందోళన చెందొద్దని సూచించారు. సెప్టెంబరు 1 తరువాత ప్రభుత్వం నిర్ణయించే గడువు తేదీ మేరకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టంచేశారు.

2016-17 విద్యాసంవత్సరానికి సంబంధించి ఉపకారవేతనాలు, బోధన రుసుముల కోసం ప్రభుత్వం సంక్షేమ శాఖలకు రూ.1017 కోట్లు విడుదల చేసిందని కరుణాకర్ తెలిపారు. ఇందులో ఇప్పటి వరకు రూ.540 కోట్లు ఖర్చుచేశామన్నారు. 11.32 లక్షల మంది విద్యార్థులు బోధన రుసుములకు ఆధార్ ధ్రువీకరణ చేశారన్నారు. ఎస్సీల్లో పేద యువతుల వివాహాలకు కళ్యాణలక్ష్మి పథకం కింద ఇప్పటి వరకు రూ.153 కోట్లు విడుదల చేశామని కరుణాకర్ తెలిపారు. 10,600 మంది లబ్ధిదారులకు నగదు విడుదల చేశామని వివరించారు. నిధుల కొరత లేదన్నారు.

కళాశాలలు బాధ్యతగా వ్యవహరించాలి: బోధన రుసుములు, ఉపకారవేతనాలకు విద్యార్థులు సకాలంలో దరఖాస్తు చేసేలా కళాశాలలు బాధ్యతగా వ్యవహరించాలని కరుణాకర్ సూచించారు. ఇప్పటికే జిల్లా సంక్షేమ అధికారులతో సమావేశాలు నిర్వహించామని, కరపత్రాలు ముద్రించి ప్రచారం చేస్తున్నామన్నారు. తల్లిదండ్రులూ అప్రమత్తంగా ఉండి, పిల్లలు దరఖాస్తు చేశారా? లేదా? గమనించాలన్నారు.

ఉపాధ్యాయులు మందలించారని..

ఇద్దరు విద్యార్థినుల బలవన్మరణం

- కిరోసిన్ పోసుకొని ఒకరు.. ఉరేసుకొని మరొకరు

నిజాంసాగర్, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు మందలించారని మనస్తాపానికి గురై ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు నిజామాబాద్, జగిత్యాల జిల్లాల్లో చోటుచేసుకున్నాయి. వీరిలో ఆరో తరగతి చదివే బాలిక ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకోగా.. పదో తరగతి విద్యార్థిని ఉరేసుకొని తనువు చాలించడం అందరినీ కలచివేసింది. నిజామాబాద్ జిల్లా నిజాంసాగర్ మండలం అచ్చంపేటకు చెందిన శెట్టి శ్రీశైలం, సంగీత దంపతులకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. వీరిద్దరు పిట్లంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. కుమార్తె శాలిని ఆరో తరగతి చదువుతోంది. మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి ఇంటికొచ్చిన శాలిని ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై కిరోసిన్ పోసుకొని నిప్పంటించుకొంది. స్థానికులు మంటలను ఆర్పి సంగారెడ్డి ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. శాలిని ఆత్మహత్య చేసుకొనే ముందు లేఖ రాసింది. 'పాఠశాలలో హోంవర్క్ చేయకపోవడంతో ప్రిన్సిపల్‌కు ఫిర్యాదు చేస్తానని ఉపాధ్యాయుడు మందలించడం.. అన్నయ్య కొడుతుండడంతో నేను చనిపోతున్నా' అని లేఖలో పేర్కొంది. తన కుమార్తెకు చదువు ఇష్టం లేక ఆత్మహత్యకు పాల్పడిందని తండ్రి శ్రీశైలం ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



సాత్విక మృతదేహం

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం కోజన్ కొత్తూరుకు చెందిన తోట సాత్విక(15) ఇబ్రహీంపట్నంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. అదే తరగతిలో ఓ విద్యార్థి బుధవారం సెల్‌ఫోన్ తెచ్చాడు. ఉపాధ్యాయులు అతని ఫోన్‌ను పరిశీలించి.. వాట్సాప్‌లో సాత్విక ఛాటింగ్ చేసినట్లు గుర్తించారు. చిన్న వయస్సులో ఇలా చేయొద్దని ప్రధానోపాధ్యాయురాలు గాయత్రీ దేవితో పాటు మరో ఇద్దరు ఉపాధ్యాయులు సాత్వికను మందలించారు. మనస్తాపానికి గురైన విద్యార్థిని పాఠశాల నుంచి ఇంటికి వెళ్లగానే ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం. కాగా దీనిపై ప్రధానోపాధ్యాయురాలు గాయత్రీ దేవిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా సాత్విక ఛాటింగ్‌ను గుర్తించి 'ఇలా చేయడం సరికాదని, మంచిగా చదువుకోవాలని' మందలించినట్లు తెలిపారు. సాత్విక తల్లి రాధ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు చెప్పారు.

శ్రీలంకతో భారత్ నాలుగో వన్డే నేడు
మధ్యాహ్నం 2.30 నుంచి సోనీ సిక్స్‌లో



ధోని ట్రిపుల్ సెంచరీ

కొలంబో

ఇప్పటికే సిరీస్ గెలిచినా, క్లీన్‌స్వీపే లక్ష్యంగా భారత్.. ఒక్క విజయమైనా సాధించాలన్న తపనతో శ్రీలంక..! ఏకపక్షంగా సాగుతున్న సిరీస్‌లో మరో సమరానికి రంగం సిద్ధమైంది. రెండు జట్ల మధ్య కొలంబోలో నాలుగో వన్డే నేడే. వరుస పరాభవాలు, అంతర్గత సమస్యలతో సతమతమవుతున్న శ్రీలంకకు జోరు మీదున్న భారత్‌ను అడ్డుకోవడం చాలా కష్టమైన పనే.

ధోని ట్రిపుల్ సెంచరీ: మహేంద్ర సింగ్ ధోనీకి కెరీర్‌లో ఇది 300వ వన్డే మ్యాచ్ కావడం విశేషం. ఈ మైలురాయి మ్యాచ్‌లో అతడు గుర్తుండి పోయే ఇన్నింగ్స్ ఆడాలన్నది అభిమానుల కోరిక. వన్డే క్రికెట్లో గొప్ప ఫినిషర్‌గా పేరున్న ధోని.. సచిన్ తెందుల్కర్ (463), రాహుల్ ద్రవిడ్ (344), అజహరుద్దీన్ (334), సౌరభ్ గంగూలీ (311), యువరాజ్ సింగ్ (304) తర్వాత మూడొందల మ్యాచ్‌లు ఆడిన భారత ఆటగాడిగా ఘనత సాధించనున్నాడు. గత రెండు మ్యాచ్‌ల్లో ఛేదనలో కీలక ఇన్నింగ్స్‌లతో భారత్ విజయాల్లో కీలక పాత్ర పోషించిన అతడు.. మంచి ఫామ్‌తో ఈ మ్యాచ్‌లో అడుగుపెడుతున్నాడు. ఒత్తిడిలో రెండో వన్డేలో 45, మూడో వన్డేలో 67 పరుగులు చేసిన ధోని.. తనలో ఇంకా చేవ తగ్గలేదని నిరూపించుకున్నాడు. ఈ మ్యాచ్‌లో ఎలా ఆడతాడో మరి.

వాళ్లకు అవకాశం?: సిరీస్ ఇప్పటికే చేజిక్కిన నేపథ్యంలో భారత్.. ఇప్పటివరకు బెంచ్‌కే పరిమితమైన ఆటగాళ్లలో కొందరిని ఈ మ్యాచ్‌లో తీసుకునే అవకాశముంది. ఆటగాళ్లను రొటేట్ చేయాలనుకుంటున్నట్లు కెప్టెన్ కోహ్లి ఇప్పటికే సూచనప్రాయంగా చెప్పాడు. కుల్‌దీప్ యాదవ్, మనీష్ పాండే, రహానె, శార్దుల్ ఠాకూర్‌లో సిరీస్‌లో ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ ఆడని సంగతి తెలిసిందే. సిరీస్‌లో ఇప్పటివరకు రాణించలేకపోయిన కేదార్ జాదవ్ స్థానంలో పాండేను తీసుకుంటారా అన్నది ఆసక్తికరం. స్పిన్నర్లు చాహల్ లేదా అక్షర్ పటేల్ స్థానంలో చైనామన్ స్పిన్నర్ కులదీప్ తుది జట్టులోకి రావొచ్చు. ఆటగాళ్లంతా బలమైన పోటీదారులుగా కనిపిస్తున్న నేపథ్యంలో ఎవరిని తుది జట్టులోకి తీసుకోవాలో అర్థం కాని ఇష్టమైన ఇబ్బంది భారత్‌దైతే.. పేలవ ఫామ్, అస్థిరత నేపథ్యంలో బలమైన తుది జట్టును ఎంచుకోలేని పరిస్థితి లంకది. సిరీస్‌లో మూడో సారి లంకకు కెప్టెన్ మారనున్నాడు. తరంగ సస్పెన్షన్ కారణంగా శ్రీలంకకు తాత్కాలిక కెప్టెన్‌గా ఉన్న కపుగెదెర కూడా గాయంతో మిగతా సిరీస్‌కు దూరమయ్యాడు. దీంతో ఈ మ్యాచ్‌లో శ్రీలంకకు పేసర్ లసిత్ మలింగ నాయకత్వం వహించనున్నాడు. ఆత్మవిశ్వాసం సన్నగిల్లిన శ్రీలంకను అతడు ఎలా నడిపిస్తాడో, అన్ని రంగాల్లోనూ అత్యంత బలంగా ఉన్న భారత్‌కు ఆ జట్టు ఎంత మేర పోటీ ఇవ్వగలదో చూడాలి.

లంక పయనం ఎటువైపు?

సౌరభ్ గంగూలీ

తొలి రెండు మ్యాచ్‌ల్లో మొదట బ్యాటింగ్ చేసి ఓడినా.. మూడో వన్డేలోనూ కెప్టెన్ కపుగెదెర బ్యాటింగ్ ఎంచుకోవడం ఆశ్చర్యం కలిగించింది. 200 పరుగుల స్కోరుతో టీమ్‌ఇండియాను ఓడించడం సాధ్యంకాదు. శ్రీలంక బౌలింగ్‌లో పసలేదని చర్చిస్తున్నాం. కానీ బ్యాటింగ్ కూడా పేలవంగా ఉందన్న సంగతి గుర్తించాలి. రోహిత్‌శర్మ మరోసారి అత్యుత్తమ బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతను సహజసిద్ధంగా ఆడుతుంటే బ్యాటింగ్ చేయడం ఇంత సులువా అనిపిస్తుంది. ధనంజయ తొలి రెండు ఓవర్లలో కంగారు పెట్టినా.. ధోనీ అనుభవం, రోహిత్ నాణ్యమైన ఇన్నింగ్స్ టీమ్‌ఇండియాకు విజయాన్ని అందించాయి. ఇప్పుడు శ్రీలంక పరిస్థితి


ఏంటి? ఇక్కడ్నుంచి వారి ప్రయాణం ఎటువైపు? అన్న ప్రశ్నలకు జట్టులోని ప్రతి ఒక్కరు లోతుగా ఆత్మపరిశీలన చేసుకోవడమే సమాధానాలు. ఆటగాడిగా జట్టుకు ఏం చేయగలనన్నది ఆలోచించాలి. సెలెక్షన్ గురించి ఆడుతున్నామని మరిచిపోయి బంతిని చూసి ఆడటం, పరుగులు రాబట్టడం ముఖ్యం. ఇంతకంటే వేరే పరిష్కారం లేదు. ఇక మిడిలార్డర్‌లో ప్రయోగాలు చేసేందుకు టీమ్‌ఇండియాకు ఇదో అవకాశం. మూడో స్థానంలో కేదార్ లేదా నాలుగో నంబరులో హార్దిక్ పాండ్యను పంపించొచ్చు. బంతితో శార్దూల్ ఠాకూర్ ఏం చేస్తాడో చూడొచ్చు.

● దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా గిబ్సన్

లండన్: దక్షిణాఫ్రికా క్రికెట్ జట్టు ప్రధాన కోచ్‌గా ఓటిస్ గిబ్సన్ నియమితుడయ్యాడు. గిబ్సన్ ప్రస్తుతం ఇంగ్లాండ్ బౌలింగ్ కోచ్‌గా ఉన్నాడు. వెస్టిండీస్‌తో చివరిదైన మూడో టెస్టు తర్వాత అతడు బాధ్యతల నుంచి తప్పుకుంటాడని ఇంగ్లాండ్ బోర్డు తెలిపింది.

● షర్జీల్‌పై ఐదేళ్ల నిషేధం

కరాచి: స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డందుకు పాకిస్థాన్ బ్యాట్స్‌మన్ షర్జీల్ ఖాన్ ఐదేళ్ల నిషేధానికి గురయ్యాడు. పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అవినీతి వ్యతిరేక ట్రైబ్యునల్ ఈ నిషేధం విధించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్‌ఎల్)లో షర్జీల్ స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డట్లు రుజువైందని పీసీబీ పేర్కొంది. షర్జీల్ శిక్షలో రెండున్నరేళ్లను ట్రైబ్యునల్ సస్పెండ్ చేసింది. 28 ఏళ్ల షర్జీల్ పాక్ తరపున ఓ టెస్టు, 25 వన్డేలు, 25 టీ20 మ్యాచ్‌లు ఆడాడు.



పాండ్య కొత్త కొత్తగా..

గాలె: ఈ మధ్య కాలంలో క్రికెటర్లు ఆటతోనే కాకుండా ఆహార్యంతోనూ ఆకట్టుకుంటున్నారు. వివిధ రకాల కేశాలంకరణతో అభిమానులను అలరిస్తున్నారు. భారత క్రికెట్ జట్టు నయా సంచలనం హార్దిక్ పాండ్య కూడా అదే బాటలో నడుస్తున్నాడు. శ్రీలంకతో వన్డే సిరీస్ ఆడుతున్న పాండ్య ఇప్పుడు కొత్త హెయిర్ స్టైల్‌తో దర్శనమిస్తున్నాడు. ఫుట్‌బాలర్ల తరహాలో ఒక వైపు జుత్తు తీయించుకుని విభిన్నంగా తయారయ్యాడు పాండ్య. అతడి కొత్త అవతారం భారత క్రికెట్ అభిమానుల్ని విశేషంగా ఆకర్షిస్తోంది. సామాజిక మాధ్యమాల్లో పాండ్య కొత్త అవతారంపై ఆసక్తికర చర్చ నడుస్తోంది.

ఇండియా బ్లూ కెప్టెన్‌గా రైనా

దిల్లీ: దులీప్ ట్రోఫీలో పోటీపడే ఇండియా బ్లూ జట్టుకు సురేశ్ రైనా కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. సెప్టెంబరు 7 నుంచి జరిగే టోర్నీ కోసం బుధవారం జట్లను ప్రకటించారు. ఇండియా గ్రీన్‌కు పార్థివ్ పటేల్.. ఇండియా రెడ్ జట్టుకు అభినవ్ ముకుంద్ నాయకత్వం వహిస్తారు. హైదరాబాద్ ఆటగాళ్లు అంబటి రాయుడు (రెడ్), సీవీ మిలింద్ (రెడ్), సిరాజ్ (గ్రీన్) టోర్నీలో ఆడనున్నారు.



ఓజాను వదులుకోం

కోల్‌కత: ఎడమచేతి వాటం స్పిన్నర్ ప్రజ్ఞాన్ ఓజాను వదులుకోమని బంగాల్ క్రికెట్ సంఘం (క్యాబ్) అధ్యక్షుడు సౌరభ్ గంగూలీ స్పష్టంచేశాడు. ఈ రంజీ సీజన్‌లో హైదరాబాద్ తరఫున బరిలో దిగేందుకు తనకు నిరభ్యంతర పత్రం (ఎన్‌ఓసీ) ఇవ్వాల్సిందిగా క్యాబ్‌కు ఓజా విజ్ఞప్తి చేశాడు. ఐతే ఓజా విజ్ఞప్తిని క్యాబ్ తిరస్కరించింది. "ఓజా విజ్ఞప్తిని తిరస్కరించాం. హైదరాబాద్ ప్లేట్ డివిజన్‌లో ఉన్నప్పుడు ఓజా బంగాల్‌కు ఆడేందుకు ఒప్పుకున్నాడు. ఓజా సేవలు మాకు కావాలి. అతణ్ని ఎలా వదులుకుంటాం" అని గంగూలీ అన్నాడు. ఓజాకు ఎన్‌ఓసీ ఇవ్వకపోతే తాము చేసేదేమీ లేదని హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) కార్యదర్శి శేష్‌నారాయణ్ తెలిపాడు. 2015-16 సీజన్‌లో హైదరాబాద్ గ్రూప్-సిలో ఉన్నప్పుడు ఓజా బంగాల్‌కు తరలివెళ్లాడు.

చాంపియన్స్

2019 ప్రపంచకప్ కోసం ఎంపిక చేయాల్సిన జట్టుపై ఇంకో ఐదు నెలల్లో ఓ అంచనాకు వస్తామన్నాడు భారత క్రికెట్ సెలక్షన్ కమిటీ ఛైర్మన్ ఎమ్మెస్కే ప్రసాద్. ఈ నేపథ్యంలోనే శ్రీలంకతో వన్డే సిరీస్‌లో తుది జట్టు విషయంలో ప్రయోగాల బాట పట్టింది టీమ్‌ఇండియా. అంత వరకు బాగానే ఉంది. కానీ బ్యాటింగ్ ఆర్డర్ విషయంలోనూ ప్రయోగాలు చేస్తుండటంలో ఔచిత్యమేంటన్నదే అర్థం కావడం లేదు. ఇంకా జట్టులో స్థానమే ఖాయం కాని ఆటగాళ్ల స్థానాల్ని అటు ఇటు మారుస్తూ కోహ్లి అండ్ కో చేస్తున్న ప్రయోగాలతో మొదటికే మోసం వస్తుందేమో అన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

అతడితో ఆటలేల!

ఫోర్త్ అంపైర్

ప్రస్తుత భారత వన్డే జట్టులో విరాట్ కోహ్లి కాకుండా సుస్థిర స్థానం ఉన్న ఆటగాళ్లెవరు అంటే సమాధానం కోసం తడుముకోవాల్సిందే! కెరీర్ చరమాంకంలో ఉన్న ధోని సంగతి వదిలేద్దాం.. మిగతా వాళ్లలో కోహ్లి కాకుండా ఎవ్వరూ కచ్చితంగా ప్రపంచకప్ ఆడుతారు అని కరాఖండిగా చెప్పలేం! బుమ్రా, భువనేశ్వర్, పాండ్య లాంటి వాళ్లు నిలకడగా రాణిస్తూ మ్యాచ్ విన్నర్లలా కనిపిస్తున్నారు కానీ.. రెండేళ్ల తర్వాత కూడా ఇదే ఫామ్‌లో ఉంటారా అన్నది చెప్పలేం! ఇక ధావన్, రోహిత్, రహానెల నిలకడ లేమి గురించి తెలిసిందే. రోహిత్ ఎప్పుడెలా ఆడతాడో చెప్పలేం! ధావన్ కూడా చోటు కోల్పోయి, తిరిగి జట్టులోకి వచ్చాడు. రహానె అంచనాల్ని అందుకోలేక తుది జట్టుకే దూరమయ్యాడు. జాదవ్, పాండే లాంటి ఆటగాళ్లు కూడా పూర్తి స్థాయిలో సత్తా చాటుకోలేదు. అశ్విన్, జడేజా టెస్టుల్లో కీలకమే కానీ.. వన్డేలకు వచ్చేసరికి గట్టి పోటీ ఉంది. ఈ నేపథ్యంలో చీఫ్ సెలక్టర్ ప్రకటన భారత ఆటగాళ్లపై ఒత్తిడి పెంచింది. అందరూ సత్తా ఉన్న వాళ్లే కానీ.. ఎవరికి చోటు ఖాయమో.. ఎవరి స్థానాల్ని ఎవరు లాగేసుకుంటారో తెలియని అనిశ్చితి జట్టులో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో జట్టులో మార్పులకు తోడు బ్యాటింగ్ ఆర్డర్‌ను కూడా మారుస్తుండటం ఈ అనిశ్చితిని మరింత పెంచేలా ఉంది.

రాహుల్ ప్రతిభ ఏంటన్నది గత రెండేళ్లలో అందరూ చూశారు. మొదట్లో తన టెక్నిక్‌తో, బ్యాటింగ్ నైపుణ్యంతో ద్రవిడ్ తరహా బ్యాట్స్‌మన్ లాగా గుర్తింపు తెచ్చుకున్న రాహుల్.. ఆ తర్వాత తన శైలిని మార్చుకున్నాడు. బ్యాటింగ్‌లో దూకుడు పెంచి ప్రమాదకర బ్యాట్స్‌మన్‌గా రూపాంతరం చెందాడు. 2015, 2016 ఐపీఎల్‌ల్లో మెరుపులు మెరిపించి.. టీమ్‌ఇండియాలోనూ రెగ్యులర్ ఆటగాడయ్యాడు. ఫిట్‌నెస్ సమస్యలతో కొన్నిసార్లు జట్టుకు దూరమైనప్పటికీ.. భారత్‌కు ఆడినప్పుడల్లా సత్తా చాటాడు. ఇటీవల లంకతో టెస్టు సిరీస్‌లోనూ జోరు చూపించాడు. టెస్టుల్లో అతను వరుసగా ఏడు 50+ స్కోర్లు చేయడం విశేషం. అలాంటి ఆటగాడు వన్డేలకు వచ్చేసరికి విఫలమయ్యాడు. అతడికి అలవాటైన ఓపెనింగ్ నుంచి మార్చి నాలుగో స్థానంలో పంపడమే ఇందుకు కారణమన్నది స్పష్టం. ఫీల్డింగ్ పరిమితుల్ని సద్వినియోగం చేసుకుని స్వేచ్ఛగా బ్యాట్ ఝులిపించడంలో రాహుల్ దిట్ట. ఐతే ధావన్ ఫామ్ అందుకుని మళ్లీ ఓపెనర్ అవతారం ఎత్తడం, రోహిత్ కూడా ఫిట్‌నెస్ సాధించి జట్టులోకి రావడంతో రాహుల్‌కు స్థాన చలనం తప్పలేదు. ఐతే వీళ్లిద్దరితో పోలిస్తే రాహులే ఓపెనింగ్ స్థానానికి ఎక్కువగా విలువ తెస్తాడన్నది అతడి ఆట చూసినా, గణాంకాలు చూసినా అర్థమవుతుంది. ఐతే ధావన్ ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్ కాబట్టి.. అతణ్ని కొనసాగించి, జోడీగా రాహుల్‌ను దించితే బాగుండేదమో!

అతణ్ని నాలుగో స్థానానికి పంపడంతో అక్కడ కుదురుకోలేక ఇబ్బంది పడుతున్నాడు. ఇంతకుముందు రహానె విషయంలోనూ ఇలాగే అటు ఇటు స్థానాలు మార్చడంతో అతడి లయ దెబ్బ తింది. నిలకడ తప్పాడు. ఇప్పుడు రాహుల్ కూడా అలాంటి స్థితికి చేరుకుంటాడేమో అన్న ఆందోళన కలుగుతోంది. టెక్నిక్, దూకుడు రెండూ ఉన్న రాహుల్ లాంటి ఆటగాడు 2019 ప్రపంచకప్‌లో కీలక పాత్ర పోషించగలడన్న అంచనా ఉంది. ప్రయోగాల పేరు చెప్పి అతడి స్థానం మార్చడమంటే మూలాలు మరిచిపోవడమే! జాదవ్, పాండ్య బ్యాటింగ్ స్థానాల విషయంలోనూ తరచుగా మార్పు జరుగుతోంది. ఇలా పదే పదే స్థానాలు మార్చడం వల్ల అనిశ్చితి ఏర్పడి.. ఆటగాళ్ల లయ, ఆత్మవిశ్వాసం దెబ్బతినే ప్రమాదముంది!

> రాహుల్ ఫిట్‌నెస్ సమస్యలతో కొన్నిసార్లు జట్టుకు దూరమైనప్పటికీ.. భారత్‌కు ఆడినపుడల్లా సత్తా చాటాడు. ఇటీవల లంకతో టెస్టు సిరీస్‌లోనూ జోరు చూపించాడు. టెస్టుల్లో అతను వరుసగా ఏడు 50+ స్కోర్లు చేయడం విశేషం. అలాంటి ఆటగాడు వన్డేలకు వచ్చేసరికి విఫలమయ్యాడు. అతడికి అలవాటైన ఓపెనింగ్ నుంచి మార్చి నాలుగో స్థానంలో పంపడమే ఇందుకు కారణమన్నది స్పష్టం.

రోహిత్ విషయానికొస్తే.. అతను స్వతహాగా మిడిలార్డర్ ఆటగాడు. కానీ భారత జట్టులో మిడిలార్డర్‌లో నిలకడగా ఆడట్లేదని ఓపెనింగ్‌కు మార్చారు. ఆ స్థానంలో కొన్ని భారీ ఇన్నింగ్స్‌లు ఆడటంతో ఆ స్థానంలోనే కొనసాగిస్తున్నారు. కానీ కోహ్లి కంటే ముందు నుంచి అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్నప్పటికీ రోహిత్ ఇప్పటికీ పూర్తిగా కుదురుకోలేదు. నైపుణ్యం విషయంలో కోహ్లికి తగ్గ వాడే అయినా.. అతడిలోని పట్టుదల, ఉత్సాహం, కసి రోహిత్‌లో కనిపించవు! అతను వికెట్ పారేసుకునే తీరు ఎప్పుడూ చర్చనీయాంశమే! టీమ్‌ఇండియాలో మిగతా ఆటగాళ్లతో పోలిస్తే అతడికి ఎక్కువ అవకాశాలు, మద్దతు లభించాయన్న విమర్శలున్నాయి. రాహుల్ ఓపెనర్‌గా సత్తా చాటుకున్న నేపథ్యంలో అతణ్ని ఆ స్థానంలో కొనసాగించి, రోహిత్‌ను తనకలవాటైన నాలుగో స్థానంలోనే ఎందుకు ఆడించకూడదు అన్న ప్రశ్న తలెత్తుతోంది. 2019 ప్రపంచకప్ నేపథ్యంలో ఇప్పుడు కచ్చితమైన ప్రణాళికలతో అడుగులేయడం కీలకం. ఈ దశలో పొరబాట్లు చోటు చేసుకుంటే అది గందరగోళానికి దారి తీయొచ్చు. కాబట్టి కోహ్లి బృందం జాగ్రత్త పడాలి.



ఆస్ట్రేలియాకు దిమ్మదిరిగే షాక్

అక్కడ అగ్ర జట్టు ఇంగ్లాండ్‌ను దాని సొంతగడ్డపై మట్టికరిపించి వెస్టిండీస్ సంచలనానికి తెరతీస్తే.. ఇక్కడ తమ గడ్డపై బంగ్లాదేశ్.. మరో పెద్ద జట్టు ఆస్ట్రేలియాకు షాకిచ్చి ఔరా అనిపించింది. కంగారూల్ని బంగ్లా ఓడించడమే కాదు.. ఆ ఓడించిన తీరు కూడా అసాధారణమే. టెస్టు క్రికెట్లో ఉన్న మజా ఏంటో చూపిస్తూ.. అనూహ్య మలుపులు తిరుగుతూ సాగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ విజయంపై ఆశలు వదులుకోకుండా పట్టుదలతో పోరాడిన వైనం అమోఘం. ఓపెనర్ డేవిడ్ వార్నర్ (112; 135 బంతుల్లో 16×4, 1×6) జోరుతో ఓ దశలో సునాయాసంగా గెలిచేలా కనిపించిన ఆసీస్.. స్పిన్నర్ షకిబ్ అల్‌హసన్ (5/85) ధాటికి అనూహ్యంగా కుప్పకూలింది. బంగ్లాదేశ్ తొలిసారిగా ఆసీస్‌ను ఓడించిచడంతో ఆ దేశమంతా సంబరాల్లో మునిగిపోయింది.

ఔరా.. బంగ్లా!

తొలి టెస్టులో సంచలన విజయం ● షకిబ్ ధాటికి కుప్పకూలిన స్మిత్ సేన

ఢాకా

వన్డేల్లోనే కాదు.. టెస్టుల్లోనూ తమను తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదని బంగ్లాదేశ్ మరోసారి చాటిచెప్పింది. కొన్ని నెలల కిందటే ఇంగ్లాండ్‌ను ఓడించిన ఆ జట్టు.. ఇప్పుడు ఆస్ట్రేలియాపైనా నెగ్గింది. ఉత్కంఠభరితంగా సాగిన తొలి టెస్టులో ఆ జట్టు 20 పరుగుల తేడాతో విజయం సాధించింది. నాలుగో రోజే ముగిసిన ఈ మ్యాచ్‌లో 265 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియా.. 244 పరుగులకు ఆలౌటైంది. వార్నర్, స్టీవెన్ స్మిత్ (37; 99 బంతుల్లో 3×4))ల జోరుతో ఓ దశలో 158/2తో సునాయాసంగా గెలిచేలా కనిపించిన ఆసీస్.. షకిబ్, తైజుల్ (3/60), మిరాజ్(2/80)ల ధాటికి కుదేలైంది. చివర్లో కమిన్స్ (33 నాటౌట్; 55 బంతుల్లో 3×4, 2×6) ఆసీస్‌ను గెలిపించేందుకు విఫలయత్నం చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లోనూ 5 వికెట్లు తీయడమే కాక, 84 పరుగుల కీలక ఇన్నింగ్స్ ఆడిన షకిబ్.. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు. బంగ్లాదేశ్‌కు టెస్టుల్లో ఆస్ట్రేలియాపై ఇదే తొలి విజయం. సిరీస్‌లో చివరిదైన రెండో టెస్టు సోమవారం ఆరంభమవుతుంది.

అతను పడ్డాడో లేదో..: ఓవర్‌నైట్ స్కోరు 109/2తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా గంట వరకు ఆడిన తీరు చూస్తే.. ఆ జట్టు 265 పరుగుల లక్ష్యాన్ని సులువుగానే ఛేదించేలా కనిపించింది. 75 పరుగులతో క్రీజులోకి వచ్చిన వార్నర్.. చకచకా సెంచరీ వైపు అడుగులేశాడు. అతను 121 బంతుల్లోనే శతకం పూర్తి చేశాడు. వార్నర్ ధాటిగా ఆడుతుంటే.. స్మిత్ (ఓవర్‌నైట్ స్కోరు 25) క్రీజులో పాతుకుపోయే ప్రయత్నం చేశాడు. వీళ్లిద్దరి భాగస్వామ్యం 100.. ఆసీస్ స్కోరు 150 దాటింది. దీంతో బంగ్లాకు మ్యాచ్ దూరమయ్యేలా కనిపించింది. ఆ స్థితిలో షకిబ్.. వార్నర్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకుని బంగ్లాకు గెలుపు ద్వారాలు తెరిచాడు. నాలుగు ఓవర్ల తర్వాత స్మిత్ కూడా షకిబ్ బౌలింగ్‌లోనే వెనుదిరిగాడు. దీంతో బంగ్లా బౌలర్లు, ఫీల్డర్లలో ఉత్సాహం రెట్టింపైంది. బ్యాట్స్‌మెన్ చుట్టూ ఫీల్డర్లను పెట్టి గింగిరాలు తిరిగే బంతులతో ఒత్తిడి పెంచారు. తైజుల్ బౌలింగ్‌లో హాండ్స్‌కాంబ్ (15) క్యాచ్‌ను సౌమ్య సర్కార్ కళ్లు చెదిరే రీతిలో అందుకున్నాడు. వేడ్ (4) కూడా నిలవకపోవడంతో లంచ్ విరామానికి ఆసీస్ 199/7తో నిలిచింది. అప్పటికి మాక్స్‌వెల్ క్రీజులోనే ఉండటంతో ఆసీస్ గెలుపుపై ఆశతోనే ఉంది. ఐతే లంచ్ తర్వాత తొలి బంతికే మాక్స్‌వెల్ (14)ను షకిబ్ బౌల్డ్ చేశాడు. ఈ దశలో కమిన్స్, లియాన్ (12) పోరాడారు. కానీ లియాన్ ఔటవడంతో గాయపడ్డ హేజిల్‌వుడ్ క్రీజులోకి వచ్చాడు. ఇక లాభం లేదని కమిన్స్ భారీ షాట్లు ఆడాడు. మిరాజ్ వేసిన ఒక ఓవర్లో రెండు సిక్సర్లు సహా 15 పరుగులు రాబట్టడంతో ఉత్కంఠ నెలకొంది. ఆసీస్ విజయానికి 21 పరుగులే అవసరమైనపుడు తైజుల్.. హేజిల్‌వుడ్‌ను వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో ఉత్కంఠకు తెరపడింది.



'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' షకిబ్

● షకిబ్, తమీమ్ ఇద్దరికీ ఇది 50వ టెస్టే. తమీమ్ రెండు ఇన్నింగ్స్‌ల్లో (71, 78) రాణించగా.. షకిబ్ తొలి ఇన్నింగ్స్‌లో 84 పరుగులు చేసి, 5 వికెట్లు పడగొట్టాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ 5 వికెట్లు తీశాడు.

● ఓ టెస్టులో పది వికెట్లు తీయడం, 80కి పైగా పరుగులు చేయడం షకిబ్‌కు ఇది రెండోసారి. టెస్టు క్రికెట్లో మరే ఆటగాడూ ఈ ఘనత సాధించలేదు.

● గత ఏడాది కాలంలో బంగ్లాదేశ్.. ఇంగ్లాండ్, శ్రీలంక లాంటి మరో రెండు పెద్ద జట్లనూ ఓడించింది. అంతకుముందు 16 ఏళ్ల తమ టెస్టు చరిత్రలో బంగ్లా.. వెస్టిండీస్, జింబాబ్వే లాంటి బలహీన జట్లపై మాత్రమే నెగ్గింది.

సొంతగడ్డపై ముంబా బోణీ

ముంబయి: ప్రో కబడ్డీ ఐదో సీజన్‌లో సొంతగడ్డపై యు ముంబా బోణీ కొట్టింది. బుధవారం 38-32 తేడాతో హరియాణా స్టీలర్స్‌పై విజయం సాధించింది. మ్యాచ్ ఆరంభంలో రెండు జట్లు హోరాహోరీగా తలపడ్డాయి. ముంబా 11వ నిమిషంలో హరియాణాను ఆలౌట్ చేసి 15-10 ఆధిక్యాన్ని సంపాదించింది. అదే ఊపు కొనసాగించిన ముంబా 20-15తో ప్రథమార్ధాన్ని ముగించింది. విరామం తర్వాత హరియాణా ఆటగాళ్లు పోరాడడంతో 29వ నిమిషానికి స్కోర్లు 29-29తో సమం అయ్యాయి. ఐతే ముంబా డిఫెండర్లు రాణించి హరియాణా రైడర్లను కట్టడి చేయడం ద్వారా తమ జట్టును 35-30 ఆధిక్యంలోకి తీసుకెళ్లారు. చివరిదాకా ఆధిక్యాన్ని కాపాడుకున్న ముంబా 38-32తో మ్యాచ్‌ను ముగించింది.

ప్రో కబడ్డీలో ఈనాడు	
తెలుగు టైటాన్స్ × తమిళ్ తలైవాస్	రాత్రి 8 గంటలకు
యు ముంబా × జైపూర్ పింక్‌పాంథర్స్	రాత్రి 9 గంటలకు
ప్రసారం: స్టార్ స్పోర్ట్స్-2, వేదిక: ముంబయి	


చెమటోడ్చిన ఫెదరర్

కష్టంగా రెండో రౌండ్లో ప్రవేశం ● నాదల్ ముందంజ

వింబుల్డన్ గెలిచిన ఊపులో ఉన్న ఫెదరర్ యుఎస్ ఓపెన్‌లో ఫేవరెట్ అనడంలో సందేహం లేదు. కానీ తొలి రౌండ్లోనే అతడికి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. ఓ పందొమ్మిదేళ్ల కుర్రాడు అతడికి చెమటలు పట్టించాడు. ఫెదరర్ ఐదు సెట్ల హోరాహోరీ పోరులో అతి కష్టంగా గెలిచి, రెండో రౌండ్లో అడుగుపెట్టాడు.

న్యూయార్క్

రోజర్ ఫెదరర్ (స్విట్జర్లాండ్) అతి కష్టంగా యుఎస్ ఓపెన్ రెండో రౌండ్లో అడుగుపెట్టాడు. తొలి రౌండ్లో అమెరికా కుర్రాడు ఫ్రాన్సెస్ తియాఫె అతణ్ని హడలెత్తించాడు. రసవత్తరంగా సాగిన మ్యాచ్‌లో మూడో సీడ్ ఫెదరర్ 4-6, 6-2, 6-1, 1-6, 6-4తో 70వ ర్యాంకు ఆటగాడైన తియాఫె (అమెరికా)పై విజయం సాధించాడు. ఐతే ఈ కఠిన పోరు తన మంచికే అంటున్నాడు ఫెదరర్. "ఈ మ్యాచ్ నా ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. ఆరంభంలో ఇలాంటి ఇబ్బంది మంచిదే" అని చెప్పాడు. మూడు వారాల కింద మాంట్రియల్ ఫైనల్లో జ్వెరెవ్ చేతిలో ఓడిన తర్వాత ఫెదరర్‌కు ఇదే తొలి మ్యాచ్. ఆ తర్వాత వారం అతడు వెన్ను నొప్పితో సిన్సినాటి టోర్నీ నుంచి తప్పుకున్నాడు. ఐతే ఇప్పుడు వెన్ను నొప్పి తనను పెద్దగా ఇబ్బంది పెట్టట్లేదని ఫెదరర్ చెప్పాడు. "కొన్ని రోజుల కింద వెన్ను నొప్పి గురించి ఆందోళన చెందా. ఇప్పుడు బాగుంది. ఐదు సెట్ల మ్యాచ్‌లో పైచేయి సాధించాలంటే ఆరోగ్యంగా ఉండాలి. ఈ మ్యాచ్ నాకెంతో ఆత్మవిశ్వాసాన్నిస్తుంది" అని ఫెదరర్ వ్యాఖ్యానించాడు. మరోవైపు ప్రపంచ నంబర్‌వన్ రఫెల్ నాదల్ (స్పెయిన్) శుభారంభం చేశాడు. మొదటి రౌండ్లో అతడు 7-6 (8-6), 6-2, 6-2తో దుసాన్ లజోవిచ్ (సెర్బియా)పై విజయం సాధించాడు. ఆరో సీడ్ డోమినిక్ థీమ్ (అమెరికా), మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్), బెర్డిచ్ (చెక్) కూడా రెండో రౌండ్‌కు చేరుకున్నారు. మహిళల సింగిల్స్‌లో స్వితోలినా (ఉక్రెయిన్), కనెపి (ఎస్తోనియా) శుభారంభం చేశారు. బౌచర్డ్ (కెనడా) 6-7 (2-7), 1-6తో రొడినా (రష్యా) చేతిలో ఓడిపోయింది.



ఫెదరర్

స్వచ్ఛ ప్రేరకులు.. కార్య సాధకులు

- బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలే ఈ యువ ప్రతినిధుల లక్ష్యం
- ఉన్నత ఉద్యోగావకాశాలను వదులుకొని సామాజిక సేవ

ఈనాడు - సంగారెడ్డి

వంద శాతం బహిరంగ మలవిసర్జన రహితంగా గ్రామాలను తీర్చిదిద్దే క్రతువులో పాలుపంచుకునేందుకు కొందరు యువ ప్రతినిధులు స్వచ్ఛభారత్ ప్రేరక్‌లుగా మారారు. టాటా ట్రస్టులో శిక్షణ పొంది వినూత్న ఆలోచనల ద్వారా పల్లెవాసుల్లో మార్పు తెచ్చేలా క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. ప్రధాని మోదీ పిలుపు మేరకు టాటా ట్రస్టు దేశవ్యాప్తంగా 300 మంది యువతీయువకులకు శిక్షణ ఇవ్వగా.. వారిలో కొందరు తెలంగాణలోని యాదాద్రి భువనగిరి, నల్గొండ, సంగారెడ్డి, రంగారెడ్డి, మంచిర్యాలలో ప్రేరక్‌లుగా పని చేస్తున్నారు. 'ఈనాడు-ఈటీవీ'తో వారు తమ అనుభవాలను పంచుకున్నారు. ఉన్నత ఉద్యోగావకాశాలు ఎన్నో ఉన్నా ఏడాదిపాటు ప్రేరక్‌లుగా పనిచేయడానికి పురిగొల్పిన అంశాలను వివరించారు. వ్యాసరచన పోటీలు, ఆలోచింపజేసే లఘుచిత్రాలు, వినూత్న కార్యక్రమాల ద్వారా లక్ష్యాన్ని చేరుతామని ధీమాగా చెబుతున్నారు. బహిరంగ మలవిసర్జన రహితంగా గ్రామాలను మార్చడంతోపాటు ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చేలా మార్పు తెస్తామంటున్నారు. వీరంతా 25-27 ఏళ్ల లోపు వారే కావడం విశేషం. వీరు నైపుణ్యం కలిగిన యువత కావడంతో మెరుగైన ఫలితాలు వస్తాయని అధికారులు సైతం ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

న్యాప్‌కిన్స్ వినియోగంపై అవగాహన

– వి.హనుమంతు(25), నల్గొండ



నేను టాటా ఇన్‌స్టిట్యూట్‌లో ఎం.ఎ (సోషల్ వర్క్) చదివాను. ప్రశాంత్‌కిషోర్ నిర్వహిస్తున్న ఇండియన్ పొలిటికల్ యాక్షన్‌కమిటీలో రెండేళ్లు పనిచేశా. ఆ సమయంలోనే ప్రేరక్‌లుగా పనిచేసేవారు కావాలంటూ ప్రకటన వచ్చింది. ఆలోచించకుండా మంచి జీతమొచ్చే ఉద్యోగాన్నివదిలి శిక్షణ తీసుకున్నా. అనంతరం సొంత జిల్లాలోనే పనిచేసే అవకాశం ఇచ్చారు. విద్యార్థినులకోసం పాఠశాలలు, కళాశాలల్లో శానిటరీ న్యాప్‌కిన్లు ఇచ్చే యంత్రాలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించాం. వాడిన న్యాపికిన్లను కాల్చివేసే యంత్రాలనూ అక్కడే బిగించనున్నాం.

పరిశుభ్రతే లక్ష్యంగా..

– కోటపల్లి హరీశ్(25), సంగారెడ్డి



నేను ఐఐటీ-ఇండోర్‌లో బీటెక్, పీహెచ్‌డీ పూర్తి చేశా. అక్కడ చదువుతున్న రోజుల్లో ఉన్నత భారత్ అభియాన్‌లో భాగంగా మధ్యప్రదేశ్ లోని సిమ్రోల్ గ్రామ రూపురేఖలు మార్చడంలో కీలకంగా పనిచేశా. పీహెచ్‌డీకి సంబంధించి ప్యారిస్, ఫిన్లాండ్ ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడ పరిసరాల పరిశుభ్రతకు వారిస్తున్న ప్రాధాన్యం ఆకట్టుకుంది. ఇక్కడ అలా ఉంచడం ఎందుకు సాధ్యం కాదనే ఆలోచనతో ప్రేరక్‌గా మారాను. జిల్లాలోని మారుమూల గ్రామాలు తిరిగి ప్రజల్లో చైతన్యం తెచ్చేలా పనిచేస్తున్నా.

ప్రజలతో కలిసి పనిచేయాలనే ధ్యేయంతో..

– సందీప్‌కుమార్ ధరావత్ (27), యాదాద్రి భువనగిరి



మాది ఖమ్మం జిల్లాలోని వెంకటాయపాలెం. ఐఐటీ-మద్రాసు నుంచి 2014లో బీటెక్ పూర్తి చేశా. ఆ తర్వాత మెరైన్ ఇంజినీర్‌గా అవకాశాలూ వచ్చాయి. అయితే ప్రజలతో కలిసి పనిచేసి వారి కష్టాలను తీర్చే ఉద్యోగం చేయాలనే లక్ష్యంతో సివిల్స్‌కు సన్నద్ధమవుతున్నా. ఇంతలో స్వచ్ఛభారత్ ప్రేరక్‌గా పని చేసే అవకాశం దక్కింది. మూడు నెలలుగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ఈ కార్యక్రమంలో నిమగ్నమయ్యాను.

ఆ పరిస్థితి చూసి చలించిపోయా...

–శ్రవణ్ నేమన(27), రంగారెడ్డి



సత్యసాయి విశ్వవిద్యాలయంలో ఎంబీఏ పూర్తి చేశా. మొబైల్ యాప్‌లు రూపొందించే సంస్థలో ఏడాది పనిచేశా. ఉద్యోగరీత్యా ఒక రోజు ముంబయి లోని లోకల్ రైలులో ప్రయాణిస్తుండగా.. పట్టాలకు సమీపంలో ఒక మహిళ చీరకొంగు తలపై కప్పుకొని మలవిసర్జనకు వెళుతున్న దృశ్యం నన్ను కలచివేసింది. ఎందరో మహిళలు ఇలా అవమాన భారంతో రోజూ గడపాల్సిందేనా? అనే ప్రశ్న తలెత్తింది. ఇదే సమయంలో స్వచ్ఛభారత్ ప్రేరక్‌గా పని చేసేందుకు అవకాశం రావడంతో మరో ఆలోచన లేకుండా వచ్చేశా.

పల్లె రూపురేఖలు మార్చేందుకు..

– వి.రాహుల్ (25), మంచిర్యాల



గ్రామీణాభివృద్ధి అంశమై ముంబయిలోని టాటా ఇన్‌స్టిట్యూట్‌లో ఎంఏ పూర్తి చేశా. మూడేళ్లపాటు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ తరఫున ఆదిలాబాద్ జిల్లాలో 'యంగ్ ప్రొఫెషనల్‌గా' పనిచేశా. పల్లెల రూపురేఖలు మార్చే పనిలో నిమగ్నం కావడం సంతృప్తినిచ్చింది. గత ఐదు నెలలుగా పల్లెల్లో తిరుగుతున్నా. బహిరంగ మలవిసర్జన రహితంగా గ్రామాలను మార్చేందుకు అవసరమైన ప్రణాళికలను రచించి, ఉన్నతాధికారుల సహకారంతో వాటిని అమలు చేసేలా పని చేస్తున్నా.

మొండి ప్రశ్నకు.. జగమొండి జవాబు

- డోక్లాం ప్రతిష్టంభనపై చైనా దూకుడుకు చర్చలతోనే భారత్ కళ్లెం
- కవ్వింపులకు సడలని నిగ్రహం

దిల్లీ

'అదేమైనా మీ భూభాగమా' ఇది డోక్లాంలో భారత బలగాల మోహరింపుపై చైనా వేసిన ఘాటు ప్రశ్న. ప్రతిష్టంభన తొలగించేందుకు బీజింగ్‌కు వెళ్లిన భారత జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ డోభాల్ దీనిపై స్పందిస్తూనే చర్చలు మొదలుపెట్టాల్సిన పరిస్థితి. మూడు దేశాల కూడలిలో మారుతున్న సమీకరణాలపై చైనా మొండి వైఖరిని ప్రతిబింబించే ఈ ప్రశ్నకు డోభాల్ దీటుగా స్పందించారు. 'వివాదాలు ముసురుకొన్న ప్రతి భూభాగమూ చైనాదే అయిపోతుందా?'అంటూ చైనా స్టేట్ కౌన్సెలర్ యాంగ్ జీచీకి ఆయన ఎదురుప్రశ్న సంధించారు. దీంతో ఈ భూభాగం భూటాన్‌దేనని నొక్కిచెప్పినట్లయింది. అంతేకాదు భూటాన్ రక్షణ బాధ్యత తమదేనని డోభాల్ స్పష్టం చేశారు. భూటాన్ సార్వభౌమత్వాన్ని కాపాడేందుకు కుదిరిన "రక్షణ ఒప్పందం"లో భాగంగానే తాము డోక్లాంలో కాలుమోపామని కూడా ఆయన తేటతెల్లం చేశారు. "సరిహద్దు వివాదాలను పరిష్కరించేందుకు భూటాన్‌తో మీరు పలు దఫాలుగా జరిపిన చర్చల్లో డోక్లాం అంశం ప్రస్తావనకు వచ్చింది. ఉత్తర ప్రాంతంలో 500 చ.కి.మీ. భూభాగాన్ని మీరు ఇస్తామన్నా.. డోక్లాంను అప్పగించేందుకు భూటాన్ ఒప్పుకోలేదు"అని గుర్తుచేశారు. ఈ వివాదం ఇంకా పరిష్కారం కాలేదు కాబట్టి.. రెండు దేశాలూ (భారత్, చైనా) ఒకేసారి బలగాలను ఉపసంహరించుకోవడం మేలని కుండబద్దలుకొట్టారు.

పలు దఫాలుగా

జులై 27న తొలి మాటల యుద్ధం అనంతరం మళ్లీ పలుమార్లు చర్చలు జరిగాయి. ప్రతిష్టంభనకు తెరదించేందుకు విదేశాంగ కార్యదర్శి ఎస్.జైశంకర్, చైనాలోని భారత రాయబారి విజయ్ గోఖలే చాలా ప్రయత్నాలే చేశారు. జులై 7న హేంబర్గ్‌లో జీ20 సదస్సుకు భారత ప్రధాని మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ హాజరైన సంగతి తెలిసిందే. అక్కడే ఈ చర్చలకు బీజాలు పడ్డాయి. పరిస్థితులు శ్రుతిమించకుండా చూసేందుకు.. ఎన్ఎస్ఏ స్థాయి చర్చలకు మోదీ, జిన్‌పింగ్ తీర్మానించారు. గత కొన్ని దశాబ్దాల్లో కనీవినీ ఎరుగని రీతిలో ఉద్రిక్తంగా మారిన పరిస్థితులను వీలైనంత త్వరగా ఓ కొలిక్కి తేవాలని చర్చల బృందానికి మోదీ సూచించారు. ద్వైపాక్షిక సహకారంతో రెండు దేశాలూ సాధించాల్సింది ఎంతో ఉందని, ఇలాంటి విభేదాలు ఘర్షణలుగా మారకూడదని ఆయన చెప్పారు. అదేసమయంలో భారత్ వైఖరినీ విస్పష్టంచేశారు. 'ఎట్టిపరిస్థితుల్లోనూ బలప్రయోగంతో డోక్లాంలో యథాస్థితి మారడానికి భారత్ తావివ్వకూడదు. చర్చలు, ఉమ్మడి అంగీకారంతోనే ఏదైనా జరగాలి' అని నొక్కిచెప్పారు.

ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది

డోక్లాం వివాదంలో భారత్ అనుసరించిన విధానాలు చైనాకు ప్రతిధ్వనిలా మళ్లీమళ్లీ ఎదురవుతూనే ఉంటాయని విదేశాంగ నిపుణులు అశోక్ కాంత్ వ్యాఖ్యానించారు. ఈయన చైనాలోని భారత రాయబారిగా పనిచేశారు. 'దక్షిణ చైనా సముద్రం సహా పలు వివాదాస్పద ప్రాంతాలపై చైనా ఇలాంటి మొండి వైఖరినే ప్రదర్శిస్తోంది. దీంతో అక్కడ చిన్న చిన్న దేశాలు చైనా ఆధిపత్యాన్ని అంగీకరిస్తున్నాయి. కానీ డోక్లాం విషయంలో భూటాన్‌కు ఆ అగత్యం పట్టలేదు. దీంతో చైనా వెనకడుగు వేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఒకవేళ భారత్ వెనకడుగు వేసుంటే... చైనాతో తలపడుతున్న చిన్నదేశాల పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుండేది. ఇప్పుడు వారిలో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. చైనాకు డోక్లాం స్పందన లాంటి ప్రతిధ్వనులు వినిపిస్తూనే ఉంటాయి' అని అశోక్ వ్యాఖ్యానించారు.

సహనమే మూలసూత్రం

రహస్యంగా క్షిపణులు, యుద్ధ ట్యాంకులను సరిహద్దుల వెంబడి చైనా కదిలించినా; మీడియాలో విషాన్ని ఎగజిమ్ముతూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా భారత్ నిగ్రహంతో ఉండటానికి మోదీ ఉద్బోధే కారణం. ఎలాంటి కవ్వింపు చర్యలు ఎదురైనా సహనంతో ఉండాలని సైన్యానికి సైతం స్పష్టమైన ఆదేశాలు అందాయి. 'ఆ ఉద్రిక్త పరిస్థితుల్లో ఒక్క సైనికుడు ఒక్క తూటా పేల్చినా పరిణామాలు విపరీతంగా మారిపోతాయి'అంటూ సైన్యం పాటించిన నిగ్రహంపై సీనియర్ అధికారులు ప్రశంసలు కురిపించారు.

డోక్లాం విజయంపై విదేశాంగశాఖ మాట్లాడితే చాలు: మోదీ

డోక్లాం ప్రతిష్టంభన సమసిపోయిన నేపథ్యంలో ఆ విజయం గురించి పదిమందికీ తెలియచేసే బాధ్యతను విదేశాంగ వ్యవహారాల శాఖకే వదిలేయం ఉత్తమమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభిప్రాయపడ్డారు. అదే విషయాన్ని ఆయన తన మంత్రివర్గ సహచరులకు బుధవారం స్పష్టంగా చెప్పారు. అత్యంత సున్నితమైన ఈ అంశంపై విదేశాంగ వ్యవహారాలశాఖ మినహా మంత్రులెవరూ కూడా మాట్లాడరాదని మోదీని ఉటంకిస్తూ అభిజ్ఞవర్గాలు తెలిపాయి.

ఇది సన్నాహకమే

- పసిఫిక్ లక్ష్యంగా మరిన్ని క్షిపణుల ప్రయోగం
- ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జాంగ్ వెల్లడి

సియోల్: జపాన్ మీదుగా తమ దేశం చేపట్టిన బాలిస్టిక్ క్షిపణి ప్రయోగాన్ని.. కేవలం 'సన్నాహక' చర్యగా ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్ వర్ణించారు. పసిఫిక్ మహాసముద్రం లక్ష్యంగా భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలు చేపడతామని.. జపాన్ మీదుగా మరిన్ని క్షిపణులు దూసుకెళ్తాయని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఉత్తర కొరియా ప్రభుత్వ మీడియా సంస్థ కేసీఎన్ఏ బుధవారం వివరాలు వెల్లడించింది. తాజా ప్రయోగంపై కిమ్ పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారని.. గువామ్ దీవులను క్షిపణుల పరిధిలోకి తెచ్చుకునేందుకు ఇదొక అర్థవంతమైన ప్రారంభ చర్య అని వ్యాఖ్యానించారని తెలిపింది. భవిష్యత్తులో పసిఫిక్‌ను లక్ష్యంగా పెట్టుకుని.. మరిన్ని బాలిస్టిక్ క్షిపణుల పరీక్షలు చేపట్టాల్సిన అవసరముందని కిమ్ వ్యాఖ్యానించినట్లు పేర్కొంది. మంగళవారం ప్రయోగించిన క్షిపణి మధ్య శ్రేణి హ్వాసాంగ్-12గా పేర్కొంది. దీన్ని ఉత్తర కొరియా మే నెలలో పరీక్షించింది. అమెరికా సైనిక స్థావరాలకు నెలవైన గువామ్ దీవులపై దీన్ని ప్రయోగిస్తామనే ఇటీవల కిమ్ ప్రభుత్వం బెదిరింపులకు దిగింది. ప్రయోగానికి సంబంధించిన 20 చిత్రాలను కిమ్ పార్టీ పత్రిక బుధవారం ప్రచురించింది. వాటిలో వాయువ్య పసిఫిక్ పటాన్ని ముందు పెట్టుకుని కిమ్ నవ్వులు చిందిస్తున్న చిత్రం కూడా ఉంది. ఇటు తాజా ప్రయోగం వల్ల తమ పొరుగు దేశాల భద్రతకు వాటిల్లిన నష్టమేమీ లేదని ఉత్తర కొరియా వాదించింది. జపాన్ ప్రధాన భూభాగం మీదుగా క్షిపణి ప్రయోగం చేపట్టినట్లు ఉత్తర కొరియా అంగీకరించడం ఇదే తొలి సారి. గతంలోనూ రెండు సార్లు (1998, 2009ల్లో) ఆ దేశం రాకెట్లను ప్రయోగించినప్పటికీ.. అవి ఉపగ్రహాల కోసం ఉద్దేశించినవనీ అప్పుడు పేర్కొంది.

ఖండించిన ఐరాస భద్రత మండలి

ఐరాస: జపాన్ మీదుగా పసిఫిక్ సముద్రంలోకి ఉత్తర కొరియా బాలిస్టిక్ క్షిపణిని ప్రయోగించడాన్ని ఐరాస భద్రత మండలి ముక్తకంఠంతో ఖండించింది. అణ్వాయుధ అభివృద్ధిని తక్షణమే ఆపివేయాలని ఉత్తర కొరియాను డిమాండ్ చేసింది. ఐరాస ప్రధాన కేంద్రంలో అంతర్గత చర్చల అనంతరం.. ఈ మేరకు భద్రత మండలి ప్రకటన విడుదల చేసింది. అమెరికా రూపొందించిన ప్రకటనపై.. 15 సభ్య దేశాలు సంతకం చేశాయి. ఉత్తర కొరియా మిత్రదేశాలు చైనా, రష్యా కూడా ఈ జాబితాలో ఉన్నాయి. భద్రత మండలి తీర్మానాల్లో చాలా వాటిని తాజా ప్రయోగం ద్వారా ఉత్తర కొరియా ఉల్లంఘించిందని ప్రకటన పేర్కొంది. అయితే దీని వల్ల వెంటనే ఆ దేశంపై కొత్త, తీవ్ర ఆంక్షలేవీ రావట్లేదు. ఉత్తర కొరియా చర్యలు ప్రాంతీయంగానే కాకుండా, సభ్య దేశాలన్నింటికీ ముప్పును కలిగిస్తున్నాయని భద్రత మండలి వ్యాఖ్యానించింది. తాజా క్షిపణి ప్రయోగంతోపాటు ప్రాంతీయ శాంతి, సుస్థిరతకు భంగం కలిగేలా ఉత్తర కొరియా చేస్తున్న బహిరంగ ప్రకటనలు, తీసుకుంటున్న చర్యలపై ఆందోళన వ్యక్తం చేసింది. ఐరాస తీర్మానాలన్నింటికీ కట్టుబడి.. అణ్వాయుధాలు, విపరీత నాశనానికి కారణమయ్యే ఇతర అస్త్రాలను వదులుకోవాలని, అణ్వాయుధ సంబంధ కార్యక్రమాలన్నింటినీ ఆపివేయాలని ఆ దేశాన్ని డిమాండ్ చేసింది.

డీఎస్సీ ప్రకటించకపోతే రాష్ట్రవ్యాప్త ఆందోళన: కృష్ణయ్య

దిల్‌సుఖ్‌నగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వం వారం రోజుల్లో డీఎస్సీ ప్రకటన విడుదల చేయాలని లేదంటే రాష్ట్రవ్యాప్త ఆందోళన చేపడతామని బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య హెచ్చరించారు. బుధవారం హైదరాబాద్‌లోని దిల్‌సుఖ్ నగర్‌లో జరిగిన తెలంగాణ బీఎడ్, డీఎడ్ భాషా పండితుల సమాఖ్య నిరుద్యోగులసమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తూ నిరుద్యోగ యువత జీవితాలతో ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ప్రకటన జాప్యం చేస్తున్నారనే ఆందోళనతో నారాయణఖేడ్‌లో రామకృష్ణ అనే యువకుడు సోమవారం చనిపోయాడని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని ఉపాధ్యాయ సంఘాలు ప్రభుత్వానికి తొత్తులుగా మారి డీఎస్సీ వాయిదావేయడానికి వత్తాసు పలుకుతున్నాయన్నారు. ఉపాధ్యాయ సంఘాలు తమవైఖరి మార్చుకోవాలన్నారు.



హాజరైన యువత. అంతరచిత్రంలో మాట్లాడుతున్న కృష్ణయ్య

రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం

ఈనాడు, హైదరాబాద్: దురంతో ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పిన ప్రమాదం, ముంబయిలో భారీ వర్షాల నేపథ్యంలో దక్షిణ మధ్య రైల్వే జోన్ పరిధినుంచి అటువైపు రాకపోకలు సాగించే రైళ్లపై తీవ్ర ప్రభావం పడింది. హైదరాబాద్-ముంబయి సీఎస్ఎంటీ హుస్సేన్‌సాగర్ ఎక్స్‌ప్రెస్ సహా తొమ్మిది రైళ్లు బుధవారం రద్దయ్యాయి. ముంబయి నుంచి బెంగళూరు, హెచ్ఎస్ నాందేడ్ వైపు వెళ్లే మూడు రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే ప్రకటించింది. 29, 30 తేదీల్లో పది రైళ్లు పాక్షికంగా రద్దయ్యాయి. ముంబయి నుంచి హైదరాబాద్, విశాఖపట్నం వైపు వెళ్లే కొన్ని రైళ్లు బుధవారం ఆరేడు గంటలు ఆలస్యంగా బయల్దేరాయి.

'ఐచ్ఛిక సెలవులు బడులకే ఉండాలి'

ఈనాడు, హైదరాబాద్: ఐచ్ఛిక సెలవులను ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా కాకుండా పాఠశాలల వారీగా వినియోగించుకునేలా చూడాలని పీఆర్టీయూ టీఎస్, యూటీఎఫ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న విధానాన్ని బడులకు వర్తింపజేయడంతో పిల్లలు పండుగలను చేసుకునే అవకాశం కోల్పోతారని, పాత విధానాన్నే కొనసాగించాలని పీఆర్‌టీయూ టీఎస్ కోరింది. 6, 7 తరగతులకు గణితం ఎవరు బోధించాలన్న దానిపై గతేడాది నుంచి వివాదం నడుస్తున్నా స్పష్టత ఇవ్వలేదని సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి సరోత్తంరెడ్డి, చెన్నకేశవరెడ్డి విమర్శించారు. ఒక బడిలోని 30 శాతం మించి ఉపాధ్యాయులకు ఐచ్ఛిక సెలవులు మంజూరు చేయరాదనే నిబంధన వల్ల మంజూరు చేసే ప్రధానోధ్యాయులు ఇబ్బంది పడతారని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి నర్సిరెడ్డి, చావ రవి అన్నారు.

డీఈఈసెట్ 2వ విడత షెడ్యూల్‌లో మార్పు

డీఎడ్ కోర్సులో ప్రవేశాలకు నిర్వహించే డీఈఈసెట్ రెండో విడత కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పులు చేశారు. ఇంతకుముందు ఈ నెల 31వ తేదీ నుంచి సెప్టెంబరు 6వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని, 12న సీట్లు కేటాయిస్తామని అధికారులు ప్రకటించారు. మారిన షెడ్యూల్ ప్రకారం తాజాగా ఈ నెల 31, సెప్టెంబరు 1 తేదీల్లో ఆప్షన్లు ఇచ్చుకోవాలని, సెప్టెంబరు 4న సీట్లు కేటాయిస్తామని పేర్కొన్నారు.

జడ్జీల నియామకంలో జాప్యంపై నేడు సమావేశం

ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తుల నియామకంలో జరుగుతున్న జాప్యంపై హైకోర్టు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ బార్ అసోసియేషన్‌లు గురువారం మధ్యాహ్నం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నాయి. 61 మంది జడ్జీలకుగాను 27 మంది మాత్రమే ఉండగా వారిలో మరికొందరు త్వరలో పదవీ విరమణ చేయబోతున్నారు. కొన్నేళ్లుగా న్యాయవాదుల కోటా నుంచి హైకోర్టు న్యాయమూర్తుల నియామకం జరగలేదు. కేసుల విచారణలో జరుగుతున్న జాప్యం నేపథ్యంలో న్యాయమూర్తుల నియామకం అంశంపై సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు హైకోర్టు తెలంగాణ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జల్లి కనకయ్య తెలిపారు.

ప్రారంభమైన హజ్ యాత్ర

మక్కా: మక్కా సందర్శనలో భాగంగా జరిగే హజ్ యాత్రలో మొదటి రోజు ప్రపంచంలోని వివిధ దేశాల నుంచి 20 లక్షల మందికిపైగా పాల్గొన్నారు. ఘనాకారంలో ఉండే కాబా చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు. మక్కాకు సమీపంలోని మినాలో బస చేసిన భారత హజ్ యాత్రికులను విదేశీ వ్యవహారాల శాఖ సహాయ మంత్రి ఎంజే అక్బర్ కలుసుకున్నారు. ప్రభుత్వ హజ్‌యాత్ర సౌహార్ద బృందానికి మంత్రి నేతృత్వం వహిస్తున్నారు. భారతీయుల వైద్య సదుపాయాల కోసం ఏర్పాటు చేసిన ఆసుపత్రిని ఆయన సందర్శించారు. భారత్ నుంచి 1,70,000 మంది మక్కాకు చేరుకున్నారు.

తమిళనాడులో బలపరీక్షకు గవర్నర్ విముఖత!

చెన్నై: అన్నాడీఎంకే అంతర్గత వ్యవహారాల్లో తాము జోక్యం చేసుకోలేమని, ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాన్ని రద్దు చేయలేమని కేంద్ర హోంశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ స్పష్టం చేసినట్లు తెలిసింది. లోక్‌సభ ఉప సభాపతి తంబిదురై బుధవారం ఆయనతో సమావేశమయ్యారు. అన్నాడీఎంకేలో కొనసాగుతున్న నాటకీయ పరిణామాలు, పార్టీ అంతర్గత వ్యవహారాల నేపథ్యంలో గవర్నర్ కల్పించుకోరని రాజ్‌నాథ్ ఈ సందర్భంగా అన్నట్లు తెలిసింది. రాష్ట్ర మంత్రులు డి.జయకుమార్, తంగమణి, ఎంపీ మైత్రేయన్, మాజీ ఎంపీ మనోజ్ పాండియన్ తదితరులు కూడా ఆయనతో భేటీ అయ్యారు. మరోవైపు వీసీకే, వామపక్షాలు, ఎంఎంకే నాయకులు గవర్నర్ విద్యాసాగర్‌రావుతో భేటీ అయ్యారు. ప్రభుత్వం మైనారిటీలో ఉందని గవర్నర్‌తో అన్నారు.

మెట్రో స్టేషన్ల సమీపంలో సౌర బస్‌షెల్టర్లు

- మెట్రో, ఆర్టీసీ సమన్వయంపై ఉన్నతాధికారుల భేటీ

ఈనాడు, హైదరాబాద్: రాజధాని హైదరాబాద్‌లో మెట్రోరైలు సేవలు కొద్ది నెలల్లో అందుబాటులోకి రానున్న నేపథ్యంలో మెట్రోస్టేషన్లను అనుసంధానిస్తూ బస్సు సౌకర్యం కల్పించడంపై టీఎస్‌ఆర్టీసీ, మెట్రోరైలు సంస్థలు దృష్టిపెట్టాయి. ఈ మేరకు బుధవారమిక్కడ బస్‌భవన్‌లో సమన్వయ సమావేశం జరిగింది. మెట్రో రైలు, ఆర్టీసీల ద్వారా హైదరాబాద్‌లో ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడంపై రవాణాశాఖ ముఖ్యకార్యదర్శి సునీల్‌శర్మతో పాటు ఆర్టీసీ ఎండీ రమణారావు, మెట్రోరైలు, జీహెచ్ఎంసీ అధికారులు చర్చించారు. మెట్రో స్టేషన్ల సమీపంలో సౌర బస్‌షెల్టర్లను నిర్మిస్తామని, వీటికి అవసరమైన స్థలాలను సమకూర్చే ప్రక్రియ కూడా మొదలుపెట్టామని మెట్రో రైలు సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మెట్రో కార్యకలాపాలను అనుసంధానించడానికి ప్లాన్ ఫీడర్ సేవలు, ఆర్టీసీ బస్సులు, ఎంఎంటీఎస్ సర్వీసులతోపాటు వీటిలో ప్రయాణానికి స్మార్ట్‌కార్డు డిజైన్‌పైనా సమావేశంలో చర్చించారు. నగరంలో ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఆర్టీసీ, మెట్రో రైలు, జీహెచ్ఎంసీ, రైల్వే అధికారులు సమన్వయంతో పనిచేయాలని సునీల్‌శర్మ సూచించారు. పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ జీవీ రమణారావు తెలిపారు. మెట్రోకు అనుగుణంగా సిటీ బస్సు సౌకర్యం అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ ఎండీ పేర్కొన్నారు.



బస్‌భవన్‌లో జరిగిన దృశ్యాత్మక ప్రదర్శనలో పాల్గొన్న మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, ఆర్టీసీ ఛైర్మన్ సోమారపు సత్యనారాయణ, ఎండీ రమణారావు

మహిళలపై నేరాలకు పాల్పడినట్లు... 51 మంది చట్టసభ సభ్యులపై కేసులు

దిల్లీ: మహిళలపై అత్యాచారం, అపహరణ లాంటి నేరాలకు సంబంధించి 51 మంది చట్టసభ సభ్యులపై కేసులున్నట్లు ప్రజాస్వామ్య సంస్కరణల సంఘం (ఏడీఆర్) బుధవారం తెలిపింది. వీరిలో 48 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు ఉన్నట్లు పేర్కొంది. వీరు భాజపా (14), శివసేన (7), తృణమూల్ కాంగ్రెస్ (6) తదితర పార్టీలకు చెందినవారని వెల్లడించింది. గత ఐదేళ్లలో ఎన్నికల సమయంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు సమర్పించిన 4,896 ప్రమాణపత్రాల్లో 4852ను విశ్లేషించినట్లు ఏడీఆర్ తెలిపింది. అధ్యయనంలోని వివరాల ప్రకారం..

- 1581 మంది (33%) ఎంపీలు, ఎమ్మెల్యేలు తమపై క్రిమినల్ కేసులున్నట్లు అంగీకరించారు. వీరిలో 51 మందిపై మహిళలపై నేరాలకు పాల్పడ్డారనే ఆరోపణలున్నాయి.
- మహిళలపై నేరాల కేసులు ఎదుర్కొంటున్న 334 మందికి వివిధ పార్టీలు ఎన్నికల్లో పోటీ చేసేందుకు టిక్కెట్లు ఇచ్చాయి. వీరిలో 40 మంది లోక్‌సభ లేదా రాజ్యసభకు పోటీచేశారు.
- 122 మంది స్వతంత్ర అభ్యర్థులు సైతం మహిళలపై నేరాలకు సంబంధించిన కేసులున్నట్లు స్పష్టంచేశారు. వీరిలో 19 మంది లోక్‌సభ లేదా రాజ్యసభకు పోటీచేశారు.
- మహిళపై నేరాల కేసులు ఎదుర్కొంటున్న చట్టసభ సభ్యుల్లో ఎక్కువ మంది మహారాష్ట్ర (12), పశ్చిమ బెంగాల్ (11), ఒడిశా (06) లాంటి రాష్ట్రాలకు చెందినవారున్నారు. అభ్యర్థుల విషయంలోనూ మహారాష్ట్రే (65) ముందుంది. బిహార్ (62), పశ్చిమ బెంగాల్ (52) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.



స్కాట్లాండ్‌లోని క్వీన్స్‌ఫెర్రీలో నిర్మించిన కొత్త వంతెన ఇది. మూడు స్తంభాలపై నిర్మించిన ప్రపంచంలోనే పొడవైన తీగ వంతెన అయిన దీనిని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మొదటి సారిగా ఈ వంతెనపై ప్రయాణించాలని పలువురు ఆసక్తిగా రావడంతో ఈ మార్గం కిక్కిరిసి పోయింది

బుల్లెట్‌రైలు పథకానికి భూమిపూజ చేయనున్న భారత్, జపాన్ ప్రధానులు

14న అహ్మదాబాద్‌లో కార్యక్రమం

అహ్మదాబాద్: బృహత్తరమైన ముంబయి-అహ్మదాబాద్ బుల్లెట్ రైలు పథకానికి సెప్టెంబరు 14న ఇక్కడ భారత, జపాన్ ప్రధానులిద్దరూ భూమిపూజ నిర్వహిస్తారు. భారత్‌లోనే మొట్టమొదటిదైన ఈ బుల్లెట్ రైలు పథకానికి ఇక్కడి సబర్మతీ రైల్వేస్టేషన్ సమీపంలో మోదీ, షిన్‌జో అబేలు భూమిపూజ చేస్తారని అధికారులు బుధవారంవెల్లడించారు. రూ.98వేల కోట్ల వ్యయంతో దీనిని చేపట్టనున్నారు. ఈ నేపథ్యంలో సెప్టెంబరు 13నుంచే ఉభయదేశాల ప్రధానులూ ఇక్కడే ఉండే అవకాశం ఉంది. నరేంద్రమోదీ జపాన్‌ప్రధాని షిన్‌జో అబేతో కలిసి 13వ తేదీ మధ్యాహ్నానికల్లా గుజరాత్ చేరుకుంటారు. మర్నాడు భూమిపూజచేస్తారు. బుల్లెట్ రైలు ప్రాజెక్టుతో పాటూ.. పెట్టుబడులకు సంబంధించిన వేర్వేరు అవగాహన ఒప్పందాలపై ఉభయ ప్రధానుల సమక్షంలో సంతకాలు జరుగుతాయి.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications. a division of Ushodaya Enterprises Private Limited and Printed at Eenadu Press, Plot No. 95 & 96. Phase-II, CIE, Gandhinagar, Quthubullapur Village & Mandal, Medchal District- 500 037, Telangana. Published at Eenadu Corporate Office, Ramoji filmcity, Anajpur Village, Abdullapurmet Mandal, Ranga Reddy Dist. 501512, Telangana State, Phone : 040 - 22232223, RNI No. 27656/75. Regd No. HSE/1009/2015-17, Eenadu, Hyderabad. Licensed to Post without Pre-payment. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00.